
జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక
RNI Regn No. 52879/93
2021 మే 1-31
వెల : రూ. 50



# సమ సమాజానికి దారిదీపం
# కార్ల్ మార్క్స్

**204వ జయంతి ప్రత్యేక సంచిక 2021 మే 5**

*Revolutions are the Locomotives of History*



*Karl Marx 204th Birth Annivesary*

# The Visakhapatnam Contract Labour Union

## Affiliated to AITUC

**Regd.No. 300/76**

33-5-1, Allipuram, **VISKHAPATNAM - 530 004**

**President**

*M. Anjaneyulu*

**Working President**

*Ch. Raghavendra Rao*

**General Secretary**

*J.V. Satyanarayana Murthy*

**Secretary**

*K. Satyanarayana*

# సమ సమాజానికి దారిదీపం మార్క్స్

**సంపాదకీయం**

మార్క్స్‌కి పరిచయం అవసరం లేదు. ఇప్పుడు ఆయన పేరు అందరికీ తెలిసిందే. అన్ని దేశాలలోనూ మార్క్స్ రచనల చుట్టూ చర్చ సాగుతున్నది. నాటికీ నేటికీ ప్రపంచంలో అత్యంత ప్రభావశీల వ్యక్తి కారల్ మార్క్స్.

1990 దశకంలో మార్క్స్‌కు గ్రహణం పట్టినట్లు అనిపించింది. సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాలు కనుమరుగు కావడంతో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు మార్క్స్ భావజాలానికి కాలం చెల్లిందని ప్రకటించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ చిరస్థాయిగా వుంటుందని, సంక్షోభాలకు తట్టుకు మనగలుగుతుందని ప్రచారం చేశారు. ఈ ప్రచారం మూణ్ణాల ముచ్చటే అయింది.

2008 నుండి పెట్టుబడిదారీ దేశాలు ఒక దాని తర్వాత మరొకటి చివరికి అన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయి. ఉద్దీపనల చిట్కాలు వాటిని గట్టెక్కించలేకపోతున్నాయి. ఇప్పుడు పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు బుర్రలు గోక్కుంటున్నారు. పెట్టుబడిదారీ చలన సూత్రాల కోసం మార్క్స్ రచనలే శరణ్యం అంటున్నారు. అందుకే మార్క్స్ రచనల అధ్యయనం వారికి కూడా తప్పనిసరి అయింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద కేంద్రీకరణ అనివార్యం అని అదే స్థాయిలో పేదరికం, దారిద్ర్యం మరొక చోట నెలకొంటుందన్న మార్క్స్ విశ్లేషణను నేటి ప్రపంచం తిరుగులేని వాస్తవంగా నిరూపిస్తున్నది.

శాస్త్ర సాంకేతికాభివృద్ధి సమాజానికి ఉపయోగపడకపోగా ఉపాధి లేని అభివృద్ధికి దారులు వేస్తున్నది. ఈ పరిణామాల పర్యవసానంగా పెట్టుబడిదారీ దేశాలు కార్మికుల వేతన స్తంభననీ సంక్షేమ కార్యక్రమాల కత్తిరింపులనీ సాధనాలు చేసుకుంటున్నాయి. పెట్టుబడికి రక్షణ కవచంగా వుండే నిరంకుశ శక్తుల చేతికి రాజకీయాన్ని కట్టబెట్టే చర్యలు తీసుకుంటున్నారు. దేశదేశాలలో కార్మికులు, శ్రామికులు ఈ పరిస్థితిని ప్రతిఘటించడానికి మార్క్స్ రచనలకు మరింత దగ్గర అవుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు బదులుగా సోషలిజం సాధించడం లక్ష్యంగా పలు ఉద్యమాలు సాగిస్తున్నారు.

సోవియట్ తరహా సోషలిజం పతనానంతరం పుట్టినవారు ఇప్పుడు యూనివర్శిటీ చదువుల్లో వున్నారు. కొత్తతరం కార్మికులు కాబోతున్నారు. అన్ని దేశాలకు వ్యాపించిన మార్క్స్ రచనల చర్చ ఈ తరంపై పెద్ద ప్రభావాన్ని చూపిస్తున్నది. ఇప్పుడు అనేక దేశాలలోని యువత మార్క్సిజానికి ఆకర్షితులవుతున్నారు. ఒకనాడు మార్క్స్ రచనలకు పట్టిన గ్రహణం ఇప్పుడు విడిపోయింది. మార్క్స్ రచనల కోసం, వ్యవస్థ మార్పు కోసం వెదుకులాట సాగుతున్నది.

సోవియట్ పతనం తర్వాత తెలుగులో మార్క్స్ రచనల అందుబాటు బాగా తగ్గింది. ఇటీవల ప్రచురితమైన కాపిటల్ అనువాదం కొన్ని నెలలోనే రెండు ముద్రణలు పొందింది. వామపక్ష ప్రచురణ సంస్థలు 'కమ్యూనిస్టు ప్రణాళిక' పుస్తకాన్ని లక్ష కాపీలు ప్రచురించి, సభలు సమావేశాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు.

ఈ నేపథ్యంలో జాతీయ స్ఫూర్తి పత్రిక మార్క్స్‌పై ప్రత్యేక సంచికను ప్రచురించాలని తలపెట్టింది. గతంలో ఎంగెల్స్ ద్విశత జయంతికి, గ్రాంసీ 130వ జయంతికి ప్రచురించిన ప్రత్యేక సంచికలు విశేష ఆదరణ పొందాయి. ఇవన్నీ మార్క్సిజం పట్ల పెరుగుతున్న ఆసక్తి సంకేతాలు. ఇప్పుడు మార్క్స్ ప్రత్యేక సంచికకు మంచి ఆదరణ లభిస్తుందని, అది మార్క్స్ రచనల అధ్యయనానికి ప్రేరణ కల్పిస్తుందని ఆశిస్తున్నాం.

పెట్టుబడిదారీ వ్యవస్థను వదిలించుకోవాలి. సమసమజాన్ని సాధించాలి. దీనికి దారిదీపాలు మార్క్స్ రచనలే.

మార్క్సిజం పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ ప్రారంభంలోనే పెద్ద గ్రంథాలను చదవడం, క్లిష్టమైన భావాలను అర్థం చేసుకోవడం అంత తేలిక కాదు. అలాంటి వారు మార్క్స్ భావజాలంలో ప్రవేశించడానికి ఈ సంచిక ఉపయోగపడుతుంది. ఈ ప్రత్యేక సంచిక సమగ్రమైంది కాదు. రేఖామాత్ర చిత్రణ మాత్రమే. సరళంగా సాధ్యమైనంత మేర పడికట్టు పదాలకు దూరంగా, మార్క్స్ రచనల పరిచయాలను, ఆయన జీవితమూ కృషినీ అందిస్తున్నాం.

ఈ ప్రయత్నంలో భాగస్వాములైన రచయితలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. జాతీయ స్ఫూర్తి చేసే ఇలాంటి ప్రయత్నాలకు మీ సహాయ సహకారాలను అర్థిస్తున్నాము.

**డి వి వి యస్ వర్మ**

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2021 మే 1-31 సంపుటి : 29 సంచిక : 15,16

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 50/- రూపాయలు

## ఈ సంచికలో...


3 కరోనా కాలం: మార్క్స్ జీవావరణ శాస్త్రం - అశోక్ కుంబము
6 కార్ల్ మార్క్స్ – జీవితమూ, కృషీ ఫ్రెడరిక్ ఎంగెల్స్
13 మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం ఫ్రెడరిక్ ఎంగెల్స్
14 మార్క్సిజం మూడు మూలాధారాలు మూడు భాగాలు - వి.ఐ. లెనిన్
18 మార్క్స్ సమకాలికుల స్మృతులు
27 మార్క్స్ ఇష్టాయిష్టాలు
28 మార్క్స్ కవితలు
29 తత్వశాస్త్రాన్ని భువికి దించిన మార్క్స్ - హెచ్చార్కె
32 మార్క్స్, ఎంగెల్స్‌ల తొలి ఉమ్మడి రచన పవిత్ర కుటుంబం - వై.వి. రమణారావు
36 జర్మన్ తత్వశాస్త్ర విమర్శ - కె.వి.రావు
40 'థీసిస్ ఆన్ ఫొయర్‌బాక్' పరిచయం - రావు కృష్ణారావు
47 1844 నాటి అర్ధశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు ఇప్పుడెందుకు చదవాలి? - మందలపర్తి కిషోర్
53 పార్టీ ఆర్గనైజరుగా, విప్లవకారుడిగా కారల్‌మార్క్స్ - ఇప్టూ ప్రసాద్
60 'కమ్యూనిస్టు భూతం' అనే కట్టుకథను ఎదుర్కోవడానికే ప్రణాళిక - డి సోమసుందర్
65 మార్క్స్ వాంగ్మయంలో '18వ బ్రూమెయిర్' స్థానం - కొండూరి వీరయ్య
69 గోథా కార్యక్రమంపై విమర్శ - డి వి వి ఎస్ వర్మ
72 మార్క్స్ పదునైన రచన : 'తత్వశాస్త్ర దారిద్ర్యం' - వై.వి. రమణారావు
76 కార్ల్ మార్క్స్ ఆఖరి ఆర్థిక రచన : వాగ్నర్ పై విమర్శ
82 ఇండియాలో బ్రిటీష్ పరిపాలన అధ్యయనానికి ఉపకరణాలు అందించిన మార్క్స్ - కొప్పర్తి వెంకట రమణమూర్తి
84 ఇండియాలో బ్రిటిష్ పరిపాలన భావిఫలితాలు - మార్క్స్
88 మార్క్స్ రచనల్లో పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాలు - కెవిన్.బి.యాండర్సన్
97 మన మార్క్స్! - ఆంటోనియో గ్రాంసీ
100 ప్రపంచానికి మార్క్స్ ఇచ్చిన బహుమతులు - అవిజిత్ పాథక్
103 మార్క్స్ అంటే మార్క్స్ - తెలకపల్లి రవి
107 పెట్టుబడిదారీ వ్యవస్థకు అంతిమదశ - మర్ల విజయ కుమార్


## జాతీయ స్ఫూర్తి ప్రత్యేక ప్రకటన

**ఉచితంగా జాతీయ స్ఫూర్తి**

జాతీయ స్ఫూర్తి పత్రికను ఆసక్తి గలవారందరికీ ఉచితంగా అందించాలని భావించాం. అందువల్ల ఆసక్తి గల మిత్రులందరూ తమ పోస్టల్ అడ్రసును 8500678977 నెంబరుకు మెసేజ్ లేదా వాట్సాప్ ద్వారా పంపించండి.

**సంవత్సర చందాలకు స్వస్తి**

ఆసక్తి గల వారందరికీ జాతీయ స్ఫూర్తి పత్రికను ఉచితంగా అందించాలని భావించినందున వార్షిక చందాల పద్ధతికి స్వస్తి చెబుతున్నాం. ఇకపై సంవత్సర చందాలు పంపవద్దని తెలియజేస్తున్నాం. గతంలో చందాదారులుగా వున్న వారికి పత్రికను పంపిస్తాం.

**విరాళాలను పంపండి**

పత్రిక నిర్వహణలో వున్న వ్యయప్రయాసలు అందరికీ తెలిసినవే. ఈ పత్రిక పది కాలాలు నిలబడడానికి, ఆసక్తి గల వారందరికీ ఉచితంగా పంపించడానికి అందరి ఆర్థిక తోడ్పాటు అవసరం. మీరు నగదు రూపంలో, ప్రకటనల రూపంలో మీ విరాళాలను జాతీయస్ఫూర్తి అకౌంటుకు పంపండి. మీరు పంపిన మొత్తం వివరాలు, మీ పోస్టల్ అడ్రసులను 8500678977 నెంబరుకు మెసేజ్/వాట్సాప్ ద్వారా తెలియచేయండి.

*NEFT లేదా RTGS పంపడానికి*
JAATEEYA SPURTHI
A/c No.3620 101 0000 380
Carana Bank, SSME Branch, Eluru
IFSC Code : CNRB 00 13620

*జాతీయ స్ఫూర్తి పత్రికకు మీ సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరుతున్నాము.*

ఇట్లు
జాతీయ స్ఫూర్తి సంపాదక వర్గం


# కరోనా కాలం: మార్క్స్ జీవావరణ శాస్త్రం



**అశోక్ కుంబము**

ప్రపంచం ఇప్పుడు ఒక విషమ కాలంలో ఉంది. తీరని దుఃఖాన్ని మూటగట్టుకుంటుంది. దోపిడీలు, అణిచివేతలు, నిర్బంధాలు నిత్యజీవితంలో భాగంగా మారుతున్న పరిస్థితులల్లో కరోనా వచ్చి మరింత విషాదాన్ని నింపుతుంది. ఇది ఎంతటి మానవ నష్టాన్ని కలిగిస్తుందో అంచనాలు వేయడం కూడా కష్టంగా వుంది. ఇటువంటి మహావిపత్తును అర్థం చేసుకోవడానికి మనకు మార్క్స్ ఆలోచనలు ఏ విధంగా ఉపయోగపడుతాయో ఆయన 204వ జయంతి సందర్భంగా పరిశీలిద్దాం.

కరోనా ప్రభావం, దాని మూలంగా జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని మనం తక్షణం జరగవలిసిన వైద్యసేవల గురించి, ప్రభుత్వాలు చేయాల్సిన (చేయలేకపోతున్న) కనీస ఏర్పాట్ల గురించి, వైద్యం పేరిట జరుగుతున్న దోపిడీ గురించి, కనీస ప్రాణవాయువు అందక పోతున్న ప్రాణాల గురించి మాట్లాడడానికే ఎక్కువగా పరిమితమవుతున్నాం. ఎందుకంటే అది తక్షణ అవసరం కాబట్టి. అయితే అదే సందర్భంలో ఆలోచించాల్సింది ఈ స్థితికి ప్రపంచ సమాజం ఎందుకొచ్చిందని. ఇది కేవలం ఒక వైరస్ మూలంగానే జరుగుతుందా? అసలు వైరస్ మానవ సమాజంలోకి ఎందుకొచ్చింది? ఒక వైరస్ మూలంగా వచ్చే విపత్తును నివారించలేని సమాజాలుగా ఎలా రూపాంతరం చెందాము. ఈ ప్రశ్నలు వేసుకోకుండా ఎవ్వరిని నిందించినా పెద్దగా ప్రయోజనం వుండదు. ఎందుకంటే కరోనా వైరస్ మొదటిది కాదు, చివరిది అంతకన్నా కాదు. చారిత్రకంగా చూస్తే ఇది కేవలం ఒక ఎపిసోడ్ మాత్రమే.




మార్క్స్‌కు కరోనా వైరస్ గురించి తెలిసే అవకాశం లేదు. కాని అది ఏ విధ్వంసకర అభివృద్ధి నమూనా మూలంగా మానవ సమాజంలోకి వచ్చిందో ఆ విధ్వంసం గురించి, మనిషికి ప్రకృతికి మధ్య పెరిగిపోతున్న అగాధం గురించి కేవలం ఊహించి చెప్పడం కాకుండా శాస్త్రబద్ధ విశ్లేషణ చేశాడు. అయితే మార్క్స్‌ను సమగ్రంగా కాకుండా ముక్కలు ముక్కలుగా చదివి అర్థం చేసుకునేవాళ్ళు చేసే అనేక ఆరోపణలలో మరొకటి జత చేరింది. అదేమంటే ఆయన వర్గ సంబంధాలకు ఇచ్చిన ప్రాముఖ్యత సమాజానికి, ప్రకృతికి మధ్య ఉండే సంబంధానికి ఇవ్వలేదని. దాని మూలంగా ఈరోజు మనిషికి, ప్రకృతికి మధ్య జరిగే సంఘర్షణను, దాని ద్వారా జరిగే పర్యవసానాలను అర్థం చేసుకోవడానికి మార్క్స్ పనికిరాడని. ఈ విమర్శను పర్యావరణవాదులు, ప్రకృతివాదులు, కొందరు మార్క్సిస్టులు కూడా చేశారు. అయితే ఈ విమర్శకు కారణం మార్క్స్ ప్రకృతి–సమాజం సంబంధాల సమస్యను గుర్తించక పోవడం వలన వచ్చింది కాదు. దానికి సంబంధించి మార్క్స్ ప్రతిపాదించిన మౌళిక అవగాహనను కొన్ని తరాలపాటు అనేక మార్క్సిస్టు పార్టీలు, ఆలోచనా స్రవంతులు, వ్యక్తులు పెద్దగా విలువ ఇవ్వకపోవడమే. ఆ అవగాహనను సమాజ పరివర్తనా సిద్ధాంతంలో భాగంగా చూడకపోవడమే. ముఖ్యంగా భారతీయ మార్క్సిస్టు మేధో సంప్రదాయంలో దానికి ఇంకా ప్రాముఖ్యత ఇస్తున్న దాఖలాలు కనబడటం లేదు.

అయితే మొత్తంగా మార్క్స్ సమాజం–ప్రకృతి సంబంధాల విషయంలో చేసిన సూత్రీకరణలను వెలికితీయడం గత మూడు దశాబ్దాలుగా పాశ్చాత్య అకడెమిక్ రంగంలో, పర్యావరణ ఉద్యమాలలో జరుగుతుంది. ఈ కృషి వేదాల్లో అన్నీ వున్నాయి అనే మడికట్టు పద్ధతిగా "మార్క్స్ ఎప్పుడో అన్ని విషయాల గురించీ చెప్పేశాడు" అనే విధంగా కాకుండా అతని ఆలోచనలను అప్పటి స్థల, కాల పరిమితులను దృష్టిలో ఉంచుకొని విమర్శనాత్మకంగా పునర్ నిర్మాణం చేస్తున్నారు. అయితే ఇది ఎర్ర మార్క్స్‌ను విమర్శల నుండి కాపడటానికి ఆయనకు ఆకుపచ్చ రంగు వేయడానికి చేసే ప్రయత్నం కాదు. లేదా ఆయన ఔచిత్యాన్ని మరింత బలోపేతం చేయడానికి అంతకన్నా కాదు. ఈ మేధోమధనమంతా

ప్రపంచం ఈనాడు ఎదుర్కొంటున్న అనేక పర్యావరణ సమస్యలకు పూర్తి, స్థిరమైన పరిష్కారం చూపించడం కోసం, దాని కోసం రూపొందించుకోవాల్సిన కొత్త ఉద్యమ రూపాలను ప్రతిపాదించడం కోసమే. మార్క్సిస్టు అవగాహన మూలంగానే వాతావరణ మార్పు (climate change) సమస్యను కేవలం వ్యక్తుల నైతిక ప్రవర్తనకు పరిమితం చేయకుండా వ్యవస్థ మార్పుతో (system change) ముడిపెట్టి చూసే ఒక దృష్టికోణం పర్యావరణ ఉద్యమాలలో అభివృద్ధి చెందింది. వ్యవస్థ మార్పు అంటే ఏ వ్యవస్థ, ఎందుకు, ఎటు వైపుకు, ఎలా మారాలో అనే విషయాలు అత్యంత కీలకమైనవి. ఈ అంశాలను అర్థం చేసుకోవడానికి మార్క్స్ ఎంతగానో ఉపయోగపడుతాడు.

ముందుగా మార్క్స్ సమాజం-ప్రకృతి సంబంధాలను ఎలా చూశాడో తెలిస్తే కాని అతని ఆలోచనలు ప్రస్తుత సంక్షోభాలను అవగాహన చేసుకోవడానికి మనకు ఎలా ఉపయోగపడుతాయో అర్థం కావు. అయితే భూస్వామ్యం నుండి పెట్టుబడిదారి వ్యవస్థలోకి మారే సమాజాలలో జరిగే సామాజిక, ప్రాకృతిక సంబంధాల మార్పును అర్థం చేసుకోవడానికి మార్క్స్ డార్విన్ నుండి ఎంతో స్వీకరించాడు. డార్విన్ రాసిన The Origin of Species 1859లో ప్రచురింపబడగానే మార్క్స్, ఎంగిల్స్ ఎంతో ఉత్సాహంగా చదివి అతను చేసింది యుగాన్ని మార్చే పని అని కొనియాడారు. అయితే డార్విన్ జీవావరణ వ్యవస్థలో ప్రతిపాదించిన "మనుగడ కోసం పోరాటం" అనే సిద్ధాంతాన్ని మానవ చరిత్ర గతిని అర్థం చేసుకోవడానికి సోషల్ డార్వినిస్టులు చేసిన తప్పుడు ఆలోచనలను మార్క్స్ అప్పుడే ఎండగట్టాడు.

అలాగే జెర్మన్ వ్యవసాయ, రసాయన శాస్త్రవేత్త లైబిగ్ ప్రభావం కూడా మార్క్స్ మీద చాలా వుంది. లైబిగ్ 1842లో ప్రచురించిన Organic Chemistry and its Applications to Physiology and Pathology గ్రంథాన్ని ఎంతో నిశితంగా చదువుకున్న మార్క్స్ అందులో అతను ప్రతిపాదించిన జీవక్రియకు సంబంధించిన అంశాలు సమాజానికి, ప్రకృతికి వుండే పేగు బంధాన్ని అర్థం చేసుకోవడానికి ఎంతో ఉపయోగ పడుతాయని గ్రహించాడు. జీవక్రియ (metabolism) అంటే ఒక జీవిలో లేదా జీవావరణంలో పదార్థం (matter), శక్తి (energy) కలిగించే ప్రవాహం, దాని మూలంగా ఆ జీవిలో, జీవావరణంలో జరిగే మార్పులను చెప్పే ఒక జీవసంబంధమైన ప్రక్రియ. ఈ భావన ఆధారంగా మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థలో మనిషికి, ప్రకృతికి మధ్య ఒక పెద్ద అగాధం ఎలా పెరుగుతుందో వివరించాడు. ముఖ్యంగా పెట్టుబడిదారీ వ్యవసాయ రంగంలో జీవక్రియలో ఏర్పడే చీలిక (metabolic rift) మూలంగా సంభవించే విపత్తుల గురించి వివరించాడు. కేవలం లాభాపేక్షే లక్ష్యంగా వుండే పెట్టుబడిదారీ వ్యవస్థ భూమిని, ప్రకృతిలోని అన్ని వనరులను కొల్లగొట్టడం మూలంగా తిరిగి వాటిని ఒక క్రమబద్ధంగా పునరుద్ధరించాల్సిన (systemic restoration) అత్యవసరం పడుతుంది. కాని ఆ పని చేయడానికి కూడా పెట్టుబడి "నాకేంటి లాభం" అనే ఆలోచిస్తుంది. ఇటువంటి స్థితి మొత్తం వ్యవస్థనే ప్రభావితం చేస్తుంది.

పందొమ్మిదవ శతాబ్దపు ఇంగ్లాండ్‌లో విచక్షణ లేకుండా భూసారాన్ని కొల్లగొట్టడం మూలంగా ఆ భూములు పంటకు పనికిరాని స్థితితో మొత్తం సమాజం (అతి ముఖ్యంగా అట్టడుగు వర్గాలు) ఆహార భద్రతను కోల్పోయిన ఒక పరిస్థితి వచ్చింది. కోల్పోయిన భూసారాన్ని పునరుద్ధరించడానికి దక్షిణ అమెరికాలోని పెరూ నుండి వేలాది టన్నుల పక్షుల మలాన్ని (guano) తరలించారు. ఈ మొత్తం వ్యవహారాన్ని చారిత్రకంగా అర్థం చేసుకున్న మార్క్స్ తన metabolic rift సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

చారిత్రకంగా చూస్తే మారే సామాజిక సంబంధాల మూలంగా వ్యవసాయం నుండి, గ్రామీణ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున రైతాంగం బయటకు నెట్టబడుతుంది. కాని అలా బయటకు (పట్టణాలకు) నెట్టబడిన రైతాంగాన్ని తన లోనికి తీసుకునే పారిశ్రామిక అభివృద్ధి లేదు. వున్నా పెట్టుబడిదారులు అందరికీ అవకాశం ఇవ్వరు. ఎందుకంటే ఎంత ఎక్కువ మంది నిరుద్యోగులుగా వుంటే అంత చౌకగా శ్రామికులు దొరుకుతారు కాబట్టి. పట్టణాలు, పారిశ్రామిక వాడలు పెరిగి పోవడమంటే అక్కడ కేవలం జనాభా పెరగడం మాత్రమే కాదు. అక్కడ గ్రామాల నుండి తరలిపోయే ఆహార ఉత్పత్తుల వినిమయం పెరగడం, తద్వారా ఉత్పత్తయ్యే వ్యర్థం కూడా అక్కడే పెరగడం. దీనర్థం భూమిలోని సారం ఆహార ఉత్పత్తుల రూపంలో పట్టణాలకు చేరుతుంది కాని పట్టణాలలో పోగయ్యే వ్యర్థం తిరిగి గ్రామాలకు చేరడం లేదు. ఇక్కడ ప్రకృతి విలువ (nature's value) కేవలం ఒకే మార్గంలో పోతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో భూసారం గ్రామాల నుండి పట్టణాలకు తరలి పోవడాన్ని మార్క్స్ భూసార దొంగతనంగా (robbing of soil fertility) గుర్తిస్తాడు. ఈ దొంగతనం రికవరీ చేయలేని స్థితికి చేరినప్పుడు సారం లేని భూమి తన సహజ గుణాన్ని కోల్పోతుంది. ప్రకృతి తన సహజత్వాన్ని కోల్పోవడం విధ్వంసాలకు, విపత్తులకు మొదటి మెట్టు. ఇది సహజ సిద్ధమైనది కాదు. ఇది పెట్టుబడి బుద్ధిపూర్వకంగా సృష్టించే విధ్వంసం.


ఈ సందర్భంలో సహజంగా వచ్చే ప్రశ్నేమంటే ఉత్పత్తి సాధనాలు ఎంతో అభివృద్ధి చెంది, అనేక శాస్త్రీయ ఆవిష్కరణలు జరుగుతున్న ఈ కాలంలో మార్క్స్ ఎప్పుడో చేసిన సూత్రీకరణలకు ఇంకా ప్రాసంగికత ఉన్నదా అని. ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది అప్పుడు మార్క్స్ చెప్పింది ఇప్పుడు యధాతదంగా జరుగుతుందని కాదు. పెట్టుబడి ఒకవైపు శ్రమ దోపిడీ చేస్తూనే, మరోవైపు వనరుల దోపిడీ చేస్తుంది. ఈ వనరుల దోపిడీ అంటే ప్రకృతికి ఉండే భరించగలిగే శక్తిని (carrying capacity) చాలెంజ్ చేయడం. అలా చాలెంజ్ చేయడం అంటే ప్రకృతి పరిమితులను (nature's limits) ప్రశ్నార్థకం చేయడం. అది జరిగినప్పుడు సమాజానికి, ప్రకృతికి మధ్య వుండే సమతుల్యత దెబ్బతింటుంది. అప్పుడు ప్రకృతి 'పగ' తీర్చుకునే స్థితి వస్తుంది. (nature's revenge అనే మాటను ఎంగెల్స్ మెటఫారికల్‌గా మాత్రమే వాడాడు తప్ప ప్రకృతిని వ్యక్తీకరించి, భావోద్వేగాలు ఆపాదించి కాదు అనేది గమనించాల్సిన విషయం!). శాస్త్రపరిజ్ఞానం ప్రకృతిని మరింత హేతుబద్ధంగా అర్థం చేసుకుని దాని పరిమితులకు అనుగుణంగా జీవించడానికి ఉపయోగపడాలే తప్ప, దాని మీద అజమాయిషీ చేయడానికి కాదు. ఎంగెల్స్ mastering nature అనే భావనను చెప్పింది కూడా ఇదే ఉద్దేశంతోనే.

అంతేకాదు metabolic rift అనేది ఒక సంఘటన కాదు. అది ఒక చారిత్రక క్రమంగా కొనసాగుతుంది. ఇంకా అనేక రూపాలుగా విస్తరిస్తుంది. అది ప్రాథమిక ఉత్పత్తిదారులను తమ ఉత్పత్తి సాధనాలనుండి దూరం చేస్తుంది. మనిషికి ప్రకృతికి మధ్య దూరం పెంచుతుంది. గ్రామానికి పట్టణానికి, ఉత్పత్తికి వినిమయానికి మధ్య దూరం పెంచుతుంది. సామ్రాజ్యవాద దేశాల స్థితికి, దోపిడీకి గురయ్యే దేశాల స్థితికి మధ్య దూరాన్ని మరింతగా పెంచుతుంది. మార్క్స్ కాలం నుండి ఇప్పటి వరకు దీనికంతటికి ముఖ్య కారణం: అంతులేని సంపదను పోగు చేసుకునే (endless accumulation of capital) ఒక రాజకీయార్థిక ప్రక్రియ. ఇది ప్రతి దానిని (ప్రకృతితో సహా) సరుకుగా మార్చడం ద్వారా, సమాజ సంపదను వ్యక్తి ఆస్తిగా గుర్తించడం ద్వారా, దానికి చట్టబద్ద రక్షణ కల్పించడం ద్వారా, అనేక రకాల పరాయీకరణలను అమలులోకి తీసుకొని రావడం ద్వారా, దోపిడీ అణివేతలతో సమాజంలో అసమానతలను కొనసాగించడం ద్వారా, మొత్తంగా దోపిడీ వర్గాలు అన్ని వ్యవస్థలను తమ ఆధీనంలోకి తీసుకోవడం మూలంగా సాధ్యమవుతుంది. వీటన్నింటినీ రద్దు చేయగలిగే రాజకీయార్థిక వ్యవస్థలు వస్తే కాని ప్రకృతి–సమాజ అసమతుల్యం మూలంగా వచ్చే సమస్యలకు పరిష్కారం దొరకదు.

మార్క్స్ దృష్టిలో ప్రకృతి మనిషికి లభించిన ఒక బహుమతి కాదు. ఎందుకంటే బహుమతిగా భావిస్తే ప్రకృతి విలువను ఉత్పత్తిలో భాగంగా చూడలేము. అంతేకాదు బహుమతిని ఇష్టానుసారంగా వాడుకునే ఒక స్థితిలోకి నెట్టబడుతాము. అందుకే మార్క్స్ ప్రకృతిని మనిషియొక్క జీవం లేని దేహంగా ("Nature is man's inorganic body") అభివర్ణిస్తాడు. దీనర్థం మనిషి ప్రకృతిలో భాగం; ప్రకృతి మనిషిలో భాగం. ఆ మనిషి జీవంతో వుండాలంటే ప్రకృతితో నిరంతర జీవక్రియా సంబంధాన్ని కొనసాగించాలి. మనిషి మారుతున్న ప్రకృతికి అనుగుణంగా తన జీవన విధానాన్ని మార్చుకోవాలి. అంతేకాని సొంత లాభాల కోసం, పెట్టుబడి అభివృద్ధి కోసం జీవావరణ విధ్వంసం చేస్తూ కాదు. అలా చేయడం మూలంగానే సగటున ప్రతి పది సంవత్సరాలకు ఒక విపత్తును (epidemic) ప్రపంచం ఎదుర్కొంటుంది. ఇప్పుడు దాదాపు వంద సంవత్సరాల తర్వాత ఒక మహా విపత్తును (pandemic) ఎదుర్కొంటున్నాము.

ఈ విపత్తులను పరిశోధించే శాస్త్రవేత్తలు చాలా స్పష్టంగా చెబుతున్నారు జంతువులలో వుండే వైరస్‌లు మనుషుల్లోకి రావడానికి కారణం అధిక లాభాల కోసం పారిశ్రామిక పద్ధతులలో జంతువులను పెంచడం, జంతువుల సహజ ఆవాసాలను నాశనం చేయడం. అలా చేయడం మూలంగా జంతువులలో రోగనిరోధక శక్తి తగ్గి వైరస్ బారిన పడటం, తద్వారా అది మనుషులకు సోకడం జరుగుతుంది. ఇది చాలా సులభంగా అర్థమయ్యే విషయమే అయినప్పటికీ పెట్టుబడిదారులు కాని, వాళ్ళకు కాపలా కాసే పాలక వర్గాలు కాని ఆ చైన్ ప్రక్రియను ధ్వంసం చేసే పనిచేయరు. ఎందుకంటే వాళ్ళకు ప్రజల ప్రాణాలకన్నా తమ స్వంత లాభాలు ముఖ్యం.

నిజమే కరోనా పాండెమిక్ కేవలం మనిషి–ప్రకృతి సమస్య మాత్రమే కాదు. ఇది ఆరోగ్య భద్రత సమస్య. స్వేచ్ఛగా జీవించే హక్కు సమస్య. కాని వాటిని అమలుచేసే వ్యవస్థలు ఎక్కడున్నవి? అన్నీ పెట్టుబడి పాదసేవలో వున్నయి. వ్యవస్థ మార్పు కోరే ప్రజా రాజకీయాలు మాత్రమే ప్రజలకున్న చివరి ఆయుధం. ప్రతి సమస్యను హేతుబద్ధంగా, శాస్త్రీయంగా విశ్లేషించి ఆ సమస్యలకు రాజకీయ పరిష్కారాన్ని చూపగలిగే ఒకే ఒక్క సిద్ధాంతం మార్క్సిజం. అది తనను తాను విమర్శించుకుంటూ, స్థల కాలాలకు సరిపడేలా సాన పెట్టుకుంటూ నిత్య చలనంలో ఉండటం దాని ప్రత్యేకత. అటువంటి సిద్ధాంతాన్ని మానవాళికి అందించిన మార్క్స్‌కు జోహార్లు! ❏



# కార్ల్ మార్క్స్ - జీవితమూ, కృషీ

ఫ్రెడరిక్ ఎంగెల్స్

సోషలిజానికీ, తద్వారా యావత్తు సమకాలీన కార్మికోద్యమానికి ప్రప్రథమంగా శాస్త్రీయమైన పునాదిని కల్పించిన కార్ల్ మార్క్స్ ట్రియర్ నగరంలో 1818లో జన్మించాడు. ఆయన బాన్, బెర్లిన్ నగరాల్లో విద్యాభ్యాసం చేశాడు. మొదట న్యాయ శాస్త్రాన్ని అభ్యసించాడు. కాని త్వరలోనే ప్రత్యేకించి చరిత్ర తత్వ శాస్త్రాల అధ్యయనంలో పూర్తిగా నిమగ్నుడయ్యాడు. తత్వశాస్త్ర విభాగంలో అసిస్టెంటు ప్రొఫెసరుగా స్థిరపడబోతున్న తరుణంలో 1842లో మూడవ ఫ్రెడరిక్ విల్హెల్మ్ మరణానంతరం పెల్లుబికిన రాజకీయోద్యమం ఆయన జీవితాన్ని మరో మార్గంలోకి మళ్లించింది.

### పత్రికారంగం- ఓ మూలమలుపు!

మార్క్స్ సహకారంతో, రెయినిష్ ఉదారవాద బూర్జువా వర్గ నాయకులైన కాంప్‌హౌసెన్, హాన్సెమన్ మొదలైనవాళ్లు కొలోన్‌లో రెయినిష్ జెయిటుంగ్[1] అనే దినపత్రికను స్థాపించారు. 1842 శరదృతువులో రేనిష్ శాసనసభ కార్యకలాపాలపై మార్క్స్ రాసిన విమర్శ పాఠకుల దృష్టిని విశేషంగా చూరగొనడంతో, ఆ పత్రికా నిర్వహణ ప్రధాన బాధ్యత ఆయనకు అప్పగించారు. ఆ పత్రిక సెన్సార్‌షిప్ నిర్బంధాల కింద వెలువడేది. కాని సెన్సార్‌షిప్ అధికారులు[2] దాన్ని అదుపులో పెట్టలేకపోయారు. తన ముఖ్య వ్యాసాలను సెన్సారు కత్తెరకు గురికాకుండా రెయినిష్ జెయిటుంగ్ పత్రిక ప్రచురించగలిగేది. సెన్సారు పరిశీలనార్థం అంతగా ముఖ్యం కాని సమాచారం ముందుగా పంపేవారు. దాన్ని అధికారులు కత్తిరించి కత్తిరించి విసిగిపోయైనా ఊరుకునే వారు; లేకుంటే, యింకా కత్తిరిస్తే మరుసటిరోజు పత్రిక వెలువడదన్న బెదిరింపు మూలంగానైనా ఊరుకోక తప్పేది కాదు. రెయినిష్ జెయిటుంగ్ పత్రిక మాదిరిగా మరో పది వార్త పత్రికలు కూడా ధైర్యంగా వ్యవహరించి వుంటే వాటి స్వంతదారులు టైప్ సెట్టింగు కోసం మరి కొన్ని వందల డాలర్లను అదనంగా ఖర్చుపెట్టేందుకు అనుమతించి ఉంటే, జర్మనీలో 1843లోనే సెన్సార్‌షిప్ దుస్సాధ్యమై వుండేది. కాని జర్మన్ వార్తపత్రికల స్వంతదారులు అల్పబుద్ధులు, పిరికి, కూపస్థ మండూకాలు, కాగా, రెయినిష్ జెయిటుంగ్ యీ పోరాటాన్ని ఒంటరిగానే సాగించింది. ఒక సెన్సారు అధికారి తర్వాత మరొక సెన్సారు అధికారి విసుగెత్తి పోయేలా చేసింది. చివరకు దానిపైన జమిలి సెన్సారు పద్ధతి మొదలయింది. మొదటి సెన్సారుషిప్ ముగిశాక, దాన్ని చివరి సారిగా మరోమారు సెన్సారు చేసేవారు. రెయినిష్ జెయిటుంగ్ విషయంలో యీ పద్ధతి కూడా నిష్ఫలమే అయింది. 1843వ సంవత్సరం మొదట్లో ఇక ఈ వార్తపత్రికను అదుపులో పెట్టడం దుస్సాధ్యమని ప్రకటించి, ఎక్కువ ఆర్భాటమేమీ లేకుండా ప్రభుత్వం దాన్ని మూసేసింది.



మార్క్స్ కుటుంబ సభ్యులతో ఎంగెల్స్

### పెళ్లి- ప్యారిస్

ఈలోగా ఫాన్ వెస్ట్ ఫాలెన్ - తర్వాత అభివృద్ధి నిరోధక మంత్రి అయాడు. సోదరిని మార్క్స్ పెళ్లి చేసుకుని, తన నివాసాన్ని పారిస్‌కు మార్చుకున్నాడు. అక్కడ ఆయన ఎ. రూగా (రూజ్)తో కలిసి డాయిష్ ఫ్రాంజోసిషె యార్బ్యూషెర్ పత్రిక ప్రచురించేవాడు. దానిలో ఆయన "హెగెలియన్ న్యాయ తత్వ శాస్త్రంపై విమర్శ"[3] అన్నదానితో ప్రారంభించి తన సోషలిస్టు రచనలను వరుసగా ప్రచురించాడు. వీటికి తోడు ఎంగెల్స్‌తో కలిసి "పవిత్ర కుటుంబం- బ్రూనో బౌవర్ ప్రభృతుల విమర్శనాత్మక విమర్శ పై విమర్శ" అనే పుస్తకాన్ని కూడా అదేరోజుల్లో వెలువరించాడు. అది ఆనాటి జర్మన్ తాత్విక భావవాదపు సరికొత్త తప్పుడు రూపాలలో ఒకటైన బ్రూనో బౌవర్ భావాలపైన వ్యంగ్య విమర్శ.

ఫ్రెంచి మహా విప్లవ చరిత్రనూ, అర్థశాస్త్రాన్నీ అధ్యయనం చెయ్యడంలో నిమగ్నుడై యుండి కూడా మార్క్స్ మధ్యమధ్య

తగినంత తీరిక చేసుకొని ప్రష్యన్ ప్రభుత్వంపైన దాడులు చేస్తూ వచ్చాడు. 1845 వసంతంలో ఫ్రాన్సునుండి మార్క్సును – గిజో ప్రభుత్వం చేత – బహిష్కరింపజెయ్యడం ద్వారా ప్రష్యన్ ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకుంది. అలెగ్జాండర్ ఫాన్ హుంబోల్డ్[4] ఈ వ్యవహారంలో దళారీగా వ్యవహరించినట్లు వినికిడి. మార్క్స్ తన నివాసాన్ని బ్రస్సెల్స్‌కు మార్చుకొని, "తత్వశాస్త్ర దారిద్ర్యం" అనే పుస్తకాన్ని 1847లో ఫ్రెంచి భాషలో ప్రచురించాడు. ప్రూడన్ రచించిన "దారిద్ర్య తత్వశాస్త్రం" అనే పుస్తకంపై విమర్శ ఈ గ్రంథం. 1848లో "స్వేచ్ఛాయుత వాణిజ్యంపై ప్రసంగం" అనే రచనను కూడా ప్రచురించాడు.

### లీగు రూపాంతరీకరణ

జర్మన్ కార్మికసంఘాన్ని[5] బ్రస్సెల్స్‌లో స్థాపించే అవకాశాన్ని వినియోగించుకొని, తద్వారా ప్రత్యక్ష ఆందోళనా కార్యక్రమాన్ని అదే కాలంలో ఆరంభించాడు. ఆయనా, ఆయన రాజకీయ మిత్రులూ 1847లో రహస్య కమ్యూనిస్టు లీగులో (యీ లీగు అంతకుముందు పలు సంవత్సరాలుగా వుంది!) ప్రవేశించినప్పుడు యీ ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమానికి మరింత ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. ఈ కమ్యూనిస్టు లీగు యావత్తు నిర్మాణ స్వరూపమూ అప్పుడిక విశేషంగా మారిపోయింది. అంతకు పూర్వం కొంచెం యించుమించుగా కుట్రదారీ సంస్థగా వుంటూ వచ్చిన లీగు యిప్పుడు కమ్యూనిస్టు ప్రచారంచేసే మామూలు సంఘంగా రూపాంతరం చెందింది. పరిస్థితుల ఒత్తిడి వలన మాత్రమే జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ యొక్క యీ తొలి సంఘం యింకా రహస్య సంఘంగా వుంది. జర్మన్ కార్మిక సంఘాలు ఉన్న ప్రతి చోటా లీగు వుంది. ఇంగ్లండు, బెల్జియం, ఫ్రాన్సు, స్విట్జర్లాండుల లోని దాదాపు యీ అన్ని కార్మిక సంఘాలలోనూ, జర్మనీలోని అత్యధిక సంఖ్యాక సంఘాలలోనూ నాయకులు లీగుకి చెందిన వారే. ఆవిర్భవిస్తున్న జర్మన్ కార్మికోద్యమంలో లీగు గణనీయమైన పాత్ర వహించింది. అంతే కాదు. యావత్తు కార్మికోద్యమం యొక్క అంతర్జాతీయ స్వభావాన్ని నొక్కిచెప్పి, ఆచరణలో దాన్ని రుజువు చేసిన సంస్థల్లో మా లీగు మొట్టమొదటిది. ఇంగ్లీషువారు, బెల్జియన్లు, హంగేరియన్లు, పోలిష్‌వారు మొదలైనవారు లీగులో సభ్యులుగా వున్నారు. లీగు అంతర్జాతీయ కార్మిక సమావేశాలను, ప్రత్యేకించి లండనులో నిర్వహించింది.

1847లో జరిగిన రెండు మహాసభల్లో లీగు రూపాంతరీ కరణ జరిగింది. పార్టీ మూలసూత్రాలను ప్రణాళిక రూపంలో విశదీకరించి, ప్రచురించాలని రెండవ మహాసభ తీర్మానించింది. ఈ పార్టీ మూలసూత్రాలను రాసే పని మార్క్స్ –ఎంగెల్సులకు అప్పగించారు. 1848లో మొదటిసారిగా వెలువడిన "కమ్యూనిస్టు ప్రణాళిక" యీ విధంగా ఆవిర్భవించింది. ఫిబ్రవరి విప్లవానికి కొంచెం ముందుగా వెలువడిన యీ ప్రణాళికను దరిమిలా దాదాపు అన్ని యూరపియన్ భాషల్లోకీ అనువదించారు.

"డాయిష్ బ్రుసెలర్ జెయిటుంగ్"[6] పత్రికా నిర్వహణలో మార్క్స్ పాల్గొన్నాడు. మాతృదేశంలో పోలీసు పాలన దుష్ఫలితాలను ఈ పత్రిక నిర్దాక్షిణ్యంగా బహిర్గతం చెయ్యడంతో, ప్రష్యన్ ప్రభుత్వం మార్క్సును మళ్ళీ బహిష్కరింపజెయ్యాలని ప్రయత్నించింది. కాని ఆ ప్రయత్నంలో అది విఫలమైంది. అయితే, ఫిబ్రవరి విప్లవం ఫలితంగా బ్రస్సెల్స్‌లో సైతం ప్రజా సామూహిక ఉద్యమాలు ప్రారంభమై, బెల్జియంలో విప్లవం ముంచుకు రానున్నట్లు కనిపించడంతో బెల్జియం ప్రభుత్వం లాంఛనాల కోసం వేచి వుండకుండా మార్క్సును అరెస్టుచేసి బహిష్కరించింది. ఈలోగా, ఫ్రెంచి తాత్కాలిక ప్రభుత్వం ఫ్లోకోన్ ద్వారా, పారిస్‌కు తిరిగి రావలసిందిగా ఆయనకు ఒక ఆహ్వానాన్ని పింపింది. మార్క్స్ యీ ఆహ్వానాన్ని ఆమోదించాడు.

ఆ రోజులలో పారిస్‌లోని జర్మన్లు విప్లవాన్నీ, రిపబ్లిక్కునూ జర్మనీకి ఎగుమతి చేసేందుకుగాను, ఫ్రాన్సులోని జర్మన్ కార్మికులను స్వచ్ఛంద సాయుధ దుస్సాహసిక దళాలుగా ఏర్పాటు చెయ్యడానికి ప్రయత్నిస్తూండేవారు. మార్క్స్ పారిస్‌లో, ప్రత్యేకించి యీ వంచనకు వ్యతిరేకంగా బాహాటమైన కృషి జరిపాడు. ఒక వైపున జర్మనీ తన విప్లవాన్ని తనే నిర్వహించుకునేందుకు ప్రయత్నాలు చేసేది. మరో వైపున ఫ్రాన్సులో ఏర్పాటుచెయ్యబడిన ప్రతి ఒక్క విప్లవాత్మక విదేశీ స్వచ్ఛంద దళం యొక్క సమాచారాన్నీ కూలదొయ్యబడవలసిన ప్రభుత్వానికి ముందుగానే చేరవేసేవారు తాత్కాలిక ప్రభుత్వపు లమర్టీన్లు. బెల్జియం, బాడెన్లలో యిదే జరిగింది.

### మళ్ళీ జర్మనీకి....

మార్చి విప్లవానంతరం, మార్క్స్ కొలోన్ వెళ్లి, అక్కడ "నెవె రెయినిష్ జెయిటుంగ్"[7]ను ప్రారంభించాడు. ఆనాటి ప్రజాస్వామిక ఉద్యమ పరిధిలో శ్రామికవర్గ దృక్పథానికి ప్రాతినిధ్యం వహించిన పత్రిక యిదొక్కటే. ఈ పత్రిక 1848 జూన్ 1 నుంచి 1849 మే 19 వరకు వెలువడింది. 1848 నాటి పారిస్ జూన్ తిరుగుబాటుదార్లకు యీ పత్రిక బేషరతుగా యిచ్చిన తోడ్పాటు యీ విషయాన్ని నిరూపిస్తుంది. ఈ తోడ్పాటుకు పర్యవసానంగా దాదాపు దాని వాటాదారు లందరూ దానినుంచి తప్పుకున్నారు. "నెవె రెయినిష్ జెయిటుంగ్"

పవిత్రమైన ప్రతి ఒకదానిపైనా, రాజు నుండి, ఆ ప్రాంతపు వైస్ రీజెంటు నుంచి సాయుధ పోలీసుదాకా, అందునా అప్పట్లో, 8,000 మంది దుర్గ రక్షక సైనికులకు కలిగిన ప్రష్యన్ కోటలో, అత్యున్నత ప్రమాణంలో ధూర్తత్వంతో దాడి చేస్తున్నదని ఆ పత్రిక పేర్కొన్నా ఫలితం లేకపోయింది. ఆకస్మికంగా అభివృద్ధి నిరోధకులుగా మారిన రేనిష్ ఉదారవాద కూపస్థ మండూకాలు క్రోధావేశాన్ని ప్రకటించారు. అదీ నిష్ఫలమే అయింది. కొలోన్‌లో మార్షల్‌లా ద్వారా 1848 శరదృతువులో పత్రిక దీర్ఘకాలంపాటు నిలిపి వేయబడింది. దానివల్లా ప్రయోజనం లేకపోయింది. ఫ్రాంక్‌ఫుర్ట్‌లోని రెయినిష్ న్యాయ మంత్రిత్వ శాఖ కొలోన్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎదుట ఈ పత్రికలో ప్రచురితమైన ప్రతి ఒక్క వ్యాసాన్ని వరసగా ఖండించి, పత్రికపైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేసింది. ఆ ప్రయత్నమూ నిష్ఫలమే అయింది. పోలీసుల కళ్లముందు పత్రిక సంపాదకత్వమూ, ప్రచురణా ప్రశాంతంగా సాగుతూ వచ్చాయి. ప్రభుత్వంపైనా, బూర్జువావర్గం పైనా దాని దాడుల తీక్షణత పెరిగేకొద్దీ పత్రిక ప్రచారమూ, ప్రతిష్ఠా పెంపొందుతూ వచ్చాయి. 1848 నవంబరులో ప్రష్యన్ రాజకీయ కుట్ర జరిగినప్పుడు, "నెవె రెయినిష్ జెయిటుంగ్" పత్రిక సంచికపైన పన్నులు చెల్లించవద్దనీ, బల ప్రయోగాన్ని బలప్రయోగంతో ఎదుర్కోమనీ ప్రజలకు పిలుపునిస్తూ వచ్చింది. అలా చేసినందుకూ, మరో వ్యాసాన్ని ప్రచురించి నందుకూ 1849 వసంతంలో పత్రిక న్యాయవిచారణను ఎదుర్కోవలసి వచ్చింది. కాని రెండుసార్లూ కూడా పత్రిక నిర్దోషిగా వదలి వెయ్యబడింది. చివరకు డ్రెస్డెన్‌లోనూ, రైన్ రాష్ట్రంలోనూ 1849 మే తిరుగుబాట్లు అణచివెయ్యబడినప్పుడూ, గణనీయమైన సంఖ్యలో సైనికులు సమీకరణ కేంద్రీకరణల ద్వారా బాడెన్-పలాటినేట్ తిరుగుబాటుకు వ్యతిరేకంగా ప్రష్యన్ ఉద్యమం ఆరంభింపబడినప్పుడూ "నెవె రెయినిష్ జెయిటుంగ్" పత్రికను బలప్రయోగం ద్వారా అణచివేసే శక్తి తనకు తగినంతగా వున్నట్లు ప్రభుత్వం భావించింది. ఎర్ర సిరాతో అచ్చువెయ్యబడిన చిట్టచివరి సంచిక మే 19న వెలువడింది.

మార్క్స్ తిరిగి పారిస్ వెళ్లాడు. కాని, 1849 జూన్ 13వ తేదీ ప్రదర్శనకు కేవలం కొద్ది వారాల తర్వాత, తన నివాసాన్ని బ్రిటన్‌కు మార్చుకోవడమో, లేక ఫ్రాన్సును విడిచి వెళ్లిపోవడమో తేల్చుకొమ్మన్న ఫ్రెంచి ప్రభుత్వ బెదిరింపును ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన రెండో ప్రత్యామ్నాయాన్నే ఎంచుకొని లండనుకు తరలివెళ్లాడు. అప్పటినుండి ఆయన నిరవరోధంగా అక్కడే ఉండిపోయాడు.

1850లో హాంబుర్గ్ నుంచి "నెవె రెయినిష్ జెయిటుంగ్" పత్రికను సమీక్ష రూపంలో ప్రచురించేందుకు చేసిన ప్రయత్నాన్ని, కొద్ది కాలం తర్వాత మానుకోవలసివచ్చింది. అభివృద్ధి నిరోధక శక్తుల బలప్రయోగం నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా, ఈ ప్రయత్నం విరమించుకోవలసి వచ్చింది. ఫ్రాన్సులో 1851 డిసెంబరులో రాజకీయ కుట్ర జరిగిన వెంటనే, "లూయీ బోనపార్ట్ : బ్రూమేర్ పద్దెనిమిదవ తేదీ" పుస్తకాన్ని ప్రచురించాడు మార్క్స్. ఈ పుస్తకం బోస్టన్ నుంచి 1852లో ద్వితీయ ముద్రణ గానూ, 1869లో హాంబుర్గ్ నుంచీ ప్రచురితమయింది. 1853లో ఆయన "కొలోన్ కమ్యూనిస్టు కుట్రకేసు బండారం" రచించాడు మొదట బాసెల్‌లోనూ, తర్వాత బోస్టన్‌లోనూ, ఆ తర్వాత యిటీవల లైప్జిగ్‌లోనూ యిది పునః ప్రచురితమయింది.

## లండన్‌లో చదువుతూ- రాస్తూ....

కొలోన్ కమ్యూనిస్టు లీగు సభ్యులకు శిక్షలు పడిన తర్వాత, మార్క్స్ రాజకీయ ఆందోళనోద్యమం నుంచి ఉపసంహరించు కొని, పదేళ్లపాటు ఒకవంక అర్థశాస్త్రంపై బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో వున్న అపూరూపమైన సమాచార సంపదను అధ్యయనం చెయ్యడానికీ, మరో వంక న్యూయార్క్ డెయిలీ ట్రిబ్యున్ పత్రికకు వ్యాసాలు రాయడానికీ తన సమయాన్ని వెచ్చించాడు. అమెరికాలో అంతర్యుద్ధారంభం దాకా ఆ పత్రిక ఆయన సంతకంతో రచనలను ప్రచురించడమే కాకుండా యూరప్, ఆసియాలోని పరిస్థితులపై ఆయన లేఖిని నుండి వెలువడిన చాలా సంపాదక వ్యాసాలను కూడా ప్రచురించింది. బ్రిటిష్ అధికారిక సమాచారాన్ని కూలంకషంగా అధ్యయనంచేసి, వాటి ఆధారంగా లార్డు పామర్‌స్టన్‌పై మార్క్స్ చేసిన విమర్శలు లండన్‌లో చిన్న పుస్తక రూపంలో ప్రచురితమయ్యాయి.

## "అర్థశాస్త్ర విమర్శ - ఓ అధ్యయనం"

పలు సంవత్సరాలపాటు జరిగిన అర్థశాస్త్ర అధ్యయనం తొలి ఫలితంగా 1859 లో "అర్థశాస్త్ర విమర్శ – ఓ అధ్యయనం" మొదటి భాగం వెలువడింది (బెర్లిన్, డుంకెర్). ఈ రచనలో డబ్బుకు సంబంధించిన సిద్ధాంతంతో బాటు మార్క్సిస్టు విలువ సిద్ధాంతపు సుసంగత వివరణ కూడా వుంది. ఇటాలియన్ యుద్ధ కాలంలో, ఉదారమైనదిగా నటిస్తూ, పీడిత జాతుల విముక్తిదాత పాత్రను నటిస్తున్న బోనపార్టిజాన్నీ లండను నుంచి వెలువడే "దస్ ఫోక్" అనే వార్త పత్రికలో మార్క్స్ ఖండించాడు. తాటస్థ్యం మరుగున కల్లోలపరిస్థితిని స్వలాభానికి వినియోగించుకొనజూచిన ఆనాటి ప్రష్యన్ విధానాన్ని కూడా అదే వార్త పత్రికలో మార్క్స్

ఖండించాడు. జర్మనీ సానుభూతి కోసం పని చేస్తున్న కార్ల్ ఫోగ్ట్‌ను కూడా ఈ సందర్భంగానే విమర్శించవలసి వచ్చింది. అప్పట్లో ప్రిన్సు నెపోలియన్ (ప్లోన్ – ప్లోన్) పనుపున, లూయీ నెపోలియన్ జీతం పైన, తాటస్థ్యం కోసం, ఫోగ్ట్ పనిచేస్తూ ఉండేవాడు. ఫోగ్ట్ తనపైన బుద్ధిపూర్వకంగా కల్పించిన హేయాతిహేయమైన అభాండాలను కూడా ఖండించి, "మిస్టర్ ఫోగ్ట్" (లండన్ 1860) అనే రచన ద్వారా వాటికి జవాబిచ్చాడు. అందులో ఫోగ్ట్‌నూ, సామ్రాజ్యవాద కుహనా ప్రజాస్వామ్యవాద ముఠాకు చెందిన తదితర పెద్దమనుషులనూ తూర్పారబట్టాడు. చివరకు ఫోగ్ట్, డిసెంబరు సామ్రాజ్యం నుండి లంచాలు తీసుకున్న నేరారోపణపై శిక్షింపబడ్డాడు. దీనికి సంబంధించిన ధృవీకరణ సరిగా పదేళ్ల తర్వాత వచ్చింది. 1870లో తుయిలెరీ రాజభవనంలో దొరికిన బోనపార్ట్ కిరాయి మనుషుల జాబితాను, సెప్టెంబరు ప్రభుత్వం చేత ప్రచురించింది. అందులో, 'ఎఫ్' అన్న అక్షరం కింద యీ కింది అంశం నమోదు అయింది: "ఫోగ్ట్ – 1859 ఆగస్టులో ఈయనకు అందజేసిన సొమ్ము – 40,000 ఫ్రాంకులు."

## "పెట్టుబడి"

చివరకు, 1867లో హాంబుర్గ్‌లో మార్క్స్ ప్రధాన రచన అయిన "పెట్టుబడి: పెట్టుబడిదారీ ఉత్పత్తి విమర్శనాత్మక విశ్లేషణ" మొదటి సంపుటం వెలువడింది. ఈ గ్రంథం మార్క్స్ ఆర్థిక – సోషలిస్టు దృక్పథాలనూ– ప్రస్తుత సమాజంపైన, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంపైన, దాని పర్యవసానాలపైన ఆయన విమర్శనూ వివరిస్తుంది. నూతన యుగాన్ని సృష్టించిన ఈ రచన ద్వితీయ ముద్రణ 1872లో వెలువడింది. ప్రస్తుతం మార్క్స్ "పెట్టుబడి" రెండవ సంపుటి పరిష్కరణలో నిమగ్నుడై వున్నాడు.

## చిరకాల వాంఛితం, ఇంటర్నేషనల్!

ఈలోగా వివిధ యూరపియన్ దేశాలలో కార్మికోద్యమం తిరిగి విశేషంగా బలాన్ని పుంజుకున్న కారణంగా మార్క్స్ తన చిరకాల వాంఛితమైన కార్మిక సంఘ సంస్థాపన గురించి ఆలోచించగలిగాడు. ఈ సంఘం యూరప్, అమెరికాల్లోని మిక్కిలి అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాపించాలని మార్క్స్ ఆశించాడు. అది యిటు కార్మికులకే కాకుండా అటు బూర్జువావర్గానికీ, ప్రభుత్వాలకూ కూడా సోషలిస్టు ఉద్యమ అంతర్జాతీయ స్వభావాన్ని ఆచరణలో ప్రదర్శించాలనీ మార్క్స్ ఆశించాడు. యిది శ్రామిక వర్గానికి ప్రోత్సాహం కలిగించి, దానికి బలం చేకూర్చగా, దాని శత్రువుల హృదయాలను భయకంపితం చెయ్యగలుగుతుందనీ మార్క్స్ ఆశించాడు. సరిగా అప్పుడే రష్యాచేత మరోమారు అణచివెయ్యబడిన పోలండును బలపరుస్తూ లండన్‌లోని సెంట్ మార్టిన్ హాలులో 1864 సెప్టెంబరు 28న జరిగిన బహిరంగ సమావేశం యీ అంశాన్ని ముందుకుతెచ్చే అవకాశాన్ని కల్పించింది. ఈ ప్రతిపాదన హర్షామోదాలు పొందింది. ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ స్థాపింపబడింది. ఆ సమావేశంలో, లండన్ కేంద్రస్థానంగా, ఒక తాత్కాలిక జనరల్ కౌన్సిలు ఎన్నుకోబడింది. ఈ జనరల్ కౌన్సిలుకే కాకుండా, హేగ్ మహాసభ వరకు దరిమిలా ఎన్నుకోబడిన జనరల్ కౌన్సిళ్లన్నింటికీ కూడా మార్క్స్ ఉత్తేజకుడుగా వ్యవహరించాడు. 1864 నాటి "ప్రారంభోత్సవ విజ్ఞప్తి" మొదలుకొని, 1871 నాటి ఫ్రాన్సులో అంతర్యుద్ధంపై విజ్ఞప్తి దాకా ఇంటర్నేషనల్ యొక్క జనరల్ కౌన్సిలు విడుదల చేసిన పత్రాలలో దాదాపు ప్రతి ఒకదాన్నీ ఆయనే రచించాడు. ఇంటర్నేషనల్‌లో మార్క్స్ కృషిని వర్ణించడమంటే ఆ సంఘ చరిత్రను రాయడమే అవుతుంది. ఏమైనా అది యూరపియన్ కార్మికుల స్మృతిలో యింకా సజీవంగానే వుంది.

పారిస్ కమ్యూన్ పతనం ఇంటర్నేషనల్‌ను పనిచేసేందుకు అసాధ్యమైన పరిస్థితిలోకి నెట్టింది. విజయవంతమైన ప్రత్యక్ష కార్యాచరణకు దిగగల అవకాశాన్ని అన్నిచోట్లా కోల్పోయిన దశలో అది యూరపియన్ చరిత్ర ముమ్మోనకు నెట్టబడింది. ఏ ఘటనలైతే దాన్ని సప్తమ అగ్రరాజ్య స్థానానికి లేవనెత్తాయో అవే ఘటనలు అది తన పోరాటశక్తులను సమీకరించుకొని, ప్రత్యక్ష కార్యాచరణలో వినియోగించడానికి ఆటంకంగా తయారయ్యాయి. కార్యచరణకే పూనుకొంటే, తప్పనిసరిగా అపజయంపాలై, కార్మికోద్యమాన్ని కొన్ని దశాబ్దాలపాటు వెనక్కినెట్టే ప్రమాదంలో పడింది ఈ సంస్థ. దీనికితోడు, ఆకస్మికంగా వృద్ధి చెందిన ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ కీర్తిని స్వాతిశయ లేక కీర్తికాంక్షా పరితృప్తి కోసం వినియోగించుకోవాలని, అనేక వైపుల నుంచి కొందరు ముందుకొస్తున్నారు. వీరు ఇంటర్నేషనల్ నిజస్థానాన్ని గుర్తించినవారు గాని, దాని పట్ల గౌరవం ఉన్నవారు గాని కారు. అటువంటి పరిస్థితిలో వీరోచితమైన ఒక నిర్ణయాన్ని తీసుకోవలసి వచ్చింది, ఈ మారు కూడా మార్క్స్ ఆ నిర్ణయాన్ని తీసుకొని హేగ్ మహాసభలో అది ఆమోదం పొందేలా చేశాడు. అహేతుకమైన, అసహ్యకరమయిన శక్తులకు కేంద్రకంగా వ్యవహరిస్తున్న బకూనిస్టుల చర్యల బాధ్యతను లాంఛనప్రాయమైన ఒక తీర్మానం ద్వారా ఇంటర్నేషనల్ తిరస్కరించింది. అటు పిమ్మట, అంతకంతకూ మోయరాని భారంగా మారిన డిమాండ్లను తీర్చడం, అన్నివైపులా అలుముకున్న అభివృద్ధి నిరోధకత్వం మూలంగా, జీవశక్తిని ఓడ్చివేసే త్యాగాలను

చెయ్యడం ద్వారా తప్ప తన పూర్తి సార్థక్యాన్ని నిలబెట్టుకోవడం సాధ్యం కాదని ఇంటర్నేషనల్ గ్రహించింది. ఈ పరిస్థితుల దృష్ట్యా, జనరల్ కౌన్సిలును అమెరికాకు మార్చడం ద్వారా, ఇంటర్నేషనల్ తాత్కాలికంగా రంగం నుంచి నిష్క్రమించింది. ఆ కాలంలోనూ, దరిమిలా తరచుగాను ఖండింపబడిన ఆ నిర్ణయం ఎంత సరైనదో తదుపరి ఘటనలు రుజువుచేశాయి. ఈ నిర్ణయం ఒకవంక, ఇంటర్నేషనల్ పేర జరిగిన ప్రయోజనరహితమైన దుందుడుకు విప్లవ ప్రయత్నాలన్నింటికీ స్వస్తి చెప్పింది. మరోవంక, వివిధ దేశాల సోషలిస్టు కార్మిక పార్టీల మధ్య కొనసాగుతున్న సన్నిహిత సాంగత్యమూ, ప్రయోజనాలసామ్యానికీ, సకల దేశాల శ్రామికవర్గ సంఘీభావానికీ సంబంధించి ఇంటర్నేషనల్ కలిగించిన చైతన్యమూ, ఆ తరుణంలో ఓ సంకెలగా తయారైన అంతర్జాతీయ సంఘ లాంఛనప్రాయమైన అనుబంధమూ లేకపోయినప్పటికీ తమను తాము సుస్థాపితం చేసుకోగలుగుతున్నాయి.

హేగ్ మహాసభానంతరం, తన సైద్ధాంతిక కృషిని తిరిగి ప్రారంభించేందుకు మార్క్సుకు చివరకు తీరిక లభించింది. త్వరలోనే ఆయన "పెట్టుబడి" రెండవ సంపుటాన్ని పూర్తి చెయ్యగలుగుతారని ఆశించవచ్చు.

### ముఖ్యమైన ఆవిష్కరణలు రెండు!

విజ్ఞానశాస్త్ర చరిత్రలో ముఖ్యమైన పలు ఆవిష్కరణలద్వారా మార్క్స తన నామధేయాన్ని లిఖించుకున్నాడు. వాటిలో రెండింటిని మాత్రమే మేమిక్కడ ప్రస్తావించగలం. ప్రపంచ చరిత్రకు సంబంధించిన మొత్తం అవగాహనలో ఆయన తెచ్చిన విప్లవం మొదటిది.

అన్ని చారిత్రక పరిణామాలకూ మూలకారణాలు మానవుల మారుతున్న భావాలలో వుంటాయి. చారిత్రక పరిణామాలన్నింటిలోకి అతి ముఖ్యమైనవి రాజకీయమార్పులు. యావత్తు చరిత్రపైనా అవే ప్రాబల్యం వహిస్తాయి అన్నదే చరిత్రకు సంబంధించిన పూర్వ దృక్పథమంతటికీ ప్రాతిపదికగా వుంటూ వచ్చింది. అయితే, ఆ భావాలు మనుషుల మనసుల్లోకి ఎక్కడినుంచి వచ్చాయి? ఆ రాజకీయ మార్పుల కారణాలేమిటి అన్న ప్రశ్న తలెత్తేది కాదు. కేవలం యిటీవలి ఫ్రెంచి చరిత్రకారుల పరంపరలోనూ, పాక్షికంగా ఆంగ్ల చరిత్రకారులలోనూ కనీసం మధ్యయుగాలనాటి నుంచి అయినా, యూరపియన్ చరిత్రలో చోదకశక్తి, పెంపొందుతున్న బూర్జువావర్గానికీ, ఫ్యూడల్ ప్రభువర్గానికీ మధ్య సామాజిక, రాజకీయ పెత్తనం కోసం జరిగిన పోరాటమేనన్న విశ్వాసం చోటు చేసుకుంది.

అయితే అప్పుడు మార్క్స సమస్త పూర్వ చరిత్రా, వర్గ పోరాటాల చరిత్ర అనీ, బహుముఖ, సంక్లిష్ట రాజకీయ పోరాటాల్లోనూ సామాజిక వర్గాల సామాజిక, రాజకీయ పాలనే కీలకాంశమనీ, పాత వర్గాలు తమ ప్రాబల్యాన్ని నిలుపుకోడానికీ, కొత్తగా తలెత్తుతున్న వర్గాలు తమ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోడానికీ మధ్య జరిగే ఘర్షణే ప్రధానాంశమనీ నిరూపించాడు. మరైతే, యీ వర్గాల ప్రాదుర్భావానికీ, వాటి అస్తిత్వాలు కొనసాగడానికీ కారణం ఏమిటి? ఒకానొక దశలో సమాజం తన జీవితావసర వస్తువులను ఏ పరిస్థితుల్లోనైతే మార్పిడి చేసుకుంటుందో, ఆ ప్రత్యేక పాదార్థిక, భౌతిక, దృగ్గోచర పరిస్థితులే వాటి అస్తిత్వానికి కారణం. మధ్యయుగాలనాటి ఫ్యూడల్ పాలన సన్నకారు రైతాంగ సమష్టి సమాజాల స్వయంపోషక ఆర్థిక వ్యవస్థపై ఆధారపడింది. ఈ రైతాంగ సమష్టి సమాజాలు తమ అవసరాలను తీర్చగల వస్తువులన్నింటినీ తామే తయారుజేసుకునేవి. ఆ సమాజాల్లో దాదాపు మారకమంటూ వుండేదే కాదు. ఆ సమాజాలు బయట నుండి సాయుధ ప్రభువర్గపు రక్షణనూ, జాతీయ కనీసం రాజకీయ సంయోగాన్నీ పొందాయి. పట్టణాలు, వాటితోబాటు చేతి పరిశ్రమలూ తలెత్తి, మొదట ఆంతరంగిక, తర్వాత అంతర్జాతీయ వర్తక సంబంధాలు పెంపొందినప్పుడు పట్టణవాస బూర్జువావర్గం అభివృద్ధి చెందింది. మధ్యయుగం నాటికే యీ వర్గం ప్రభువర్గంతో పోరాటం జరిపి, ఫ్యూడల్ వ్యవస్థలో భాగస్వామ్యాన్నీ, అలాగే సమాజంలో ప్రత్యేక సౌకర్యాలు కలిగిన అంతరువునూ సంపాదించుకుంది. కానీ యూరపియనేతర ప్రపంచాన్ని కనుగొన్న తర్వాత, పదిహేనవ శతాబ్ది మధ్య నుండి, యీ బూర్జువా వర్గం మరింత విస్తృతమైన వాణిజ్య రంగాన్నీ, దానితో బాటు తన పరిశ్రమకు కొత్త ఊపునూ సంపాదించుకుంది.

అతి ముఖ్యమైన శాఖల్లో చేతివృత్తుల స్థానాన్ని యిప్పుడు ఫాక్టరీ స్థాయిలో కార్ఖానా పరిశ్రమలు ఆక్రమించాయి. గత శతాబ్దపు శాస్త్రీయావిష్కరణలు, ప్రత్యేకించి ఆవిరి ఇంజను కనుగొనటంతో యివి సాధ్యమయ్యాయి. భారీ పరిశ్రమలు తిరిగి తమ వంతులో, వెనుకబడిన దేశాలలో చేతిశ్రమను తొలగించడం ద్వారా వర్తకంపైన పనిజేసి, మరింత అభివృద్ధి చెందిన దేశాల్లో ఆవిరి ఇంజన్లు, రైల్వేలు, విద్యుత్ టెలిగ్రఫీ మొదలైన ఆధునిక నూతన రవాణా, వార్తాప్రసార సౌకర్యాలను సృష్టించాయి. బూర్జువావర్గం యీ విధంగా అంతకంతకూ అధికంగా సామాజిక సంపదనూ, సామాజిక అధికారాన్నీ కూడదీసుకోనారంభించింది. అయితే అది యింకా చాలాకాలం దాకా రాజకీయాధికారం నుండి దూరంగా అట్టే పెట్టబడింది. రాజకీయాధికారం యింకా

ప్రభువర్గం చేతుల్లోనూ, ఫ్యూడల్ ప్రభువర్గపు తోడ్పాటు కలిగిన రాజరికం చేతుల్లోనే వుంటూ వచ్చింది.

కాని ఒకానొక దశలో ఫ్రాన్సులో మహావిప్లవం నాటి నుండి – బూర్జువావర్గం రాజకీయ అధికారాన్ని సైతం ఆక్రమించుకుంది, అప్పుడది శ్రామికవర్గంపైనా, సన్నకారు రైతులపైనా పాలకవర్గం అయింది. ఈ దృక్కోణం నుంచి చూసినప్పుడు సమస్త చారిత్రక ఘటనలనూ – సమాజం యొక్క ప్రత్యేక ఆర్థిక పరిస్థితికి సంబంధించి తగినంత పరిజ్ఞానం వున్నట్లయితే – అత్యంత సరళమైన పద్ధతిలో వివరించడం సంభవం. అయితే, మన వృత్తి చరిత్రకారులలో యీ పరిజ్ఞానం పూర్తిగా లోపించడం వాస్తవం! అదేవిధంగా, ప్రతి ఒక చారిత్రక దశ భావాలనూ జీవితపు ఆర్థిక పరిస్థితులను బట్టీ ఆ దశ యొక్క సామాజిక, రాజకీయ సంబంధాలను బట్టీ వివరించవచ్చు. యివి తిరిగి యీ ఆర్థిక పరిస్థితులను బట్టే నిర్ధారితమవుతాయి. చరిత్ర మొట్టమొదటి సారిగా వాని వాస్తవ ప్రాతిపదికపైన నిలబడింది. అందరికీ స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, మనుషులు పెత్తనం కోసం పోరాడాలన్నా, రాజకీయాలు, మతం, తత్వశాస్త్రం మొదలైన వాటిలో పాల్గొనాలన్నా, మొదట వారికి తినడానికి తిండీ, తలదాచుకోడానికి యిల్లూ, కట్టుకునేందుకు దుస్తులూ వుండాలన్న, అందుకు గాను పని చేసి తీరాలన్న సంగతిని యింతకు ముందు పూర్తిగా విస్మరించారు. విస్పష్టమైన ఆ వాస్తవం చివరకు యిప్పుడు తన చారిత్రక ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

చరిత్రకు సంబంధించిన యీ కొత్త భావనకు సోషలిస్టు దృక్పథంలో అత్యధిక ప్రాముఖ్యం ఉంది. గత చరిత్ర యావత్తూ వర్గవైరుధ్యాలలోనూ, వర్గపోరాటాలలోనే గడిచిందనీ, పాలక వర్గాలూ, పాలిత వర్గాలూ, దోపిడీచేసే వర్గాలూ, దోపిడికి గురయ్యే వర్గాలూ ఎల్లప్పుడూ ఉంటూ వచ్చాయనీ, మానవజాతిలో అత్యధిక సంఖ్యాకులు ఎల్లప్పుడూ నడుంవిరిగే శ్రమకూ, అల్ప సంతోషానికే గురి అవుతూ వచ్చారనీ యీ చారిత్రక దృక్పథం నిరూపించింది. ఇది ఎందుకిలా జరిగింది? మానవజాతి అభివృద్ధి దశలన్నింటి లోనూ ఉత్పత్తి అతి తక్కువగా అభివృద్ధి చెందడమే యిందుకు కారణం. ఆ కారణంగా చారిత్రకాభివృద్ధి యీ శత్రువైరుధ్య రూపంలో మాత్రమే ముందు సాగగలిగింది. మొత్తంగా చారిత్రకాభివృద్ధిని ప్రత్యేకహక్కులు కలిగిన అత్యల్ప సంఖ్యాకులకు కేటాయించగా, అత్యధిక సంఖ్యాకులు తమ శ్రమద్వారా తమ కోసం నామమాత్రపు జీవితావసరపదార్థాలకు పరిమితులయ్యారు; దానికి తోడు, ప్రత్యేక హక్కులు కలిగినవారికోసం అంతకంతకు అధికతర జీవితావసర పదార్థాలనూ తయారుచెయ్యవలసిన దుస్థితిలో కూడా పడ్డారు. కాని, గత వర్గ పాలనకు యీ విధంగా యింత సహజమూ, హేతుబద్ధమూ అయిన వివరణను సమకూర్చే యీ చరిత్ర పరిశీలన పద్ధతే మరో విషయాన్ని కూడా స్పష్టం చేస్తోంది. ఈ చారిత్రిక పరిశీలనే లేకపోతే, మనిషి దుష్టత్వం మాత్రమే యిందుకు కారణమని చెప్పాల్సి వుంటుంది! ఆధునిక కాలంలో ఉత్పాదక శక్తులు యింత విశేషంగా అభివృద్ధి చెందిన కారణంగా మానవజాతిని పాలకులుగానూ, పాలితులు గానూ, దోపిడీ చేసేవారు, దోపిడీ చెయ్యబడేవారుగానూ – కనీసం మిక్కిలి అభివృద్ధి చెందిన దేశాల్లోనైనా – విభజించేందుకు గల చిట్టచివరి సాకు సైతం అంతరించి పోయిందన్నదే ఆ విషయం. పాలక బడా బూర్జువావర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని పరిపూర్తి చేసింది, సమాజానికి నాయకత్వం వహించగల సామర్థ్యం దానికి ఇప్పుడిక ఎంతమాత్రం లేదు, ఉత్పత్తి అభివృద్ధికి అది ఒక సంకెలగా కూడా తయారైంది. వ్యాపార సంక్షోభాలూ, ప్రత్యేకించి యిటీవలి అంతర్జాతీయ ఆర్థిక మహాసంక్షోభమూ, అన్ని దేశాల్లోని పరిశ్రమల హీనస్థితీ దీన్నే నిరూపించాయన్నదే ఆ విషయం. చారిత్రక నాయకత్వం శ్రామికవర్గం చేతుల్లోకి మారింది, సమాజంలో మొత్తంగా తనకుగల స్థానం ఫలితంగా సమస్త వర్గపాలననూ, సమస్త దాస్యాన్నీ, సమస్త దోపిడీని రద్దు చెయ్యడం ద్వారా మాత్రమే యీ వర్గం తనను తాను విముక్తం చేసుకోగల దన్నదే ఆ విషయం. బూర్జువావర్గపు అదుపును మీరి పెరిగిన సామాజిక ఉత్పాదక శక్తులు జతగూడిన శ్రామికవర్గం తమ చేతుల్లోకి తమను తీసుకొనేందుకూ అటువంటి పరిస్థితులను కల్పించేందుకు నిరీక్షిస్తున్నాయి – అన్నదే ఆ విషయం. తద్వారా, ఏ పరిస్థితుల్లోనైతే సమాజంలోని ప్రతి ఒక్క సభ్యుడూ ఒక్క ఉత్పత్తిలోనే కాకుండా సామాజిక సంపద పంపిణీ నిర్వహణలలో కూడా పాల్గొనగలుగుతాడో, ఏ పరిస్థితుల్లోనైతే యావత్తు ఉత్పత్తీ ప్రణాళికాబద్ధంగా జరిగి సామాజిక ఉత్పాదక శక్తులనూ, వాటి ఫలసాయాన్నీ పెంచి, తద్వారా సమాజంలోని ప్రతి ఒక్క సభ్యుని యొక్క సహేతుకమైన సకలావసరాల పరిదృప్తికీ నానాటికీ అధికతర హామీని కల్పిస్తుందో అటువంటి పరిస్థితులను కల్పించేందుకు నిరీక్షిస్తున్నాయి – అన్నదే ఆ విషయం!

## అదనపు విలువ సిద్ధాంతం

మార్క్స్ ముఖ్య ఆవిష్కరణల్లో రెండోది ఏమిటంటే, పెట్టుబడికీ శ్రమకీ మధ్య వున్న సంబంధం. వేరేమాటల్లో చెప్పాలంటే, ఆధునిక సమాజంలో, ప్రస్తుత పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో కార్మికుడు పెట్టుబడిదారుచేత ఏ విధంగా దోచుకో బడుతున్నాడో స్పష్టంగా వివరించడమే ఆ ఆవిష్కరణ. సమస్త


సంపదకూ, సమస్త విలువకూ శ్రమే మూలం అన్న సూత్రాన్ని అర్థశాస్త్రం ప్రతిపాదించిన నాటినుండీ యీకింది ప్రశ్న ముందుకు రాక తప్పలేదు: వేతన కార్మికుడు తన శ్రమద్వారా సృష్టింపబడిన విలువ మొత్తమంతటినీ పొందడం లేదు, దానిలో కొంత భాగాన్ని అతను పెట్టుబడిదారుకు అప్పగించవలసి వస్తోందన్న వాస్తవంతో దీనికి ఎలా పొత్తు కుదురుతుంది? బూర్జువా ఆర్థికశాస్త్రవేత్తలూ, సోషలిస్టులూ, కూడా యీ ప్రశ్నకు శాస్త్రీయంగా ఆధారసహితమైన జవాబు నిచ్చేందుకు బుర్రలు బద్దలుకొట్టుకున్నారు. చిట్టచివరకు మార్క్స్ దీనికి పరిష్కారమార్గాన్ని చూపాడు.

ఆ పరిష్కారం ఇదీ: ఆధునిక పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం లో రెండు సామాజిక వర్గాలు ఉండి తీరుతాయి – ఒక వంక ఉత్పత్తి సాధనాలనూ, జీవితావసర వస్తువులనూ కలిగివున్న పెట్టుబడిదారీ వర్గం వుంటుంది. మరోవంక శ్రామికుల వర్గం వుంటుంది. ఉత్పత్తి సాధనాలకూ, జీవితావసర వస్తువులకూ దూరం చెయ్యబడిన శ్రామికులు అమ్ముకొనేందుకు తమ శ్రమశక్తి అనే ఒకే ఒక్క సరుకును మాత్రమే కలిగివుంటారు. అందుచేత జీవితావసర సాధనాలను సంపాదించుకోవాలంటే వీరు తమ శ్రమశక్తిని అమ్ముకొని తీరాల్సి వుంటుంది. కాని, ఒకానొక సరుకు విలువను ఎలా నిర్ణయిస్తారు? ఆ సరుకు ఉత్పత్తిలోనూ, కాగా దాని పునరుత్పత్తిలో కూడా మూర్తీభవించిన, సామాజికంగా అవసరమైన, శ్రమపరిమాణం చేతనే దాని విలువను నిర్ణయించాలి. అందుచేత ఒకరోజులో, ఒక నెలలో లేక ఒక సంవత్సరంలో సగటు మానవుని శ్రమ శక్తి విలువ, ఒక రోజులో, ఒక నెలలో లేక ఒక సంవత్సరంలో యీ శ్రమశక్తి పోషణకు అవసరమైన జీవితావసర వస్తువుల పరిమాణంలో మూర్తీభవించిన శ్రమ పరిమాణం చేత నిర్ణయింపబడుతుంది.

ఒక రోజుకు ఒకానొక కార్మికునికి అవసరమైన జీవితావసర వస్తువుల ఉత్పత్తికి ఆరుగంటల శ్రమ అవసరమవుతుందని అనుకుందాం. లేకుంటే వేరేమాటల్లో, ఆ జీవితావసర వస్తువులలో యిమిడివున్న శ్రమ ఆరుగంటల శ్రమ పరిమాణానికి ప్రాతినిధ్యం వహిస్తుందని అనుకుందాం. అప్పుడు ఒక రోజు శ్రమశక్తి విలువ ఆరుగంటల శ్రమలో మూర్తీభవించిన డబ్బు మొత్తంలో కూడా వ్యక్తం చెయ్యబడుతుంది. మనం యింకొంచెం ముందుకు వెళ్లి చూద్దాం. మన యీ కార్మికుడిని పనిలో పెట్టుకున్న పెట్టుబడిదారు అతని శ్రమకు యీ మొత్తాన్ని ప్రతిఫలంగా యిచ్చినప్పుడు, అతని శ్రమశక్తి పూర్తి విలువను చెల్లించాడని అనుకుందాం. మరి యిప్పుడు కార్మికుడు రోజులో ఆరుగంటలు పెట్టుబడిదారు కోసం పనిచేస్తే, పెట్టుబడిదారు పెట్టిన ఖర్చుకు పూర్తి విలువను కార్మికుడు పూర్తిగా తీర్చివేసినట్లే, అంటే ఆరుగంటల శ్రమకు ఆరుగంటల శ్రమ తీర్చాడన్నమాట. అప్పుడు దానిలో పెట్టుబడి దారుకు మిగిలేది ఏమీవుండదు. కాగా పెట్టుబడీదారు యీ వ్యవహారం వంక పూర్తి భిన్నమైన పద్ధతిలో చూస్తాడు. అతనిలా అంటాడు: నేనీ కార్మికుని శ్రమశక్తిని ఆరుగంటలకు కాక మొత్తం రోజంతకీ కొన్నాను. తదనుగుణంగా అతను, పరిస్థితులనుబట్టి, కార్మికునిచేత 8,10,12,14 లేక అంతకన్న ఎక్కువ గంటలు పని చేయిస్తాను. ఈ కారణంగా ఏడవ, ఎనిమిదవ, గంటల యొక్క, తదుపరి గంటల యొక్క ఉత్పాదితం చెల్లింపబడని శ్రమ అవుతుంది. అది పెట్టుబడిదారు జేబులోకి పోతుంది. ఈ విధంగా పెట్టుబడిదారు కొలువులో వున్న కార్మికుడు, ఏ శ్రమశక్తి విలువకైతే తనకు మూల్యం చెల్లింపబడుతుందో ఆ శ్రమశక్తి విలువను పునరుత్పత్తి చెయ్యడమే కాకుండా, అంతకుమించి అదనపు విలువను కూడా అతను ఉత్పత్తి చేస్తాడు. మొదట పెట్టుబడిదారు చేత స్వాయత్తం చేసుకోబడే యీ అదనపు విలువ, దాని తర్వాతి క్రమంలో కచ్చితమైన ఆర్థిక నియమాల ప్రకారం మొత్తం పెట్టుబడిదారీ వర్గం మధ్య పంపిణీ చెయ్యబడి, ఏ మూలనిధి నుంచి అయితే భూమికౌలు, లాభం, పెట్టుబడి సంచయనంగా రూపొందుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, శ్రమ జెయ్యని వర్గాల చేత వినియోగింపబడే, పోగు చెయ్యబడే సంపద యావత్తూ ఉత్పన్నమవుతుందో ఆ మూలనిధిగా రూపొందుతుంది. కాని దీని వల్ల బానిస యజమాని లేక ఫ్యూడల్ ప్రభువుల ధనసంపద ఏ విధంగానైతే భూదాసుల యొక్క మూల్యం చెల్లింపబడని శ్రమహరణ ఫలితమో, అదేవిధంగా యీనాటి పెట్టుబడిదారుల ధనసంపద కూడా యితరుల మూల్యం చెల్లింపబడని శ్రమ ఫలితమే అన్న విషయం నిరూపితమవుతోంది. ఈ దోపిడి రూపాలన్నింటి మధ్యా గల భేదమల్లా మూల్యం చెల్లింపబడని శ్రమ ఏవిధంగా ఏ పద్ధతిలో స్వాయత్తం చేసుకోబడుతోందన్నది మాత్రమే. అయితే యిది ఆస్తిపరవర్గాల వంచనాత్మక పదజాలపు చిట్టచివరి ఔచిత్యాన్ని సైతం తొలగించివేసింది. ప్రస్తుత సామాజిక వ్యవస్థలో హక్కులు, న్యాయం, హక్కులూ విధుల సమానత్వం, ప్రయోజనాల సార్వత్రిక సామరస్యం వున్నాయనే మాట అర్థరహిత మయిపోయింది. ప్రస్తుత బూర్జువాసమాజం, తనకంటె ముందరి సమాజాల మాదిరిగానే, అంతకంటె ఏ మాత్రమూ తక్కువ కాకుండా అల్పసంఖ్యాకులచేత – అత్యధిక సంఖ్యాకుల దోపిడిని సాధ్యం చేసే ఆడంబరపూర్వకమైన ఒక వ్యవస్థ మాత్రమే అన్న

☞ మిగతా 26వ పేజీలో

# మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం



**ఫ్రెడరిక్ ఎంగెల్స్**

మార్చి 14వ తేదీన, మధ్యాహ్నం పావు తక్కువ మూడు గంటలకు, ప్రపంచంలోకెల్ల మహత్తర ఆలోచనాపరుని ఆలోచనా క్రియ ఆగిపోయింది. ఆయన్ని మహా అయితే రెండే రెండు నిమిషాలు విడిచి బయటకు వెళ్లి వుంటామేమో, కాని మేము తిరిగి వచ్చేసరికి ఆయన పడకకుర్చీలో శాంతంగా నిద్రపోతున్నాడు – అయితే అది శాశ్వత నిద్ర.

ఈ మనిషి మృతి మూలంగా యూరప్, అమెరికాలలోని సమరశీల శ్రామికవర్గానికీ, చారిత్రక విజ్ఞాన శాస్త్రానికీ అపారమైన నష్టం వాటిల్లింది. ఈ మహాత్ముని మహాప్రస్థాన కారణంగా ఏర్పడిన లోటు జనానికి త్వరలోనే అనుభూతమవుతుంది.



డార్విన్ ఏ విధంగానైతే జీవప్రకృతి యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడో, సరిగా అదే విధంగా మార్క్స్ మానవ చరిత్ర యొక్క అభివృద్ధి నియమాన్ని కనుగొన్నాడు. భావజాలం యొక్క అమితవృద్ధి కారణంగా యింతదాకా మరుగున పడిపోయిన ఒక సరళ సత్యాన్ని, రాజకీయాలు, విజ్ఞానశాస్త్రం, కళలు, మతం మొదలైన వాటిలో నిమగ్నులు అవగలిగేందుకు ముందు మానవజాతికి అన్నపానాలూ, వాస వస్త్రాలూ అవసరమన్న విషయాన్ని ఆయన కనుగొన్నాడు. కాగా, అత్యవసర జీవనాధార వస్తువుల ఉత్పత్తి, తత్పర్యవసానంగా ఒకానొక యుగంలో లేక ఒకానొక జాతి ప్రజల చేత సాధింపబడిన ఆర్థికాభివృద్ధి స్థాయే ఆ ప్రజల యొక్క రాజ్య సంస్థలకు, న్యాయశాస్త్రానికి సంబంధించిన భావనలు, కళలు, చివరకు మతానికి సంబంధించిన భావాలు సైతం క్రమాభివృద్ధి చెందడానికి పునాది. అందుకని వీటన్నింటినీ యీ పునాది దృష్ట్యానే – యింతవరదాకా జరుగుతున్నట్లు, యిందుకు తలకిందులుగా కాకుండా – వివరించాల్సి వుంటుంది.

అయితే అంతమాత్రమే కాదు. సమకాలీన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, యీ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్నీ శాసించే ప్రత్యేక గతినియమాన్ని కూడా మార్క్స్ కనుగొన్నాడు. అదనపు విలువ ఆవిష్కారంతో, ఏ సమస్యను పరిష్కరించే ప్రయత్నంలోనైతే అంతకు పూర్వపు అటు బూర్జువా అర్థశాస్త్రజ్ఞుల యొక్క, యిటు సోషలిస్టు విమర్శకుల యొక్క – అన్వేషణలన్నీ అంధాన్వేషణలుగానే మిగిలిపోయాయో, ఆ సమస్యపైన కాంతి ప్రసరింపబడింది.

ఒక జీవితానికి అటువంటి ఆవిష్కరణలు రెండు చాలు. అటువంటి ఒక్క ఆవిష్కరణను చేసే అదృష్టం లభించిన వ్యక్తి సైతం భాగ్యశాలి అనే చెప్పాలి. కాని మార్క్స్ తను పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ కూడా – మరి ఆయన చాలా రంగాల్లోనే పరిశోధన జరిపాడు, అలా పరిశోధన జరిపిన ఏ ఒక్క రంగంలోనూ ఆషామాషీగా పైపైన తడిమి విడిచిపెట్టలేదు. గణితశాస్త్రం తో బాటు ప్రతి ఒక్క రంగంలోనూ కూడా ఆయన స్వతంత్రమైన ఆవిష్కరణలు చేశాడు.

అటువంటి విజ్ఞాన శాస్త్రవేత్త ఆయన. అయితే విజ్ఞాన శాస్త్రవేత్తగా ఆయన యీ రూపం ఆయన సమగ్ర వ్యక్తిత్వంలో అర్ధాంశం కూడా కాదు. మార్క్స్‌కు సంబంధించినంత వరకు విజ్ఞాన శాస్త్రం చారిత్రకంగా క్రియాత్మకమైన, విప్లవాత్మకమైన ఒక శక్తి. ఏ విజ్ఞానశాస్త్ర సిద్ధాంతంలోనైనా ఒక కొత్త ఆవిష్కరణ జరిగితే – ఆచరణలో దాని అన్వయాన్ని గురించి ఆలోచించడం సైతం యింకా అసంభవమే అయినా కూడా – దానికి ఆయన మహా సంతోషంగా స్వాగతం పలికేవాడు. కాని అదే ఆవిష్కరణ పరిశ్రమల్లోనూ, మొత్తంగా చారిత్రకాభివృద్ధిలోనూ రక్షణ విప్లవాత్మక మార్పులకు దారి తీసినట్లయితే ఆయన మరో రకమైన ఆనందానుభూతి పొందుతూండేవాడు. ఉదాహరణకు, విద్యుచ్ఛక్తి రంగంలో జరిగిన ఆవిష్కరణల అభివృద్ధి క్రమాన్ని, మర్సేల్ ద్రెస్ యిటీవలి

☞ మిగతా 17వ పేజీలో



# మార్క్సిజం మూడు మూలాధారాలు మూడు భాగాలు

**వి.ఐ. లెనిన్**

మార్క్స్ ఉపదేశాలు నాగరిక ప్రపంచమంతటా బూర్జువా శాస్త్రానికి (అధికారయుగ విజ్ఞానశాస్త్రానికీ, ఉదార విజ్ఞానశాస్త్రానికీ కూడా) అత్యంత శత్రు భావాన్నీ, ద్వేషాన్నీ కలిగిస్తున్నాయి. అవి మార్క్సిజాన్ని ఒక రకమైన 'హానికరమైన పక్షం'గా పరిగణిస్తున్నాయి. అవి వేరొక వైఖరిని ప్రదర్శిస్తాయని ఆశించలేము, ఎందుచేతనంటే వర్గపోరాటం ప్రాతిపదికగా ఏర్పడిన సమాజంలో "నిష్పాక్షిక"మైన సామాజిక శాస్త్రం అనేది ఏదీ వుండజాలదు. అధికారయుతమైన, ఉదారమైన విజ్ఞాన శాస్త్రం అంతా ఏదో విధంగా వేతన బానిసత్వాన్ని సమర్థిస్తూ వుంటే, మార్క్సిజం ఆ వేతన బానిసత్వం మీద సడలుబాటు లేని యుద్ధాన్ని ప్రకటించింది. వేతన బానిస సమాజంలో విజ్ఞానశాస్త్రం నిష్పాక్షికంగా వుంటుందని ఆశించడం పెట్టుబడిదార్ల లాభాలను తగ్గించుకుని కార్మికుల వేతనాలను పెంచే సమస్య మీద ఉత్పత్తిదారులు నిష్పాక్షికంగా వుంటారని ఆశించడమంతటి తెలివితక్కువ అమాయకత్వమే అవుతుంది.

అంతే కాదు. తత్వశాస్త్ర చరిత్ర, సామాజిక శాస్త్ర చరిత్ర అత్యంత స్పష్టంగా తెలుపుతున్నది ఏమిటంటే, ప్రపంచ నాగరికతాభివృద్ధి యొక్క రాజమార్గానికి దూరంగా ఎక్కడో ఉత్పన్నమైన కరుడుగట్టిన సిద్ధాంతం అనే భావంలో చూస్తే మార్క్సిజంలో "ఒంటెత్తువాదా"న్ని పోలిన లక్షణం కించిత్తు కూడా లేదు. తద్భిన్నంగా మానవజాతిలో అగ్రశ్రేణికి చెందిన భావుకులు ఇదివరకే లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వడంలోనే మార్క్స్ ప్రతిభ వుంది. తత్వశాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ, సోషలిజంలోనూ మహాపండితులైన వారి బోధలకు సూటి అయిన తక్షణమైన కొనసాగింపుగానే మార్క్స్ సిద్ధాంతం ఉద్భవించింది.

మార్క్సిస్టు సిద్ధాంతం సర్వశక్తివంతమైనది, ఎందుకంటే అది సత్యమైనది. అది సమగ్రమైనది. సమరసమైనది. ఏ రకమైన మూఢ నమ్మకంతో గానీ, అభివృద్ధి నిరోధకత్వంతో గానీ, బూర్జువా పీడనను సమర్థించడంతో గానీ రాజీపడని పరిపూర్ణమైన ప్రపంచ దృక్పథాన్ని మానవులకు సమకూరుస్తుంది. అది జర్మన్ తత్వశాస్త్రంలోనూ, ఇంగ్లీషు అర్థశాస్త్రంలోనూ, ఫ్రెంచి సోషలిజంలోనూ వ్యక్తమైన విధంగా పందొమ్మిదవ శతాబ్దంలో మానవాళి సృజించినదానిలో ఉత్తమమైన దానికి న్యాయమైన వారసురాలు.

మార్క్సిజం యొక్క యీ మూడు మూలాధారాలను గురించీ, దాని అంశీభూతములు కూడా అయిన మూడు భాగాలను గురించీ మేమిప్పుడు క్లుప్తంగా వివరిస్తాం.

**(1)**

మార్క్సిజం తత్వశాస్త్రం భౌతికవాదం. యూరప్ ఖండం యొక్క ఆధునిక చరిత్ర అంతటిలోనూ, అందులో ప్రత్యేకించి పద్దెనిమిదవ శతాబ్దం చివరిలో మధ్యయుగం నాటి అన్ని రకాల చెత్తకూ వ్యతిరేకంగానూ, సంస్థలలోనూ భావాలలోనూ వుండిన ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగానూ కృతనిశ్చితమైన పోరాటం సాగిన ఫ్రాన్సులు ప్రకృతి శాస్త్రాల బోధలన్నిటికీ తగినట్టుగానూ, మూఢనమ్మకాలకు డాంబికాలు వగైరాలకు వ్యతిరేకంగానూ నిరంతరాయంగా ఎదిరించి నిలబడగలిగిన ఒకే ఒక తత్వశాస్త్రం భౌతికవాదమేనని రుజువైంది. అందుచేత ప్రజాస్వామ్యానికి శత్రువులైన వారు భౌతికవాదాన్ని "పూర్వపక్షం" చేయడానికీ, దాన్ని కూలదోసి అపఖ్యాతి పాలు చేయడానికీ ఎల్లప్పుడూ తమ సర్వశక్తులనూ వినియోగించారు. ఎల్లప్పుడూ ఏదో విధంగా మతాన్ని సమర్థించేవి, లేక బలపర్చేవి అయిన రకరకాల తాత్విక భావవాద రూపాలను ప్రోత్సహిస్తూనే వచ్చారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు తాత్విక భౌతికవాదాన్ని అత్యంత దృఢనిశ్చయంతో సమర్థించి యీ ప్రాతిపదిక నుంచి వైదొలగిన పెడమార్గం ప్రతీదీ ఎంత తీవ్రమైన పొరపాటో పదేపదే వివరించారు. ఎంగెల్స్ రచించిన "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్", "ఆంటీ డ్యూరింగ్" అనే గ్రంథాలలో వారి భావాలు అత్యంత స్పష్టంగానూ పూర్తిగానూ వివరించబడ్డాయి. ఇవి, 'కమ్యూనిస్టు ప్రణాళిక' లాగనే వర్గచైతన్యం కలిగిన ప్రతి కార్మికునికీ పాఠ్యగ్రంథాలు.

అయితే, మార్క్స్ పద్దెనిమిదవ శతాబ్దపు భౌతికవాదంతోనే ఆగిపోలేదు. తత్వశాస్త్రాన్ని ఆయన ముందుకు తీసుకుపోయాడు. ఆయన దానిని జర్మన్ సాంప్రదాయక తత్వశాస్త్రం సాధించిన విజయాలతో, అందులోనూ ముఖ్యంగా హెగెల్ సిద్ధాంతంతో పరిపుష్టం చేశాడు. ఈ హెగెల్ సిద్ధాంతం నుంచే ఫాయెర్‌బాఖ్ భౌతికవాదం వచ్చింది. అందులో ప్రధానమైన చేర్పు గతితర్కం,

అంటే అభివృద్ధిని దాని పరిపూర్ణమైన, ప్రగాఢమైన, అత్యంత సమగ్రమైన రూపంలో చూపించే సిద్ధాంతం. నిత్యం అభివృద్ధి చెందే పదార్థం యొక్క ప్రతిబింబాన్ని మనకు ప్రదర్శించే మానవ విజ్ఞానపు సాపేక్షత గురించిన సిద్ధాంతం. ప్రకృతి శాస్త్రంలో రేడియం, ఎలక్ట్రానులు, మూలద్రవ్యాలు వేరు పదార్థాలుగా మారిపోవడం మొదలైన ఇటీవలి ఆవిష్కరణలు, పాతకాలపు మృతి చెందిన భావవాదానికి తిరిగివెళ్లి బూర్జువా తత్వశాస్త్రజ్ఞులు చేసే 'నూతన' బోధలన్నీ విఫలం చెందగా, మార్క్స్ యొక్క గతితర్కం భౌతికవాదానికి అద్భుతమైన ధ్రువీకరణ.

మార్క్స్, తాత్విక భౌతికవాదాన్ని ప్రగాఢ మొనర్చి, పూర్తిగా అభివృద్ధి చేసి, ప్రకృతిని గురించిన ప్రజ్ఞానాన్ని మానవ సమాజం గురించిన ప్రజ్ఞానానికి కూడా వర్తించేట్టు విస్తృతపర్చాడు. ఆయన చారిత్రక భౌతికవాదం శాస్త్రీయ చింతన సాధించిన ఒక మహత్తర విజయం. చరిత్రను, రాజకీయాలను గురించిన అభిప్రాయాలలో అంతకు పూర్వం ప్రబలంగా వుండిన అవ్యక్తస్థితికీ, నియమరహిత స్థితికీ బదులు ఉత్పాదక శక్తుల పెరుగుదల ఫలితంగా సామాజిక జీవితపు ఒక వ్యవస్థ నుండి మరొక ఉన్నత వ్యవస్థ ఎలా అభివృద్ధి చెందుతుందో – ఉదాహరణకు ఫ్యూడలిజం నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా ఉత్పన్నమవుతుందో – నిరూపించే ఆశ్చర్యకరమైనంత పరిపూర్ణమైన సమరసమైన శాస్త్రీయ సిద్ధాంతం వచ్చింది.

మానవుని ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా ఉనికిలో వున్న ప్రకృతిని (అంటే, అభివృద్ధి చెందే పదార్థాన్ని) అతని ప్రజ్ఞానం ఏ విధంగా ప్రతిబింబిస్తుందో అలాగే మానవుని సామాజిక ప్రజ్ఞానం (అంటే, అతనికున్న తాత్విక, మత, రాజకీయ భావాలూ, సిద్ధాంతాలూ వగైరా) ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది. రాజకీయ సంస్థలు ఆర్థిక పునాది మీద నిర్మింపబడిన ఉపరి నిర్మాణం, ఉదాహరణకు, ఆధునిక యూరోపియన్ రాజ్యాల యొక్క వివిధ రాజకీయ రూపాలు శ్రామికవర్గంపై బూర్జువా వర్గపు అధికారాన్ని పటిష్టం చేసేటందుకు ఉపయోగపడుతూండటాన్ని మనం చూస్తున్నాం.

మానవజాతికి, అందులోనూ ముఖ్యంగా కార్మికవర్గానికి శక్తివంతమైన జ్ఞానసాధనాలను సమకూర్చిన పరిపూర్ణమైన తాత్విక భౌతికవాదమే మార్క్స్ బోధించిన తత్వశాస్త్రం.

**(2)**

ఆర్థిక వ్యవస్థ పునాదిపైనే రాజకీయ ఉపరి నిర్మాణం లేపబడుతుందనే విషయాన్ని గుర్తించిన మార్క్స్ యీ ఆర్థిక వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించడానికి ఎక్కువ శ్రద్ధ వహించాడు. మార్క్స్ తన ప్రధాన గ్రంథం అయిన 'పెట్టుబడి'లో ఆధునిక సమాజపు, అంటే పెట్టుబడిదారీ సమాజపు, ఆర్థిక వ్యవస్థను గురించి పరిశీలన జరిపాడు.

మార్క్స్‌కు పూర్వం సాంప్రదాయిక అర్థశాస్త్రం, పెట్టుబడిదారీ దేశాలలో కల్లా అత్యంత అభివృద్ధి చెందిన ఇంగ్లండులో వ్యుత్పన్నం అయింది. ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డో ఆర్థిక వ్యవస్థను పరిశీలించి విలువ యొక్క శ్రమ సిద్ధాంతానికి పునాదులు వేశారు. వారి కృషిని మార్క్స్ కొనసాగించాడు; ఆయన ఆ సిద్ధాంతానికి రుజువును సమకూర్చి దానిని సుసంగతంగా అభివృద్ధి చేశాడు. ప్రతి సరుకు యొక్క విలువ దానిని ఉత్పత్తి చేయడానికి ఖర్చు చేయబడే సామాజికంగా అవసరమైన శ్రమ కాలాన్ని బట్టి నిర్ణయం అవుతుందని నిరూపించాడు.

బూర్జువా అర్థశాస్త్రజ్ఞులు వస్తువుల మధ్య గల సంబంధాన్ని (ఒక సరుకుతో మరొక సరుకును మారకం చేసుకోవడమనే సంబంధాన్ని) గుర్తించగా మార్క్స్ మనుష్యుల మధ్య గల సంబంధాన్ని బైటపెట్టాడు. సరుకుల మారకం మార్కెట్ ద్వారా వ్యక్తిగత ఉత్పత్తిదారుల మధ్య ఉండే సంబంధాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ సంబంధం అంతకంతకు మరింత సన్నిహితం అవుతూ వుండడాన్ని, వ్యక్తిగత ఉత్పత్తిదారుల ఆర్థిక జీవితం యావత్తునూ ఒకటిగా విడదీయరాని విధంగా ఏకం చెయ్యడాన్ని ధనం తెలియజేస్తుంది. ఈ సంబంధం మరింత అభివృద్ధి చెందడాన్ని – మానవ శ్రమశక్తి ఒక సరుకుగా తయారవడాన్ని – పెట్టుబడి తెలియజేస్తుంది. వేతన కార్మికుడు తన శ్రమశక్తిని భూమినీ, ఫ్యాక్టరీలను, శ్రమ సాధనాలనూ కలిగివున్న యజమానికి అమ్ముకుంటాడు. కార్మికుడు తాను పనిచేసే రోజులో ఒక భాగాన్ని తననూ, తన కుటుంబాన్ని పోషించుకోడానికి అయ్యే ఖర్చుల సంపాదనకు (వేతనానికి) వినియోగిస్తాడు, ఆ రోజులో రెండవ భాగాన్ని ఎలాంటి ప్రతిఫలం లేకుండా పెట్టుబడిదారుని లాభానికి మూలాధారం అయిన అదనపు విలువను సృష్టించడానికి వినియోగిస్తాడు. ఈ అదనపు విలువే పెట్టుబడిదారీ వర్గపు సంపదకు మూలాధారం.

అదనపు విలువ సిద్ధాంతం మార్క్స్ ఆర్థిక సిద్ధాంతానికి పునాది రాయి. కార్మికుని శ్రమ సృష్టించిన పెట్టుబడి, చిన్న ఉత్పత్తిదారులను నాశనం చేయడం ద్వారానూ, నిరుద్యోగుల సైన్యాన్ని సృష్టించడం ద్వారానూ కార్మికుణ్ణే అణచివేస్తుంది.

పరిశ్రమలో అయితే భారీస్థాయి ఉత్పత్తి సాధించిన విజయం మనకి వెంటనే కనబడుతోంది. కాని వ్యవసాయ రంగంలో కూడా ఇదే పరిణామం సంభవిస్తోందని గ్రహించాలి. అక్కడ భారీ స్థాయి పెట్టుబడిదారీ వ్యవసాయపు ఆధిక్యత పెరుగుతోంది. యంత్రాల వినియోగం హెచ్చు అవుతోంది. ధన పెట్టుబడి గుప్పెట్లో పడి రైతాంగ ఆర్థిక వ్యవస్థ పతనం చెందుతోంది. వెనుకబడిన వ్యవసాయ పద్ధతుల భారం క్రింద క్రుంగి నాశనం అవుతోంది. సన్నకారు ఉత్పత్తి యొక్క క్షయం వ్యవసాయ రంగంలో వివిధ రూపాలను ధరిస్తోంది, కాని అది క్షీణించిపోతోందన్న విషయం మాత్రం నిర్వివాదం.

సన్నకారు ఉత్పత్తిని నాశనం చేయడం ద్వారా పెట్టుబడి శ్రామిక ఉత్పాదకత యొక్క పెరుగుదలకూ, బడా పెట్టుబడిదారుల సంఘాలు గుత్తాధిపత్య స్థితిని నెలకొల్పడానికి దారితీస్తుంది. ఉత్పత్తియే అంతకంతకు ఎక్కువ సామాజికం అవుతుంది – లక్షలాది కోట్లాది కార్మికులు ఒక క్రమబద్ధమైన ఆర్థిక నిర్మాణంగా కట్టుబాటు అవుతారు. కాని యీ సమిష్టి శ్రమ ఫలితం మాత్రం పిడికెడు మంది పెట్టుబడిదారులచే భుక్తం చేసుకోబడుతుంది. ఉత్పత్తిలో అరాజకత్వం, సంక్షోభాలు, మార్కెట్ల కోసం ఉగ్రమైన వేట, జన బాహుళ్యపు ఉనికికే భద్రత లేకపోవడం తీవ్రమైపోయాయి.

కార్మికులు పెట్టుబడి మీద ఆధారపడి వుండే స్థితిని అంతకంతకు అధికం చేయడం మూలంగా పెట్టుబడిదారీ విధానం సమైక్య శ్రమ యొక్క మహత్తర శక్తిని సృష్టిస్తుంది.

సరకుల ఉత్పత్తి మీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ అంకుర దశ నుంచి, సరళ మారకం దశ నుంచి దాని అత్యున్నత రూపాలైన భారీస్థాయి ఉత్పత్తి వరకూ పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధిని మార్క్స్ వివరించాడు.

పాతవి కొత్తవి, అన్ని పెట్టుబడిదారీ దేశాల అనుభవం అంతకంతకు ఎక్కువ మంది కార్మికులకు ఆయేటికాయేడు ఈ మార్క్స్ సిద్ధాంతంలోని సత్యాన్ని మరింత కళ్లకు కట్టినట్టుగా చూపిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచమంతటా విజయం పొందింది, కాని యీ విజయం పెట్టుబడి మీద శ్రమశక్తి సాధించబోయే విజయానికి నాంది మాత్రమే.

**(3)**

ఫ్యూడల్ వ్యవస్థ కూలదోయబడి ప్రపంచంలో "స్వేచ్ఛాయుత" పెట్టుబడిదారీ సమాజం రావడంతోనే యీ స్వేచ్ఛ అంటే శ్రామిక ప్రజలను పీడించి దోచుకునే ఒక కొత్త పద్ధతి మాత్రమే అనేది వెంటనే స్పష్టం అయిపోయింది. ఈ పీడనకు ప్రతివర్తనగానూ అసమ్మతిగానూ రకరకాల సోషలిస్టు సిద్ధాంతాలు తక్షణమే తల ఎత్తాయి. కాని ఆదిలో వచ్చిన సోషలిజం ఊహాజనిత సోషలిజంగానే వుండిపోయింది. అది పెట్టుబడిదారీ సమాజాన్ని విమర్శించింది. దానిని ఖండించి తిట్టింది, దాని నాశనాన్ని గురించి అది కలలు కంది, అది ఉత్తమ సమాజ వ్యవస్థ గురించి ఊహించింది, దోపిడి చేయడంలో వున్న అవినీతిని గురించి ధనికులకు నచ్చచెప్పి ఒప్పించడానికి ప్రయత్నించింది.

కాని ఊహాజనిత సోషలిజం నిజమైన పరిష్కార మార్గాన్ని చూపించలేకపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన బానిసత్వపు సారం ఏమిటో వివరించలేకపోయింది. పెట్టుబడిదారీ అభివృద్ధి నియమాలను బైటపెట్టడం గాని ఏ సామాజిక శక్తి నూతన సమాజ సృష్టికర్త కాగల సామర్థ్యం కలిగి వుందో చూపడం గాని చేయలేకపోయింది.

ఇది ఇలా వుండగా ఫ్యూడల్ వ్యవస్థ, భూదాస్య వ్యవస్థ, పతనం చెందిన వెనువెంటనే యూరప్‌లో ప్రతి చోటా, ముఖ్యంగా ఫ్రాన్సులో, వచ్చిన ఉధృతమైన విప్లవాలూ, యీ పరిణామానికంతకీ ప్రాతిపదిక, చోదకశక్తి వర్గపోరాటమే అన్న విషయాన్ని అంతకంతకు మరింత స్పష్టంగా బైటపెట్టాయి.

ఫ్యూడల్ వర్గంపై సాధించబడిన రాజకీయ స్వాతంత్ర్య సంబంధమైన ఏ ఒక్క విజయమూ కూడా తెంపరితనంతో కూడిన ప్రతిఘటనను ఎదుర్కోకుండా లభించలేదు. ఏ ఒక్క పెట్టుబడిదారీ దేశమూ కూడా, పెట్టుబడిదారీ సమాజంలోని వివిధ వర్గాల మధ్య జీవన్మరణ పోరాటం ద్వారా తప్ప కొద్దో గొప్పో స్వేచ్ఛాయుత ప్రజాస్వామిక ప్రాతిపదికపై వికసించలేదు.

దీన్నుంచి, ప్రపంచ చరిత్ర బోధించే యీ గుణపాఠాన్ని మొట్టమొదటి సారిగా గ్రహించి, ఆ గుణపాఠాన్ని సుసంగతంగా అన్వయించడంలోనే మార్క్స్ ప్రతిభ వుంది. ఈ గుణపాఠమే వర్గపోరాట సిద్ధాంతం.

ప్రజలు ఎల్లప్పుడూ రాజకీయాలలో వంచనకూ ఆత్మ వంచనకూ తెలివితక్కువగా బలి అవుతూనే ఉన్నారు. అన్ని నైతిక, మత, రాజకీయ, సాంఘిక పదజాలాల, ప్రకటనల, వాగ్దానాల వెనుక ఏదో ఒక వర్గం యొక్క ప్రయోజనాలు దాగి వున్నాయనే విషయాన్ని గ్రహించేటంత వరకూ వారలా బలి అవుతూనే వుంటారు. ప్రతి పురాతన సంస్థా, అది ఎంత అనాగరికమైనది

గానూ, కుళ్లిపోయినదిగానూ కనబడినప్పటికీ పాలక వర్గాలకు చెందిన కొన్ని శక్తులచే అది నిలబెట్టబడుతోందనే విషయాన్ని గ్రహించకుండా వున్నంతవరకూ సంస్కరణవాదులూ, అభివృద్ధి కాముకులూ పాత వ్యవస్థను సమర్థించే వారిచేత ఎల్లప్పుడూ మోసగించబడుతూనే వుంటారు. ఆ వర్గాల ప్రతిఘటనను పటాపంచలు చేయడానికి ఒకే ఒక మార్గం వుంది. అదేమిటంటే మన చుట్టూ ఉన్న సమాజంలోనే పాతను తుడిచివేసి కొత్తను సృష్టించే సామర్థ్యం గలిగివున్న శక్తులను – సమాజంలో వాటి స్థానాన్ని బట్టి ఆ పని చేసి తీరవలసిన శక్తులను – వెలికి తెచ్చి పోరాటం కోసం ఆ శక్తులను విజ్ఞానవంతులను చేసి సంఘటితపర్చడం.

ఇప్పటి వరకూ ఆధ్యాత్మిక బానిసత్వంలో పడి మగ్గుతూన్న పీడిత వర్గాలన్నీ దాని నుండి బైటపడే మార్గాన్ని శ్రామికవర్గానికి చూపినది మార్క్స్ బోధించిన తాత్విక భౌతికవాదం ఒక్కటే. పెట్టుబడిదారీ విధానపు సాధారణ వ్యవస్థలో శ్రామికవర్గం యొక్క నిజమైన స్థానం ఏదో వివరించినది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం ఒక్కటే.

అమెరికా మొదలు జపాను వరకు, స్వీడన్ మొదలు దక్షిణాఫ్రికా వరకు, ప్రపంచమంతటా శ్రామికవర్గపు స్వతంత్ర సంఘాలు వృద్ధి అవుతున్నాయి. తన వర్గ పోరాటాన్ని సాగించడం ద్వారా శ్రామికవర్గం విజ్ఞానాన్ని వికాసాన్ని పొందుతోంది. అది బూర్జువా సమాజపు దుర్భ్రమలను వదిలించుకుంటోంది. అది తన శ్రేణులను మరింత సన్నిహితంగా సమీకరించుకుంటోంది, తన విజయాల ప్రమాణాన్ని అంచనా వేయడం నేర్చుకుంటోంది. అది తన బలాలను పటిష్టం చేసుకుంటోంది, అప్రతిహతంగా అభివృద్ధి చెందుతోంది. ❑

## మార్క్స్ సమాధి వద్ద ఎంగెల్స్ ప్రసంగం

**(13వ పేజీ తరువాయి)**

ఆవిష్కరణలతో బాటు మార్క్స్ అత్యంత శ్రద్ధాసక్తులతో గమనించేవాడు.

మార్క్స్ అన్నిటికంటే ముఖ్యంగా విప్లవవాది కావడమే యిందుకు కారణం. ఏదో ఒక రకంగా పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన రాజ్యసంస్థలనూ కూల్చివెయ్యడానికి తోడ్పడడం, ఆధునిక శ్రామికవర్గ విముక్తికి తోడ్పడడమే ఆయన జీవిత పరమోద్దేశ్యం. దానికి తన స్థితినీ, అవసరాలనూ గురించిన చైతన్యాన్ని కలిగించి, ఏ పరిస్థితుల్లో దాని విముక్తి సంభవమో తెలియజెప్పిన మొట్టమొదటివాడు ఆయనే. పోరాటం జరపడమే ఆయన సహజగుణం. మరి ఆయన అతి కొద్దిమందికి మాత్రమే సాధ్యమైన ఆవేశంతో, పట్టుదలతో, సాఫల్యంతో ఆ పోరాటాన్ని సాగించాడు. మొదటి "Rheinische Zeitung" (1842)[4]లో, పారిస్ "Vorwarts"[87] (1844) లో, "Deutsche-Brusseler Zeltung"[9] (1847) లో, "Neue Rheinische Zeitung"[10] (1848-49) లో, New York Tribune"[18] (1852-61) లో ఆయన చేసిన పని, దీనికి తోడు సమరశీలమైన అనేక చిన్న పుస్తకాల రచన, పారిస్, బ్రసెల్స్, లండన్లలోని సంఘాల్లో చేసిన పని, చిట్టచివర ఆయన సేవల్లోకెల్ల శిఖరప్రాయమైనదైన ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్[88] సంస్థాపన – ఇదెంతటి గొప్ప పని అంటే, యీ సంఘ సంస్థాపకుడు, తను మరేదీ చెయ్యకపోయినా కూడా, యీ ఒక్క పనికే సముచితంగా గర్వించవచ్చు.

మరి వీటన్నింటి పర్యవసానంగానే, మార్క్స్ తనకాలంలో అందరికన్న ఎక్కువగా ద్వేషింపబడ్డాడు, అభాండాలకు గురయ్యాడు. రాజరిక, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కూడా ఆయన్ని తమ తమ దేశాల నుండి బహిష్కరించాయి. బూర్జువాలు, వారు మితవాదులైనా, లేక పరమ ప్రజాస్వామ్యవాదులైనా కూడా, మార్క్స్‌పై అభాండాలు కురిపించడంలో ఒకరితో మరొకరు పోటీపడ్డారు. ఇవన్నీ ఏదో ఒక సాలెగూడన్నట్లు ఆయన వీటన్నింటినీ తోసిపారేశాడు. వీటిని మనస్సుకు పట్టించుకోలేదు, మరీ తప్పనిసరి అవసరం ఏర్పడినప్పుడు మాత్రమే వీటికి సమాధాన మిచ్చాడు. మరి యిప్పుడాయన మన మధ్య లేడు. సైబీరియా గనులు మొదలుకొని కాలిఫోర్నియా దాకా, యూరప్ అమెరికాలలో అన్ని ప్రాంతాల్లోనూ గల లక్షలాది మంది ఆయన విప్లవవాద కార్మిక సహచరులు ఆయన్ని ప్రేమిస్తున్నారు, ఆయన్ని గౌరవిస్తున్నారు. ఈనాడు ఆయన మృతి పట్ల అశ్రుధారలు కురిపిస్తున్నారు. నేనొక విషయం ధైర్యంగా చెప్పగలను. ఆయనకు పలువురు వ్యతిరేకులు ఉండి వుండవచ్చునేమో గాని ఆయనకు వ్యక్తిగత శత్రువు మాత్రం ఒక్కడూ లేడు.


ఆయన పేరు యుగయుగాలదాకా అమరంగా వుంటుంది, అలాగే ఆయన కృషి కూడా చిరస్థాయిగా వుంటుంది.

లండన్‌లోని హైగేట్ శ్మశాన వాటికలో 1883, మార్చి 17న ఎంగెల్స్ ఇంగ్లీషు భాషలో చేసిన ప్రసంగం

జర్మన్ భాషలో, 1883, మార్చి 22న, "Der Sozialdemokrat" 13వ సంచికలో ప్రచురింపబడింది. ❑

# మార్క్స్ సమకాలికుల స్మృతులు


**పాల్ లాఫార్గ్ (1842-1911):**



(ఫ్రెంచ్ అంతర్జాతీయ కార్మికోద్యమ నాయకుడు. మార్క్సు సహయోధుడు, సన్నిహితుడు. మార్క్సు కూతురు లౌరా భర్త)

అయినా, మేయ్‌ట్లండు పార్కు రోడ్డులోని ఆయన పఠనాగారంలో నేను మొదట చూసింది. నిర్విరామ, నిరుపమాన సోషలిస్టు ఆందోళనకారుని కాదు–శాస్త్రవేత్తను. సోషలిస్టు భావనా నిధి అయిన ఆయన అభిప్రాయాలను తెలుసుకోడానికి నాగరిక ప్రపంచపు నలుమూలలనుండి పార్టీ కామ్రేడ్లు వచ్చే కేంద్రం ఆ పఠనాగారం. మార్క్సు ఆత్మిక జీవితంతో సన్నిహితత్వం కలగా లంటే, ముందు ఆ చరిత్రాత్మకగదిని గురించి తెలుసుకోవాలి.

ఆ గది రెండవ అంతస్తులో వుండింది. పార్కు వైపు వుండిన పెద్ద కిటికీ గుండా వెలుతురు వెల్లువలా వచ్చేది. కిటికీకి యెదురుగా, నిప్పుగూడుకి యిరు వైపులా వున్న గోడలకు ఆనుకొని వున్న బీరువాల నిండా పుస్తకాలూ, పై కప్పు దాకా పేర్చిన వార్తా పత్రికలూ, రాతప్రతులూ వుండినాయి. నిప్పుగూడుకి యెదురుగా, కిటికీకి ఒకవైపున, రెండు మేజాల మీద కాగితాలూ, పుస్తకాలూ వార్తా పత్రికలూ దొంతులు దొంతులుగా వుండినాయి. గది మధ్యలో, మంచి వెలుతురులో, ఒక చిన్న సాదా డెస్కూ (మూడు అడుగుల పొడవూ రెండు అడుగుల వెడల్పు గలది), ఒక కొయ్య కుర్చీ వుండినాయి. కుర్చీకీ పుస్తకాల బీరువాకూ మధ్య, కిటికీ కి యెదురుగా ఒక లెదర్ సోఫా వుండింది; అందులో మార్క్సు అప్పుడప్పుడు పండుకొని విశ్రాంతి తీసుకునేవాడు. నిప్పుగూడు మీద మరికొన్ని పుస్తకాలూ, సిగార్లూ, అగ్గి పుల్లలూ, సిగార్ పెట్టెలూ, పేపర్ వెయ్‌ట్లూ, మార్క్సు భార్యా బిడ్డలదీ, విల్ హెల్మ్ వొల్ఫ్‌దీ, ఫ్రెడరిక్ ఎంగెల్సుదీ ఫోటోలూ వుండినాయి.




మార్క్సు యెక్కువగా ధూమపానం చేసేవాడు. ఆయన ఒకసారి నాతో యిలా అన్నాడు: "యీ 'పెట్టుబడి'ని రాస్తూ తాగిన సిగార్ల ఖర్చు కూడా నాకు యీ గ్రంథం ద్వారా రాదు." ఆయన అగ్గి పుల్లలు మరీ యెక్కువగా ఖర్చు చేసేవాడు. పైపు, లేక సిగార్ పీల్చడం ఆయన తరచుగా మరిచిపోయి, దాన్ని తిరిగి అంటించుకోడానికి అగ్గిపెట్టెలు విపరీతంగా ఖాళీ చేసేవాడు.

ఆయన తన పుస్తకాలనూ, కాగితాలనూ యెవరూ మట్టసంగా – చిందరవందరగా అంటే బాగుంటుంది – పెట్టడానికి అంగీకరించేవాడు కాదు. పైకి మాత్రమే అవి చిందర వందరగా వున్నట్లు కనిపించేవి, నిజానికి ప్రతివొకటీ ఉద్దిష్ట స్థానంలో వుండేది. ఆయనకు అవసరమైన పుస్తకం గానీ, నోటుబుక్కు గానీ సులభంగా అందుకోడానికి వీలుగా సంభాషణల మధ్యలో కూడా తాను అప్పుడు చెప్పిన విషయాన్ని గానీ, అంకెను గానీ తరచుగా పుస్తకం యెత్తి అందులో చూపించేవాడు. ఆయనా, ఆయన పఠనాగారమూ ఏకఖండం: తన శరీరాంగాలు యెంతగా ఆయన అదుపులో వుండేవో, తన పుస్తకాలూ, కాగితాలూ అంతగా ఆయన అదుపులో వుండేవి.

పుస్తకాలు సర్దిపెట్టడంలోని బాహ్య సౌష్ఠవం ఆయనకు అక్కరలేదు: వేరు వేరు సైజుల సంపుటాలు ఒకదానిపక్కన ఒకటి నిలబెట్టబడి వుండేవి. వాటిని సైజును బట్టి కాక, విషయాలను బట్టి ఒక పద్ధతిలో పెట్టుకునేవాడు. పుస్తకాలు ఆయనకు మానసిక పరికరాలు – భోగ వస్తువులు కాదు. "అవి నా బానిసలు, నా అభీష్టం ప్రకారం నాకు సేవచెయ్యాలి" అనేవాడు ఆయన. పుస్తకం సైజునూ, బైండింగునూ,

కాగితం రకాన్నీ, టైపునూ ఆయన పట్టించుకునేవాడు కాదు. ఆయన పేజీల మూలలను మడిచే వాడు, మార్జిన్‌లో పెన్సిల్‌తో గుర్తులు పెట్టేవాడు, పంక్తులు పంక్తులే కింద గీతలు గీసేవాడు. పుస్తకాలమీద ఆయన యెప్పుడూ యేమీ రాసేవాడు కాదు; కానీ, ఒకోసారి, రచయిత మరీ అతిగా పోయిన చోట, ఆశ్చర్యార్థకమో, ప్రశ్నార్థకమో పెట్టకుండా వుండలేక పోయేవాడు. ఆయన కింది గీతల పద్ధతి యే పుస్తకంలో నైనా ఆయనకు కావలసిన ఘట్టం సులభంగా దొరికేటట్లు చేసేది. నోటుబుక్కులలో రాసుకున్నవీ, పుస్తకాలలో కింది గీతలు గీసిన ఘట్టాలు అనేక సంవత్సరాల తర్వాత మళ్లీ చదివే అలవాటు ఆయనకు వుండేది; తద్వారా అవి ఆయన మనస్సులో తాజాగా వుండేవి. ఆయనకు అసాధారణంగా విశ్వసనీయమైన జ్ఞాపకశక్తి వుండింది. హేగెల్ సలహా ననుసరించి, తనకు తెలియని విదేశ భాషలోని కవిత్వాన్ని కంఠస్థం చేయడం ద్వారా, ఆయన ఆ జ్ఞాపకశక్తిని చిన్నప్పటినుండి పెంపొందించుకున్నాడు.

మార్క్సు రాత్రిపూట చాలా పొద్దు పోయిందాకా మేలుకునే వాడు. అయినప్పటికీ ఆయన ఉదయం యెనిమిది, తొమ్మిది గంటల మధ్య నిద్రలేచి, బ్లాక్ కాఫీ తాగి, వార్తా పత్రికలు చదివి, తరువాత తన పఠనాగారంలోకి పోయేవాడు. అక్కడ ఆయన తెల్లవారుజామున రెండు మూడు గంటలదాకా పని చేసుకునే వాడు. భోజనానికి మాత్రమే పని ఆపేవాడు. వాతావరణం బాగుంటే, సాయంత్రం పూట హాంప్‌స్టెడ్ హీథ్ షికారు వెళ్లే వాడు. పగటిపూట అప్పుడప్పుడు సోఫాలో పండుకొని గంటో, రెండు గంటలో నిద్రపోయేవాడు. యవ్వనంలో ఆయన తరుచు రాత్రంతా మేలుకుని పనిచేసుకునేవాడు.

మార్క్సుకు పనిమీద అనురక్తి. పనిలో ఆయన యెంతగా లీనమై పోయేవాడంటే, తరచుగా భోజనం మాట మరిచిపోయే వాడు. తరచు ఆయన్ను యెన్నోసార్లు పిలిచిన తర్వాతగానీ భోజనశాలకు వచ్చేవాడు కాదు; చివరి ముద్ద తినీ తినకముందే మళ్లీ పఠనాగారంలో వుండేవాడు.

ఆయన చాలా కొద్దిగా తినేవాడు; ఆయనకు ఆకలిమాంద్యం కూడా వుండేది. దాన్ని అధిగమించడానికి ఆయన మసాలా వేసిన ఆహారం – యెండు మాంసమూ, యెండు చేపలూ, చేపగుడ్లూ, ఊరబెట్టిన కూరగాయలు – తినడం ద్వారా ప్రయత్నించేవాడు. ఆయన మెదడు చేసే అపారమైన పని వలన ఆయన కడుపు నష్టపడవలసి వచ్చింది. తన మెదడుకు ఆయన తన శరీర మంతటినీ బలి చేసినాడు. ఆలోచన అన్నిటికంటే గొప్ప ఆనందం ఆయనకు. ఆయన చిన్నప్పటి తత్వశాస్త్ర గురువైన హేగెల్ యొక్క యీ మాటలను ఆయన చెప్పడం నేను చాలా సార్లు విన్నాను: "దుష్టుని దురాలోచనకు కూడా స్వర్గంలోని అద్భుతాలను మించిన ఔన్నత్యమూ, ఉదాత్తతా వుంది."

యీ అసాధారణమైన జీవిత విధానాన్నీ, శక్తిని తోడేసే బౌద్ధిక కృషినీ భరించడానికి ఆయన దేహస్థితి మంచిదై వుండాలి. నిజానికి ఆయన దృఢ గాత్రుడు, మామూలు మనుషుల కంటె యెత్తరి, విశాలమైన భుజాలూ, దృఢమైన వక్షమూ గలవాడు. సుసమన్వితమైన అవయవాలు గలవాడు– తరుచుగా యూదులకు వున్నట్లు, ఆయన శరీరంలో కింది భాగం కంటె పై భాగం కాస్త పొడవుగా వున్నప్పటికీ చిన్నప్పుడు ఆయన వ్యాయామం చేసి వుంటే, చాలా బలిష్ఠమైన మనిషి అయ్యేవాడు. ఆయన క్రమబద్ధంగా అవలంభించిన శరీర పరిశ్రమ నడక ఒక్కటే; ఆయన గంటల తరబడి షికారు పోయేవాడు, లేదా కొండ లెక్కేవాడు, మాట్లాడుతూ, ధూమపానం చేస్తూ, అయినా బొత్తిగా అలసిపోకుండా. ఆయన తన గదిలో నడుస్తూ పనిచేసుకునేవాడని కూడా అనవచ్చు – నడుస్తూ ఆలోచించిన దాన్ని కాగితంమీద రాయడానికి మాత్రమే అప్పుడప్పుడు కాసేపు కూర్చునేవాడు. మాట్లాడేటప్పుడు అటూ యిటూ నడవడం ఆయనకు యిష్టం – యెప్పుడైనా ఒకసారి ఆవేశంగా వివరించేటప్పుడూ, సంభాషణ గంభీరమైనప్పుడూ ఆగేవాడు.

అనేక సంవత్సరాలు నేను ఆయనతో కలిసి హాంప్ స్టెడ్ హీథ్‌లో సాయంత్రపు షికార్లు పోయినాను. యిలా గడ్డి మైదానాల్లో నడిచేటప్పుడే నేను అర్థశాస్త్రం నేర్చుకున్నాను. "పెట్టుబడి" మొదటి భాగంలో ఆయన రాసిందంతా అది రాసేటప్పుడు నాకు వివరించి నాడు, ఆ విషయం తాను గమనించకుండానే.

షికారు నుండి యింటికి వస్తూనే, నేను విన్నదంతా సాధ్యమైన మేరకు యెప్పుడూ రాసుకునేవాణ్ణి. గంభీరమైన, జటిలమైన ఆయన వాదాలను అర్థం చేసుకోవడం మొదట్లో నాకు కష్టంగా వుండేది. దురదృష్టవశాత్తు ఆ అమూల్యమైన నోటుబుక్కులు నేను పోగొట్టుకున్నాను. పారిస్ కమ్యూన్ తర్వాత పారిస్‌లోనూ, బోర్డోలోనూ, పోలీసులు నా కాగితాలు శోధించి తగలబెట్టినారు.

నాకు అన్నిటికంటె విచారం కలిగేది ఒక సాయంత్రం నేను రాసుకున్న నోట్సు పోయినందుకు. ఆనాడు మార్క్సు, తనకు విలక్షణమైనట్టి పుష్కలమైన ఉపపత్తులతోనూ, వాదాలతోనూ, మానవ 'సమాజాభివృద్ధిని గురించిన తన ఉజ్వలమైన సిద్ధాంతాన్ని

వివరించినాడు. నా కన్నుల మీద పొరలు విడిపోయినట్లైంది. మొట్టమొదటిసారిగా ప్రపంచ చరిత్ర వెనక వున్న తర్కం నాకు స్పష్టంగా అవగతమైంది. పైకి చూడడానికి యెంతో పరస్పర విరుద్ధంగా కనపడే ఘటనలను – సమాజాభివృద్ధినీ, భావాల అభివృద్ధినీ – వాటి భౌతిక జన్మస్థానాల దాకా అనుసరించ గలిగినాను. నాకు కన్నులు మిరుమిట్లు గొలిపినాయి. నా మనస్సు మీద ఆ ముద్ర చాలా యేండ్లు వుండింది.


మార్క్సు సిద్ధాంతాల్లో అత్యంత గంభీర సుందరమైన ఆ సిద్ధాంతాన్ని నా దుర్బల శక్తి సామర్థ్యాలకు తగినట్లు నేను మాడ్రిడ్ సోషలిస్టులకు వివరించినప్పుడు వాళ్లకూ అలాంటి ముద్రే కలిగింది. నిస్సందేహంగా ఆ సిద్ధాంతం మానవ మేధ విశదీకరించిన అత్యున్నత సిద్ధాంతాల్లో ఒకటి.

చరిత్రలోనివీ, ప్రకృతిశాస్త్రంలోనివీ, తాత్విక సిద్ధాంతాల లోనివీ వాస్తవాలు నమ్మశక్యం గానంత విస్తారంగా ఆయన మెదడులో వుండినాయి. యేండ్ల తరబడి సాగిన బౌద్ధిక కృషిలో ఆయన సేకరించిన జ్ఞానాన్నీ, గమనించిన విషయాలనూ ఉపయోగించుకోవడంలో ఆయనకు అసాధారణమైన ప్రజ్ఞ వుండింది. యెప్పుడు యే విషయం మీద ఆయన్ను ప్రశ్న అడిగినా, అత్యంత సవివరమైన జవాబు మనకు లభించగలదు, దాని వెంట సార్వత్రికంగా వర్తించే తాత్విక అభిప్రాయాలు కూడా యెప్పుడూ వుంటాయి. ఇంజను ఆడుతూ రేవులో నిలిచి వుండే యుద్ధ నౌక లాంటిది ఆయన మెదడు – యే ఆలోచనా రంగంలోకైనా సరే బయలుదేరడానికి అది యెప్పుడూ సిద్ధంగా వుంటుంది..

అచ్చెరువు కలిగించే శక్తి, గొప్ప జ్ఞానమూ గల మేధ "పెట్టుబడి"లో కనపడుతుందనడంలో సందేహం లేదు. కానీ, నా దృష్టిలో, మార్క్సుతో సన్నిహిత పరిచయం గల వాళ్లందరి దృష్టిలో లాగే, "పెట్టుబడి"లో గానీ, ఆయన రచనల్లో దేనిలో గానీ, ఆయన మేధా పరిమాణం గానీ, జ్ఞాన విస్తృతి గానీ పూర్తిగా వెల్లడి కాదు. ఆయన రచనలకంటె ఆయన యెంతో గొప్పవాడు.

నేను మార్క్సుతో కలిసి పనిచేసినాను. ఆయన చెప్తూ వుంటే నేను రాసేవాణ్ణి అంతే. కాని దాని ద్వారా నాకు ఆయన ఆలోచనా విధానాన్నీ, రచనా విధానాన్ని గమనించే అవకాశం లభించింది. పనిచేయడం ఆయనకు సులభం – అదే సమయంలో కష్టం కూడా. సులభం యెందుకంటే, సంబంధం గల వాస్తవాలనూ, వాదాలనూ, వాటి పూర్ణత్వంలో గ్రహించడం ఆయన మెదడుకు కష్టం కాదు. కానీ, సరిగ్గా ఆ పూర్ణత్వమే ఆయన భావాల అభివ్యక్తిని దీర్ఘమైన, కష్టమైన పనిగా చేసేది.

## విల్ హెల్మ్ లీబ్ క్నెఖ్ట్ (1826-1900):



(జర్మన్ అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి. జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపకుల్లో ఒకడు. మార్క్సు మిత్రుడూ, సహచరుడూ).

### మార్క్సూ, పిల్లలూ

దృఢమైన, ఆరోగ్యవంతమైన ప్రకృతి గలవాళ్లందరిలాగే, మార్క్సుకు పిల్లల మీద అపారమైన ప్రేమ. ఆయన తన పిల్లలతో కలిసి గంటల కొద్దీ తానూ ఒక పిల్లవాడుగా వుండగల మహా ప్రేమార్ద్రమైన తండ్రి మాత్రమే కాదు. యెవరి పిల్లలైనా ఆయన్ను సూదంటు రాళ్లలాగా ఆకర్షించేవాళ్లు, ముఖ్యంగా అనాథలైన పిల్లలు కష్టాల్లో వుండి ఆయనకు యెదురైనప్పుడు బీదవాళ్ల పేటల గుండా మేము నడిచి వెళ్లేటప్పుడు, వందలసార్లు ఆయన మమ్మల్ని వదలిపెట్టి పోయేవాడు, చింపిరి బట్టలతో వాకిలి ముందర కూర్చున్న యే పసిబిడ్డ తలనో నిమిరి, ఆ బిడ్డ చేతిలో పెన్నీయో, అర పెన్నీయో పెట్టడానికి.

ఆయన బిచ్చగాళ్లను నమ్మేవాడు కాదు – బిచ్చమెత్తు కోవడం లండన్‌లో ఒక వృత్తిగా స్థిరపడింది, లాభసాటి వృత్తిగా కూడా, ఒక్కొక్కరు ఒక చిన్న రాగి డబ్బే యిచ్చినప్పటికీ, కనుక, మొదటి రోజుల్లో ఆయన దగ్గర డబ్బు వుంటే యెవరికీ బిచ్చం లేదనక పోయినా, బిచ్చమెత్తుకునే పురుషులను గానీ, స్త్రీలను గానీ చూసి ఆయన చాలా కాలం మోసపోలేదు. యెవరైనా అనారోగ్యమనో, ఆకలనో అభినయించి, ఆయన హృదయాన్ని కరిగించ జూస్తే , వాళ్ల మీద ఆయన తీవ్రంగా ఆగ్రహపడేవాడు. మానవ హృదయం లోని జాలిని అక్రమంగా వినియోగించుకోవడం మరీ నీచమనీ, బీదవాళ్ల సొత్తు అపహరించడంతో సమానమని ఆయన యెంచేవాడు. కానీ యే మనిషైనా, స్త్రీ గానీ, పురుషుడు గానీ, యేడ్చే బిడ్డ నెత్తుకొని మార్క్సు వద్దకు వచ్చి చేయి జాపితే, ఆ బిడ్డ కన్నులలోని అభ్యర్థనకు మార్క్సు లొంగిపోయేవాడు – ఆ మనిషి ముఖంలో వంచన యెంత స్పష్టంగా కనపడుతున్నప్పటికీ.

భార్యను కొట్టే మగవాణ్ణి – అలాంటి వాళ్లు ఆనాటి లండన్‌లో మామూలు. కొరడా పుచ్చుకొని చంపెయ్యాలనేటంత ఆవేశ పడేవాడు మార్క్సు. అలాంటి సందర్భాలలో ఆయన ఉట్టిపాటు ఆవేశం ఆయన్నూ, మమ్మల్నూ తరుచు యిబ్బందుల్లో పెట్టేది.

ఒక సాయంత్రం ఆయనా, నేనూ బస్సు పై అంతస్తులో

యెక్కి హాంప్‌స్టెడ్ రోడ్డుకు పోతూ వుండినాము. ఒక హోటల్ దగ్గర వున్న బస్‌స్టాపు వద్ద చాలా గలాటాగా వుండింది. "హత్య! హత్య! " అని ఒక స్త్రీ కేకలు వెయ్యడం వినిపిస్తూ వుండింది. రెప్పపాటులో మార్క్సు బస్సు దిగినాడు, నేను ఆయన్ను అనుసరించినాను. ఆయన్ను ఆపడానికి నేను ప్రయత్నించినాను, కానీ తుపాకి గుండును చేతితో ఆపడానికి ప్రయత్నించడమే అది. వెంటనే మేము ఆ కోలాహలం మధ్యలో వుండినాము, మా చుట్టూ జనం రద్దీగా వుండినారు. "యేమిటి సంగతి?" సంగతేమిటో తెలుస్తూనే వుంది. ఒక తాగిన ఆడ మనిషి మగనితో కొట్లాడింది. ఆమెను యింటికి తీసుకపోవాలని అతని ప్రయత్నం. ఆమె ప్రతిఘటిస్తున్నది, దయ్యం పట్టిన దానిలాగ కేకలు వేస్తూ. అంత వరకు బాగానే వుంది. మేము జోక్యం కలిగించుకోవలసిన అవసరం లేదని మాకు అర్థమైంది. కొట్లాడే జంటకు కూడా అది అర్థమైంది; వాళ్లు వెంటనే రాజీపడి, మా మీదికి వచ్చినారు. మాచుట్టూ వున్న గుంపు యింకా పెరిగి దట్టమైంది; "విదేశీ వెధవల"ను తన్నాలనే ధోరణిని వాళ్లు మా పట్ల వహించినారు. ముఖ్యంగా ఆ స్త్రీ మార్క్సుమీద దాడి చేసింది, ఆయన చక్కని, నల్లని గడ్డం ఆమె కోపానికి గురి అయింది. ఆ తుఫానును శాంతపరచడానికి నేను ప్రయత్నించినాను, కానీ సాధ్యం కాలేదు. ఉపకారబుద్ధితో జోక్యం కలిగించుకున్నందుకు మాకు మంచి శిక్ష పడేదే, యిద్దరు భద్రమైన పోలీసులు వచ్చి మమ్మల్ని రక్షించకపోతే. మేము సురక్షితంగా మళ్లీ బస్సు యెక్కి యింటి ముఖం పట్టినప్పుడు సంతోషించినాము. ఆ తరువాత అలాంటి సందర్భాలలో జోక్యం కలిగించుకునే ప్రయత్నాలలో మార్క్సు మరింత జాగ్రత్తగా వుండినాడు.

ఆయన తన పిల్లలతో కలిసి వుండినప్పుడు చూసిన వాళ్లకే అర్థమౌతాయి ఆయనకు గల ప్రగాఢమైన ప్రేమా, నిరాడంబరత్వమూ. ఆయనకు ఒక నిముషం తీరిక వున్నప్పుడు, లేదా షికారు పోయేటప్పుడు, ఆయన వాళ్లతో కలిసి పరుగెత్తుతూ, మహాగోలతో, నవ్వులతో నిండిన వాళ్ల ఆటలలో పాల్గొనేవాడు. పిల్లల మధ్య వున్నప్పుడు ఆయన పిల్లవాడుగా వుండేవాడు. యెప్పుడైనా ఒకసారి హాంప్‌స్టెడ్ హీథ్‌లో మేము "ఆశ్వికదళం" ఆట ఆడేవాళ్లం . ఆయన కూతుర్లలో ఒకరిని నేనూ, మరొకరిని మార్క్సు భుజాల మీద యెక్కించుకునే వాళ్లం; అప్పుడు యెగిరే పోటీయో, పరుగు పందెమో ప్రారంభమయ్యేది, లేదా రౌతులు ఆశ్విక యుద్ధం చేసేవాళ్లు. ఆడపిల్లలు మగపిల్లల లాగే గట్టివాళ్లు. తల బొప్పికట్టినా యేడ్చేవాళ్లు కాదు.

యిద్దరిలో పెద్ద కూతురు జెన్ని హెన్ అచ్చం తండ్రి పోలిక: ఆమెకు అవే నల్లని కన్నులూ, అదే నుదురూ. ఆమెకు అప్పుడప్పుడు పూనకం వచ్చేది. ఆమె కన్నులు మెరుస్తూ, నిప్పుల్లా అయ్యేవి; ఆమె యేదైనా వల్లించడం ప్రారంభించేది – తరుచు మహా అచ్చెరువు కలిగించే చిత్ర కల్పనలను. ఒక రోజు హాంప్ స్టెడ్ హీథ్ నుండి యింటికి పోయేటప్పుడు ఆమెకు అలాంటి పూనకం వచ్చి, నక్షత్రాలలోని జీవుల గురించి మాట్లాడింది; ఆమె మాటలు కవిత్వ రూపం ధరించినాయి. కొంత మంది పిల్లలను పసితనం లోనే పోగొట్టుకున్న మార్క్సు భార్య, మాతృ సహజమైన ఆందోళనతో, యిలా అన్నది: "యీ వయసు పిల్లలు అలాంటి విషయాలు మాట్లాడరు. యీ పిల్లకున్న అతితెలివి అనారోగ్య లక్షణం." మూర్ ఆమెను మందలించినాడు. నేను ఆమెకు జెన్ని హెన్‌ను చూపించినాను. ఆ అమ్మాయి పూనకం నుండి తేరుకొని ఉల్లాసంగా గంతులు వేస్తూ, నవ్వుతూ వుంది, అచ్చమైన ఆరోగ్యమూర్తి లాగ.

మార్క్సు కొడుకులిద్దరూ చిన్నతనంలోనే మరణించినారు – ఒకడు లండన్‌లో పుట్టినవాడు, చాలా పసితనంలోనూ; రెండవవాడు, బ్రసెల్స్‌లో పుట్టినవాడు, దీర్ఘ వ్యాధి తర్వాతా.

రెండవవాని చావు మార్క్సుకు దారుణమైన దెబ్బ. నయం కాజాలని ఆ వ్యాధి కాలం నాటి విషాదపూరిత వారాలు నాకింకా జ్ఞాపకం వున్నాయి.

ఆ అబ్బాయికి ఎడ్గార్ అనే ఒక మేనమామ పేరు పెట్టినారు, కానీ "ముష్" అని పిలిచేవాళ్లు. అతను చాలా ప్రతిభావంతుడు, కానీ ఆజన్మ రోగిష్ఠి, నిజమైన విషాద శిశువు. అతనికి అందమైన కన్నులూ, తెలివిపరుడనిపించే తలా వుండినాయి; ఆ తల అతని దుర్బల దేహానికి మరీ బరువు అనిపించేది..

పాపం ముష్ బతికి వుండేవాడేమో, అతనికి శాంతి, నిత్య సంరక్షణా లభించి వుంటే, అతను గ్రామసీమల్లో గానీ, సముద్ర తీరంలో గానీ వుండివుంటే. కానీ ప్రవాస జీవితంలో, ఒక చోటు నుండి మరొక చోటికి వేటాడబడుతూ, లండన్ జీవితపు కడగండ్ల మధ్య, మహా కోమలమైన పితృ వాత్సల్యంగానీ, మాతృ సంరక్షణ గానీ ఆ సుతిమెత్తని మొక్కకు, ప్రాణం కొరకు పోరాడడానికి తగిన శక్తి నివ్వలేకపోయినాయి. ముష్ మరణించినాడు.

ఆ దృశ్యం నాకు మరుపు రాదు: తల్లి తన మృత శిశువుమీద పడి నిశ్శబ్దంగా శోకిస్తున్నది – లెన్‌హెన్ పక్కన నిలిచి యేడుస్తున్నది – మార్క్సు ప్రచండమైన ఆరాటంలో చిక్కి, యెవరు

ఓదార్చబోయినా కస్సుమంటూ, దాదాపు ఆగ్రహావేశుడౌతున్నాడు. ఆడపిల్లలిద్దరూ మౌనంగా యేడుస్తూ, తల్లిని దగ్గరగా ఆనుకున్నారు. తల్లి వాళ్లను ఆర్తితో కరుచుకున్నది, తన కొడుకులను అపహరించిన మృత్యువు నుండి వాళ్లను రక్షించడానికా అన్నట్లు.

రెండు రోజుల తర్వాత శవం సమాధి చేయబడింది. లెస్నెర్, ఫెండెర్, లోహ్నెర్, కోన్రాడ్ ష్రామ్, యెర్ర వౌల్ఫ్, నేనూ హాజరైనాము. నేను మార్క్సుతో కలిసి బండిలో పోయినాను. ఆయన ఒక్క మాట కూడా లేకుండా కూర్చున్నాడు, చేతులలో తల పెట్టుకొని....

తరువాత టుస్సీ పుట్టింది, కేరింతలు వేసే పసికందు, బంతిలాగ గుండుగా – వెన్న ముద్దలాగ, గులాబి గుత్తి లాగ; మొదట పెరాంబులేటర్ (తోపుడు బండి) లో వెళ్లేది, తర్వాత ఒకోసారి యెత్తుకునేవాళ్లు, ఒకోసారి తప్పటడుగులు వేస్తూ వుండేది. నేను జర్మనీకి తిరిగి వచ్చినప్పుడు ఆ అమ్మాయికి ఆరేండ్లు – సరిగ్గా నా పెద్ద కూతురు వయస్సులో సగం. నా కూతురు అప్పటికి రెండేండ్లుగా హాంప్ స్టెడ్ హీథ్‌లో మార్క్సు కుటుంబంతో ఆదివారం షికార్లలో కలిసి వుండేది.

మార్క్సుకు పిల్లల సాహచర్యం లేకుండా జరగదు. అదే ఆయనకు విశ్రాంతీ, వినోదమూ. ఆయన పిల్లలు పెరిగి పెద్ద వాళ్లైనప్పుడు, లేదా చనిపోయినవాళ్లు చనిపోగా, మనుమలు ఆ స్థానం ఆక్రమించినారు. పారిస్ కమ్యూన్ ప్రవాసులలో ఒకరైన లోంగెను దెబ్బల ప్రారంభంలో పెండ్లి చేసుకొన్న జెన్నిహెన్ మార్క్సుకు అల్లరి మనుమలను కొంత మందిని ప్రసాదించింది. పెద్ద వాడు జాన్, లేక జోనీ మహా అల్లరివాడు, తాతకు ముద్దుల మనుమడు. ఆ కుర్రవాడు ఆయన్ను యిష్టం వచ్చినట్లు ఆడించే వాడు. ఆ శక్తి తనకుందని అతనికి తెలుసు. ఒక రోజు నేను లండన్‌కు పోయినాను. యేటా అనేక సార్లు తన తల్లి దండ్రుల చేత పారిస్ నుండి లండన్‌కు పంపబడే జోనీ అప్పుడు లండన్‌లో వుండినాడు. జోనీకి ఒక బుద్ధి పుట్టింది, తన తాతను గుర్రపు బండిగా చేసి తాను బండిమీద యెక్కాలని – అనగా తాను మార్క్సు భుజాల మీద కూర్చోవాలని, ఎంగెల్సూ, నేనూ గుర్రాలం కావాలని. మమ్మల్ని సక్రమంగా బండికి కట్టిన తర్వాత, మేయ్‌ట్లండు పార్కు రోడ్డులోని మార్క్సు బంగళా వెనక వున్న చిన్న తోట చుట్టూ కోలాహలంగా తరమడం ప్రారంభమైంది – బండి తోలడం అన్నమాట అది. లేక అది రీజెంటు పార్కు రోడ్డు లోని ఎంగెల్సు యింటి వద్దనేమో – లండన్ గృహాలు అన్నీ ఒక్కలాగే వుంటాయి, వాటి విషయంలో పొరపాటు పడడం సులభం, తోటల విషయంలో మరీనూ. కొద్ది చదరపు గజాల గచ్చూ, గడ్డీ వుంటుంది; వాటిమీద “నల్ల మంచు,” అనగా లండన్ మసి, కప్పి వుంటుంది, గచ్చు యెక్కడుందో, గడ్డి యెక్కడుందో తెలుసుకోడానికి వీలు లేకుండా – లండన్‌లో తోట అంటే అలా వుంటుంది.

స్వారీ ప్రారంభమైంది. పద! అంతర్జాతీయ – ఇంగ్లీషు, జర్మన్, ఫ్రెంచి కేకలతో. "Go on! Plus vite! Hurrah" మూర్ కదం తొక్కవలసి వచ్చింది, నుదుటి నుండి చెమట కారేదాకా. ఎంగెల్సో, నేనో కొంచెం మెల్లగా పోవడానికి ప్రయత్నిస్తే, బండి వాని కొరడా దెబ్బలు క్రూరంగా మా మీద పడేవి: “ఏయ్ దొంగ గుర్రం! పద ముందుకు!” అలా అది సాగింది, మార్క్సు పడిపోయేట్టున్నాడు. అప్పుడు మేము జోనీతో సంప్రదింపులు జరిపి, సంధి చేసుకున్నాం.

## లెన్ హెన్

మార్క్సు సంసారం ప్రారంభమైనప్పటి నుండి, ఆయన బిడ్డలలో ఒకరు అన్నట్లుగా, ఆ యింటికి లెన్‌హెన్ జీవమూ, ఆత్మా. ఆమెకు యెంతపని వుండేదని! అదంతా ఆమె సంతోషంగా చేసేది. యెప్పుడూ సరదాగా, చిరునవ్వులతో, సహాయపడడానికి సంసిద్ధంగా. కాని, ఆమెకు కూడా కోపం వచ్చేది; మూర్ శత్రువులను ఆమె తీవ్రంగా ద్వేషించేది.

మార్క్సు భార్య జబ్బుపడినప్పుడూ, లేక అస్వస్థంగా వున్నప్పుడూ ఆమె స్థానంలో లెన్ హెన్ తల్లిగా వ్యవహరించేది. యేమైనప్పటికీ, పిల్లలకు ఆమె రెండవ తల్లి. ఆమె సంకల్పానికి గొప్ప బలమూ, స్థిరత్వమూ వుండేది: ఆమె యేదైనా అవసర మనుకుంటే అది జరిగి తీరవలసిందే.

ముందే చెప్పినట్లు, ఆ యింట్లో ఆమె ఒక విధమైన నియంత: కచ్చితంగా చెప్పాలంటే, లెన్ హెన్ నియంత, కానీ మార్క్సు భార్య యజమానురాలు. యిక మార్క్సు ఆ నియంతృత్వానికి మేకపిల్లలాగా అణకువగా లోబడేవాడు.

యే మనిషీ తన పరిచారకుల దృష్టిలో గొప్పవాడు కాదు, అంటారు. మరి మార్క్సు లెన్ హెన్ దృష్టిలో గొప్పవాడు కానేకాదు. ఆయన కోసం ఆమె ఆత్మత్యాగం చేసుకునేది, ఆయన కోసమైనా, ఆయన భార్య కోసమైనా, పిల్లలలో యెవరి కోసమైనా ఆమె తన జీవితాన్ని, అవసరమైతే, సాధ్యమైతే, వందసార్లు అర్పించేది. నిజంగా వాళ్ల కోసం అలా అర్పించింది కూడా. కానీ, ఆమె మీద మార్క్సు పెత్తనం చేయలేదు. ఆయన యిష్టానిష్టాలూ, బలహీనతలూ అన్నీ ఆమెకు కరతలామలకం; ఆయన్ను ఆమె

తన యిష్టం వచ్చినట్లు ఆడించగలదు. ఆయన కోపంలో వున్నప్పుడూ, ఉరుముతూ ఉగ్రతాండవం చేసేటప్పుడూ, ఆయన దగ్గరికి యెవరు పోవాలన్నా జంకుతారు; అలాంటప్పుడు కూడా లెన్ హెన్ పులి గుహలోకి పోతుంది. ఆమెను చూసి ఆయన గాండ్రుమంటే, ఆమె అనవలసిన మాటలు నాలుగూ అనేస్తుంది. పులి, మేకపిల్లలాగ మెత్తబడుతుంది.

## మార్క్సూ, చదరంగమూ

డాఫ్ట్స్ ఆటలో మార్క్సు ఉత్కృష్టమైన ఆటకాడు. ఆ ఆటలో ఆయన యెంత నేర్పరి అంటే, ఆయన్ను ఓడించడమే కష్టం. చదరంగమంటే ఆయనకు కూడా ఇష్టం, కానీ అందులో అంత నేర్పరి కాదు. ఆ లోపాన్ని దీక్షతోనూ ఆకస్మిక దాడులతోనూ పూరించుకోడానికి ఆయన ప్రయత్నించేవాడు.

యాభైల ఆరంభంలో మా ప్రవాసులకు చదరంగం ప్రియంగా వుండింది. అప్పుడు మాకు తీరిక యెక్కువ వుండింది; మేము కోరినంత కంటె యెక్కువ వుండింది. కనుక మేము యెద్ర వొల్ఫ్ దర్శకత్వం కింద "ధీమంతుల ఆట"లో కొంత పాలుపంచుకున్నాం. వొల్ఫ్ పారిస్‌లోని అత్యుత్తమ చదరంగం బృందాలతో తరుచుగా కలిసి, దాన్ని గురించి కొంత నేర్చుకున్నాడు.

అప్పుడప్పుడు మాకు ఉద్రేకపూరితమైన చదరంగం పోటీలు వుండినాయి. ఓడినవాడు బాగా హాస్యోక్తులకు గురి అయ్యేవాడు; ఆటలు సరదాగా, తరుచు చాలా కోలాహలంగా వుండేవి. మార్క్సు యిబ్బందిలో పడినప్పుడు మనఃక్లేశం పొందేవాడు, ఓడిపోయినప్పుడు కోపగించుకునే వాడు. ఓల్డ్ కాంప్టన్ స్ట్రీట్ లోని "మాడల్ లాడ్జింగ్ హౌస్'లో మేము కొంతమందిమి కొంతకాలంపాటు వారానికి మూడున్నర షిల్లింగుల చొప్పున అద్దె యిచ్చి బస చేసినాము. అక్కడ మా ఆటను తీవ్రమైన ఆసక్తితో గమనిస్తూ మాచుట్టూ యెప్పుడూ యింగ్లీషువాళ్లు వుండేవాళ్లు – చదరంగం యింగ్లండులో జనప్రియంగా వుండింది, కార్మికులలో కూడా. మా కోలాహలపు సరదాతో వాళ్లు బాగా వినోదం పొందేవాళ్లు, రెండు డజన్ల యింగ్లీషు వాళ్ల కంటె యిద్దరు జర్మన్లు రద్దీగా వుంటారు.

తానొక కొత్తయెత్తు కనిపెట్టినాననీ, దానితో మమ్మల్నందరినీ ఓడిస్తాననీ ఒక రోజు మార్క్సు విజయోత్సాహంతో మాతో చెప్పినాడు. ఆయన సవాలుకు ఒప్పుకున్నాం. నిజమే, ఒకరి తర్వాత ఒకరిని మమ్మల్నందరినీ ఆయన ఓడించినాడు. కానీ మేము మా ఓటమి నుండి త్వరలో నేర్చుకున్నాం, మార్క్సును నేను తోసిరాజన్నాను. అప్పటికి బాగా పొద్దు బోయింది; కనుక మరుదినం తన యింటివద్ద మళ్లీ ఆడాలని ఆయన పట్టుబట్టినాడు.

సరిగ్గా పదకొండు గంటలకు లండన్‌లో అది బాగా ప్రొద్దున్నే – నేను మార్క్సు యింటివద్ద వుండినాను. ఆయన తన గదిలో లేడు, కానీ త్వరగా వస్తాడని చెప్పినారు. మార్క్సు భార్య కనిపించలేదు; లెన్ హెన్ అంత సరదాగా లేదు. కారణమేమిటని నేను అడగగలిగే లోపల మార్క్సు యింటిలోకి వచ్చి, నాతో కరచాలనం చేసి, చదరంగం పలక బయటికి తీసినాడు.

అప్పుడు పోరాటం ప్రారంభమైంది. మార్క్సు తన యెత్తు కంటె మేలైనది రాత్రి నేర్చుకున్నాడు; చాలా సేపు గడవకముందే నేను దుస్థితిలో పడినాను. నేను ఓడిపోయినాను, మార్క్సు సంతోషించినాడు. ఆయన కొంత పానీయమూ, కొన్ని శాండ్‌విచ్‌లు తెప్పించినాడు. తరువాత మేము మరొక ఆట ఆడినాము, నేను గెలిచినాను. మేము ఆడుతూ వుండినాం మారుతున్న అదృష్టంతోనూ, మారుతున్న మనస్థితులతోనూ.... –

మార్క్సు భార్య మా యెదుటబడకుండా వుంది, పిల్లలెవరూ దగ్గరికి రావడానికి సాహసించలేదు. పోటీ ప్రజ్వలించింది, ఒక సారి ఒకరికీ, మరొక సారి మరొకరికి అనుకూలంగా మారుతూ. చివరకు అర్ధరాత్రికి వరసగా రెండు సార్లు మార్క్సును ఓడించినాను. యింకా ఆడుదామని ఆయన పట్టుబట్టినాడు. కానీ లెన్ హెన్ ఖండితంగా చెప్పింది: "యిక చాలు!"...

## యోసెఫ్ వేడిమేయర్‌కు జెన్నీ మార్క్సు లేఖ

లండన్, మే 20, 1850

ప్రియమైన వేడిమేయర్,



మీరూ, మీ ప్రియమైన భార్యా నాకు అంత మైత్రి పూర్వకమైన, హార్దికమైన ఆతిథ్యం యిచ్చి, నేను మీ యింటిలో అంత సుఖంగా, స్వేచ్ఛగా వుండి, త్వరలో సంవత్సరమౌతుంది. యీ కాలమంతా నేను బతికివున్న లక్షణాలే మీకు చూపించలేదు: మీ భార్య నాకు అంత ఆప్యాయమైన ఉత్తరం రాసినప్పుడు నేను మౌనంగా వుండినాను, మీకు బిడ్డ పుట్టిన వార్త మాకు అందినప్పుడు కూడా నేను ఆ మౌనాన్ని భంగం చేయలేదు. నా మౌనం తరచు నన్ను బాధించింది, కానీ యీ కాలంలో అత్యధిక భాగం నాకు రాయడం సాధ్యం కాలేదు; యీనాడు కూడా రాయడం కష్టంగా వుంది, చాలా కష్టంగా వుంది.

కానీ, పరిస్థితులు కలం పట్టుకునేటట్లు నిర్బంధిస్తున్నాయి. "రెవ్యూ" నుండి మీకు డబ్బేమైనా అందివుంటే, లేక అందితే, మాకు వీలైనంత త్వరలో పంపాలని ప్రార్థిస్తున్నాను. డబ్బు మాకు చాలా చాలా అవసరంగా వుంది. సంవత్సరాల తరబడి మేము చేస్తున్న, భరిస్తున్న త్యాగాలను గురించి మేము యెప్పుడైనా గొప్పగా చెప్పుకున్నామని మమ్మల్ని యెవరూ నిందించలేరు. మా పరిస్థితులు జనానికి యెప్పుడూ, లేక దాదాపు యెప్పుడూ, తెలియవు. నా భర్త అలాంటి విషయాలలో చాలా సున్నితమైన వాడు; ఆయన తన సర్వమూ త్యాగం చేస్తాడు కానీ, ఆధికారికంగా గుర్తింపబడిన "గొప్పవాళ్లు" లాగా ప్రజాతంత్ర భిక్షాటనకు దిగడు. అయితే, ఆయన తన మిత్రులనుండి, ముఖ్యంగా కొలోన్‌లోని మిత్రుల నుండి, ''రెవ్యూ''కు క్రియాత్మకమైన, చురుకైన అండదండలు ఆశించి వుండగలడు. "రైనిషె సైటుంగ్" కొరకు ఆయన చేసిన త్యాగాలు యెక్కడ తెలుసునో అక్కడ నుండి ప్రప్రథమంగా ఆయన అలాంటి అండదండలు ఆశించి వుండగలడు. అండదండలకు బదులు, అశ్రద్ధగా, అస్తవ్యస్తంగా నిర్వహించినందు వలన వ్యాపారం సర్వనాశనమైంది. అన్నిటి కంటె యెక్కువ వినాశకరమైనది పుస్తక విక్రేత ఆలస్యాలో, వ్యాపార నిర్వాహకుల ఆలస్యాలో, కొలోన్‌లోని పరిచయస్తులో, మొత్తం మీద డెమోక్రట్ల వైఖరో తెలియదు.

యిక్కడ నా భర్త జీవితపు చిల్లర దిగుళ్ల చేత దాదాపు తలమునకలైనాడు; అవి యెంత అసహ్యమైన రూపంలో వున్నాయంటే, దినదినమూ, గంటగంటా చేసే ఆ పోరాటంలో అవి ఆయన శక్తినంతటినీ, ఆయన ప్రశాంతమైన, స్వచ్ఛమైన హుందాతనమంతటినీ హరించినాయి. ప్రియమైన వేడిమేయర్, పత్రికకు నా భర్త చేసిన త్యాగాలు మీకు తెలుసు. ఆయన దానికి వేలు నగదు పెట్టినాడు, దాని యాజమాన్యం తన చేతికి తీసుకున్నాడు. ఆయన అలా చేయకపోతే దాని అప్పులకు సమాధానం చెప్పవలసి వుండిన గౌరవనీయ డెమోక్రట్ల మాటలు విని, అది విజయం పొందే అవకాశం లేని సమయంలో, ఆయన అలా చేసినాడు. పత్రిక యొక్క రాజకీయ గౌరవాన్నీ, తన కొలోన్ పరిచయస్తుల పౌర గౌరవాన్ని కాపాడడానికి ఆయన యావత్తు బాధ్యతనూ తన పైన వేసుకున్నాడు; ఆయన తన ప్రింటింగ్ ప్రెస్సును త్యాగం చేసినాడు, ఆదాయమంతటినీ త్యాగం చేసినాడు, అక్కడ నుండి వెళ్లి పోయేముందు, కొత్తగా అద్దెకు తీసుకున్న భవనానికి అద్దె, సంపాదకులకు బాకీ వుండిన జీతాలు మొదలైనవి చెల్లించడానికి 300 థేలెర్లు అప్పు కూడా చేసినాడు. మరి, ఆయన బలవంతంగా గెంటి వేయబడినాడు. మేము మా కొరకు యేమీ వుంచుకోలేదని మీకు తెలుసు. మా వెండి సామాను – మా కుండిన చివరిది – తాకట్టు పెట్టడానికి నేను ఫ్రాంక్‌ఫుర్ట్‌కు పోయినాను. నా విలువైన వస్తువులూ, సమస్తమూ జప్తు చేయబడే ఉపద్రవం వుండింది గనుక, నేను కొలోన్‌లోని నా ఫర్నిచర్ అమ్మినాను. బాధాకరమైన ప్రతీఘాత విప్లవ కాలపు ప్రారంభంలో నా భర్త పారిస్‌కు పోయినాడు, మా ముగ్గురు పిల్లలతో నేను అనుసరించినాను. ఆయన పారిస్‌లో స్థిరపడీ స్థిరపడక ముందే అక్కడ నుండి బహిష్కరింపబడినాడు; అక్కడ యే కొంత కాలమైనా వుండడానికి మా పిల్లలకూ, నాకూ కూడా అనుమతి నిరాకరింప బడింది. నేను మళ్లీ ఆయన వెంట సముద్రం దాటిపోయినాను. ఒక నెల తర్వాత మా నాల్గవ బిడ్డ పుట్టింది. ముగ్గురు పిల్లలు వుండడమూ, నాల్గవ పిల్లను కనడమూ అంటే యేమిటో అర్థం కావడానికి మీరు లండన్‌నూ, యిక్కడి పరిస్థితులనూ తెలుసు కోవలసి వుంటుంది. అద్దెకు మాత్రమే మేము నెలకు 42 థేలెర్లు చెల్లించవలసి వుండింది. మాకు వచ్చిన డబ్బుతో మేము దీనిని యెదుర్కోగలిగినాము; కానీ "రెవ్యూ" ప్రచురింపబడినప్పుడు, మా స్వల్ప ఆదాయం అయిపోయింది. ఒప్పందానికి వ్యతిరేకంగా, మాకు డబ్బు యివ్వలేదు, తరువాత చిన్న చిన్న మొత్తాలుగా మాత్రమే యిచ్చినారు; ఫలితంగా యిక్కడ మా పరిస్థితి మహా భయం గొలిపేదిగా వుండింది.

నేను ఆ జీవితంలో ఒక్క రోజును మాత్రం వర్ణిస్తాను, సరిగ్గా యెలా జరిగిందో అలాగ; బహుశా కొద్ది మంది ప్రవాసులు మాత్రమే అలాంటి పాట్లు పడివుంటారని మీకు అర్థమౌతుంది. యిక్కడ పాలదాదులకు మితిమీరిన డబ్బు యివ్వాలి గనుక, నాకు రొమ్ములోనూ, వీపులోనూ నిత్యం ఘోరమైన బాధ వున్నప్పటికీ, నా బిడ్డకు నేనే పాలు యివ్వడానికి నిశ్చయించినాను. కానీ నా బంగారు బాబు పాలుతో పాటు యెంత దిగులూ, దిగమింగిన ఆందోళనా తాగినాడంటే, యెప్పుడూ అనారోగ్యంగా వుండి, రేయింబగలూ దారుణంగా బాధపడినాడు. వాడు యీ భూమి మీద పడినప్పటినుండి ఒక్క రాత్రి కూడా నిద్రపోలేదు, మహా అయితే రెండు మూడు గంటలు నిద్రపోయి వుంటాడు, అదైనా అరుదుగా. యిటీవల వానికి తీవ్రంగా గింజుకోవడము కూడా వుండి, నిరంతరం చావు బ్రదుకులమధ్య వుండినాడు. వాని బాధలో వాడు నా రొమ్ము యెంత బిర్రుగా పీల్చినాడంటే, నా రొమ్ము పుండు అయి, చర్మం పగిలి, వాని వణికే చిన్న నోటిలోకి రక్తం దుమికేది. నేను అలా ఒక రోజు వాణ్ని ఒడిలో

పెట్టుకొని కూర్చుని వుండగా, మా గృహ నిర్వాహకురాలు వచ్చింది. ఆమెకు శీతకాలంలో మేము 250 థేలెర్లు యిచ్చి, భవిష్యత్తులో డబ్బు ఆమెకు యివ్వకుండా, ఆమె యింటి సొంతదారునికి యిచ్చేటట్లు ఒప్పందం చేసుకొన్నాం; ఆ సొంతదారుడు ఆమె మీద జప్తు వారంటు తెచ్చి వుండినాడు. ఆమె ఒప్పందాన్ని నిరాకరించి, మేము యింకా ఆమెకు బాకీ వుండిన అయిదు పౌండ్లు డిమాండు చేసింది. మా దగ్గర అప్పుడు డబ్బు లేనందున (నౌట్ రాసిన ఉత్తరం తరువాత గానీ రాలేదు) యిద్దరు అమీనాలు వచ్చి నాకుండిన కొద్ది వస్తువులన్నీ జప్తు చేసినారు – గుడ్డలూ, పడకలూ, దుస్తులూ, ప్రతిదీ – పసిబిడ్డ ఉయ్యాల కూడా, అక్కడ నిలబడి ఆవురుమని యేడుస్తున్న మా కూతుర్ల మంచి మంచి ఆటవస్తువులు కూడా. వాళ్లు రెండు గంటలలో తీసుకపోతామని బెదిరించినారు. అప్పుడిక నేను చలికి గడ్డ కట్టుకపోయే మా పిల్ల లతో, అస్వస్థంగా వున్న నా రొమ్ముతో, కటికనేల మీద పండుకొనవలసి వచ్చేది. మా మిత్రుడు ష్రామ్, మాకు సహాయం తీసుకరావడానికి, నగరంలోకి ఉరికినాడు. అతను గుర్రపుబండిలో యెక్కినాడు, కానీ గుర్రాలు బెదురు తున్నాయి, అతను కిందికి దుమికినాడు, రక్తపు గాయాలతో అతన్ని యింట్లోకి తెచ్చినారు. వణికే పిల్లలతో నేను యేడుస్తూ వుండినచోటికి.

మరుదినం మేము యిల్లు వదలి పెట్టవలసి వచ్చింది. ఆ రోజు చలిగా, వర్షం పడుతూ కాంతిహీనంగా వుండింది. నా భర్త మాకు విడిది కోసం ప్రయత్నించినాడు. నలుగురు పిల్లలు వున్నారని ఆయన చెప్పగానే యెవరూ మాకు విడిది యివ్వరు. చివరికొక మిత్రుడు మాకు సాయం చేసినాడు. మేము అద్దె చెల్లించి, తొందరగా మా పడకలన్నీ అమ్మి, మందుల షాపు వానికీ, బ్రెడ్డు వర్తకునికీ, మాంస వర్తకునికీ, పాలవాళ్లకూ డబ్బు చెల్లించినాము; వాళ్లు జప్తు దృశ్యం చూసి భయపడి, హఠాత్తుగా తమ బిల్లులతో నన్ను చుట్టు ముట్టినారు. మేము అమ్మిన పడకలు బయటికి తెచ్చి, బండిమీద పెట్టినారు. యేమి జరుగుతున్నది? అప్పటికి బాగా పొద్దు గూకింది. ఇంగ్లీషు చట్టం ప్రకారం చీకటి పడిన తరువాత సామాన్లు తరలించకూడదు. అందుకని మేము యీ చట్టాన్ని ఉల్లంఘించినట్లయింది.

మా యింటి సొంతదారుడు యిద్దరు పోలీసులతో పరుగున వచ్చి, ఆ సామాన్లలో తన సామాన్లు కొన్ని వుండవచ్చుననీ, మేము విదేశాలకు పారిపోవాలనుకున్నామని వాదించినాడు. అయిదు నిముషాలు కాకముందే మా వాకిలి చుట్టూ రెండు మూడు వందల మంది అటూ యిటూ తిరుగుతున్నారు – చెల్సీ గుంపు అంతా. పడకలు మళ్లీ లోపల పెట్టినారు. మరుదినం పొద్దు పొడిచిన తర్వాత గానీ వాటిని కొనుగోలుదారునికి యివ్వడానికి వీలు లేదు. మేము మా సామాన్లు అన్నీ అమ్మినప్పుడు మా అప్పులు చివరి పైసా వరకు చెల్లించే స్థితిలో వుండినాము. మేము యిప్పుడు వుంటున్న జర్మన్ హోటల్ (1, లైసెస్టర్ స్ట్రీట్, లైసెస్టర్ స్క్వేర్) లోని రెండు చిన్న గదులకు మా చిన్న పిల్లలతో పోయినాము. అక్కడ వారానికి 5 పౌండ్లు యివ్వగా మమ్మల్ని మనుషుల మాదిరి చూసినారు.

ప్రియ మిత్రమా, యిక్కడి మా జీవితంలోని ఒక్క రోజును యింత దీర్ఘంగా, అధిక ప్రసంగంగా వర్ణించినందుకు క్షమించండి. యిది అనుచితమని నాకు తెలుసు, కానీ యీ సాయంత్రం నా హృదయం దుఃఖంతో నిండి పొర్లిపోతున్నది, నా నిజమైన, ఉత్తమ, పాత మిత్రుని వద్ద ఒకసారైనా నా హృదయ భారం దించుకోవాలి. యీ చిల్లర దిగుళ్లకు నేను లొంగిపోయినానని అనుకోకండి: నాకు యెంతో బాగా తెలుసు, మన పోరాటం యేకాకిది కాదు, నేను అదృష్టమూ, ఆనందమూ గల భాగ్యవంతులలో ఒకతెను, యెందుకంటే, నా జీవిత ఆధారమైన నా భర్త యిప్పటికీ నా పక్కన వున్నాడు. నిజంగా నా ఆత్మనే క్షోభ పెట్టేదీ, నా హృదయ రక్తాన్ని పిండేదీ యేమిటంటే, చిల్లర విషయాలతో ఆయన అంతగా బాధపడవలసి రావడం, ఆయనకు అంత స్వల్ప సహాయం లభించగలగడం, అంతమంది యితర్లకు యిష్టంతో, సంతోషంతో సహాయం చేసిన ఆయనే అంత నిస్సహాయుడు కావడం. కానీ, ప్రియమైన వేడిమేయర్ , మేము యెవరిమీదనైనా డిమాండ్లు చేస్తున్నామని అనుకోకండి. నా భర్త తన భావాలనూ, తన ప్రోత్సాహాన్నీ, తన అండదండలనూ యిచ్చినవాళ్లను కోరగలిగిందల్లా ఒక్కటే: తన "రెవ్యూ"కు సంబంధించిన వ్యాపారం లో మరింత చురుకుదనం చూపించమనీ, దానికి మరింత అండదండలు యివ్వమనీ. యీ విషయం నేను సగర్వంగా, ధైర్యంగా ఉద్ఘాటించగలను. ఆ స్వల్పం ఆయన హక్కు. అది యెవరికీ అన్యాయమని నేను అనుకోను. అదే నన్ను దుఃఖ పెట్టేది. కానీ నా భర్త అభిప్రాయం వేరు. యెప్పుడూ, అత్యంత భయంకరమైన క్షణాల్లో కూడా, ఆయన భవిష్యత్తులో విశ్వాసం కోల్పోలేదు; తన ఉత్సాహపూరిత మనస్తత్వం కూడా కోల్పోలేదు; నేను ఉల్లాసంగా వుండడమూ, మా అనురక్త సంతానం తమ ప్రియమైన తల్లిని అంటగరుచుకుని వుండడమూ చూసి ఆయన సంతృప్తి పడతాడు. ప్రియమైన వేడిమేయర్, మా పరిస్థితిని

గురించి మీకు నేను యింత వివరంగా రాసినానని ఆయనకు తెలియదు. అందుకని యీ మాటలను మీరు ప్రస్తావించవద్దని మిమ్మల్ని కోరుతున్నాను. మా డబ్బు వసూలు చేయడమూ, పంపడమూ వీలైనంత త్వరగా చేయండని ఆయన పేరుమీద మిమ్మల్ని అడిగినానని మాత్రమే ఆయనకు తెలుసు.

సెలవు, ప్రియ మిత్రమా, నా అనురాగ పూర్వకమైన శుభాకాంక్షలు మీ భార్యకు అందజేయండి, మీ బుజ్జి పాపాయికి నా తరపున ముద్దు యివ్వండి, తన బిడ్డ కోసం యెన్నో కన్నీళ్లు కార్చిన ఒక తల్లి తరపున. అయినప్పటికీ మా ముగ్గురు పెద్ద పిల్లలూ అద్భుతంగా వున్నారు. ఆడపిల్లలు అందంగా, ఆరోగ్యంగా, ఉల్లాసంగా, బుద్ధిమంతులుగా వున్నారు, బొద్దుగా వున్న మా చిన్న కుర్రవాడు హుషారుగా వున్నాడు, వాని పొట్ట నిండా మహా తమాషా అయిన భావాలు వున్నాయి. కుర్రకుంక రోజంతా ఆశ్చర్యకరమైన ఆవేశంతో, ఉరుములాంటి కంఠంతో పాడుతూ వుంటాడు. ఫ్రైలిగ్రాత్ రచించిన "మార్సెల్యేస్" పాటలోని పాదాలు వాడు గొంతు చించుకొని పాడితే యిల్లు దద్దరిల్లి పోతుంది.

"రావే జూన్, లోకోత్తరమగు ఘనకార్యాలను మాకై మోసుకరావే, జూన్ ! యశస్కరమ్మగు పనులు చేయ మా హృదయము ఉవ్విళ్లూరుచునున్నది."

బహుశా ఆ నెలయొక్క చరిత్రాత్మక విధి కావచ్చు, గత రెండు జూన్‌ల లాగే బ్రహ్మాండమైన పోరాటం ప్రారంభించడం; అందులో మళ్లీ మనమందరమూ చేతులు కలుపుదాం. సెలవు!

## కార్ల్ మార్క్స్ జీవితమూ కృషి

**(12వ పేజీ తరువాయి)**

విషయాన్ని బహిర్గతం చేసింది. పైగా, ఈ అల్పసంఖ్యాకుల సంఖ్య నానాటికీ యింకా తగ్గుతోంది.

ఆధునిక శాస్త్రీయ సోషలిజం యీ రెండు ముఖ్యమైన వాస్తవాలపై ఆధారపబడి వుంది. "పెట్టుబడి" రెండవ సంపుటంలో పెట్టుబడిదారీ వ్యవస్థకి సంబంధించిన యీ అంశాలూ, యింత కంటె బహుశా ఏ కొంచమో మాత్రమే తక్కువ ముఖ్యమైన యితర శాస్త్రీయ పరిశోధితాంశాలూ మరింత సవిస్తరంగా వివరింప బడుతాయి. ఈ విధంగా అర్థశాస్త్రం యొక్క ఏ పార్శ్వాలైతే మొదటి సంపుటంలో చర్చకు రాలేదో అవి రెండవ సంపుటంలో విప్లవాత్మకమైన మార్పులు పొందుతాయి. మార్క్స్ యీ రెండవ సంపుటాన్ని త్వరలో ముద్రణకు సంసిద్ధం చెయ్యగలగాలన్నదే మన హృదయపూర్వకమైన ఆకాంక్ష.

(1877 జూన్ మధ్యలో, మార్క్స్ మరణానికి ఆరేళ్ళ ముందు, ఎంగెల్స్ ఈవ్యాసం రాశారు.)

(1) 1842 జనవరి నెలలో మొదలైన రెయినిష్ జెయిటుంగ్ 1843 మార్చిలో మూతపడింది. ప్రష్యన్ పాలకుల సెన్సారు వేధింపుల కారణంగానే ఈ పత్రిక మూతపడింది.

(2) ఆ రోజుల్లో పోలీస్ కౌన్సిలర్ డాలేషాల్ ముందుగా సెన్సార్ కత్తెర పట్టేవారు. ఈ మహానుభావుడు మహామేధావి కూడా. 13 -14 శతాబ్దాలకు చెందిన ఇటాలియన్ కవి దాంతే రాసిన "డివైన్ కామెడీ" అనువాదం గురించి కలోనిష్ జెయిటుంగ్ లో వచ్చిన ఓ ప్రకటనను కొట్టిపారేశాడు. దేవుడికి సంబంధించిన విషయాలను కామెడీ చెయ్యకూడదని వ్యాఖ్యానం కూడా చేశాడట!

(3) 1820లో హెగెల్ రాసిన హక్కుల తాత్వికత- మూల ధాతువులు అనే సిద్ధాంత పత్రంపై మార్క్స్ విమర్శ డాయిష్ ఫ్రాంజోసిషె యార్బ్బాషెర్ పత్రికలో, 1844 లో అచ్చయింది.


(4) అలెగ్జాండర్ ఫాన్ హుంబోల్డ్ బహుముఖ ప్రజ్ఞావంతుడిగా ప్రసిద్ధుడు. భూగోళ శాస్త్రం, ప్రకృతి శాస్త్రం, తత్వశాస్త్రం తదితర రంగాల్లో పేరు తెచ్చుకున్న హుంబోల్డ్ ప్రష్యన్ సామ్రాజ్య సేవలో తరించాడు!

(5) 1847 ఆగస్టు నెలలో మార్క్స్ -ఎంగెల్స్ బ్రస్సెల్స్ నగరంలో జర్మన్ వర్కర్స్ సొసైటీని స్థాపించారు.

(6) 1847 ఏప్రిల్ - 1848 ఫిబ్రవరి మధ్యకాలంలో నడిచిన పత్రిక "డాయిష్ బ్రుసెలర్ జెయిటుంగ్ ". ఈ పత్రికలో మార్క్స్-ఎంగెల్స్ పాతిక ముప్పై వ్యాసాలు రాశారు.

(7) 1848 జూన్ ఒకటో తేదీన మొదలై, 1849 మే 19న మూతపడిన "నేవే రెయినిష్ జెయిటుంగ్" చారిత్రిక ప్రాధాన్యం కలిగి వున్న పత్రిక. 1848 నాటి జర్మన్ విప్లవ పోరాటాల స్ఫూర్తిని ఈ పత్రిక ప్రతిఫలించింది.

# మార్క్స్ ఇష్టాయిష్టాలు



| | |
|---|---|
| మీ అభిమాన సద్గుణం | సరళత్వం |
| పురుషునిలో మీ అభిమాన సద్గుణం | బలం |
| స్త్రీ లో మీ అభిమాన సద్గుణం | బలహీనత |
| మీ ప్రధాన గుణం | లక్ష్యశుద్ధి |
| మీ దృష్టిలో ఆనందం | పోరాటం |
| మీ దృష్టిలో దౌర్భాగ్యం | లొంగుబాటు |
| మీరు యెక్కువగా క్షమించే దుర్గుణం | యితరులనుఅనాలోచితంగా నమ్మడం |
| మీరు యెక్కువగా ద్వేషించే దుర్గుణం | దాస్యభావం |
| మీకు అయిష్టం | మార్టిన్ టప్పర్[1] |
| అభిమాన వ్యాపకం | పుస్తకాలలోమునిగిపోవడం |
| అభిమాన కవులు | షేక్ స్పియర్,ఈస్కిలస్, గ్యోతే |
| అభిమాన వచన రచయిత | డిడ్రో[2] |
| అభిమాన నాయకుడు | స్పార్టకస్, కెప్లెర్[3] |
| అభిమాన నాయిక | గ్రెత్హెన్[4] |
| అభిమాన పుష్పం | డాఫ్నె |
| అభిమాన రంగు | యెరుపు |
| అభిమాన పేరు | లౌరా, జెన్నీ |
| అభిమాన వంటకం | చేప |
| అభిమాన ప్రవర్తన నియమం | Nihil humani a me alienum puto[5] |
| అభిమాన నీతిసూత్రం | De omnibusdubitandum[6] |

* "ఒప్పుదలలు" 1865 నాటివి. ఆకాలంలో యింగ్లండులోనూ, జర్మనీలోనూ బాగా ప్రచారంలో వుండిన ప్రశ్నలకు మార్క్సు జవాబులు యివి. యీ జవాబులు తేలికగా చెప్పబడినప్పటికీ, యివి మార్క్స్ వ్యక్తిత్వాన్ని వెల్లడిస్తాయి.

1 టప్పర్, మార్టిన్ (1810-1889) – ఒక యింగ్లీషు రచయిత. యితని రచనలను క్షుద్రత్వానికి పరాకాష్ఠగా మార్క్సు యెంచేవాడు.

2 డిడ్రో, డెనీ (1713-1784) – సుప్రసిద్ధ ఫ్రెంచి తత్వవేత్త, భౌతికవాదీ, రచయితా.

3 కెప్లెర్, యోహన్ (1571-1630) – కొపెర్నిక్ సిద్ధాంత ఆధారంతో గమన నియమాలను ఆవిష్కరించిన జర్మన్ ఖగోళశాస్త్రజుడు.

4 గ్రెత్హెన్ – గ్యోతే నాటకం "ఫాస్ట్"లోని మార్గరీటా.

5 మానవ సంబంధమైనదేదీ నాకు పరాయిది కాదు (లాటిన్ భాష).


6 ప్రతి దాన్ని సందేహించు (లాటిన్ భాష)

# మార్క్స్ కవితలు

మందలపర్తి కిషోర్

## పరిచయం అక్కర్లేని పేరు కార్ల్ మార్క్స్

దాదాపు 200 సంవత్సరాలుగా మానవ చరిత్రను ప్రభావితం చేస్తూన్నవాడు మార్క్స్
తత్వశాస్త్రం, అర్థశాస్త్రం రాజకీయ శాస్త్రం తదితర రంగాలపై మార్క్స్ ప్రభావం సుస్పష్టం!
అయితే, విద్యార్థి దశలో మార్క్స్ ఎన్నో కవితలు రాశాడని చాలామందికి తెలియదు.
వాటిల్లో అత్యధికం తన హృదయాన్ని దోచుకున్న జెన్నీ కోసం రాసినవే !
మానవాళి పట్ల మార్క్స్ ప్రేమకు బీజాలు ఈ కవితల్లోనూ కనిపిస్తాయి.
అంతకు మించి కళ్లు చెదరగొట్టే మార్క్స్ ప్రతిభా ద్యుతి ఈ కవితల్లో సువ్యక్తమవుతుంది!
జెర్మన్ నుంచి వాటిని ఇంగ్లీష్‌లోకి అనువదించిన వాడు క్లెమెన్స్ దత్.



### శ్రావ్యమయిన నిట్టూరుపు !

దశదిశలా వ్యాపించే ప్రాచుర్యం ఏపాటిది?
తారల్లా తళతళమను నీదు తరళ నేత్రావళి
తొలకరించు వెలుగు ముందు దిగదుడుపే అనుకుంటా!

దేశాంతర సీమల సాధించే యశమేపాటిది?
గోర్వెచ్చని ఆనందంతో నిండిన నీ హృదయం
చిలకరించు ప్రేమ ముందు చిటికెడనే అనుకుంటా!

దిగంతాల మార్మోగే కీర్తిగాన మేపాటిది?
గానపారవశ్యంలో లీనమయిన నీ కన్నుల
పెల్లుబికిన అశ్రుకణమె విలువయినది అనుకుంటా!

నీ వీణియ వెలువరించు శ్రావ్యమయిన నిట్టూర్పుల
కడపటి ఊపిరిగా కడు సంతసమున స్వీకరింతు
నీ గుండెలలో దుఃఖం, నీ మనసున కానందం
కలిగించే భాగ్యం నా పరమయ్యే పక్షంలో,
అంతటి అపురూపమయిన అదృష్టం కలిసొస్తే
విశ్వ ప్రణయ రాజ్యానికి విజేతగా మరణిస్తా!

### ప్రేమ గీతిక


సుతిమెత్తని పాదాలకు భక్తితోడ ప్రేమాంజలి
స్వీకరించు నేనిచ్చే సకల ప్రణయ గీతావళి
హృదయ వీణ తీవెలపై తీయనయిన అనురాగం
నీ నీడన నా ఆత్మే పాడెను స్వేచ్ఛాగీతం
పాటలోని పటుత్వమే ప్రణయమ్మై, పలుకుతుంది
తియతీయని వాంఛలనే గుండెల్లో చిలుకుతుంది
సరాలలో రేగుతోంది నవనాడుల సంస్పందన
నీ ఎదలో సాగుతోంది సమ్మోహనకర నర్తన
నీ చూపుకు అందనంత దూరంలో దాగి వుండి
విజయం నీలో రేపే వెలుగుల జడి గమనిస్తా
బహుదూరపు సీమలలో తెగువ చూపి తలపడతా
సుమధురతర సంగీతం నీ కోసం వినిపిస్తా
ఆసాంతం మారిన నా ఆత్మ ఖంగుమని మోగును
హృదయవీణ మధురమైన వేదనతో చెలరేగును

# తత్వశాస్త్రాన్ని భువికి దించిన మార్క్స్



హెచ్చార్కె

'జ్ఞానం మనిషికి శాపం' అంటాడు చలం. గది బయట పడివున్న ఒక గులాబీ పువ్వు భూమికి చిన్ని గాయమై చిందిన నెత్తుటి చుక్కలా ఉందనీ ఇంకోటనీ మరొకటని రొమాంటిక్ ఊహలెన్నెన్నో చేసి, బయటికొచ్చి చూసే సరికి అది వుత్తి రంగు కాయితమ్ముక్క అని 'తెలుసుకుని', అసలు తెలుసుకోడం' ఎందుకు, అలా అందమంతా పోగొట్టుకోడమెందుకు అని బాధపడతాడు చలం, తన 'మ్యూజింగ్స్' లో ఒక చోట. ఆనందవాది చలం సంగతి సరే గాని, జ్ఞానం దుఃఖదాయిని అనే మాట మాత్రం నిజం. నాణానికి మరో ముఖంలా, జ్ఞానం మనను నడిపిస్తున్న మాట కూడా నిజం. ఏడిపించడం అనేది నడిపించడంలో భాగమే.




అసలు విషయం, మనిషి అసంపూర్ణుడు. తను అసంపూర్ణం అని మనిషి ఏడుపు. సంపూర్ణం (అబ్జల్యూట్) కావాలని కల. అసంపూర్ణం కానిది విశ్వమంత వెదకినా దొరకదు. అసంపూర్ణం కానిది ఏదీ లేదు. లేదు. కాని, మానవుడికి తప్ప మరి దేనికీ తన అసంపూర్ణత గురించి తెలీదు. తెలియడం అంటే జ్ఞానం. అందుకే జ్ఞానం శాపమని, దుఃఖమని అనడం.

జ్ఞానం సంగతి మనిషికి పట్టని కాలం ఒకటి ఉండింది. అంటే, తెలియదని (కూడా) తెలియని కాలం. అప్పుడు కూడా కొన్ని సంగతులు తెలుసు. ఆకలి తెలుసు. ఆకలికి అన్నం తినాలని తెలుసు. సెక్సు తెలుసు. సెక్స్‌కు సహచరుడు/చరి కావాలని తెలుసు. ప్రాణాపాయం నుంచి పారిపోవడమో పోరాడడమో చేయాలని తెలుసు. అంతే. అలాంటి సహజాతాలకు మించి తెలీదు. రాను రాను తెలుసుకోడం, తెలుసుకోడాన్ని తెలుసుకోడం, 'ప్రయోగాలు' చెయ్యడం కూడా అలవాటయ్యింది.

అసంపూర్ణమైనవి ఉన్నాయంటే, తార్కికంగా, సంపూర్ణమైనది 'ఒకటి' ఉండాలి. అది వీటన్నిటికి కుదురు/మూలం అయి వుండాలి. అలాంటి కుదురు ఉందనే సంగతి తార్కికంగా అందేదే గాని; ఏ విధంగానూ కనిపించదు, వినిపించదు. స్పర్శకు, రుచికి, వాసనకు తగలదు. 'సంపూర్ణత' మనిషిని వెంటాడే ఒక మహా స్వప్నం. అన్నిటికి మూలం, ప్రప్రథమం, 'ఒక' సంపూర్ణత (అబ్జల్యూట్) ఉందనే స్వప్నం చాల సిద్ధాంతాలకు ప్రోది చేసింది.

"ఆ ప్రప్రథముడు (The First) మరెవరి వైపు చూడడాన్నీ, కదలడాన్నీ మనం ఊహించలేం. అన్నటికన్న ముందు ఉండే తన ఉనికి (బీయింగ్) లోనే తానుంటాడు. మరేది ఉండడానికైనా ముందు ఉండే ప్రాథమిక ఉనికి తనది. ఉనికిలోని వాటన్నిటితో తన సంబంధాల కన్న కూడా ముందు ఉండే ఉనికి అది." "ఏదైతే తన కక్ష్యకు బయట చరించదో, మరెటూ వంగక తనతో తాను, మార్పు లేకుండా ఉంటుందో, అదే పూర్తిగా తన ఉనికిని తాను కలిగి ఉంటుందని చెప్పగలుగుతాం" : ఎన్నీడ్స్' (Enneads)

ప్లోటినస్ (క్రీస్తుశకం 204/5–270)

రోమన్ తత్వవేత్త ప్లోటినస్ మాటల్లోని ఈ భావన దాదాపు అన్ని ప్రాంతాల్లో, అన్ని సంస్కృతులలో ఉంటుంది. మన అనుభవాలలోని అన్నిటికీ మూలమైనది 'ఒకటి' ఉంది. అది వంగదు, ఎటు వైపూ జరగదు, మరి దేనిగానూ మారదు. అది మన అనుభవానికి అందని ఒక సంపూర్ణత (అబ్జల్యూట్). అది 'శస్త్రాలకు గాయపడదు, నీటికి తడవదు, గాలికి ఎండదు, అగ్నికి కాలదు' అని భగవద్గీత. అలాంటి సంపూర్ణతను దాదాపు అన్ని సంస్కృతులూ ఊహిస్తాయి. పూజిస్తాయి కూడా. సంపూర్ణమైనది 'ఒకటి' ఉందనే భావన చాల సార్లు ఏదో ఒక మతం రూపం తీసుకుని, గడ్డకట్టి, అక్కడితో ఆగిపోతోంది.

దాన్నలా గడ్డ కట్టనీకుండా, తాత్విక రీతిలో... తార్కిక హేతుబద్ధ పద్ధతిలో... తరచి చూశారు. పశ్చిమాన 17, 18 శతబ్దాలలో ప్రవర్ధిల్లిన జ్ఞాన వికాస యుగం, లేక హేతు యుగం

(Age of Enlightenment or Age of Reason) లో... ప్రతి దాన్ని విమర్శించి, తర్కించి చూసే పద్ధతికి మంచి ఊపు వొచ్చింది.

"ఈ యుగం విమర్శా యుగం (ఏజ్ అఫ్ క్రిటిసిజం). విమర్శకు ప్రతిదీ తల వంచవలసిందే. మతం తన 'పవిత్రత' కింద, శాసనం తన రాజసం (మెజెస్టీ) కింద దాక్కుని విమర్శ నుంచి మినహాయింపు పొందాలనుకుంటాయి. కాని, కుదరదు. ఆ ప్రయత్నం వల్ల అవి తమను సందేహించే ఆలోచనలకు మరింత ప్రేరణ కల్పిస్తాయి. హేతువు (రీజన్) తన విమర్శకు నిలబడిన దానినే గౌరవిస్తుంది. అందువల్ల, స్వేచ్ఛాయుత, బహిరంగ విమర్శ నుంచి మినహాయింపు కోరుకునే మతాన్ని, శాసనాన్ని హేతువు నిజాయితీ (Unfeigned) గా గౌరవించదు." అంటాడు తన 'క్రిటిక్ అఫ్ ప్యూర్ రీజన్' లో ఇమ్మాన్యుయల్ కాంట్ (1724-1804).

వస్తుమయ ప్రపంచాన్ని విశ్లేషించి (విడదీసి), సంశ్లేషించి (కలిపి) చూసే క్రమంలో ఎన్నో సంగతులు మనిషికి అవగత మయ్యాయి. సంగతులు అవగతమయ్యే కొద్దీ జీవితం కొద్ది కొద్దిగా బాగుంటోంది. కాని, దుఃఖం మాత్రం వదలడం లేదు. ఆ ఒక్కటి', ఆ 'ప్రప్రథమం.... అది కావాలి మనకు. ఆ 'సంపూర్ణత' కావాలి మనకు. అది మనం పోగొట్టుకున్న ఔన్నత్యం, మన సంపూర్ణ స్వాతంత్ర్యం, సంపూర్ణ స్వేచ్ఛ... దాన్ని తిరిగి పొందాలని కోరిక. నడిపించే కోరిక.

మార్క్సును, ఆనాటి యువతరాన్ని బాగా కదిలించిన జర్మన్ తత్వవేత్త జార్జ్ విలియం ఫ్రెడెరిక్ హెగెల్... ఈ కోరికకు ఒక నిర్దిష్ట రూపమిచ్చాడని చెప్పవచ్చు. అయితే, అది మస్తిష్కం దాటని (మెటఫిజికల్) రూపం.

హెగెల్ ఆలోచన పద్ధతిలో భావనలు త్రిపాది (triad) లోపలి త్రిపాదుల లోపలి త్రిపాదులుగా సాగుతాయి. 'సీర్పిన్ స్కీ త్రిభుజం' (Sierpinski triangle) అనే తర్క రూపంలో వ్యక్తమవుతాయి. ప్రతి అంశం తనలోని విరుద్ధాల మధ్య ఘర్షణ క్రమంలో, ఆ విరుద్ధాల్ని జీర్ణించుకుని, వాటి కన్న ఉన్నతమైన మరొకటి అవుతుంది.

హెగెల్ స్వయంగా తన పద్ధతిని, 'సీర్పిన్ స్కీ త్రిభుజం' గా కాకుండా, 'వలయాల వలయం ' (circle of circles) గా వర్ణించాడు .

"... శాస్త్రం తన చుట్టు తాను చుట్టుకునే వలయంగా వ్యక్తమవుతుంది. దానిలోని అనుసంధాన శక్తి (మీడియేషన్) దాని ముగింపును తిప్పి దాని ప్రారంభానికే తెస్తుంది. ఆ విధంగా అది వలయం లోపల వలయాలు ఉన్న వలయం అవుతుంది. ఈ పద్ధతిలో... సంలీనం (ensouled) అయ్యే ప్రతీ అంశం (మెంబర్) తనలోనికి తాను ప్రతిఫలిస్తుంది, తన ప్రారంభానికి తాను తిరిగి చేరడం ద్వారా అది మరో కొత్త అంశం యొక్క ప్రారంభం అవుతుంది."

– హెగెల్, 'సైన్స్ అఫ్ లాజిక్'

తన ఉనికి కోసం ఏది మరి దేనిమీదా ఆధారపడదో దాన్ని 'ప్రథమ సూత్రం' (ఫస్ట్ ప్రిన్సిపిల్) అంటాడు హెగెల్. అది తనకు తనతో మాత్రమే సంబంధం ఉన్నది. ఒకదాన్ని ఒకటి పరిమితం చేస్తూ, ఒక దాన్ని ఒకటి పట్టించుకోని విభిన్న అంశాలు దానిలో ఉండవు. 'ప్రథమ సూత్రం' తనలో తాను (బీయింగ్ ఇన్ ఇట్సెల్ఫ్) గా, తనతో తాను (బీయింగ్ సెల్ఫ్ రిలేటెడ్) గా ఉంటుంది. ఆ సంపూర్ణత్వానికి (అబ్జల్యూట్‌కు) ఏ పరిమితులు వర్తించవు. అది అపరిమితం (ఇన్ ఫినిట్).

ఈ అర్థంలో చూస్తే, మేధ లేక మనస్సు (మైండ్) మాత్రమే అపరిమితం. హెగెల్ మరింత ముందుకెళ్లి, మేధ కేవలం ప్రథమ సూత్రం మాత్రమే కాదు, అదొక్కటే వాస్తవం అంటాడు. ఉనికి (బీయింగ్), వాస్తవికత (రియాలిటీ)లో ఉన్న ప్రతిదీ ఈ మేధ అభివృద్ధి క్రమంలోని ఒక దశ మాత్రమే. మేధ తన అపరిపక్వత మీద తాను పోరాడే క్రమంలో పనిముట్లుగానో, పోరాట రూపాలుగానో... ఈ దశలు... మనకు తెలుస్తాయి.

అది తన మొదటికి తాను చేరడమంటే, వెనక్కి వెళ్లడం కాదు. తిరోగమనం కాదు. తిరిగి తన మొదటి సంపూర్ణతను తాను చేరుకోడం. ఈ లోపల ప్రయాణంలో జరిగిన అభివృద్ధి నంతా తనలో ఇముడ్చుకుంటుంది. మేధ తన ప్రారంభానికే తాను చేరుతుంది అంటే, తనను తాను తెలుసుకుంటుందన్న మాట, తన సత్యం తానే అన్న మాట. ఈ అంతిమ దశనే సంపూర్ణ జ్ఞానం (అబ్జల్యూట్ నాలెడ్జ్) అంటాడు హెగెల్.

"ఈ చైతన్యం ఉండే పదార్థం (సబ్ స్టాన్స్) మరేమీ కాదు. అది తన లోపల తానేమిటో బయట కూడా అదే అయిపోయే ఒక అభివృద్ధి క్రమం. ఇలా తన లోపలికి తాను ప్రతిఫలించే క్రమంలోనే అది వాస్తవిక చైతన్యం అవుతుంది. ఇది జ్ఞాన క్రమం లో ఉండే అంతర్గత చలనం. వస్తువు అంతర్గత స్వభావం దాని బయటి రూపంగా, అంటే, దాని అధ్యయనాంశం (ఆబ్జెక్ట్) గా మారే చలనం. ఈ స్వయం చైతన్యం (సెల్ఫ్ కానిషియస్నెస్) తన అధ్యయనాంశాన్ని (ఆబ్జెక్ట్ ని) రద్దు చేసి, దాన్ని అధిగమించి, దాన్నొక భావన/అభిప్రాయం (బెగ్రిఫ్)గా మార్చేస్తుంది. ఈ

పరివర్తన క్రమం ఒక వలయం, తన నుంచి బయల్దేరి తిరిగి తనలోనికి తాను చేరే వలయం, తనకంటూ ఒక ప్రారంభం ఉండి చిట్టచివరికి మాత్రమే ఆ ప్రారంభానికి చేరే వలయం."

– హెగెల్, 'ఫినామినాలజీ అఫ్ మైండ్')

ఒక సంపూర్ణ భావం (అబ్జల్యూట్ ఐడియా) లోంచి నేటి అసంపూర్ణ (కంటింజెంట్) ప్రపంచం విడివడింది. అసంపూర్ణ ప్రపంచం, తన అసంపూర్ణతకు అనుగుణంగానే, నిరంతరం మారుతుంటుంది. తన లోపలి విరుద్ధాంశాల మధ్య ఘర్షణ కారణంగా అసంపూర్ణ భావం తనను తాను రద్దు చేసుకుని, విరుద్ధాంశాల సంయోజన (సింథెసిస్) రూపంలో ఆ రెండింటి కన్న ఎక్కువ ఉన్నతమైన రూపం ధరిస్తుంది. అలాగని అక్కడ ఆగదు. దానిలో మళ్లీ విరుద్ధాంశాలు. వాటి మధ్య ఘర్షణ ఫలితంగా మరొక ముందడుగు ఉంటుంది. అసంపూర్ణ ప్రపంచ భావం సంపూర్ణత వైపుగా, అంతకంతకు ఉన్నత రూపం ధరిస్తుంది.

ఇంతా చేసి ఈ అభివృద్ధి అంతా... భావం (ఐడియా) లో జరిగేదే. ఇది సంపూర్ణ భావం (అబ్జల్యూట్ ఐడియా) లేక ప్రథమ సూత్రం దిశగా జరిగే ప్రయాణం. ఈ ప్రయాణంలో అంతకంతకు పరిపక్వమయ్యే భావాల భౌతికరూపం రాజ్యం (స్టేట్). అంతకంతకు ఉన్నతమైన రాజ్యం ఏర్పడుతూ ఉంటుంది.

ఇది ఫ్రెడరిక్ హెగెల్ గతితర్కం. ఇందులో ఎక్కడా మనుషులు కనిపించరు. భావాలు మాత్రమే కనిపిస్తాయి. భావాలు ధరించే రూపం రాజ్యం. అందుకే, హెగెల్‌కు ఆనాటికి చాల ప్రగతిశీలి అనిపించిన నెపోలియన్ ఒక అద్భుతం అనిపించాడు. "నేను చక్రవర్తిని చూశాను. ప్రపంచ–ఆత్మను (Weltseele) చూశాను. అప్పుడతడు (జెనా) నగరం బయట స్వారీ చేస్తున్నాడు. అలాంటి వ్యక్తిని చూడడం ఒక గొప్ప అనుభూతి. గుర్రం మీద కూర్చుని ఈ బిందువు దగ్గర కేంద్రీకరించి చేయి చాచి మొత్తం ప్రపంచాన్ని గెలవబోతున్నట్లు ఉన్నాడతడు" అని హెగెల్ తన స్నేహితుడు నీథామర్‌కు రాశాడు.

హెగెల్ పద్ధతిలోని మంచి పార్శ్వాన్ని (గతితర్కాన్ని) తీసుకుని దానిపై చేయాల్సిన విమర్శ చేయడం ద్వారా... తత్వ శాస్త్రాన్ని దివి నుంచి భువికి దించిన ప్రజా ప్రేమి కార్ల్ మార్క్స్, యువ హెగెలియన్‌గా మొదలయి, హెగెల్‌లోని రాజ్య–అనుకూలతను విమర్శించే రూపంలోనే మార్క్స్ ప్రజాకీయాలు మొదలయ్యాయని చెప్పొచ్చు.

రాజ్యం ఏ వాస్తవ ప్రజల నుంచి ఏర్పడిందో వారి నుంచి వేరు చేసి, రాజ్యానికి వేరే ఒక పుటకను, ఒక విలువను ఆపాదించే హెగెల్ ఆలోచనలను మార్క్స్ వ్యతిరేకించాడు. రాజ్య వ్యవహారాలు ప్రజలతో సంబంధం కలిగి ఉండడం కేవలం ఆకస్మికం (యాక్సిడెంట్) అయినట్లు హెగెల్ భావించాడు. నిజానికి ఆ సంబంధమే రాజ్యం సారం. రాజ్యం దానికది స్వతంత్రం అయినట్లు, వాస్తవ వ్యక్తులు దానికి ప్రతివాదం (యాంటీథీసిస్) అయినట్లు హెగెల్ పరమ అనిర్దిష్టంగా ఊహించాడు.

మార్క్స్ ఆ ఆలోచనను మౌలికంగా వ్యతిరేకించాడు.

"మానవ వ్యక్తి యొక్క సారం అతడి గడ్డం, రక్తం లేక అతడి భౌతిక స్వభావం కాదు. అతడి సామాజిక వ్యక్తిత్వమే అతడి వ్యక్తిత్వం. మనిషి సామాజిక వ్యక్తిత్వం యొక్క రూపాలూ, వ్యవహారాలే రాజ్యం వ్యవహారాలు. అంతకన్న ఎక్కువా కాదు, తక్కువా కాదు. వ్యక్తుల సామాజిక, వ్యక్తిగత వ్యక్తిత్వాల దృష్ట్యా, వ్యక్తులను రాజ్యం పనులకూ, అధికారానికి ప్రతినిధులుగానే చూడాలి."


– మార్క్స్, 'క్రిటిక్ అఫ్ హెగెల్'స్ ఫిలాసఫీ అఫ్ రైట్'

"ప్రపంచాన్ని అస్పష్ట స్వప్నాల నుంచి నిద్ర లేపి, తన నిజమైన కార్యాచరణ ఏమిటో దానికి చూపించాలి. ఇంతకాలంగా ప్రపంచం వేటి గురించి కలలు కంటూ ఉన్నదో వాస్తవికంగా వాటిని తెలుసుకోడం (బికమ్ అవేర్ అఫ్) ద్వారానే, వాటిని దక్కించుకోగలుగుతుంది."

– మార్క్స్ (పాతికేళ్ల వయసు (1843) లో ఆర్నాల్డ్ రూజ్‌కు రాసిన ఉత్తరం)

ఆ తరువాత కాలంలో మార్క్స్ గతితర్కాన్ని నిజంగానే దివి నుంచి భువికి దించాడు. అస్పష్ట మానవ స్వప్నానికి విస్పష్ట వాస్తవ రూపం ఇచ్చాడు. దాన్ని మనిషి చేతి పరికరం చేశాడు. దానికి మార్క్స్ అనుసరించిన పద్ధతి చారిత్రక భౌతికవాదం. మనిషిని సామాజిక వ్యక్తిగా (సోషల్‌పర్సన్‌గా) ఆయన విశ్లేషించాడు. సమాజం ఉత్పత్తి సంబంధాల మీద ఆధారపడి ఉందని, ఉత్పత్తి సంబంధాలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధి దశల మీద ఆధారపడి ఉన్నాయని గతితార్కికంగా నిరూపించాడు. ఆ విధంగా సోషలిజానికి, ఆచరణ సాధ్యమైన దారి వేశాడు. దానికి ఉన్న విస్తృతినీ, పరిమితిని కూడా నిస్సందేహంగా వివరించాడు. మనం ఏం చేయాలో, ఏం చేయగూడదో, ఎప్పుడు ఏం చేయాలో ఈ కింది ఉటంకింపు నిర్ద్వంద్వం చేస్తుంది. ఇటీవలి కాలపు చాల వైఫల్యాలకు మన దుందుడుకుతనం, మన సోమరితనం

☞ మిగతా 64వ పేజీలో




# మార్క్స్, ఎంగెల్స్‌ల తొలి ఉమ్మడి రచన
# పవిత్ర కుటుంబం

వై.వి. రమణారావు

మార్క్స్, ఎంగెల్స్‌లు 1844 చివర్లో కలిసి రచించిన గ్రంథమే 'పవిత్ర కుటుంబం'. 1845లో ప్రచురించిన ఈ రచనలో 'పవిత్ర కుటుంబం' అనే మాట యువ-హెగెలియన్ సమర్థకులైన బ్రూనో బాయెర్, ఎడ్గార్ బాయెర్ సోదర ద్వయం, జెలీగా లకు మార్క్స్, ఎంగెల్స్‌లు ఇచ్చిన వ్యంగ్యాత్మక పేరు. ఈ గ్రంథంలో యువ హెగెలియన్లపై దాడిచేస్తూనే మార్క్స్, ఎంగెల్స్‌లు ఏకంగా హెగెల్ భావవాద తాత్వికతనే విమర్శనాత్మకంగా విశ్లేషిస్తారు.

**హెగెల్ :** తత్వశాస్త్రంలో హెగెల్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. అప్పటి వరకూ బీజప్రాయంగా వున్న 'గతి తర్కాన్ని' అతను తన 'తర్కం' (Logic) (ఇది ప్రతి అంశంలోనూ 'త్రిక-సముదాయం' (Triad)గా ఉంటుంది, అంటే, 'భావం, అభావం, అభావం అభావం చెందటం' లేదా 'వాదం/సిద్ధాంతం, ప్రతి వాదం/ప్రతి-సిద్ధాంతం, సంశ్లేషణ' (thesis, anti-thesis, synthesis) ద్వారా చాలా అభివృద్ధి చేశాడు. (అలా చేసింది 'భావ వాద' పరంగానే, అంటే 'ఆలోచన' ప్రధానంగానే.)




భావవాద పరమైన ఈ హెగెల్ తాత్వికతను అర్థం చేసుకునే ముందు మనం "భౌతికార్థంలోని సృష్టి గురించిన నిర్మాణాన్ని' తాత్విక అర్థంలో చూద్దాం. మూల ద్రవ్యం/ద్రవ్యం (substance) నుండి సృష్టి వచ్చింది. అలాంటి ద్రవ్యం నుండి ఏర్పడిన విశ్వం/విశ్వాలు, గెలాక్సీలు, నక్షత్రాలు, వగైరాల తర్వాత ఏర్పడిన గ్రహాల్లోని జీవుల్లో ఆ 'ద్రవ్య లక్షణాలు పదార్థ పరిణామ క్రమంలో వస్తాయని చెబుతుంది. ఈ క్రమంలో భూమిపై గల 'జీవి'(అంటే, 'తన అస్తిత్వంపై ఎరుక గల పదార్థం')కి 'స్వీయ-చైతన్యం '(self-consciousness) ఒక లక్షణంగా పైకొస్తుందనీ, మానవుల్లో ఈ లక్షణం పరిణామక్రమంలో ఆవశ్యకంగానూ, ప్రధానంగా పాదార్థిక ఉత్పత్తిపై ఆధారపడే సాంఘిక సంబంధాల నుండి అసలైన విధంలో అభివృద్ధి చెందుతుందనీ చెబుతుంది.

ఇక, యూదుమతం, క్రైస్తవం ప్రకారం సృష్టికర్త/భగవంతుడు (Spirit) మూల ద్రవ్యాన్ని సృష్టించాడనీ, దాన్నుండి వచ్చిన జీవుల్లో ముఖ్యంగా మానవుల్లో సత్వాంశ (spirit)ను కల్గజేశాడనీ, దీన్నే ఆధ్యాత్మిక ఆత్మ (spiritual soul) {సత్వాంశ (spirit)} అంటారనీ ఉంటుంది (చూడు : కాంట్ వ్యాఖ్య, 'పవిత్ర కుటుంబం', పేజీ : 404, 404-412). అలానే, "ఏ గ్రహంలోని జీవుల్లో ఆ గ్రహం ఏర్పడిన పదార్థం యొక్క లక్షణాలు' వుండేట్లుగా ఆ గ్రహ జీవుల్లో పాదార్థిక ఆత్మ (material soul)/ఆత్మ (soul) ఉంటుంది " అనే అర్థంలో గలది ఏర్పడుతుందనీ అంటాయవి. కానీ, దైవాన్ని చేరటానికి ఈ ఆత్మకి బదులు, 'సత్వాంశ'యే అసలైన అంశమనీ, దాన్ని మనలో 'దైవంపై విశ్వాసం' ద్వారా మేల్కొలిపి, తీవ్ర భావోద్వేగంతో భగవంతున్ని చేరటానికి ఆచరణలో పెడుతూ, భువిపై పరిపూర్ణ మానవులుగా ఎదుగుతూ జీవించాలని (చూడండి : హిబ్రూ, నూతన నిబంధన) ఆ రెండు మతాల్లో ఉంటుంది. ప్రాచ్య, భారతీయ తత్వశాస్త్రాల్లో ఇలా మూడు (సత్వం, సత్వాంశ, ఆత్మ) ఉండవు, బదులుగా రెండే (సత్వం/భగవంతుడు, ఆత్మ) ఉంటాయి. ఇక, హెగెల్ ప్రకారం,

"అఖండ భావం/మనసు/సత్వం (Absolute Idea/Mind)/Spirit) అనేది దాని స్వీయ-పరాయీకరణ చెందిన రూపంలోని ప్రకృతి' (Nature) ద్వారా తన స్వీయ-పరాయీకరణకు తిరిగివచ్చే ప్రక్రియగా (అంటే, అపరాయీకరణ (de-alienation) చెందటం) 'హద్దుగల మనసు' (Finite Mind)(spirit) అయిన 'మానవుడు'లో ఉంటుంది. ఆ రకంగా, మానవుని ప్రాథమిక నిర్మాణమే ఆ అఖండ భావం యొక్క ఈ సృష్టి నిర్మాణ ప్రక్రియను అందుకునే వైపుగా (పరాయీకరణ, అపరాయీకరణల ద్వారా) పయనిస్తుంది." (హెగెల్ "దృగ్విషయ శాస్త్రం")

ఇక, తన ఈ భావవ్యవస్థకు తన గతితర్కాన్నీ, తాత్విక వ్యవస్థ చట్రాన్ని వాడే క్రమంలో హెగెల్ 'స్పెక్యులేటివ్ తత్వశాస్త్రాన్ని' దన్నుగా చేసుకుంటాడు. అలా ద్రవ్యం' అనేది 'స్వీయ-చైతన్యం' స్థాయికి ఎత్తబడాలనీ, ఎందుకంటే, స్వీయ-

చైతన్యమంటే 'అహం' అనీ అంటాడు (చూడు :అధ్యాయం–VI). అలా, తాను నిర్మించిన ఈ అహం కల్గిన మానవుల్లో ఉత్కృష్టుడే 'తాత్వికుడు' అంటాడు (చూడు:ఈ పుస్తకం, ఆర్థిక, తాత్విక రాతప్రతులు, 1844"), ఎందుకంటే, "తాత్వికుని పని ఐన 'ఆలోచించటం' 'ఏ హద్దులూ, ఆంక్షలు లేనిది' కనుక, 'స్వచ్ఛమైనది, పరమమైనది' కనుక" అంటాడు హెగెల్. దీనికి దన్నుగా అతను దృగ్విషయశాస్త్రంలో చెప్పిన 'యజమాని–బానిస' ఉదాహరణను ఇలా ఇస్తాడు : "అధికారం, గుర్తింపు : ఈ రెంటి కోసం పోరాటం ఉంటుంది. ఈ పోరాటంలో : తమ పోటీదారుల కంటే కొంతమంది ఎక్కువ వేగం పెడతారు, 'యజమానులు' అవుతారు. అతి తక్కువ వేగం పెట్టేవాళ్ళు బానిసలు లేదా బాధితులు అవుతారు. తన ప్రాణం కాపాడుకోవడానికి 'బానిస' అనేవాడు 'యజమానికి లొంగి వుంటాడు. నాగరికతా కార్యకలాపాల వల్ల మృత్యువును అధిగమించడం జరుగుతోంది. తన జీవితాన్ని పణంగా పెట్టి మొదట యజమాని అయినవాడు ప్రకృతి శృంఖలాల్ని ఛేదించే వాడవుతాడు. అందులో బుద్ధిని నింపే క్రమానికి శ్రీకారం చుడతాడు."

### స్పెక్యులేటివ్ తత్వశాస్త్రం :

దీనికి ఉదాహరణలుగా మార్క్స్ ఈ గ్రంథంలో 'పండు', 'జంతువు' ల నిచ్చి మనకు చక్కగా వివరిస్తాడు. వాటి ప్రకారం, వాస్తవ ఉనికిలో గల అన్ని విషయాలు/వస్తువుల నుండే బయల్దేరి, వాటిలోని లక్షణాల్ని అమూర్తంగా (అంటే, వాస్తవ/తాత్విక అస్తిత్వం–లేనివిగా) సాధారణీకరిస్తూ, ఒక అమూర్త 'తాత్విక భావాభివర్గం' లోకి మార్చి, ఆ తాత్విక భావాభివర్గంలో నుండే తిరిగి మళ్ళీ వాస్తవవిషయాల్ని/వస్తువుల్ని హెగెల్ సృష్టిస్తాడంటాడు మార్క్స్. అలా భావం నుండి సృష్టి నిర్మాణం జరిగిందంటూ, తాను దాని నిర్మాణ వ్యవస్థనూ, రహస్యాన్ని దర్శించాననీ డబ్బా వాయించుకుంటూ, 'నిజమే, ఇలానే సృష్టి జరిగి ఉంటుంది, హెగెల్ అద్భుతమే చూపెట్టాడు' అన్పించేలా, 'వాస్తవాల్ని 'తాత్వికుని, తెలివి' మాటున హెగెల్ దాస్తాడని మార్క్స్ చెబుతాడు. అందుకనే, మొత్తంగా అతని తత్వశాస్త్రాన్ని 'స్పెక్యులేటివ్ తత్వ శాస్త్రం' అని ఈ గ్రంథంలో వ్యాఖ్యానిస్తాడు మార్క్స్. అందుకనే "హెగెల్ తత్వశాస్త్రం వాస్తవమేమో' అని అన్పించటానికి కారణం అతని తత్వశాస్త్రం చాలా తరచుగా వాస్తవాలను కలిపేసి వివరించటమే" అంటాడు మార్క్స్, ఇంకా, దీని పట్ల మనం జాగరూకంగా ఉండాలంటాడు మార్క్స్. అలా, దానిలో విషయాన్ని (content) దాన్లో నుండే స్వీకరించే లేదా 'కల్గి వుంటుంది" అని అది అనుకునేదే స్పెక్యులేటివ్ తత్వశాస్త్రం.

హెగెల్ అందుకనే ""ఆ కాలపు చైతన్యాలు (zet zeists) ఉంటాయనీ, అవి సమాజ గమనాన్ని నిర్దేశిస్తాయనీ" అదే రకపు శుద్ధ–భావవాద తాత్వికతనూ వెలిబుచ్చుతాడు. (వ్యక్తి చైతన్యం, సామాజిక చైతన్యం, సామాజిక చైతన్య రూపాల గురించి మార్క్స్ చెప్పిన వాటికై తెలుగులో వచ్చిన 'జర్మన్ భావజాలం' పుస్తకం చూడండి). కానీ, తాను దైవ సమర్థన (theodicy)ను చేశాననీ, 'శుద్ధ భావనల అభివృద్ధి'నే చిత్రించాననీ హెగెల్ ఒప్పుకుంటాడనీ మార్క్స్ మనకు చెబుతాడు (చూడు : 'పవిత్ర కుటుంబం', అధ్యాయం– VI, జర్మన్ భావజాలం', పేజీ–77). ఇటువంటి స్పెక్యులేటివ్ తత్వశాస్త్ర ఆధారితమైన 'అహంభావపు' భావ పర/(కర్మ పర) తత్వశాస్త్రమే 'పవిత్ర కుటుంబ సభ్యుల'కీ, వారి భావవాద వ్యాఖ్యలకీ, విమర్శకీ, విమర్శనాత్మక విమర్శకీ, 'శ్రమనూ, శ్రామికులనూ చులకన చేయటాని'కి ఆధారం. కానీ, ఈ హెగెల్ తత్వశాస్త్రం మొత్తంగా చూస్తే, (post-festum) వంటిదనీ (అంటే, 'పండగ తర్వాత సంబరం చేసుకోవటం' లేదా 'ఘటన తర్వాత వ్యాఖ్యానించటం/విశ్లేషించటం' అనీ, 'తాత్వికుని పని అదేననీ మనకు మార్క్స్ ఈ గ్రంథంలో పలు మార్లు చెబుతాడు, అదలా వున్నట్లు విశదీకరిస్తాడు కూడా.

### హెగెల్ తత్వశాస్త్రాన్ని అన్వయించటం :

**(1) ప్రూధోన్ :** ఇటువంటి హెగెల్ తత్వశాస్త్రాన్ని వాడుతూ ప్రూధోన్ తన సొంత అధి–భౌతిక శాస్త్ర పదాలు, భావనలతో రాజకీయార్థిక శాస్త్రాన్ని ఇష్టారీతిన వ్యాఖ్యానిస్తే, మార్క్స్ తన 'తత్వశాస్త్ర దారిద్ర్యం' గ్రంథంలో హెగెల్ తాత్వికతనూ, ప్రూధోన్ అధి–భౌతికతనూ ప్రూధోన్ గ్రంథంలో నుండే ఉదహరిస్తూ వాస్తవ అపవిత్ర చరిత్రనూ, వాస్తవ రాజకీయార్థిక శాస్త్రాన్ని మన ముందుంచుతాడు.

**(2) 'పవిత్ర కుటుంబ' సభ్యులు :** ఈ గ్రంథంలోనూ పవిత్ర కుటుంబ సభ్యులు హెగెల్ తత్వశాస్త్రాన్ని తమ ఇష్టారీతిని వాడుతూ స్పెక్యులేటివ్, దైవశాస్త్రపరంగా చరిత్రనూ, రాజకీయార్థిక శాస్త్రాన్ని, సమాజంలోని ఎన్నో రంగాల వాస్తవాల్నీ భావపరంగా తప్పుగా చెబుతూ పామరుల్నీ, శ్రమనూ, శ్రామికుల్నీ, భౌతికవాదం, తదితరాల్నీ చులకన చేస్తూ, తమను తాము దైవాంశ స్థాయికి నిలబెట్టుకుంటారు. దీన్ని ఖండిస్తూ మార్క్స్, ఎంగెల్స్‌లు ఈ సభ్యుల గ్రంథాలు, రచనల్లో నుండే వారి వ్యాఖ్యల్ని ఉదహరిస్తూ, అతి తీవ్రంగా విమర్శిస్తారు, పామరుల పక్షాన నిలబడుతూ వాస్తవ చరిత్రనూ, దాని అభివృద్ధిలో పామరుల పాత్రనూ ఎలుగెత్తి చాటతారు.

**పుస్తకంలోని విషయాలు :** ఇక ఇప్పుడు ఈ పుస్తకంలోకి వస్తే, ఈ గ్రంథం ఉప–శీర్షిక మనకు చెబుతున్నట్లే, ఈ గ్రంథం

ప్రధానంగా 'విమర్శనాత్మక విమర్శపై గుణదోష విశ్లేషణ' అన్నమాట. దీని ప్రకారం, కొందరు రచయితలు ఒక పుస్తకంపై 'విమర్శ' (criticism) చేస్తే, ఆ విమర్శ 'లోపరహితం, పరమం, అఖండం, స్వచ్ఛమైనది' కాదంటూ ఈ పవిత్ర కుటుంబ సభ్యులు (ముఖ్యంగా, బ్రూనో బాయెర్) దానిపై 'విమర్శనాత్మక విమర్శ' (critical criticism) చేస్తూ, తమది 'స్వచ్ఛమైన, లోపరహితమైన, అఖండమైన, దివ్యమైన' విమర్శ అంటూ తమ సొంత పత్రిక ఐన Allegemein Zeitung($J_1$)లోని 8 సంచికల్లోనూ, ఇతర గ్రంథాల్లోనూ రాస్తూనే, దానితో వచ్చిన అహంభావంతో మరోవైపు పామరులనూ, శ్రామికులనూ చులకన చేస్తారు. మార్క్స్, ఎంగెల్స్‌లు వీటిని ఖండిస్తూ, 'నిరపేక్షమైన, అఖండమైన, స్వచ్ఛమైన, లోపరహితమైన విమర్శ' ఉండదంటూ, ఈ సభ్యుల 'విమర్శనాత్మక విమర్శపై గుణదోష విశ్లేషణ' చేస్తారు.

(1) మొదటగా, ఎడ్గార్ బాయెర్ యేమో అధ్యాయం-IV లో ఇతరుల రచనల్ని తప్పుగా అనువదించి, ఆపై దాని సహాయం తో ఇతరుల వాస్తవ రచనల్ని తప్పుగా వ్యాఖ్యానిస్తూ, విమర్శిస్తూ తన విమర్శను స్వచ్ఛమైనదంటూ, లోపరహితమంటాడు.

(2) పవిత్ర కుటుంబపు మరో సభ్యుడనబడే ఫ్రాంజ్ ఫ్రీడ్రిక్ జెలీగా వాన్ జిచ్ లిస్కీ అనేవాడు 'జెలీగా ' అనే కలం పేరుతో $J_1$, పత్రికలో "పారిస్ మర్మాలు" అనే ఫ్రెంచి నవల (రచయిత : యూజెన్ సూ) లోని పాత్రల స్వభావాలకీ, ప్రవర్తనలకీ హెగెలియన్ తత్వశాస్త్రాన్ని అన్వయిస్తాడు, దాన్ని దైవశాస్త్రపరంగా, మతపరంగా వ్యాఖ్యానిస్తాడు.

(3) బ్రూనో బాయెర్ యేమో తన విమర్శను స్వచ్ఛమైన దంటూ, పరమమైనదంటూ పామరులను, మాస్‌ను దైవానికి వ్యతిరేకంగా నిలిపి, చులకన చేస్తాడు. తన విమర్శను పరమ విమర్శ స్థాయికీ, తనను దైవాంశ స్థాయికీ నిలుపుకుంటే, మార్క్స్ తీవ్రంగా విమర్శిస్తాడు. పుస్తకంలోని అధ్యాయాలు : (1) అధ్యాయాలు-I నుండి III వరకు వివిధ అనువాదకులు వారి సొంత అనువాదాలకు అఖండ స్థాయిని ఆపాదిస్తే, ఎంగెల్స్ వాటిని నిర్దాక్షిణ్యంగా, వ్యంగ్యంగా విమర్శిస్తాడు. (2) అధ్యాయం-IV అంతా ప్రూధోన్ రాసిన రాజకీయార్థిక శాస్త్రం, కొన్ని రాజకీయ, సామాజిక విషయాలపై ఎడ్గార్ బాయెర్ తప్పు అనువాదాలు చేయటమే కాక, అలా చేసినవాటికి పైపెచ్చు తన సొంత వ్యాఖ్యానాల్నిస్తూ, తన విమర్శను పైస్థాయిలో నిల్పుకుంటూ, రాజకీయార్థిక అంశాల్ని (ఉదా॥కి, వివిధ యంత్రాల అభివృద్ధిలోని చారిత్రక వరుస క్రమాన్ని) తారుమారు చేసి, తప్పుగా విమర్శిస్తాడు. అప్పుడు ఎంగెల్స్, మార్క్సులు వాటి గురించి ప్రూడోన్ అసలైన రచనల్నుండే ఉదహరిస్తూ, ఎడ్గార్ బాయెర్ తప్పుగా చేసిన అనువాదాన్నీ, వ్యాఖ్యానాల్నీ నిర్దాక్షిణ్యంగా, వ్యంగ్యంగా విమర్శిస్తారు.

(3) అధ్యాయం-V, VIII లలో మనకు యూజెన్ సూ నవలలోని పాత్రలనూ, వాటి స్వభావాలనూ జెలీగా తన క్రైస్తవ మత పరంగా గల అర్థాల్లోనికి వక్రీకరించి ఆ 'పారిస్ మర్మాలు' నవల్లోని మర్మాలను మామూలు, సులభ సామాజిక విషయాల న్నట్లు తేల్చే, తేలిగ్గా తీసుకోవాలనే అర్థాన్నిస్తూ వర్ణిస్తాడు. మార్క్స్ మటుకు మనకు దీని అసలైన మాతృక ఐన యూజెన్ సూ నవల నుండి ఉదహరిస్తూనే, జెలీగా చేసిన వక్రీకరణల్నీ, అలానే యూజెన్ సూ చేసిన క్రైస్తవ మతపరమైన వాటిలోని సామాజిక దౌర్భాగ్యతనూ తేటతెల్లం చేస్తాడు. ఈ అధ్యాయాల్లో ముఖ్య పాత్రలు : (1) చౌరిన్యూయర్ అనే ఒక కసాయివాడు, (2) మాట్రెడి ఇకోల్ అను ఒక విద్యావంతుడు, (3) నవల్లోని ముఖ్య పాత్ర ఫ్యూయర్ డి మేరీ, (4) రుడాల్ఫ్.

(4) ఇక, అధ్యాయాలు-VI, VIII లలో ఈ పవిత్ర కుటుంబ సభ్యుల నాయకుడైన, $J_1$, పత్రిక ప్రధాన సంపాదకుడైన బ్రూనో బాయెర్ మటుకు హెగెల్ తత్వశాస్త్రాన్ని తన సొంత దైవశాస్త్ర పరమైన మరియు క్రైస్తవ-జర్మన్ తరహాలోనూ వక్రీకరించి, తన విమర్శను స్వచ్ఛమైనదీ, పవిత్రమైనదీ, అఖండమైనదీ, లోప-రహితమైనదీ అంటూ స్పెక్యులేటివ్ తత్వశాస్త్రాన్ని ఇష్టారీతిని వాడతాడు. అంతటితో ఆగక చరిత్రనూ, దాని నిర్మితిలో పామరుల పాత్ర లేదంటూ వక్రీకరిస్తూ, 'చలనశీల పరమాత్మ'గా 'కొద్దిమంది ఎంపిక చేయబడ్డ వ్యక్తులు' ( 'సత్వాంశలేని మాస్'గా, పదార్థంగా" ఉన్నారని చెప్పబడే 'మిగిలిన మానవజాతి'కి, పామరుల పూజా విధానమైన మాస్‌కి అభిముఖంగా నిలబెట్ట బడతారు, అలా అతను పామరులపై చాలా చులకన, తృణీకార భావాన్ని చూపుతాడు. ఈ క్రమంలోనే భౌతికవాద చరిత్రనూ, ఫ్రెంచి విప్లవాన్నీ, సోషలిజాన్నీ వక్రీకరిస్తాడు కూడా. అలానే 'యూదు సమస్యపై మూడు విభాగాల్లో 'రాజకీయ పరమైన, మతపరమైన విముక్తి జరిగితే, వారు మానవ విముక్తిని సాధించినట్లే' అని గందరగోళపడటాన్ని మార్క్స్ ఖండిస్తూ, బాయెర్‌ని విమర్శిస్తాడు. ఈ 'యూదు సమస్య' పోవటానికి యూదుల సాంఘిక విమోచనం వారి రాజకీయ విమోచనంతో ఏకకాలంలో జరిగితేనే వారు 'మత విమోచనం' చెందుతారని మార్క్స్ తన 'యూదు సమస్యపై' వ్యాసంలో చెప్పటాన్ని మనం ఈ పుస్తకం అనుబంధం-1 లో చూస్తాం.

ఇక, అధ్యాయం-VIIలో బ్రూనో బాయెర్ వందిమాగధులే పామరుల విమర్శ ఎంతటి తక్కువ స్థాయిదోనంటూ జర్మనీలోని వివిధ ప్రదేశాల (ముఖ్యంగా బెర్లిన్) నుండి బాయెర్‌కి ఉత్తరాలు

రాసే వార్తా లేఖా ప్రతినిధులు (correspondents) అతన్ని దైవాంశ స్థాయికి ఎత్తటం మనం చూస్తాం. మా ఈ అధ్యాయంలో ఆ లేఖా ప్రతినిధులు రాసే ఉత్తరాల్ని ఉదహరిస్తూనే, వాటిలోని విషయాల్ని కూడా చాలా హస్యాస్పదంగా ఉన్నాయంటూ బహిర్గత పరుస్తాడీ గ్రంథంలో. చివరగా ముగిస్తూ, అధ్యాయం-IX లో మార్క్స్ ఏమంటాడంటే, " బ్రూనో బాయెర్ అన్నట్లుగా అంతానికి వచ్చింది. ప్రపంచం కాక, హెగెలియన్ తత్తశాస్త్రాన్ని తన ఇష్టారీతిని వాడిన బ్రూనో బాయెర్ పత్రిక $J_1$, మాత్రమే " అని.

**5) అనుబంధం-2 : బ్రూనో బాయెర్ ప్రతి-విమర్శకు మా సమాధానం :** 'పవిత్ర కుటుంబం' గ్రంథంలో తనపై మార్క్స్ రాసిన విమర్శకు జవాబుగా బ్రూనో బాయెర్ మళ్ళీ ప్రతి-విమర్శ చేస్తే, మార్క్స్ దానికి కేవలం 3 పేజీల్లోనే సమాధానమిస్తాడు. అందులో మార్క్స్ ఏమంటాడంటే : 'పవిత్ర కుటుంబం' గ్రంథంపై ఎవరో సరిగా సమీక్ష చేయనివాని నుండి బ్రూనో బాయెర్ మక్కీకి మక్కీగా కాపీ కొట్టి ప్రతి-విమర్శను చేశాడని. అలా ఆ సమీక్షకుని సమీక్షనూ, బాయెర్ ప్రతి-విమర్శనూ పక్కపక్కనే పెట్టి ఉదహరిస్తూ, విమర్శిస్తాడు మార్క్స్.

**పుస్తకంలోని అసలు విషయం :** ఈ సకల సంపదల సృష్టికీ, సమాజాభివృద్ధికి పామరులే (mass) మూలం, ఆధారం అనీ, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ చులకనచేసే, తక్కువచేసే హక్కు ఎవ్వరికీ లేదనీ, ఎవరూ అలా చేయకూడదనేదీనూ. తమ విమర్శకూ, తమకూ స్వచ్ఛతనూ, పవిత్రతనూ, లోపరాహిత్యాన్ని ఆపాదించుకుని, పామరులనూ, వారి దైవిక ఆచారాల్నీ చులకనతో కించపరుస్తూ తమను దైవాంశగా చెప్పుకునే వారిని మార్క్స్, ఎంగెల్స్‌లు విమర్శించటం.

**ప్రాసంగికత :** నాడు జర్మనీకీ, చుట్టుప్రక్కల దేశాలకీ ప్రాకి, ప్రభావితం చేసిన ఈ హెగెలియన్ స్పెక్యులేటివ్ తత్వశాస్త్రం నేటి భారతదేశానికి నాటికంటే ఎక్కువగా వర్తిస్తుంది. ఎందుకంటే, నాటి జర్మనీలో హెగెల్, అతని అనుయాయులొక్కరిదే ఐన తత్వశాస్త్రం ప్రభావం చూపితే, నేటి భారతదేశంలో మాత్రం వేల ఏళ్ళనుండే తంత్ర, మాయా వాదాలతో పాటు, వేదాంతంతో యోగా, వ్యక్తిగతమైన ఇతర శాస్త్రాలను కలిపేసి మొత్తం భారత సమాజ ప్రజ బుర్రల్ని గందరగోళపరుస్తూ, క్షణక్షణం 'పవిత్రత' గురించి మాట్లాడుతూ, 'మతం' పై గల ప్రజల విశ్వాసాన్ని ఆసరా చేసుకుని, ఎన్నో సామాజిక అసమానతల్నీ 'కుల వ్యవస్థ'నూ వ్యవస్థీకృతం చేశారు. కాబట్టి, ఒకవైపు గ్లోబలైజేషన్ వల్ల సరుకుల మార్కెట్ మాజాయాలంలో పడి భారత ప్రజ పాదార్థికంగా వస్తుగతంగా నలిగిపోతోంది. మరోవైపు, దానికంటే మిన్నగా వేల ఏళ్ళ నుండి మానసికంగా సాంస్కృతిక భావజాల రంగంలో మానసికంగా కుంగిపోతోంది. అలా మనం 'వాస్తవ మానవులు' గా ఈ దేశంలో రోజురోజుకూ నశించిపోతున్నాం. కనుకే నేడు ఈ గ్రంథం మన దేశ సాంస్కృతిక విప్లవానికీ, ప్రజా విప్లవాలకీ మరింత అవసరం. ❑

*గమనిక : ఈ గ్రంథ అధ్యయనాన్ని సరళం చేస్తూ అనువాదకుని 24 వివరణలు యీ పుస్తకంలో వున్నాయి. ఈ పుస్తకంపై రచయిత చేసిన అంతర్జాల వీడియో ప్రసంగం ఈ కింది లింక్‌లో చూడండి.*
*https://youtu.be/v2JlqvvQbOI*

### కారల్‌మార్క్స్ కొన్ని ముఖ్య రచనలు

| | |
|---|---|
| అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు | 1844 |
| థీసిస్ ఆన్ ఫ్యూయర్‌బాక్ | 1845 |
| తత్వశాస్త్ర దారిద్ర్యం | 1847 |
| లూయీ బోనపార్టీ 18వ తేదీ | 1852 |
| గ్రూన్ డ్రిస్సీ | 1857 |
| రాజకీయ అర్థశాస్త్ర విమర్శ | 1859 |
| పెట్టుబడి మొదటి భాగం | 1867 |
| మరణానంతరం రెండో భాగం | 1885 |
| మూడో భాగం | 1894 |

### మార్క్స్ - ఎంగెల్స్‌ల ఉమ్మడి రచనలు

| | |
|---|---|
| పవిత్ర కుటుంబం | 1845 |
| జర్మన్ ఐడియాలజీ | 1845 |
| కమ్యూనిస్టు ప్రణాళిక | 1848 |

ఘటన పూర్తయిన తర్వాతే (post festum)
హెగెల్ చెప్పే తత్వవేత్త రంగంపైకి దర్శనమిస్తాడు.
-మార్క్స్

స్వీయ-చైతన్యం అనేది 'మనిషికి గల ఒక గుణం' నుండి
ఒక 'స్వీయ-అస్తిత్వం గల కర్త/విషయి '(subject) లోనికి
{హెగెల్, బ్రూనో బాయెర్‌లచే} రూపాంతీకరింపబడింది.
-మార్క్స్


మనిషిలో వుండే ప్రతీ మానవీయ విషయాన్నీ
అతనికి పరాయిదిగానూ, అతనిలోని అమానవీయమైన
ప్రతి విషయాన్నీ అతనికి వాస్తవంగా చెందినట్టుగానూ
'మతపర కాపట్యం' సాధారణంగా పరిగణిస్తుంది.
-మార్క్స్



# జర్మన్ తత్వశాస్త్ర విమర్శ

కె.వి.రావు

ప్రతి దేశంలో, ప్రతి యుగంలో మార్పుని ఆశించేవారు, యథాస్థితిని కోరుకునేవారు, మార్పు నియమిత పరిధిలోనే జరగాలనుకునేవారు, లేక ఎల్లలు లేని మార్పు కావాలనుకునేవారు ఉంటారు. వారి వారి ఆశయాలకు అనుగుణంగా వారి వాదన లను, అదే విధంగా వారి తాత్విక దృక్పథాలను రూపొందించు కుంటారు. అంటే ఈ తాత్విక దృక్పథాలన్నీ ఆయా వర్గాల ప్రయోజనాలకు, తదనుగుణమైన చైతన్యానికి అద్దం పడతాయి. 1845లో మార్క్స్ -ఎంగెల్స్ సంయుక్తంగా జర్మన్ ఐడియాలజీని రచించే నాటికి జర్మన్ జాతీయవాదం నేపథ్యంగా అనేక భావజాలాలు ఒకదానితో ఒకటి తలపడుతూ ఆ సమాజాన్ని గందరగోళంలో ముంచెత్తుతున్నాయి. ఈ సందర్భంగా రచయితలు తమ "పూర్వ తాత్విక దృక్పథంతో లెక్కలు తేల్చుకోవడానికి" ఈ రచన చేశామనీ, ఈ రచన ముఖ్య లక్ష్యం స్వీయ స్పష్టీకరణ కావడం వలన దీనిని ముద్రించాల్సిన అవసరం లేదనీ అందుకని ఈ రాతప్రతులను ఎలుకల విశ్లేషణకే వదిలేశామనీ, అవి ఆ కాగితాలను చక్కగా నమిలేశాయనీ, వారి తరువాతి రచనలలో రాసుకున్నారు.




అయితే ఈ రచనని 1936లో ముద్రించారు. మార్క్స్ - ఎంగెల్స్ ఆలోచనా విధానానికి సంబంధించిన ఎన్నో విషయాలు బీజరూపంలో కొన్నీ, వికసిత రూపంలో మరికొన్నీ- కవితాత్మక శైలిలో ఈ రచనలో మనకు కనబడతాయి.

ఆనాటి పెటీ బూర్జువా భావవాదులు హెగెలియన్ వ్యవస్థతో పోరాటం చేస్తూ వారి నవీన భావవాదం మానవ జాతిని విముక్తి చేస్తుందని నమ్మజూపారు. అయితే హెగెలియన్ భావవాదానికి, యువ హెగెలియన్ల నవీన భావవాదానికి ఎలాంటి వ్యత్యాసం లేదని మార్క్స్ - ఎంగెల్స్ ఈ రచనలో నిరూపించారు. వారు తమ రచనని ఒక పరిహాసంతో మొదలుపెడతారు. "అనగనగా ఒక వీరుడు. మానవులను గురుత్వాకర్షణ శక్తి అనే భావన ఆవహించిందని, ఈ భావన వల్లే వీరు నీట మునుగుతున్నారని వాదించాడు. అయితే మూఢనమ్మకంగా మారిన ఈ భ్రమను మనుషుల బుర్రలలో నుంచి తొలగించినట్లయితే వారికి నీట మునిగే ప్రమాదం ఉండదని బోధించాడు. తన జీవితాంతం ఈ గురుత్వాకర్షణ శక్తి అనే భ్రమకు, దాని దుష్పరిణామాలకు వ్యతిరేకంగా ఈ వీరుడు పోరాడాడు. అతని వాదనకు అనుగుణంగా ఎన్నో సాక్ష్యాలను, గణాంకాలను కూడా కూడగట్టాడు" అంటూ మనుషుల భావనలు మారితే ప్రపంచమే మారుతుందనే ఆలోచనా విధానాన్ని రచయితలు ఎద్దేవా చేశారు.

ప్రపంచంలో మార్పు తేవడంలోని సాధ్యాసాధ్యాల గురించిన రకరకాల ఊహాగానాలను, విభిన్న సిద్ధాంతాల రూపంలో జర్మన్ బూర్జువా వర్గం సమాజం ముందుంచింది. "మానవ ప్రమేయం లేకుండానే సామాజిక మార్పు తీసుకురావడం సాధ్యమా?" అనే ప్రశ్నకు, సాధ్యమేనని జర్మన్ తాత్వికులు అందరూ -హెగెల్ వరకు- జవాబు ఇచ్చారు. దీనర్థం సమాజంలో వచ్చే మార్పులు దైవికమని, మానవుడు నిమిత్తమాత్రుడని వీరి నిర్ధారణ.

తన చుట్టూ ఉన్న సృష్టిలోని విషయాల బాహ్య రూపాలను మాత్రమే మానవుడు గ్రహించగలడనీ, అయితే వీటి అంతర్గత సారం మానవునికి అంతుచిక్కదనీ, కాబట్టి తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మార్చడానికి మానవుడు చేసే ప్రయత్నం ఎట్టకేలకు వృథా అవుతుందనీ ఇమ్మాన్యుయేల్ కాంట్ సిద్ధాంతీకరించాడు.

పరబ్రహ్మ 'జగన్నాటక సూత్రధారి' అనీ, మానవుడు కేవలం నిమిత్తమాత్రుడనీ హెగెల్ తన వాదనలో తేల్చిచెప్పాడు. హైందవ దశావతారాలలో మాదిరిగా ఈ పరబ్రహ్మ ఒక దశ నుంచి ఆ పై దశకు పురోగమిస్తూ ఉంటాడనీ, ఈ ప్రయాణానికి మానవ

సమాజం ప్రతిబింబంగా ఉంటుందనీ, ఇది దైవంలో వచ్చిన పురోగతిని అనుకరిస్తూ ఉంటుందనీ హెగెల్ సూత్రీకరించాడు. అయితే ఈ పరబ్రహ్మ అలా పురోగమించి, పురోగమించి ప్రష్యన్ రాజ్యంలో తన పరిపూర్ణ దశకు చేరుకున్నాడనీ, ఇక మార్పు జరగదనీ కూడా ఆయన తేల్చేశాడు.

ఈ యథాస్థితి వాదనలకు భిన్నంగా, బూర్జువా ఆలోచనా విధానానికి అద్దం పట్టే తాత్విక దృక్పథాన్ని యువ హెగెలియన్లు ఆవిష్కరించారు. వీరి ప్రకారం మానవ ప్రయత్నంతోనే చరిత్ర ముందుకు సాగింది; సమాజంలోని మార్పులకు మానవులే కారకులని వీరు చాటారు. అయితే ఈ మార్పులన్నీ మానవుని మెదళ్ళల్లో జరిగాయనీ, "అలా భావనలలో వచ్చిన విప్లవాలే సామాజిక విప్లవాలుగా మారాయని" వీరు వక్కాణించారు.

వీరిని ఉద్దేశించి మార్క్స్– ఎంగెల్స్ హేళనగా "ఇప్పటివరకు మానవులు తామేమిటో, ఎలా ఉండవలెనో అనెడి విషయాలపై తప్పుడు భావనలు కలిగి యున్నారు. వారికి దైవము పట్ల మానవుని పట్ల ఉన్న భావాలకు అనుగుణంగా తమ సంబంధాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పుడు వారి మేధోత్పత్తి అయిన ఈ భావాలు, వారి చేతుల్లోంచి తప్పించుకు పోయాయి. వీటి సృష్టికర్తలైన ఈ మానవులు ఇపుడు వీటి ముందు మోకరిల్లుతున్నారు. పదండి, మనము ఈ తలపులు, ఈ నమ్మకాలు, ఈ ఊహాగానాల కాడి కిందపడి నలుగుతున్న మానవజాతిని విముక్తి చేద్దాం. ఈ భావనల పాలనపై తిరుగుబాటు చేద్దాం."

"ఒకడేమో మనం, మానవుల భ్రమలను తొలగించి వాటిని మానవసారంతో నిండిన భావాలుగా ఎలా మార్చుకోవాలో నేర్పుదాం అంటాడు. మరొకడేమో ఈ భ్రమల పట్ల విమర్శనాత్మక ధోరణిని ఎలా ఏర్పరచుకోవాలో చెబుదాం అంటాడు. వేరొకడేమో ఈ భ్రమలను మన తలల నుంచి తొలగించగానే, చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచం ఎలా కుప్పకూలుతుందో నిరూపిద్దాం అంటాడు.

పసిపిల్లల వంటి బేలతనమే ఈ యువ హెగెలియన్ల తాత్విక సారాంశం! తోడేళ్ళ తోలు కప్పుకున్న ఈ గొర్రెల మెకమెకలు కేవలం జర్మన్ మధ్య తరగతి ఆలోచనలను ప్రతిబింబిస్తాయి. వారి దయనీయ జీవిత పోరాటాలను చాటుతాయి".

యువ హెగెలియన్లు, హెగెల్‌ను తిరస్కరించినా గాని, వారి తత్వసారం కూడా భావవాదమేనని, అది ఎన్నటికీ మార్పుకు తోడ్పడదని మార్క్స్ – ఎంగెల్స్ తేల్చేశారు. "వీరి తాత్విక విమర్శ మతం నుండి మొదలై రాజకీయానికి, న్యాయానికి, నైతిక శాస్త్రానికి ఇంకా ఇతర భావనలకు విస్తరించి వీటన్నింటిని మతం గాటన కట్టి – ఇవన్నీ మతానికి, మత స్పృహకు సంబంధించినవే" యువ హెగెలియన్ల వాదనలని మార్క్స్ – ఎంగెల్స్ తేలుస్తారు.

"ఇలా యువ హెగెలియన్లు అన్ని రంగాలలో మతం యొక్క ఆధిపత్యాన్ని ముందస్తు షరతుగా ఉంచుతారు. ప్రతి మానవ సంబంధాన్ని మతపరమైన సంబంధంగా చూస్తారు" అని మార్క్స్– ఎంగెల్స్ తేల్చి చెప్పారు. "యువ హెగెలియన్లు సమాజంలోని ప్రతి వ్యవస్థకి మతం అనే భావనను పులిమి విమర్శించారు. మతం అన్నింటికి మూలాధారం అన్న పాత హెగెలియన్ల సూత్రంతో వారు ఏకీభవించినట్లే. అయితే తేడా ఏంటంటే, మతం మానవునిపై చేసేది దురాక్రమణ అని ఒకరు అంటే – వేరొకరు అది చూపే ప్రభావం న్యాయ సమ్మతమే అంటారు" అని మార్క్స్– ఎంగెల్స్ తేల్చి చెప్పారు.

ఈ మతపరమైన ఆలోచనలను తొలగించే విషయంలో యువ హెగెలియన్లు చేసే విఫల ప్రయత్నాన్ని మార్క్స్ – ఎంగెల్స్ తిప్పి కొట్టారు. "ఈ ఆలోచనలు ప్రజల మనస్సుల నుండి తొలగించడానికి వారి జీవన పరిస్థితులు మారాలి. అయితే కార్మిక వర్గం ఇటువంటి మతపరమైన సూత్రాలు ఏవి లేనట్లే ప్రవరిస్తుంది. ఎందుకంటే వారి జీవనపరిస్థితులు ఈ విశ్వాసాలని ఎన్నడో కరిగించి వేశాయి." అంటారు మార్క్స్–ఎంగెల్స్. ఇటువంటి వాదననే వారు "పవిత్ర కుటుంబం" అనే రచనలో కూడా వినిపిస్తారు. వారు యువ హెగెలియన్ల మత విమర్శ గురించి ప్రస్తావిస్తూ "ఈ విమర్శకులకు కార్మికుల దినవారి పోరాటం పట్ల ఏ కొంచెం అవగాహన ఉన్నా వారు ఎంతగా మారిపోయారన్నది అర్థమై ఉండేది" అంటారు.

యువ హెగెలియన్లు భావనలు, ఆలోచనలు, తలపులు అనగా బౌద్ధిక ఉత్పత్తులన్నింటికి స్వతంత్ర ఉనికిని ఆపాదించారు. వీటిని సమాజంలోని బాంధవ్యాలని పాత హెగెలియన్లు అంటే, యువ హెగెలియన్లు ఇవి మానవజాతికి బంధాలు అని అన్నారు. కాబట్టి ఈ భావాలు, ఆలోచనలు, తలపులతో పోరాడి వాటిని తొలగించడమే మార్పుకు దారి తీస్తుందని వారు వాదించారు. ఈ వాదనను తిరస్కరిస్తూ మార్క్స్–ఎంగెల్స్ "మానవుడు ప్రస్తుత చైతన్యాన్ని మార్చుకొన్నట్లయితే సామాజిక మార్పును సాధించ గలమన్నది వీరి వాదన; చుట్టూ ఉన్న వాస్తవిక ప్రపంచాన్ని భిన్నంగా చూడాలనే కోరిక మాత్రమే ఇది. వీరు తత్వ శాస్త్రానికి, వాస్తవ పరిస్థితులకు ఉన్న సంబంధాన్ని శోధించలేకపోయారు" అని అన్నారు.

ఉత్పత్తి, ఉత్పత్తి చేసిన వస్తువుల మార్పిడి, సామాజిక క్రమానికి పునాదిగా ఉంటాయి అని మార్క్స్ - ఎంగెల్స్ భావించారు. ప్రతి సమాజంలో ఆస్తి పంపకం, సమాజంలోని చీలికల వల్ల ఏర్పడ్డ వర్గాలు - ఏ వస్తువులను ఉత్పత్తి చేస్తున్నారో, వాటిని ఎలా ఉత్పత్తి చేస్తున్నారో, ఆ వస్తువులను ఎలా మారకం చేస్తున్నారో అనే విషయాల పైన ఆ సామాజిక క్రమం ఆధారపడి ఉంటుంది. కాబట్టి, మార్క్స్ - ఎంగెల్స్ ఆలోచనల ప్రకారం సమాజంలో మార్పు అనేది మనుషుల మెదళ్ళలో జరగదు! నానాటికి సత్యం ధర్మం పట్ల వారు అభివృద్ధి చేసుకుంటున్న అవగాహన వల్లనూ ఈ మార్పు రాదు! ఉత్పత్తి విధానాన్ని, మారక వ్యవస్థనూ మార్చడం వల్లనే ఈ మార్పు సాధ్యము. దీనికి ఉపయోగపడేది తత్వశాస్త్రం కాదు- ఆర్థిక శాస్త్రం అని మార్క్స్ - ఎంగెల్స్ తేల్చి చెప్పారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న వ్యవస్థలు హేతుబద్ధమైనవి కావనీ, న్యాయమైనవి కావనీ మనం గ్రహించగలుగుతున్నామంటే - ఉత్పత్తి విధానాలకూ, మారక వ్యవస్థలకూ, సామాజిక క్రమాలకూ మధ్య రాపిడి మొదలైందనడానికి అది సూచన. ఇది అన్యాయమైన దని గ్రహించిన ప్రజలు, ఈ అన్యాయాలు తొలగించడానికి కావాల్సిన సాధనాలు కూడా ఈ సమాజం అభివృద్ధి చేసిందని తెలుసుకోవాలి. ఈ సాధనాలను వెతికి సమాజంలో కనుగొనాల్సిందే తప్ప మానవుడు తన మెదడులో ఆవిష్కరించాల్సినవి కావు అని మార్క్స్ - ఎంగెల్స్ అభిప్రాయపడ్డారు.

అయితే ఈ విషయం చారిత్రకమైనది; భౌతికమైనది. మానవ చరిత్రకు మొదటి ప్రాతిపదిక మనుషుల ఉనికే కదా. మానవులే లేని మానవ చరిత్ర ఎలా? మానవులని ఇతర జంతువుల నుండి వేరు చేసినప్పుడు వాటికి లేని మతం, చైతన్యం మానవునికి ఉంది కదా అనవచ్చు. ఐతే మానవుడు జంతువుల నుండి నిజంగా వేరయ్యేది తన జీవికకు అవసరమయ్యే సాధనాలను ఉత్పత్తి చేసినప్పుడే! ఆ ఉత్పత్తి సాధనాలే మానవ సమాజపు ఉత్పత్తి విధానాన్ని నిర్ణయిస్తాయి. ఒక ఉత్పత్తి విధానం కేవలం మానవుని భౌతిక మనుగడనే కాదు. అది ఒక నిర్దిష్టమైన ప్రక్రియగా, జీవన విధానాన్ని వ్యక్తపరుస్తుంది. మార్క్స్ - ఎంగెల్స్ మాటల్లో చెప్పాలంటే "మానవులు ఏమిటి అనే విషయం వారు ఏం ఉత్పత్తి చేస్తున్నారు - ఎలా ఉత్పత్తి చేస్తున్నారు అన్న వాటితో ముడిపడి ఉంటుంది". ఉత్పత్తిలో క్రియాశీలకంగా పాల్గొనే వ్యక్తులు నిర్దిష్టమైన పద్ధతుల్లో , నిర్దిష్టమైన సామాజిక, రాజకీయ సంబంధాలు ఏర్పరచుకుంటారు... ఈ విధంగా మనకు రాజకీయ క్రమానికి, ఉత్పత్తికి ఉన్న సంబంధం స్పష్టమవుతుంది.

కాబట్టి భావాలకు స్వాతంత్ర్యం లేదు. వాటికి స్వతంత్ర పురోగతీ లేదు. మానవులు భౌతిక ఉత్పత్తిన్ని, సంబంధాలను అభివృద్ధి చేసే క్రమంలో వారి ఆలోచనలను, ఇతర బౌద్ధిక ఉత్పత్తులను కూడా మార్చుకుంటారు. అందుకని "మానవుని చైతన్యం అతని జీవితాన్ని నిర్ధారించదు - అతని జీవితమే తన చైతన్యాన్ని నిర్ధారిస్తుంది.!"

దీని వలన తెలిసిందేమిటంటే పరిశ్రమ, వ్యవసాయం, వాణిజ్య రంగాల చారిత్రక పురోగతిపై మానవ జాతి విముక్తి ఆధారపడి ఉంటుంది. కూడు - గూడు-గుడ్డ అందించకుండా మానవ జాతికి మానసిక విముక్తిని అందించగలమా? అని మార్క్స్ ప్రశ్నిస్తాడు. అలా ప్రశ్నించడం ద్వారా మానవ విముక్తి అన్నది చారిత్రమైనదని, మానసికమైనది కాదని నిర్ధారిస్తాడు.

మానవుడు ఉత్పత్తిని సమాజంలో ఇతర వ్యక్తుల సహకారం తో చేయగలడు. పైగా ఒక్కో ఉత్పత్తి విధానానికి ఒక్కో నిర్దిష్ట సహకార విధానం ఉంటుంది. ఈ సహకార విధానం ఒక ఉత్పత్తి శక్తి కూడాను. ఉత్పాదకత జనాభా పెరిగే కొద్దీ శ్రమ విభజన ఉనికిలోకి వస్తుంది. ఈ విభజన మౌలికంగా భౌతిక - బౌద్ధిక విభజనగా ఉంటుంది. ఇలాంటి శ్రమ విభజన ఉన్న సమాజంలో భావవాదం ప్రాచుర్యంలోకి వస్తుంది.

శ్రమ విభజన విధానం ఒకరికి భౌతిక శ్రమనూ, వేరొకరికి బౌద్ధిక శ్రమనూ కేటాయించడం వల్ల- ఒకరికి ఉత్పత్తినీ, వేరొకరికి వినిమయాన్నీ కేటాయించడం వల్ల- ఒకరికి శ్రమనూ, మరొకరికి తీరికనూ పంచిపెట్టడం వలన- తరచు ఉత్పత్తి శక్తులకూ సమాజానికీ చైతన్యానికీ మధ్య పరస్పరం రాపిడి పుడుతుంది. శ్రమ విభజనను తొలగించడం వలనే దీనిని అధిగమించడం సాధ్యమవుతుంది.

ఈ శ్రమ విభజనలో అసమాన పంపిణీ అనగా శ్రమ ఒకరికి దాని ఉత్పత్తులు ఒకరికి అందించడం వలన ఆస్తి ఉద్భవిస్తుంది. అంటే, శ్రమ విభజన - సొంత ఆస్తి అన్నవి పర్యాయపదాలే! ఒకటి ప్రక్రియను సూచిస్తే మరొకటి దాని ఉత్పత్తిని సూచిస్తుంది.

శ్రమ విభజన మానవుని ఇష్టాఇష్టాలకు వ్యతిరేకంగా వాని తలపై ప్రత్యేకమైన వృత్తిని రుద్ది దాని నుంచి తప్పించుకోలేని విధంగా చేస్తుంది. అతడొక వేటగాడిగానో, ఒక మత్స్యకారుడి

గానో, ఒక గొర్రెల కాపరిగానో, లేక విమర్శనాత్మక విమర్శకుడి గానో ఉండిపోవలసిందే. తనపై రుద్దబడ్డ ఈ వృత్తుల నుండి తప్పించుకునే ప్రయత్నం చేయడమంటే అతను తన జీవికను కోల్పోడానికి సిద్ధపడటమే అవుతుంది.

అయితే కమ్యూనిస్టు సమాజంలో ప్రత్యేకమైన వృత్తులు మానవుడిపై రుద్దబడవు. వారి అభిష్టాల మేరకు ఏ వృత్తినైనా చేయవచ్చు. 'పగలు వేటాడి, మధ్యాహ్నం చేపలు పట్టి, సాయంత్రం గోవులు కాసి, రాత్రి భోజనానంతరం తోచిన విమర్శ చేసే స్వేచ్ఛ ఉంటుంది. అది ఒక వ్యక్తి వేటగాడి వృత్తిలోనో, మత్స్యకారుడి వృత్తిలోనో గొర్రెల కాపరిగానో, మెట్ట వేదంతిగానో స్థిరపడనక్కర లేకుండానే చేయవచ్చు.

"వ్యక్తుల సహకారం వలన వేలరెట్లు పెరిగిన ఉత్పత్తి శక్తి శ్రమ విభజన వలన అంతుచిక్కని పరాయి శక్తిగా మారుతుంది. దీనికి కారణం మానవుల సమ్మతితో సంబంధం లేని సహకారం; ఆపై శ్రమ విభజన. శ్రమ పరాయికరణను అంతమొందించడానికి రెండు ముందస్తు షరతులున్నాయి. మొదటిది ఒకవైపు విశాల ప్రజాబాహుళ్యం ఆస్తి విహీనం కావడం. రెండవది, సమాజంలో ఉత్పత్తి, ఆస్తి, సంస్కృతి తారాస్థాయికి చేరడం. "ఈ రెండు షరతులు పాలక వర్గాలను భరించలేనివిగా చేస్తాయి. విప్లవాన్ని ప్రేరేపిస్తాయి. ఐతే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి దీనికి ఖచ్చితమైన ముందస్తు షరతు, ఇది లేనట్లయితే ఆ విప్లవం పేదరికాన్ని మాత్రమే పంచిపెడుతుందని కనీస అవసరాలు తీర్చుకోలేని ఆ సమాజం తిరోగమించి పాత వ్యవహారాలనే పునఃస్థాపించవలసి వస్తుం"దని మార్క్స్ – ఎంగెల్స్ అంచనా వేశారు.

మార్క్స్ – ఎంగెల్స్ ప్రకారం, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అంటే అది ప్రపంచ స్థాయిలో ఉండే అభివృద్ధి అని దీని వలన ప్రపంచ స్థాయి సంపర్కం (intercourse) స్థాపించబడుతుందని వారు పేర్కొన్నారు. మార్క్స్ – ఎంగెల్స్ మాటల్లో "ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అన్ని దేశాలలో ఆస్తి హీనులైన జన బాహుళ్యాన్ని సృష్టిస్తుంది. ఇది ప్రాంతీయ వ్యక్తులకు ప్రతిగా విశ్వ మానవులను ఉనికిలోకి తెస్తుంది. వాస్తవానికి కమ్యూనిజం మానవ సమాజంలో రాజకీయంగా పైచేయి సాధించిన సామాన్యులు ప్రపంచమంతా ఏక కాలంలో ఏకబిగిన చేసే ప్రక్రియ వలనే సాధ్యమవుతుంది. దీనికి ముందస్తు షరతుగా ఉత్పత్తి శక్తులు విశ్వవ్యాప్తంగా అభివృద్ధి చెంది ఉండాలి. వాణిజ్యం కూడా సమానంగా అభివృద్ధి చెంది ఉండాలి. పైగా శ్రామికులు తప్ప మరియేది కాలేని ప్రజా సమూహం అనగా పెద్ద యెత్తున పోగైన శ్రమ శక్తి ఒకచో పెట్టుబడితో ఎడబాటులో ఉండి, వేరొకచో కనీస అవసరాలు తీర్చుకోలేని స్థితిలో ఉండి, సాటి కార్మికులతో పోటీలు పడుతూ అభద్రతకు లోనై, అడపాదడపా కూలీని కోల్పోయే వీళ్ళు తమ జీవిక భద్రత కొరకు ప్రపంచ మార్కెట్‌ని ఒక బీమాగా కోరుకుంటారు.

కాబట్టి మార్క్స్ – ఎంగెల్స్, ప్రపంచ స్థాయిలోనే కార్మికులు చరిత్రను సృష్టించగలరు అని, అలాగే కమ్యూనిజం కూడా ప్రపంచ స్థాయిలోనే మనగలదు అని భావించారు. దీని పర్యవసానంగా ప్రపంచ చరిత్రతో నేరుగా సంబంధం ఏర్పరచుకున్న విశ్వమానవులు ఉనికిలోకి వస్తారు అని చెప్పారు. మార్క్స్ – ఎంగెల్స్ మాటల్లో "ఇప్పటి వరకు ఉన్న చరిత్రలో వేర్వేరు వ్యక్తుల చర్యలు, ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా చారిత్రక చర్యలుగా మారాయి. ఈ చర్యలు వాటిని అమలు పరిచిన వ్యక్తులకు దూరమై, వారిని ఎదిరించే శక్తులుగా మారి, వారిని దాసులుగా చేశాయి. అయితే కమ్యూనిస్ట్ విప్లవం సొంత ఆస్తిని రద్దు చేసి, ఈ శక్తిని తునాతునకలు చేస్తుంది. అప్పుడు ప్రతి ఒక్క వ్యక్తి, మానవ చరిత్ర ఏ మేరకు విశ్వ చరిత్రగా మారిందో, ఆ మేరకు విముక్తిని పొందుతాడు. ఇది వ్యక్తులను జాతీయ మరియు ప్రాంతీయ స్పృహల నుంచి విముక్తి చేసి, ప్రపంచంలోని భౌతిక మరియు బౌద్ధిక ఉత్పత్తితో సంబంధం ఏర్పరచుకునేలా చేస్తుంది. ఇలా ప్రపంచ స్థాయి ఉత్పాదనలు వారు అనుభవించడానికి యోగ్యులను చేస్తుంది. ఈ ప్రపంచ స్థాయి చరిత్ర అంటే ప్రపంచ స్థాయి సహకారం ఉనికిలోకి వచ్చి పరాయివైపోయిన ఉత్పత్తి శక్తులను నియంత్రించే స్థాయిని మానవ జాతికి కల్పిస్తుంది".

## ముగింపు

జర్మన్ ఐడియాలజీలో భౌతికవాదానికి, భావవాదానికి ఉన్న వ్యత్యాసం కమ్యూనిస్ట్ విప్లవానికి ఉన్న విశ్వస్థాయి లక్షణాలు, ప్రపంచ మార్కెట్ వలన కార్మికులకు జరిగే లబ్ధి, ఇలాంటివి ఎన్నో విషయాలను మార్క్స్– ఎంగెల్స్‌లు స్పష్టీకరించారు. పై పరిచయం ప్రేరణతో పాఠకులు ఈ రచనను చదువుతారని నేను ఆశిస్తున్నాను. ❑

*జర్మన్ ఐడియాలజీపై రచయిత చేసిన ప్రసంగం వేదిక / Discord లో ఈ క్రింది లింకు ద్వారా వినవచ్చును.*

*https://www.youtube.com/channel/UCPxKsHZi5KhDL6fH1iEJO5g*



# 'థీసిస్ ఆన్ ఫాయర్‌బాక్' పరిచయం

**రావు కృష్ణారావు**

1845 జనవరి నెలలో ప్రష్యా ఒత్తిడితో ఫ్రెంచి ప్రభుత్వం మార్క్సును దేశం నుండి బహిష్కరించింది. మార్క్స్ బ్రస్సెల్స్‌కు మారాడు. బ్రస్సెల్స్‌లో వుండగానే 1845మార్చి నెలలో 'థీసీజ్ ఆన్ ఫాయర్‌బాక్' అనే పేరుతో నోట్సు రాసుకున్నాడని పరిశోధకుల అభిప్రాయం. వీటిని ప్రచురణ కోసం కాక, తన రిఫరెన్స్ కోసం రాసుకున్నాడు. అందుకే అతి క్లుప్తంగా, సాంద్రంగా వుంటాయి. థీసీజ్ అతి సంక్షిప్తమైనవి, చాల లోతైనవి. 11 థీసిస్‌లు కలిపి ప్రింటులో మూడు పేజీలు మాత్రమే!. మార్క్స్ చనిపోయిన తర్వాత ఆయన నోటు పుస్తకాల్లో ఒకదానిలో వీటిని కనుగొన్న ఎంగెల్స్ వీటిని స్వల్పంగా ఎడిట్ చేసి, 1888లో తన పుస్తకం 'లుడ్విగ్ ఫాయర్‌బాక్, సంప్రదాయ జర్మను తత్వశాస్త్ర ముగింపు' పుస్తకానికి అనుబంధంగా ప్రచురించాడు. ముఖ్యంగా ఇవి పాత భౌతికవాదం నుండి మార్క్సిష్టు భౌతికవాదానికి మార్పును సూచిస్తాయి.

మార్క్స్ చింతనలో థీసీజ్‌కు చాలా ప్రాధాన్యతుంది. ఆయన ప్రధానంగా వీటిని తన గత భావాలను విమర్శనాత్మకంగా విశ్లేషించుకోవడానికి, తన భవిష్యత్ కృషికి మార్గదర్శకంగానూ రాసుకున్నాడు. మార్క్స్ చింతన మొదట్నుండీ చివరిదాకా 'విప్లవాత్మక మానవతావాదం'. మార్క్స్ ఆలోచన అంతటికీ ప్రాతిపదిక 'మనిషి' మాత్రమే! 'మనిషే మానవప్రపంచం, రాజ్యం, సమాజం' అనేది మార్క్స్ సామాజిక సిద్ధాంతం. థీసీజ్‌లోని అతి ప్రధాన విషయం ఇదే.

మార్క్స్ రచనలను వేటినీ విడిగా చూడకూడదంటారు. అదే థీసిస్‌కూ వర్తిస్తుంది. ఇవి ప్రధానంగా ఈ దిగువ విషయాలను తెలుపుతాయి.

1. ఆలోచనలో సిద్ధాంతం – ఆచరణల ఐక్యత.
2. వాస్తవికతను స్థిరమైనది, మార్పు లేనిదిగా కాదు. అది వైరుధ్యాలతో నిరంతరం మారుతుంటుంది. దాన్ని దాని అన్ని వైరుధ్యాలలో అర్థం చేసుకోవాలి.
3. సమాజంలో భౌతికవాద గతితర్కం యొక్క స్థానం, దాని పనివిధానం.
4. అనువిత్తి (perception), ఆచరణలకు సంబంధించిన జ్ఞాన సిద్ధాంతం.
5. స్వీయ పరాయీకరణ, దానికి నిజమైన కారణం.
6. నిజమైన భౌతికవాదం గురించిన చారిత్రిక–మానవ శాస్త్రం.
7. రుజువు, ధృవీకరణ, ఆచరణలకు సంబంధించిన సిద్ధాంతం.
8. మార్క్స్ లక్ష్యాన్ని తెలిపే, మానవాళికి లక్ష్యాన్ని బోధించే అతిముఖ్యమైన నినాదం.

ప్రధానంగా హెగెల్ భావవాదం, పాత మననాత్మక భౌతిక వాదాలను అధిగమించి ఒక కొత్త ఆచరణాత్మక భౌతికవాదాన్ని ప్రతిపాదించడానికి థీసిజ్‌ను మొదట్నుండి చివరివరకూ ఒక క్రమ పద్ధతిలో నిర్మించడం జరిగింది. మార్క్స్ థీసీజ్‌లో కొత్త భౌతికవాదం జన్మించింది. ఈ భౌతికవాదం ప్రపంచమంటే సంవేదనల (sensations) ద్వారా తెలుసుకునే వస్తు సముదాయం అనే భావనను దాటి ముందుకు వెళ్ళి ప్రకృతితో మన ఆచరణాత్మక పరస్పర చర్యలపై దృష్టి సారించింది.




మార్క్స్ కొత్త భౌతికవాదం మనకున్న ప్రపంచానికి భాష్యం చెప్పడంతో సరిపుచ్చుకోక దాన్ని ఆచరణాత్మకంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. థీసీజ్, భౌతికవాదాన్ని ఆచరణాత్మక, సామాజిక భౌతికవాదంగా మార్చింది. ఇక్కడ కొన్ని థీసిస్‌ల గురించి అతి క్లుప్తంగా చెప్పుకుందాం.

**థీసిస్ నెం.1**

"ఫొయర్‌బాక్ వాదంతో సహా, ఇంతవరకూ ఉన్న భౌతిక వాదంలో, ప్రధాన లోపం ఏమిటంటే, వస్తువు (Gegenstand), వాస్తవికత, సంవేదనీయత అనేవాటిని కేవలం భౌతిక వస్తు (Objekt) రూపంగా, లేక మననాత్మక రూపంగా భావించడం జరిగింది కాని, సంవేదనా మానవ కార్యకలాపంగా, ఆచరణగా, స్వీయాత్మకంగా (కర్త పరంగా) భావించలేదు. కనుక భౌతిక వాదానికి విపర్యాసంగా, క్రియాశీల పార్శ్వాన్ని భావవాదం అమూర్తంగా అభివృద్ధి చేసింది. అయితే భావవాదానికి నిజమైన, సంవేదనాత్మక కార్యకలాపం గురించి ఏమీ తెలియదు.

ఫొయర్‌బాక్ ఆలోచనా వస్తువులనుండి, సంవేదనీయ వస్తువులను వేరు చేయాలని నిజంగానే కోరుకుంటున్నాడు. కాని మానవ కార్యకలాపమే భౌతిక కార్యకలాపమని ఆయన గ్రహించ లేకపోతున్నాడు. అందుచేతనే "క్రైస్తవమత సారాంశం" గ్రంథంలో అతడు సైద్ధాంతిక దృక్పథం మాత్రమే నికార్సైన మానవ దృక్పథంగా పరిగణించి, ఆచరణను కేవలం దాని మలిన యూదు (dirty-Jewish) వ్యక్తీకరణలో మాత్రవే భావించి నిర్ణయిస్తున్నాడు. కనుక "విప్లవకర", "ఆచరణాత్మక-విమర్శనాత్మక" కార్యాచరణ ప్రాధాన్యాన్ని ఆయన గ్రహించలేక పోతున్నాడు."

మార్క్స్ ప్రాచీన, ఆధునిక భౌతికవాదాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. ఈ తత్వశాస్త్రాలు అన్నింటిలోను ఆయన ఒక ప్రాథమిక లోపాన్ని కనుగొన్నాడు. అదేమంటే, అవి అనువిత్తి, జ్ఞానాలను, అలాగే చైతన్యం, చర్య (action) లను వాస్తవంగా, అర్ధవంతంగా వివరించలేకపోయాయి.

సాంప్రదాయ భౌతికవాదం, మనిషి శరీర కూర్పు బయటి ప్రపంచంలోని పదార్థాలతో జరుగుతుందని నమ్మింది. లోకాయతులు మన శరీరం గాలి, నిప్పు, నేల, నీరు అనే నాలుగు భూతాలతో నిర్మించబడిందని చెప్పారు. అదేవిధంగా మన మనసులోని విషయాలన్నీ, అంటే అనుభూతులు, ఆలోచనలు, భావాలు వగైరా అన్నీ బయటి నుండి మనలోకి ప్రవేశించినవేనని వివరించింది. అంటే బాహ్య ప్రపంచంలోని వస్తువులు మన ఇంద్రియాలపై పనిచేసి సంవేదనలను (ఇంద్రియానుభూతులను) తద్వారా ఆలోచనలు, భావాలను కలుగచేస్తాయని పాత భౌతిక వాదులు నమ్మారు. ఒక వస్తువు మన కంటికి కనిపించిందంటే ఆ వస్తువుపై పడిన కాంతి ప్రతిఫలించి మనకంటికి చేరడం కారణమన్న మాట. ఇందులో మన ప్రమేయం ఏమీ లేదంటుంది భౌతికవాదం. పాత భౌతికవాదం అంటే మార్క్స్ వరకూ ఉన్న అన్ని రకాల భౌతికవాదాలు. ఈ ప్రక్రియలో మానవుని మనసు నిష్క్రియాత్మకమైనది, కావలసినట్లుగా మలచగలిగే మైనం లాంటిదని అని ఈ భౌతికవాదులు భావించారు. అయితే పరిసరాలకు స్పందించడం, వాటిని మార్చడం, పూర్తిగా తిరిగి నిర్మించడంలో మానవులు నిర్వర్తించే పాత్రను పాత భౌతికవాదం గుర్తించలేదు.

మార్క్స్ భౌతికవాదం వస్తువు మనకు కనిపించడానికి కారణం వస్తువు, వస్తువునుండి వచ్చే కాంతి మాత్రమే కాదు, ఆ వస్తువును మనం చూడటం ముఖ్యం అంటుంది. ఉద్దేశ్య పూర్వకంగా మనం ఆ వస్తువును చూస్తున్నామన్న మాట. అంటే వస్తువు కనబడటం అంటే కేవలం వస్తువు నుండి కాంతి కంటికి చేరడం మాత్రమే కాదు. మనం దాన్ని చూడాలి. చూడటం, అలాగే అనుభూతి చెందడం వస్తువులు మనపై పనిచేయడం కాదు. అలా అనుభూతి చెందడం అనేది మనం చేస్తున్న పని, ఉద్దేశపూర్వక కార్యకలాపం. బయటి నుండి వస్తువులు మన మనసుపై ముద్రలు వేస్తే మనం ఉదాసీనంగా స్వీకరించడం కాదు, మనం ఎంపిక చేసుకొని మనకు కావలసినవాటినుండి లభించే సంవేదనలనే గ్రహిస్తాం.

అంతే కాక మన ఇంద్రియానుభూతులు బయటి వస్తువుల ప్రతిబింబాలు, ముద్రలు అయితే ఆ ప్రతిబింబాలు, ముద్రలు మన మనసులో, లేదా శరీరంలో ఉండాలి. కాని నిజానికి మనం చూస్తున్న వస్తువు మనలోపల కాక మన వెలుపల మనకి ఎంత దూరంలో ఉందో ఎంత సైజులో ఉందో అదే విధంగా కనిపిస్తుంది. బయటి దాన్ని బయటి దానిగానే గ్రహించగల సామర్థ్యం మనకుంది. అంటే మనం బయటి నుండి గ్రహించిన వస్తువును తిరిగి బయటికి, దాని వాస్తవ స్థితికి ప్రతిక్షేపించ (project) గలమన్న మాట. అందుచేత ఇంద్రియానుభూతిని కేవల ప్రతిఫలనంగా భావించడం తప్పు.

బాహ్య ప్రపంచంలోని వస్తువులు మన ఇంద్రియాలపై పనిచేసి సంవేదనలను కలుగచేస్తాయని వివరించే ఈ యాంత్రిక విధానాన్ని భౌతికవాదులు సరిదిద్దలేక పోయారు. భావవాదులు సరి చేశారు. జర్మను భావవాదుల లోపాలు ఎన్ని వున్నా, వారు మనసు కార్యకలాపం గురించి లోచూపుతో గొప్ప దోహదం చేశారు. మార్క్స్ అన్ని రకాల భావవాదం పైన తీవ్ర విమర్శలు చేసి తెగతెంపులు చేసుకున్నాడు. అయితే అలా తెగతెంపులు చేసుకున్నది సరళ, యాంత్రిక భౌతికవాదాన్ని అంగీకరించడానికి కాదు. చైతన్యాన్ని విశ్లేషించడంలో భావవాదులు చేసిన నికార్సైన ఆవిష్కరణలకు భౌతికవాద భూమికను ఏర్పరచడానికి మార్క్స్ కృషి చేశాడు.

కేవలం మామూలు ఆలోచననే కాక మామూలు అనువిత్తిని కూడా ఒక యాంత్రిక ప్రచోదన ఫలితంగా వివరించలేము. ఎందుకంటే మనకు తెలిసిన, అనుభూతి చెందిన దానిలో కేవలం యాంత్రిక ప్రతిబింబం కాక, మన ఊహలు, జ్ఞాపకాలు, విలువలు, ఆకాంక్షలు, మొ. ఎన్నో కలగలిసి ఉంటాయి. మనం ఒక నిర్జీవ అద్దంలా ప్రతిబింబించడం కాక, ఒక క్రియాశీల కర్తగా ఆ వస్తువును అనుభూతి చెందుతాం. అయితే ఈ క్రియాశీలత భౌతిక పరిస్థితులకు అతీతమైనది కాదు.

పాత భౌతికవాదులందరూ కూడా చైతన్యానికి, వస్తువును ప్రతిద్వందిగా చూశారు. అయితే వీటిలో ఏది దేన్ని నిర్ణయిస్తుంది? చైతన్యమా, లేక వస్తువా? అది గ్రహించలేక పదార్ధం ప్రాధమికం కాబట్టి చైతన్యాన్ని పదార్ధంగా కుదించి, పదార్ధం నుండి చైతన్యం జనిస్తుందని నిర్ణయించారు.

ప్రకృతి, మానవుడు, సమాజాల అభివృద్ధిని పరిశీలించ దానికి ఆరంభ స్థానంగా భౌతిక వాదులు పదార్ధాన్ని తీసుకుంటే, భావవాదులు కర్త (subject మనిషిని) ను తీసుకున్నారు. మార్క్స్‌కు ఆరంభ స్థానం మనిషి. మార్క్స్ మనుషులతో ప్రారంభించాడు. వారిని మార్పులేని వారు, పరిపూర్ణులు అని భావించలేదు. వారిని నిజమైన వారిగా, అనుభవాలు పొందుతూ, నిరంతరం అభివృద్ధి చెందుతున్న వారిగా, ఉన్నవారిని ఉన్నట్లుగా అర్ధం చేసుకున్నాడు. ఇటువంటి మనుషుల క్రియాశీల జీవన ప్రక్రియను వర్ణించనారంభించగానే, చరిత్ర ఇంకెంత మాత్రం మృత వాస్తవాల పోగుచేతగా వుండదు. మార్క్స్ అభిప్రాయం ప్రకారం చరిత్ర అంటే జరిగిపోయిన ఘటనల రికార్డ్ కాదు.

చరిత్రను అర్ధం చేసుకోవడానికి మానవులే ఆరంభ స్థానం. అంటే మానవ అవసరాలే మానవుని గురించిన పరిశోధనకు ఆరంభ స్థానం అయి తీరాలి. ఎందుకంటే మానవుడు తన అవసరాలు తీర్చుకోవడం కోసం ప్రకృతిపై పనిచేసి దాన్ని మారుస్తూ అలా మార్చిన మేరకు తనూ మారే క్రమమే చరిత్ర... చరిత్ర గమనం పదార్ధంలోనే ఉండే గతిశీల ప్రేరణ ఫలితం కాదు. భౌతిక పరిస్థితులకు, సామాజిక వ్యవస్థకు మధ్య పరస్పర చర్యే చరిత్ర. మిగిలిన అన్ని భౌతికవాదాలనుండి మార్క్స్‌ను వేరు చేసేది ఆయన రూపొందించిన 'చరిత్రను గురించిన భౌతిక వాద భావన'.

ఇక్కడ మననాత్మక భౌతిక వాదం (Contemplative materialism) అంటే ఏమిటో క్లుప్తంగా చెప్పుకుందాం. మననం, లేదా contemplation అంటే ఈ సందర్భంలో అర్ధం నిష్క్రియాత్మకంగా, ప్రత్యేక ప్రయోజనం ఏదీ లేకుండా పరిసరాలను పరిశీలిస్తూ, ఆ పరిసరాలు మన ఇంద్రియాలద్వారా మనపై చూపే ప్రభావానికి గురవ్వడం. ఆచరణ, ప్రయోజనాలతో ప్రత్యక్ష సంబంధం లేని పరిశీలన, ఆలోచన అని చెప్పుకోవచ్చు. చైతన్యం గురించిన మననాత్మక దృక్పధం చైతన్యాన్ని శాశ్వత, స్థిర వాస్తవికత యొక్క జడ ప్రతిబింబంగా పరిగణిస్తుంది. అంటే ఎప్పటికీ మారని బాహ్య ప్రపంచం యొక్క యధాతథ ప్రతిబింబం గా భావిస్తుంది. మార్క్స్ పూర్వపు భౌతికవాదంలోని ప్రధాన లోపం దాని జ్ఞాన సిద్ధాంతంలో వుంది. ఆ భౌతికవాదం సంజ్ఞానాన్ని (cognition) అనువిత్తి యొక్క నిష్క్రియాత్మక ప్రక్రియగా పరిగణించింది. సంవేదన చెందే గుణాన్ని మనిషి మీద బాహ్య వస్తువుల ప్రభావం కారణంగా ఏర్పడే ఒక నిష్క్రియాత్మక స్థితిగా పరిగణించింది. ఇందులో మనిషి తనంత తానుగా చేసేది ఏమీ వుండదు. బాహ్య ప్రపంచం మనిషి జ్ఞానేంద్రియాలపై పని చేస్తే మనిషి కేవలం దాన్ని అనుభూతి చెందుతాడు అంతే!

అంతేగాక ఇది ఏకపక్షంగా వస్తుగత ప్రపంచం, మానవ కార్యకలాపాలను వేరు వేరైనవిగా, పరస్పరం వ్యతిరేకమైనవిగా పరిగణించింది. ఇది జ్ఞానాన్ని దాని సామాజిక చారిత్రిక పరిస్థితులతో సంబంధం లేకుండా, వాటికి అతీతమైన స్వతంత్ర వ్యవస్థగా పరిగణించింది. దీన్నే మార్క్స్ మననాత్మక భౌతికవాదం అన్నాడు. మార్క్స్ ఇందులోని ఏకపక్ష ధోరణిని, అసమగ్రతను ఎత్తి చూపాడు. సంవేదన చెందడం అనేది మనిషి సొంత కార్యకలాపమని, సంవేదనా కార్యకలాపం ఆచరణేనని చెప్పాడు. కనుక ఇటువంటి సంవేదనా కార్యకలాపం కల మనిషి కేవలం తన పరిసరాల చేత ప్రభావితుడయ్యే వస్తువు మాత్రమే కాదని, ఆ పరిసరాలను మార్చే కర్త కూడా అని ఉద్ఘాటించాడు.

మార్క్స్ భౌతికవాదం నుండి వస్తుగత ప్రపంచ భావనను తీసుకున్నాడు. భావవాదం నుండి క్రియాశీలత భావనను తీసుకున్నాడు. అయితే ఆ రెండింటిలో లేనిదాన్ని ముందుకు తెచ్చాడు. అదే ఆచరణకు కేంద్ర స్థానం కల్పించడం. భావవాదం నొక్కి చెప్పిన 'మానసిక కార్యకలాపం' సంవేదనీయ మానవ కార్యకలాపమైన ఆచరణ యొక్క ఒక పార్శ్వం మాత్రమే అన్నాడు. సంవేదనీయ మానవ కార్యకలాపం అంటే చుట్టూ వున్న ప్రపంచాన్ని మార్చే కార్యకలాపం.

మార్క్స్ వాడిన జర్మను మాటలకు అర్ధాలు, అనువాదాల మీద కొన్ని వివాదాలున్నాయి.

మొదటి థీసిస్ హృదయం, సారం (core) భౌతికవాద గతితర్కం.

## థీసిస్-2

"మానవుని ఆలోచనకు వస్తుగత యదార్థతను ఆపాదించ వచ్చా, లేదా అనేది సిద్ధాంత సమస్య కాదు. అది ఆచరణాత్మక సమస్య. మానవుడు సత్యాన్ని నిరూపించి తీరాలి. అనగా ఆచరణలో ఆలోచన యొక్క ఇహలోకత్వాన్ని, వాస్తవికతను, శక్తిని, నిరూపించాలి. ఆలోచన వాస్తవమా, లేదా అవాస్తవమా అనే వివాదాన్ని ఆచరణ నుండి విడకొట్టినట్లయితే, అది శుద్ధ పాండిత్య ప్రగల్భ సమస్య అవుతుంది."

'మానవుని ఆలోచన భౌతిక సత్యాన్ని సరిగా చూపుతుందా, లేదా అనే ప్రశ్న సిద్ధాంత సమస్య కాదు. అది ఆచరణాత్మక సమస్య'. సిద్ధాంతం, ఆచరణల గురించి ఫొయర్‌బాక్ భావనలను మార్క్స్ వ్యతిరేకించాడు. ఆచరణ నుండి పుట్టిన సిద్ధాంతం పనికి, చర్యకు మార్గదర్శి. సిద్ధాంతాన్ని పరీక్షించడానికి చేపట్టే కొన్ని ప్రత్యేక చర్యలను ప్రాక్టీసు అంటున్నాము. నిజానికి ప్రాక్టీస్, లేదా ప్రాక్సిస్ అనేది ఎంచుకున్న ప్రవర్తన. దాని లక్షణం మనిషి చూసే, చేసే వాటిలోకి మనిషి తెచ్చే నైపుణ్యాలు, టెక్నిక్‌లు, విధివిధాన పద్ధతులలో వుంటుంది. ఇతర తత్వవేత్తలందరూ గుర్తించినా చెప్పలేకపోయిన దాన్ని మార్క్స్ ప్రాక్సిస్ సిద్ధాంతం వివరిస్తుంది. మార్క్స్ అభిప్రాయం ప్రకారం, సామాజిక అవసరాలు తీర్చడానికి వస్తువులను తయారుచేసే క్రమంలో చేపట్టే కార్యకలాపాలలో జ్ఞానం బలాన్నిస్తుంది.

శతాబ్దాలుగా జ్ఞానం అంటే ఏమిటి? అదెలా పుడుతుంది? అనేది తత్వశాస్త్రంలో కీలక సమస్యగా వుంటూ వచ్చింది. అయితే మానవ జ్ఞానం శరీరం నుండి వేరుగా, లేదా పాదార్థిక ప్రపంచం నుండి వేరుగా వుంటుందన్నప్పుడే ఈ సమస్య పుడుతుంది. మార్క్స్‌కు పూర్వమున్న భౌతికవాదులు జ్ఞానమంటే బాహ్య ప్రపంచ ప్రతిబింబమని, మనిషి మెదడు బాహ్య విషయాలను ప్రతిబింబిస్తుందని, అది (మానవ జ్ఞానం) పదార్థం నుండి పుట్టింది కనుక ద్వితీయమని చెప్పారు. దీనికి విరుద్ధంగా మార్క్స్, బయటి విషయాలను ప్రతిబింబించడం ద్వారా కాక, తన జీవావసరాలను తీర్చుకోవడానికి మనిషి బయటి వస్తువులపై పనిచేసే క్రమంలో ఆ వస్తువుల స్వరూప స్వభావాలు, వాటిని మార్చడానికి తప్పనిసరిగా అనుసరించాల్సిన పద్ధతులు, నియమాలు తెలుసు కుంటాడని వాదించాడు. ఇక్కడ గమనించవలసిన ముఖ్యవిషయం ఏమంటే మనిషి తన జ్ఞాన తృష్ణను తీర్చుకోవడానికి వివిధ విషయాలను తెలుసుకోడు. పని లేక ఆలోచించి, లేక జ్ఞాన యోగిలా తపస్సు చేసి జ్ఞానాన్ని పొందలేడు. తను బతికుండటానికి అవసరమైన వాటిని సమకూర్చుకునేందుకు చేసే పనిలో అతనికి జ్ఞానం లభిస్తుంది. అంటే జ్ఞానం అనేది పనితో, ఆచరణతో విడదీయలేని విధంగా ముడిపడి వుంది అని అర్థమౌతుంది. మార్క్స్ అభిప్రాయం ప్రకారం జ్ఞానం మనిషి క్రియాశీల ఆచరణలో భాగం.

ప్రపంచం నుండి, తోటి మనుషుల నుండి వేరుగా వున్నాననే గుర్తింపే చైతన్యం అయినా, చైతన్యంలో భాగమైన జ్ఞానాన్ని ప్రపంచం నుండి వేరుగా వుండి ఆర్జిస్తున్నాను అనుకోవడం తప్పు. మనం ప్రపంచంలో భాగం. ప్రపంచం కూడా మన శరీరమే. అయితే మార్క్స్ అన్నట్లు అది 'నిరింద్రియ శరీరం' (inorganic body). ప్రపంచం లేకుండా మన ప్రత్యేకత ని, స్వీయతని గుర్తించలేం. సమాజం లేకుండా ఎవరినుండి మనల్ని మనం ఆలోచనలో వేరుచేసుకుంటాం. 'నువ్వు' లేకుండా 'నేను'కు అర్థముండదు. ప్రపంచంతో మనిషి సంబంధం గతితార్కికమైనది. అంటే ప్రపంచంలో భాగమైన మనిషి ప్రపంచంలోనే వుంటూ తన అవసరాలు తీర్చుకోవడానికి, జీవించి ఉండటానికి ప్రపంచంతో ఘర్షణ పడతాడు.

సామాజిక ఆచరణ సంజ్ఞానానికి క్రియాశీల పాదార్థిక పునాది. అంటే సమాజంలో భాగంగా మనిషి తన అవసరాలు తీర్చుకోవడానికి ప్రకృతిపై పనిచేసే క్రమంలోనే ప్రకృతి గురించి, తన గురించి జ్ఞానాన్నార్జిస్తాడు. ప్రకృతిలోని ఏ వస్తువు తన అవసరాలు తీర్చగలదు, దానితో ఎలా, ఏ పద్ధతులు ఉపయోగించి, ఏ నియమాలకు లోబడి పని చేయాలి తెలుసుకుంటాడు. ఇదే జ్ఞానం.

విషయి–విషయ (subject-object) సంబంధం లో భావ–పదార్థాలు (Ideal and Material) ఆచరణ ద్వారా పరస్పరం ఒకటి మరోటిగా మారతాయి. సిద్ధాంతం–ఆచరణలు సాపేక్షంగా మాత్రమే విరుద్ధమైనవని మార్క్స్ అభిప్రాయం. అవి ఒకదాని కొకటి పూరకాలు. సిద్ధాంతం ఆచరణలో భాగమవుతుంది, అలాగే ఆచరణ సిద్ధాంతానికి విషయం/ సారం అవుతుంది. అంటే ఆచరణకు పనికిరాని సిద్ధాంతం సారహీనమే.

సత్యం ఏదో ఒక విషయానికి సంబంధించినదై వుంటుంది. 'దానికదిగా సత్యం' అనేది ఉండదు. అందుచేత శుద్ధ సైద్ధాంతిక విషయంగా ఉన్న సత్యానికి పూర్తి రుజువులు ఉండవు. అది పాక్షికంగానే సాధ్యం. అంటే దాని అంతర్గత సంగతత్వం, తార్కికంగా సరియైనదిగా ఉండటం మేరకే రుజువవుతుంది. అయితే సత్యం నిరూపించబడవలసింది సిద్ధాంతంలో కాదు,

ఆచరణలో. చివరకు సరియైన ఆలోచన, సరియైన పని చేయడంతో సమానమవుతుంది. కార్యాచరణ అనేది ఆరంభం నుండి ఆలోచనలో వుంటుంది. పర్యవసానంగా చివరకు సరియైన ముగింపుగా కనిపిస్తుంది.

### థీసిస్-3

"పరిస్థితులు, పెంపకాలను మార్చడం గురించి చెప్పే భౌతికవాద సిద్ధాంతం ఒక విషయం మరచిపోతున్నది. పరిస్థితులను మార్చేది మనుష్యులేననీ, విద్యావేత్త తనే విద్యావంతుడు కావడం ఆవశ్యకమనీ మరచిపోతున్నది. కనుక ఈ సిద్ధాంతం అనివార్యంగా సమాజాన్ని రెండు భాగాలుగా విభజిస్తుంది. ఇందులో ఒక విభాగం సమాజం కంటే ఉన్నతమైనది.

పరిస్థితులను, మానవ కార్యాచరణను ఏకకాలంలో మార్చడం, లేదా స్వీయ మార్పును విప్లవాత్మక ఆచరణగా మాత్రమే భావించి, సహేతుకంగా అర్థం చేసుకోవచ్చు."

మార్క్స్ మూడవ థీసిస్‌లో మానవుడు కార్యాచరణ ద్వారా పరిస్థితులను మార్చుతూ తను మారతాడని, అంటే స్వీయ మార్పుకు గురౌతాడని చెప్పాడు. మార్చడం, మారడం అనే ఏకకాలంలో జరిగే ఈ ప్రక్రియను విప్లవాత్మక ఆచరణగా అర్థం చేసుకోవాలని, భావించాలని చెప్పాడు.

ఫొయర్‌బాక్ కేవలం సైద్ధాంతిక దృక్పథమే ఏకైక, నికార్సైన దృక్పథమని పరిగణించాడు. సిద్ధాంతానికి ఆచరణ కంటే ఉన్నతమైన స్థానం కల్పించాడు. మార్క్స్ అభిప్రాయంలో 'మార్పు' సైద్ధాంతిక అంశం కాదు. విప్లవాత్మక ఆచరణకు సబంధించినది. విప్లవాత్మక ఆచరణ అంటే పరిస్థితులను మార్చే కార్యాచరణ. అలా పరిస్థితులను మార్చుతూ మార్చే మనిషి కూడా మారడం. కీలకమంతా ఈ 'స్వీయ పరివర్తన' (తనకు తాను మారడం) లోనే ఉంది.

మనసనేది పదార్థంపై, పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని చెప్పే ప్రతీ సరళ సిద్ధాంతమూ, సంస్కరణ, విప్లవాలను ఎదుర్కొన్న వెంటనే చిక్కుల్లో పడిపోతుంది. ఎందుకంటే సమాజాన్ని మార్చాలనుకునే ఏ కార్యక్రమానికైనా ఒక ప్రణాళిక ఉంటుంది. ఆ ప్రణాళిక మార్చాల్సిన పరిస్థితులను, పద్ధతులను, మార్చిన తర్వాత పరిస్థితులను ఊహిస్తుంది. అప్పటికి ఉన్న ప్రతీ భావం, కార్యక్రమం కేవలం ఉన్న పరిస్థితుల ప్రతిఫలనం మాత్రమే అయితే, మార్చాలనే ఆలోచన ఎలా వస్తుంది? ఒక తెలివైన ఆదర్శం, పరిస్థితులను మార్చే దిశగా, ఉన్నదాన్ని రద్దు చేసే దిశగా మానవ కార్యాచరణను ఎలా నడిపించగలుగుతుంది? అందుచేత మనిషి, అతని మనసు క్రియాశీలమైనవి. పరిస్థితులను మార్చడంలో, తద్వారా తను మారడంలో మనిషి పాత్ర కీలకం.

మానవుల ఆదర్శాలు, అవి తప్పైనా, రైటైనా కేవలం మనసు కల్పించిన ఊహా చిత్రాలు కావు. అవి జనించిన కాలంలో ఆచరణకు ప్రణాళికలు. ఊహాజనిత సోషలిస్టులు తమని తాము సామాజిక ప్రక్రియకు అతీతమైన వారిగా భావిస్తారు. తమ భావాలు ప్రస్తుత వ్యవస్థను విప్లవీకరిస్తాయని, తాము చరిత్రను మార్చగలమని భావిస్తారు. ఇతర ప్రజల తాత్వికత, పరిస్థితులు, విద్య చేత నిర్ణయించబడతాయి గాని, వీరి సొంత తత్వశాస్త్రం వాటికి, అంటే పరిస్థితులు, విద్యలకు అతీతం. నిజానికి ఈ ఊహాజనిత సోషలిస్టులు కూడా ప్రజలందరితో పాటు ఒకే పరిస్థితుల్లో నివసిస్తారు. మరి ఆ పరిస్థితుల ప్రభావం వారిమీద ఉండదా? అందుచేతనే మార్క్స్ ఈ విధంగా కలగలిపిన సోషలిజం, భౌతికవాదాల సమ్మేళనం సమాజాన్ని రెండుగా విభజిస్తుందని, సామాన్య ప్రజల భావాలను పరిస్థితులు, విద్య నిర్ణయిస్తాయని, రెండో భాగమైన 'ఊహాజనిత' ఆత్మలు సమాజం కంటే ఉన్నతమైనవనీ, దోషభూయిష్టమైన మానవాళికి భగవంతుడిచ్చిన బహుమతులని గేలి చేశాడు. ఊహాజనిత బృందాలలోని కొంత మంది వారి బోధనల ద్వారా సమాజంలో విశేష గౌరవమర్యాదలు పొందారు. ప్రజల్లో వీరిపట్ల ఆరాధనా భావం, నాయకత్వ పూజ ఏర్పడ్డాయి. అవి వీరి ఆత్మ విశ్వాసాన్ని అమితంగా పెంచాయి. తమ ఆదర్శాలను సమర్థించమని బికారి మొదలుకొని రాకుమారులవరకు, ఎవరికైనా నచ్చజెప్పి ఒప్పించ గలమని, తద్వారా అన్ని సామాజిక రుగ్మతలను నయం చేయ గలమనీ నమ్మకం కలిగింది. దీనికి కారణం విముక్తికి తాళాలు సక్రమంగా ఆలోచించే తమలాంటి కొద్ది మంది వద్ద వుంటాయని నమ్మడమే!

మనుషులు తాము మారకుండా ప్రపంచాన్ని మార్చలేరనీ, అదే సమయంలో ప్రపంచాన్ని మార్చే ప్రయత్నంలోనే వారు మారగలరనీ మార్క్స్ వాదన. ఫ్రెంచి భౌతికవాదులు, ఊహా జనిత సోషలిష్టులు ప్రతిపాదించిన 'విద్య' భావనలో వర్గపోరాటానికి, విప్లవ ఆచరణకు స్థానం లేదు. నిజానికివే సమాజాన్ని మార్చే కీలక శక్తులు.

పరిస్థితులు అనుకూలించినప్పుడు సామాజిక విప్లవం దానికదే వస్తుందనే ఆలోచన సరికాదు. (పరిస్థితులు

అనుకూలించినప్పుడు సోషలిజం అనివార్యం అని సోవియట్ మార్క్సిస్టు పాఠ్య గ్రంథాలు పేర్కొన్నాయి) మనుషులు ఏమేరకైతే పరిస్థితులను రూపొందిస్తారో, ఆ మేరకు ఆ పరిస్థితుల చేత రూపొందించబడతారు. అతి ముఖ్యమైన ఈ 3వ థీసిస్‌లో మార్క్స్ మానవులు పరిస్థితులు, పెంపకాల ఫలితమనీ, అయితే ఆ పరిస్థితులు, పెంపకాలు మానవ సృష్టియేనని వివరిస్తాడు. ఇలా పరిస్థితులను మార్చడం, మానవ కార్యాచరణ ఏక కాలంలో జరగడం అనే దాన్ని సహేతుకంగా 'విప్లవాత్మక ప్రాక్సిస్' గా భావించవచ్చు. దీని భావమేమంటే సమాజ అవసరాలను గ్రహించినంత మాత్రాన సంస్కర్తలు సమాజాన్ని మార్చలేరు. ఎవరి ప్రయోజనాలైతే మొత్తం సమాజ ప్రయోజనాలతో ఏకీభవిస్తాయో ఆ ప్రజలే మార్చగలరు.

### థీసిస్-6

మార్క్స్ 6వ థీసిస్‌లో సామాజిక సంబంధాల మొత్తమే* మానవ సారాంశం అని చెప్పాడు. మనుషులు వారి దైనందిన జీవితంలో ఒకరితో ఒకరు రకరకాల సంబంధాలు ఏర్పరచు కుంటారు. సమాజాన్ని ఉత్పత్తి, పునరుత్పత్తి చేసే సామాజిక సంబంధాలలోనే వారు జీవిస్తారు. సమాజమంటే మనుషుల మంద కాదు. మనుషుల మధ్య గల సామాజిక సంబంధాల మొత్తమే సమాజం. అందుచేత అది మనుషులందరి'ఆచరణల మొత్తం' కూడా. ప్రతీ మనిషి ఆచరణ ఒక మొత్తంగా సమాజాన్ని ఉత్పత్తి చేసే క్రమంలో భాగం. అదే సమయంలో సమాజం మన ఆలోచనల్ని, ఆచరణను తీర్చిదిద్దుతుంది,మనపై ప్రభావం చూపుతుంది.

మార్క్స్ మనిషిని సామాజిక సంబంధాల మొత్తంగా పరిగణించాడు. అదే భావాన్ని ఆయన తన గ్రుంట్‌రిస్సెలో ఇలా వ్యక్తం చేశాడు. "వ్యక్తులు ఏ సంబంధాలలో ఉంటారో, ఆ పరస్పర సంబంధాల మొత్తాన్ని సమాజం వ్యక్తం చేస్తుంది." మార్క్స్ నిజమైన, నిర్దిష్టవ్యక్తులచే నిర్మితమైన సామాజిక వాస్తవికతగా సమాజాల గురించి చెప్పాడు. అంటే మార్క్స్ వ్యక్తులను వారి సంబంధాలను నిజమైనవిగా పరిగణిస్తున్నాడు. ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే వ్యక్తులు, వారి సామాజిక సంబంధాలు విడదీయలేనివి అని. నిర్దిష్ట సంబంధాల లోని వ్యక్తులే వాస్తవం. పరస్పర సంబంధాలు లేని వ్యక్తులుగాని, వ్యక్తులకు అతీతంగా వారి మధ్య సంబంధాలు, తద్వారా సమాజం గాని వుండవు. వ్యక్తుల స్వతంత్ర ఉనికి ద్వారా ఉనికిలోకి వచ్చేది సమాజం. అంటే వ్యక్తి ఉనికిలా సమాజ ఉనికి ప్రాథమికమైనది కాదు. అయితే సమాజం కేవలం ఊహల్లో వుండే కల్పిత భావన కాదు. అది వాస్తవమైనది. మార్క్స్ అభిప్రాయం ప్రకారం సమాజం అంటే ఆ సమాజంలోని వ్యక్తుల, వారి సంబంధాల మొత్తం కాదు. అంతకంటే చాలా ఎక్కువ. ఎందుకంటే సమాజానికి బయట ఉండే వ్యక్తి కంటే సామాజికుడైన వ్యక్తి గుణాత్మకంగా ఉన్నతుడు. ఆ ఔన్నత్యం పరస్పర సంబంధాలనుండి, అంటే సమాజం నుండి పొందినది. అందుచేత సామాజికులు కాని విడి వ్యక్తుల మొత్తం విలువ కంటే సామాజికులుగా మారిన అదే వ్యక్తుల విలువ చాలా ఎక్కువ. ఎందుకంటే శ్రమ, ఉత్పత్తి, భాష, సహకారం మొ. అన్నీ సమాజంలోనే సాధ్యం. ఈ గుణాలు కలిగినవాడు ప్రకృతిలో ఒంటరిగా బతికే నర జంతువు కంటే అనేక రెట్లు ఉన్నతుడు. ఇంత మహత్తర శక్తి కల సమాజం వ్యక్తులు, వారి కార్యకలాపాలకు అతీతంగా ఉనికిలో వుండదు.

*మార్క్స్ ensemble అనే ఫ్రెంచి మాటను వాడాడు. ఈ మాటకు a fluid network of relations అని అర్థం.

### థీసిస్-11

"తత్వవేత్తలు కేవలం ప్రపంచాన్ని అనేక విధాలుగా వ్యాఖ్యానించారు; కాని విషయమేమంటే ప్రపంచాన్ని మార్చాలి."

ఈ 11వ థీసిస్ మార్క్స్ మొత్తం ప్రకటనలలో కెల్లా అత్యుత్తమమైనదిగా ప్రసిద్ధి చెందింది. దీన్ని మిగిలిన పది థీసిస్‌ల సంగ్రహ సారంగా భావిస్తారు.

మొత్తంమీద ఈ పదకొండు థీసిస్‌లు మార్క్స్ క్రియాశీల ఆలోచన ఫాయర్‌బాక్ భౌతికవాదాన్ని విమర్శిస్తూ ఉన్నత శిఖరాలను అందుకుందని తెలియజేస్తాయి. ఆయన అందులో లీనమై, అదే సమయంలో దాన్ని అధిగమించాడు.

ఫాయర్‌బాక్ చింతనలో మానవుని స్వయం ప్రతిపత్తి పరిమితమైనది. మార్క్స్ విమర్శ అంతా మానవ స్వయంప్రతిపత్తికి అవధులు లేవని అంగీకరింపచేయడానికి చేసిన గట్టి ప్రయత్నమే! ఆయన అభిప్రాయం ప్రకారం తన సొంత పరిసరాలలో, అంటే సామాజిక ప్రపంచంలో, మనిషి మాత్రమే కొత్త, క్రియాశీల చరిత్ర నిర్మాత కాగలడు. అటువంటి ప్రాతిపదికపై సమాజానికి సంబంధించి 'మనిషి' గా పని చేయడానికి మార్క్స్ జీవితాంతం ఇష్టపడి కృషి చేశాడు. అటువంటి మనిషి పట్ల ఎటువంటి మినహాయింపులూ లేని విశ్వాసాన్ని ప్రకటించాడు. ఈ విశ్వాసానికి ఎటువంటి సహేతుక నిరూపణ, సమర్థన అవసరం లేదు. మనిషి తనకు తానే నిరూపణ, సమర్థనా కూడా. మనిషికి మనిషే అత్యున్నత అస్తిత్వం.

మానవుని శ్రమకు గురై మారిపోయిన ప్రకృతి, పరిసరాలు, పరిస్థితులు, సమాజమే 'మానవ ప్రపంచం'. అది మాత్రమే మానవునికి అర్థవంతమైనది. దాన్ని విస్మరించి మానవ జీవితానికి ఆవల ఉందని భావించే 'పదార్థాన్ని'** గురించి తత్వశాస్త్రం ఆలోచించడాన్ని మార్క్స్ అంగీకరించడు. అలాగే సైకాలజీ పరిశోధించి తెలుసుకునే అద్భుత విషయాలేవీ మానవ మస్తిష్కం లో లేవని మార్క్స్ సిద్ధాంతం వల్ల తేలిపోయింది. మానవ ప్రవర్తనకు ప్రాతిపదిక అతని సామాజిక జీవితమని దానికి అతీతంగా మానవ మనస్తత్వం ఉండదని మార్క్స్ వాదన. మనం అర్జెంటుగా విశ్లేషించాల్సిన అతిసంక్లిష్టమైన పెట్టుబడిదారీ ప్రపంచం మాత్రమే మన ఎదురుగావుంది.

(** మార్క్స్ తిరస్కరించిన పదార్థ భావన మార్క్సిస్టు తత్వశాస్త్రంలో అగ్ర స్థానమాక్రమించింది.)

తత్వశాస్త్రం భిన్న దృక్పథాలకు తటస్థ వేదికగా మనకు కనిపించినప్పటికీ, పైకి కనిపించే బహుళత్వం దిగువన ప్రాథమిక ఏకత్వం పనిచేస్తున్నదని మార్క్స్ చేసిన కృషి మనకు తెలియ జేస్తున్నది. ప్రపంచ అస్తిత్వం పట్ల మననాత్మక (నిష్క్రియాత్మక) ధోరణే ఆ ఏకత్వం. అంటే ప్రపంచాన్ని మార్చడానికి పూనుకోకుండా, ఈ ప్రపంచం ఏమిటి? దానికి ఆధారం, దాని మూల స్వభావం ఏమిటి? అని ఆలోచించడం. ఒక వ్యక్తి తత్వవేత్తగా మారే క్రమంలోనే, తనకు తెలియకుండానే ఈ ధోరణిలో శిక్షణ పొందుతాడు. తత్వవేత్తలు ప్రపంచాన్ని చూసే కొత్త మార్గాలను ప్రతిపాదిస్తుంటారు. అలాగే వివిధ విషయాలకు కొత్త భాష్యాలను చెబుతుంటారు.

మానవులంటే కేవలం వారి సిద్ధాంతాలు కాదు. వారి భావాలు, పాదార్థిక పరిస్థితులు వారికి చారిత్రిక వారసత్వంగా లభించాయి. వారు సామాజిక సంబంధాల సంక్లిష్ట సమ్మేళనం. భావాలు, పరిస్థితులు స్థిరమైనవిగా ఉంటూనే, అదే సమయంలో మార్చితే మారిపోగలవి కూడా! మొత్తం మీద ప్రతీ వారి ప్రవర్తన ను ప్రభావితం చేసే పాదార్థిక పరిస్థితులు, ప్రయోజనాలను మార్చకపోతే, ప్రపంచాన్ని కొత్తగా చూడటం వల్ల ప్రపంచం ఏమీ మారదు అని మార్క్స్ చెప్పాడు. తత్వశాస్త్రం ఉన్నది ఆలోచన ను తప్పించుకోవడానికి, లేదా ఆలోచన స్థానంలో పాశవిక (జంతు సమాన) ఆచరణ ఉంచడానికి కాదు. అది ఇంకెంత మాత్రం మానవ కార్యాచరణకు పరిమితులు విధించకూడదు. సామాజిక జీవితం యొక్క ప్రతీ అణువులోకి అది అల్లుకు పోవాలి. అలా జరిగినప్పుడే తత్వశాస్త్రం నిజమయ్యి ప్రత్యేక శాస్త్రంగా దాని అవసరం తీరిపోతుంది. అప్పుడు తత్వశాస్త్రాన్ని మన వెనక వదిలి వేయాలని మార్క్స్ మనకు మార్గ నిర్దేశం చేస్తున్నాడు.

మార్క్స్‌కు తప్ప మిగిలిన సాంప్రదాయ తత్వశాస్త్రానికి 'ఆచరణ' పరాయిది. ఆ ఆచరణలో నిర్ణయం, సంఘర్షణ, అనేక సాధ్య ప్రత్యామ్నాయాలలో ఒకదానిని ఎంచుకొనే పక్షపాతం ఇమిడి వుంటాయి.) కోరుకున్న తత్వశాస్త్రానికి ఒక భావన విషయంలో తెగింపు సరిపోదు. అంటే ఒక భావంతో సాహసోపేతంగా వ్యవహరించడం చాలదు. ఆ భావాన్ని ఆచరణ లో పెట్టడానికి వ్యక్తినే ఫణంగా పెట్టి తెగించి సాహసోపేతంగా పోరాడే తత్వశాస్త్రం కావాలి. అన్నిటికంటే ముఖ్యంగా మార్క్స్ వాదం 'తత్వశాస్త్రం తత్వశాస్త్రం కోసమే' అనేదాన్ని ఖండిస్తుంది, తత్వశాస్త్రం ఆచరణ, ప్రాక్సిస్ కోసం అంటుంది.

11వ థీసిస్‌లో మొదటి భాగం ప్రపంచానికి భాష్యం చెప్పటం తప్ప ఇంకేమీ చెయ్యని తత్వవేత్తలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినది. రెండో భాగం ప్రపంచాన్ని మార్చడానికి తప్పనిసరి అవసరమైన పూర్తి ప్రణాళికాబద్ధ ప్రయాణానికి కావలసిన క్రియాశీల తత్వశాస్త్రం కోసం అన్వేషణను సూచిస్తుంది. మార్క్సిష్టు తత్వశాస్త్రం యొక్క నవ్యత అంతా తత్వశాస్త్ర ప్రాతిపదిక ను సమూలంగా మార్పు చేయడంలోను, దానికి విప్లవ కర్తవ్యాన్ని అప్పగించడంలోను వుంది. మార్క్స్ ప్రపంచాన్ని నిర్దిష్టంగా మార్చే బాధ్యతను, సామర్థ్యాన్ని తత్వశాస్త్రానికి కల్పించాడు గాని ఇక తత్వశాస్త్రంగా వుండకూడదని డిమాండు చేయలేదు. ఎందుకంటే మార్క్సిష్టు సూత్రీకరణలు గతంలో ఎన్నటికంటే, ఏ ఇతర సిద్ధాంతం కంటే మరింత తాత్వికంగా ఉంటాయి. ఆ కారణం చేత ప్రపంచాన్ని మార్చే విషయంలో, 11వ థీసిస్ రెండవ భాగం జ్ఞానం యొక్క విజయాన్ని కీర్తించిందని చెప్పవచ్చు.

11వ థీసిస్ తత్వశాస్త్ర అత్యున్నత విజయం. 1845 నాటి మార్క్స్ 11వ థీసిస్ నేటికీ సామాజిక తత్వశాస్త్రాలకు ఒక సవాలుగానే మిగిలింది. మార్క్స్ తదనంతర రచనలేవీ కూడా ఈ థీసిస్‌ను దాటి ముందుకు వెళ్ళలేదు. దాని పరిధిలోనే ఉంటాయి. దుర్మార్గమైన ఈ ప్రపంచాన్ని మార్చాలని మార్క్స్ ఆగ్రహావేదనలతో పెట్టిన పొలికేక ఈ 11వ థీసిస్. ❑

*రచయిత వేదిక / Discord లో చేసిన ప్రసంగాన్ని ఈ క్రింది లింకు ద్వారా వినవచ్చును.*

*https://www.youtube.com/channel/UCPxKsHZi5KhDL6fH1iEJO5g*


*ఈ పుస్తకం పిడిఎఫ్ కాపీని ఈ లింక్ ద్వారా పొందవచ్చును.*
https://kinige.com/kbook.php?id=10147. లేదా
https://drive.google.com/file/d/1LKCrgSu6AH_47VFj8PZMTyXoSPZrsS_d/view?usp=sharing For Printed Book

# 1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు ఇప్పుడెందుకు చదవాలి?



మందలపర్తి కిషోర్

అసలు, '1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు' అనే శీర్షికలోనే అంతా వుంది. ఇది అచ్చువెయ్యడం కోసం సిద్ధం చేసిన ప్రతి కాదు కనకనే అచ్చులో కూడా అది 'రాతప్రతులు' గానే ఉండిపోయింది. ఇందులోని చర్చనీయాంశాల్లో మొదటి స్థానం అర్థశాస్త్రానికి దక్కింది. 'రాతప్రతులు'లో ఉన్నవి పదకొండు అధ్యాయాలయితే, తొమ్మిది అర్థశాస్త్రానికి సంబంధించినవే! తత్వశాస్త్రానికి సంబంధించిన ఒకే ఒక్క అధ్యాయం ఆఖరిదీ, అతికీలకమయిందీ కూడా.




నిజానికిది, సమగ్ర రచనేం కాదు; పుస్తకం కానే కాదు. ముఖ్యంగా, ఈ 'రాతప్రతులు' ఇతరులను ఉద్దేశించి రాసినవి కాదు; మార్క్స్ తను ఉపయోగించుకునే నిమిత్తం రాసుకున్న 'రాతప్రతులన్నీ దొరకలేదు కూడా! ఇవి రాసుకుని ఇప్పటికి – ఈ 2021 నాటికి కేవలం 177 ఏళ్ళే అయింది! 'స్వీయ స్పష్టీకరణ క్రమం' లో అనేక అంశాలపై కార్ల్ మార్క్స్ రాసుకున్న నోట్సు ఈ 'రాతప్రతులు'. 'ఇందులో రాసుకున్న దాదాపు ప్రతి అంశాన్నీ విశదీకరిస్తూ మార్క్స్ తర్వాతికాలంలో ఉద్గ్రంథాలే రాశారు. ఈ 'రాతప్రతులు' రాసుకున్న ధోరణిలోనే మార్క్స్ ఇతర రచనలు కూడా చేయడం గమనార్హం. ఉదాహరణకి, 1845లో రాసిన 'థీసెజ్ ఆన్ ఫాయెర్‌బాఖ్" కూడా ఒకే పుస్తకంగా రాసిన రచన కాదు. అది కూడా వ్యాసశకలాల సంకలనం; రూపంలో 'రాతప్రతుల' కు దగ్గరగా వున్నట్లనిపిస్తుంది. వాటిని ఎంగెల్స్ సవరించి, "లుడ్విగ్ ఫాయెర్‌బాఖ్...." పుస్తకానికి అనుబంధంగా చేర్చి ప్రచురించారు. అయితే, సారం విషయానికి వచ్చే సరికి 'రాతప్రతులు' లో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది.

ఇందులోని విషయాలన్నింటినీ మార్క్సే ఇతరత్రా విశదీకరించినప్పుడు ఈ నోట్స్ మనం ఇప్పుడెందుకు, ఎలా చదవాలి?

మార్క్సిస్టు అధ్యయన పద్ధతికి కొన్ని ప్రాథమిక లక్షణాలున్నాయి. 'చారిత్రిక నేపథ్యంతోనే చర్చనీయాంశాన్ని అధ్యయనం చెయ్యడం' అనేది వాటిల్లో ముఖ్యమయింది. చారిత్రక పరిణామాలను అధ్యయనం చెయ్యడానికి అదే శాస్త్రీయమయిన, వైజ్ఞానికమైన పద్ధతి కాబట్టి. ఈ 'చారిత్రిక దృక్పథం' అనే దాన్ని మార్క్సిజం చరిత్రకు సైతం వర్తింపచెయ్యాలి మనం! ముఖ్యంగా, మార్క్స్ మేధోపరిణామక్రమాన్ని అధ్యయనం చేసే సందర్భం లోనూ ఈ పద్ధతి పాటించాలి. మార్క్స్ అయినా, మరెవరయినా పుడుతూనే మేధావిగా పుట్టరు – కృషితోనే ఎవరయినా మేధావులయ్యేది. ఆ క్రమం ఎలా సాగిందో అధ్యయనం చెయ్యడానికి 'రాతప్రతులు' మంచి వనరుగా ఉపయోగ పడుతుంది. వాస్తవానికి ఇప్పుడు ఈ 'రాతప్రతుల' చారిత్రక ప్రాముఖ్యం అదే!

ఇక, సార్వజనీనమూ, సాపేక్షికార్థంలో సార్వకాలికమూ అయిన విషయాలను కూడా మార్క్స్ 'రాతప్రతులులో ప్రస్తావించాడు. ఉదాహరణకి, శ్రమతో శ్రామికుడి వేర్పాటు – ఎస్ట్రేంజ్‌మెంట్ – పరాయీకరణ – ఏలియనేషన్ – లాంటివి. ఇవి, మానవాళి సహజస్వభావాన్ని ప్రభావితం చేసే కీలకాంశాలు. వర్గ సమాజాల్లో పీడితుల ప్రవర్తన సరళిని ప్రత్యక్షంగా ప్రభావితం చేసే విషయాలివి. శ్రమశక్తి దోపిడీ ఉన్నంతకాలం ఈ విషయాలు చర్చనీయాంశాలుగా కొనసాగుతూనే వుంటాయి. అంతకాలమూ, 'రాతప్రతుల' ప్రాసంగికత చెక్కుచెదరదు!!

మనలో చాలామందికి మార్క్సిజానికి మూడు మూలాలూ, మూడు భాగాలూ ఉన్నాయని తెలుసు. జెర్మన్ తత్వశాస్త్రం, ఇంగ్లీష్ రాజకీయ అర్థశాస్త్రం, ఫ్రెంచ్ సోషలిజం మార్క్సిజానికి మూడు మూలాలు. భౌతికవాద సిద్ధాంతం, (అదనపు) విలువ సిద్ధాంతం, కార్మికవర్గ నేతృత్వంలో సాగే వర్గపోరాట సిద్ధాంతం– ఇవీ మార్క్సిజానికి మూడు భాగాలని లెనిన్ చెప్పాడు. స్థూలంగా ఈ మూడు వనరులూ, మూడు భాగాలపై మార్క్స్ అధ్యయనం ఒక

కొలిక్కి వస్తున్న దశ 1844. అప్పట్లో మార్క్స్ పారిస్‌లో ఉండేవాడు; ఎంగెల్స్ 'ఇంగ్లండ్‌లో కార్మికవర్గం స్థితిగతులు' రాసి వున్నాడు. మార్క్స్ ఎంగెల్స్‌ల తొలి ఉమ్మడి రచన 'జెర్మన్ ఐడియాలజీ' రూపొందడానికి ముందు సంవత్సరమది.

లెనిన్ చెప్పిన మూడు మూలాల్లో రెండో స్థానం ఫ్రెంచ్ సోషలిజానికి దక్కింది. చాలామంది దృష్టిలో ఈ ద్వితీయమే అద్వితీయమైంది. ఎందుకంటే, విప్లవ కార్యాచరణ వైపు ఆకర్షితులయ్యే వాళ్ళను ముందుగా ఆకట్టుకునేది రాజకీయ అంశమే! అయితే, లెనినే మరో మాట చెప్పాడు– సిద్ధాంతం లేని ఆచరణ గుడ్డిది; ఆచరణయోగ్యం కాని సిద్ధాంతం గొడ్డుది అని. మార్క్సిజం మూలాల్లో ఫ్రెంచ్ సోషలిజం పాత్ర అద్వితీయమే కానీ, తత్వశాస్త్రం పాత్రేం తక్కువ కాదు! దేని ప్రాముఖ్యం దానిదే!!

ఫ్రాన్స్‌వా నోయెల్ బేబఫ్ గురించి 'రాతప్రతులు' లో ప్రస్తావనవశంగా చెప్పాడు మార్క్స్. పద్దెనిమిదో శతాబ్దానికి చెందిన ఫ్రెంచ్ విప్లవకారుడు బేబఫ్. క్రీ. పూ. రెండో శతాబ్దానికి చెందిన విప్లవాత్మక సంస్కర్త 'గ్రాకస్'తో బేబఫ్‌ను పోల్చి చెప్తారు. బేబఫ్ ఉద్యమానికి పాలకవర్గాలు పెట్టుకున్న ముద్దు పేరు 'కుట్ర'.

వాస్తవానికి, మార్క్స్ రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనంలో తలమునకలై వున్న దశలో రాసుకున్నవీ 'రాతప్రతులు' అని చెప్పుకున్నాం కదా– ఆయన ఆ అధ్యయనాన్ని ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో ఒక్కసారి పరిశీలిద్దాం. 'రాతప్రతులు' రాసుకోడానికి రెండేళ్ళు ముందు రెయ్‌నిషె జెయ్‌టుంగ్ పత్రిక మొదలయింది. దాదాపు తొలినాళ్లనుంచీ మార్క్స్ ఈ పత్రికలో విభిన్న విషయాల గురించి రాస్తూ వచ్చాడు. ఈ పత్రికకు తొలిఎడిటర్‌గా ఎంపికైన మోజెస్ హెస్‌తో పరిచయం మార్క్స్ జీవితాన్ని మలుపు తిప్పింది. హెస్‌తో పాటుగా ఫ్రెంచ్ సోషలిజం భావనలతో కూడా ఇక్కడే మార్క్స్‌కు పరిచయమయింది. వాస్తవానికి అప్పటికి మార్క్స్‌కు గట్టిగా పాతికేళ్ళు కూడా లేవు – అప్పుడప్పుడే డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నాడు! అయితే, అప్పటికే ఆయన మేధస్సు తగినంత గుర్తింపును పొంది వుంది. "లోతయిన తాత్విక ప్రాముఖ్యాన్ని, సునిశితమైన చతురోక్తులతో మేళవిస్తాడు మార్క్స్. రూసో, వోల్టేర్, హోల్‌బఖ్, లెసింగ్, హెగెల్‌లను ఒకే వ్యక్తిలో ఐక్యం చేసి చూడండి – నేనంటున్నది వాళ్లందరినీ ఒకే వ్యక్తిత్వంలో 'ఐక్యం' చెయ్యమని, కట్టగట్టి పెట్టమని కాదు! – అప్పుడు మీ కళ్లముందు డాక్టర్ మార్క్స్ ప్రత్యక్షమవుతాడు" అన్నాడు మోజెస్ హెస్ ఓ లేఖలో. ఈష్కిలస్, షేక్స్పియర్, గొయ్‌థే, షెల్లీల పేర్లు హెస్ ఎత్తకపోయినా, వాళ్ల రచనలు మార్క్స్‌కు కొట్టినపిండి! అయితే, తత్వశాస్త్ర గ్రంథాలూ, సాహిత్యం , న్యాయశాస్త్రం తప్ప మిగతా విషయాలతో మార్క్స్‌కున్న పరిచయం పరిమితం. హెస్ చెప్పిన పేర్లలో స్మిత్, రికార్డో, షూల్జ్, జేమ్స్ మిల్, జే.బీ.సే, బ్యూరే కనబడకపోవడం కాకతాళీయం కాదు. రాజకీయ అర్థశాస్త్రం గురించి మార్క్స్ ఏకాగ్రంగా కృషి చెయ్యడం అప్పుడప్పుడే మొదలు పెట్టారు మరి!!

దీన్నిబట్టి మనకి ఏమర్థమవుతోంది?

రెయ్‌నిషె జెయ్‌టుంగ్ పని చెయ్యాలనుకోవడంతోనే, మార్క్సిజం దిశగా మార్క్స్ ప్రయాణం మొదలైంది! ఆ రోజుల్లో తత్వశాస్త్రం, సాహిత్యం లాంటి రంగాల్లో వాస్తవ జీవిత విమర్శకు పెద్ద ప్రాధాన్యం ఉండేది కాదు. అలాంటి రంగాల్లో జీవిత వాస్తవాల గురించిన చర్చకు ప్రాధాన్యం ఆశించడం దురాశే అవుతుంది. (ఉన్న మాట చెప్పాలంటే, ఇప్పటికీ ఈ రంగాల పరిస్థితుల్లో పెద్ద మార్పు లేదు!) కానీ, మార్క్స్ ఆ రంగాల్లో సీరియస్‌గా కృషి ప్రారంభించిన మనిషి. తనకు తెలియని విషయాలను మనసుపెట్టి తెలుసుకునే ప్రయత్నం చేయడం ఆయన స్వభావం. అందుకే, పోటీపరీక్షలకు తయారయ్యే విద్యార్థి గా ఆయన రాజకీయ అర్థశాస్త్ర అధ్యయనం మొదలుపెట్టారు. ఈ క్రమాన్ని మనకు సూచనప్రాయంగా తెలియచేస్తాయి 1844 నాటి 'రాతప్రతులు..

చిత్రమేమిటంటే, మార్క్స్‌కు ఫ్రెంచ్ సోషలిజంతో పరిచయం కల్పించిన మోజెస్ హెస్ వైరుధ్యాల పుట్ట. ఎంగెల్స్‌కు కూడా సోషలిజం కమ్యూనిజాలను పరిచయం చేసినవాడు హెస్సే! తాను సోషలిస్టునూ, కమ్యూనిస్టునూ అని చెప్పుకుంటూనే యూదు జాత్యహంకారాన్ని ఆశ్రయించాడు హెస్. స్పినోజా ప్రభావంతో నైతిక, నైష్ఠికవాదిగా అవతరించి, "లేబర్ జియోనిజం" అనే వింతవాదానికి జన్మనిచ్చాడు! అలాంటి వాడితో మార్క్స్ ఎంగెల్స్ లకు సరిపడకపోవడంలో విడ్డూరమేముంది? జెర్మన్ ఐడియాలజీ లో హెస్ భావాలను కూడా వాళ్ళిద్దరూ ఆక్షేపించారు; అధిక్షేపించారు. సైద్ధాంతిక గందరగోళాన్ని సహించేంత హృదయ వైశాల్యం మార్క్స్, ఎంగెల్స్‌లకు ఎప్పుడూ లేదు. అయినప్పటికీ, వాళ్ళిద్దరినీ మార్క్సిజం వైపు మళ్లించిన ఘనత మాత్రం హెస్‌కే దక్కాలి!!

హెగెల్ ప్రతిపాదించిన దృగ్విషయశాస్త్రం' పై తన విమర్శను మార్క్స్ 'రాతప్రతులు' లోనే మొదలుపెట్టాడు. హెగెల్ ప్రతిపాదించిన దృగ్విషయశాస్త్రం' లో మార్క్స్ రెండు మౌలికమైన లోపాలను చూపించాడు. మానవసారానికి దూరమయిన సారభూతమయిన అంశాలుగా సంపదనూ, రాజ్యాధికారాన్ని

ప్రతిపాదించాడు హెగెల్. కానీ, ఆ పనిని కేవలం భావనాత్మకంగా, అనిర్దిష్టంగా మాత్రమే చేశాడు. ఆ మాటకొస్తే, హెగెల్ ప్రతిపాదించిన పరాయీకరణ సిద్ధాంతం మొత్తం అనిర్దిష్ట ఆలోచనల నుంచి పుట్టుకొచ్చిందే. అనిర్దిష్ట చైతన్యమే నిజమయిన మానవ సారమని హెగెల్ నమ్మకం. అందుకే, మతం, సంపద వగయిరాలను కేవల ఆధ్యాత్మిక అస్తిత్వాలుగా పరిగణించాడు. అంచేత, హెగెల్ నిజమయిన మానవచరిత్రను రాయలేదు; దాని అనిర్దిష్ట, ఊహాత్మక రూపానికి మాత్రమే ఆయన అక్షర రూప మిచ్చాడు. మనిషిని చైతన్యంగానూ, చైతన్యాన్ని స్వీయచైతన్యం గానూ మాత్రమే హెగెల్ పరిగణించాడు. అందుకే, మనుషుల పరాయీకరణ మొత్తంగా స్వీయచైతన్య పరాయీకరణేనని భావించాడు.

సహజమయిన వస్తువులకు బదులుగా, అనిర్దిష్టమైన 'వస్తు తత్వాలను' ప్రతిపాదించాడాయన. మనిషిని అనిర్దిష్ట పదార్థంగా మార్చే ప్రక్రియ, చివరికి అభావంగా మారుతుంది. ఒకానొక అస్తిత్వానికి వెలుపల వస్తువేది -పదార్థమేదీ- లేకపోతే అది నాస్తిత్వం (ఉన్‌వేసెన్) గా మారుతుంది; అటువంటి నాస్తిత్వాల చరిత్ర అవాస్తవిక చరిత్ర అవుతుంది; హెగెల్ దృగ్విషయశాస్త్రం చెప్పిన చరిత్ర అదే అయింది! అయితే, హెగెల్ సాధించిన ఒకానొక విషయం గురించి మార్క్స్ ఈ సందర్భంగా చెప్తాడు. మానవుడి సృజనశక్తిని ఒక పరిణామ క్రమంగా చెప్తాడు హెగెల్. ఇక్కడ హెగెల్ మనిషిని వాస్తవ రూపంలో చూశాడు; శ్రమ పరిణామ సారాన్ని ఆయన అర్థం చేసుకున్నాడు! జాతిపరమైన అస్తిత్వంగా మనిషి, తన జాతిపరమైన సామర్థ్యాలన్నింటినీ, శ్రమ ద్వారానే సాధించాడన్నాడు. ఈ విషయాన్ని ఎత్తి చూపించడం ద్వారా, హెగెల్, మిగిలిన తత్వవేత్తల కన్నా పది అంగలు ముందడుగు వేశాడు. తన సమకాలికులూ, పూర్వికులూ మాత్రమే కాదు–తన వారసులకన్నా కూడా ఈ విషయంలో ముందున్నాడు!

తేనెటీగ రకరకాల పూలలోంచి తేనె చుక్కలు సేకరిస్తుం దంటారు. అలాగే మార్క్స్ తన అవగాహనకు పనికొచ్చే అంశాలను విభిన్న మూలాల నుంచి సేకరించుకున్నాడు.

1840 దశకం తొలినాళ్లలో మార్క్సును ప్రగాఢంగా ప్రభావితం చేసిన తాత్విక రచనలు ఫొయెర్‌భాఖ్‌వి. 'రాత ప్రతులు' రాసే నాటికే ఫోయెర్ బాఖ్ ప్రభావంలోనే, భౌతికవాద దృక్పథం ఏర్పర్చుకున్నాడు మార్క్స్, మతపరమైన విశ్వాసాలను వ్యతిరేకించడంతోనే తన స్వతంత్ర ప్రయాణం మొదలుపెట్టాడు ఫొయెర్‌బాఖ్. మనిషికీ ప్రకృతికీ మధ్యన ఉన్న సంబంధం ప్రాతిపదికగా, 'వాస్తవ భౌతికవాదం' ప్రతిపాదించాడు ఫొయెర్ బాఖ్. ఆయన వైఖరి హెగెల్ పట్ల సానుకూల, నిర్మాణాత్మక విమర్శన దృష్టి కలిగి వుండడమేనని మార్క్స్ రాశాడు. కానీ, ఫొయెర్‌బాఖ్, హెగెల్‌పై చెప్పుకోదగిన విజయం సాధించలేక పోయాడని కూడా అన్నాడు మార్క్స్. మనిషిని జాతిపరమైన అస్తిత్వంగా మాత్రమే చూసే విపరీత ధోరణి వల్లనే ఇలా జరిగిందని అన్నాడు. ప్రకృతిసిద్ధమైన 'జాతుల' నేపథ్యంలోనే మనిషిని అంచనా కట్టేందుకు ఫొయెర్‌బాఖ్ పరిమితమయ్యాడు. సామాజిక నిర్మాణం నేపథ్యంలో మనిషిని చూడలేకపోవడంలోనే ఫొయెర్ బాఖ్ వైఫల్యం దాగి వుందన్నాడు మార్క్స్.

రాతప్రతులు' కేవలం తనకోసమే మార్క్స్ రాసుకున్న నోట్స్ మాత్రమే అని చెప్పుకున్నాం కదా! వాటిని, కూడా అధ్యాయాల ప్రాతిపదికగా రూపొందించి రాసుకున్నాడు మార్క్స్. ఆయన లేఖలకు సైతం నిర్దిష్ట నిర్మాణం వుంటుంది– ముఖ్యంగా, ఎంగెల్స్ కి రాసిన లేఖలు చూడండి! ఇంతకీ, ఈ నిర్మాణం ఆ లేఖల్లో లేదు– అది మార్క్స్ ఆలోచనల్లో ఉంది! –

'రాతప్రతుల' చర్చనీయాంశాలేమిటో మార్క్సే స్వయంగా ప్రవేశిక' లో చెప్పాడు. "రాజ్యం, న్యాయశాస్త్రం, సామాజిక నీతి శాస్త్రం, పౌరజీవితం వగయిరాలకూ– రాజకీయ అర్థశాస్త్రానికీ మధ్య వున్న అంతస్సంబంధాన్ని ఈ రచనలో ప్రస్తావించానని ఆయన అన్నాడు. "ఫ్రెంచ్, ఇంగ్లీష్, జెర్మన్ సోషలిస్టుల రచనలను ఇందులో ఉపయోగించుకున్నా"నన్నాడు మార్క్స్, ఎంగెల్స్, హెస్ జెర్మన్‌లో చేసిన 'మౌలిక, సారవంతమయిన' రచనలు కూడా తనకు ఉపయోగపడ్డాయని చెప్పాడు. "హెగెల్ తర్వాత, ఫోయెర్ బాఖ్ రచనలే నిజమయిన సైద్ధాంతిక విప్లవాన్ని తమలో ఇముడ్చుకుని వున్నా"యని అన్నాడు. చిట్టచివరి అధ్యాయం హెగెల్ తాత్వికత గురించి – ముఖ్యంగా గతితర్కం గురించి– చర్చించేందుకే కేటాయించాడు. "మొత్తంగా హెగెల్ తాత్వికతతో ఉన్న విభేదాలన్నిటికీ అంతిమ పరిష్కారంగానే ఈ అధ్యాయాన్ని ఉద్దేశించా"నన్నాడు.

దీన్ని బట్టి ఏం అర్థమవుతోంది? లెనిన్ చెప్పిన మూడు మూలాలూ మూడు భాగాల గురించే 'రాతప్రతులు' చర్చించాయని తేలిపోతోంది! చిత్రమేమిటంటే, మూడు మూలాలూ–మూడు భాగాల గురించి చెప్పిన లెనిన్ ఈ 'రాతప్రతులు' చూడనే లేదు! ఆయన చనిపోయిన తర్వాత మూడేళ్ళకుగానీ 'రాతప్రతులు బయటపడలేదు; ఏడెనిమిదేళ్ళకు గానీ అవి అచ్చుకానేలేదు! మరి లెనిన్ అంత స్పష్టంగా మూడు మూలాలూ–మూడు భాగాల

గురించి ఎలా చెప్పగలిగారు? మార్క్స్– ఎంగెల్స్ ల ప్రధానమైన రచనలు చదివిన వాళ్లందరికీ ఈ ప్రశ్నకు జవాబు తెలుసు! 'రాతప్రతులు' రూపుదిద్దుకునే నాటికే వాళ్ళిద్దరూ ఎవరికి వారుగా మార్క్సిజం దిశగా ప్రయాణం ప్రారంభించారు. మార్క్స్ మరణానంతరం 'కమ్యూనిస్ట్ పార్టీ ప్రణాళికకు రాసిన తొలి ముందు మాటలో ఈ విషయాన్ని ఎంగెల్స్ చెప్పారు. ఎత్తుపల్లాలెన్ని ఎదురైనా మార్క్స్ ఎంగెల్స్ వాళ్ళ జీవితకాలంలో ఎన్నడూ ఈ బాట నుంచి పక్కకు తప్పుకోలేదు.

రాతప్రతులు' తొలి అధ్యాయమే 'శ్రమకు వేతనాలు' అనే అంశాన్ని చర్చించింది. హెగెల్ కూడా శ్రమ గురించీ, మానవ జ్ఞానపరిణామం గురించి చెప్పిన మాట నిజమే! కానీ, శ్రమనూ, దాని వేర్పాటునూ, పరాయీకరణ క్రమాలనూ భావవాదం మబ్బుతెరల మాటు నుంచే చూపించాడు. ఆ మబ్బుతెరలను చీల్చిన సూర్యుడు మార్క్స్. వాటిని దైనందిన, వాస్తవజగత్తు అనే నేలమీదికి దించాడు! శ్రమకు కార్మికుడు దూరం కావడంలోనూ, పరాయివాడు అయిపోవడంలోనూ ఓ వాస్తవ–భౌతిక క్రమాన్ని చూశాడు మార్క్స్, రాజకీయ అర్థశాస్త్రంలో ఈ క్రమాలకు సంబంధించిన మర్మాలను వెల్లడించే విషయముందని గ్రహించాడు. అందుకే, 'రాతప్రతులు' తొలి అధ్యాయాల్లో ఆనాటి ప్రముఖ రాజకీయ అర్థశాస్త్రవేత్తల సిద్ధాంతాలే కనిపిస్తాయి. యాడమ్ స్మిత్, రికార్డో, జేమ్స్ హిల్, మెక్‌కల్లో, జే.బీ.సే, డెస్టట్ దె ట్రేసీ, బోయ్స్ గిల్బర్ట్, విల్ హెల్మ్ షుల్జ్ – ఈ పొలిటికల్ ఇకానమిస్టులు రూపొందించిన సిద్ధాంతాలను విశ్లేషించడంతోనే మునుంపట్టాడు మార్క్స్. వీళ్లందరిలోనూ కనిపించే సామాన్య, ప్రాథమిక విశిష్టత ఒకటుంది– వాళ్లందరూ సకల సంపదలకూ శ్రమే మూలమని గుర్తించారు; తమ రచనల్లో అదే విషయం చాటించారు! విలువయిన లోహాలే సంపదకు మూలమన్నది వాణిజ్య ఆర్థికవేత్తల అవగాహన; భూమే సకల సంపదలకూ మూలమన్నది వ్యవసాయార్థికవేత్తల (ఫిజియోక్రాట్ల) అవగాహన; వాళ్ల అవగాహనలకు విరుద్ధమయిన అవగాహన రాజకీయ అర్థశాస్త్రవేత్తలది. వ్యవసాయార్థికవేత్తలు శ్రమను వ్యవసాయ పరికరాల్లో భాగంగా పరిగణించారు. పంచభూతాల్లో ఒకానొక రూపమయిన భూమిని సంపదకు మూలకందంగా వాళ్లు ఎంచారు. కానీ, సంపదలన్నిటికీ శ్రమే మూలమని ఆధునిక ఆర్థికవేత్తలు మాత్రమే గుర్తించారని మార్క్స్ రాశాడు.

వీళ్ళందరూ రాజకీయ అర్థశాస్త్రవేత్తలే కావడం కాకతాళీయం కాదు! కూడబెట్టిన శ్రమే పెట్టుబడి అని గుర్తించి, నిర్వచించిన శాస్త్రం అది!! అలా గుర్తించి, నిర్వచించినందుకే మార్క్స్ వాళ్లని అభిమానించి అధ్యయనం చేశాడు. అంతేకాదు– రాజకీయ అర్థశాస్త్రవేత్తల పరిమితులను గుర్తించడంలో మార్క్స్ విఫలం కాలేదు.

అవసరమయిన ప్రతి సందర్భంలోనూ మార్క్స్ ఎంగెల్స్ రాజకీయ అర్థశాస్త్రవేత్తల వాదాలను తొక్కి నారతీశారు! ఉదాహరణకి యాడమ్ స్మిత్ పై వాళ్ల విమర్శలను తీసుకుందాం– స్మిత్ లెక్క ప్రకారం సంపదంతా పారిశ్రామిక సంపదే. సొంత ఆస్తి యొక్క వికసిత రూపం పారిశ్రామిక వ్యవస్థ అన్నాడు స్మిత్. అదేవిధంగా, శ్రమ యొక్క వికసిత రూపమే పరిశ్రమ అని కూడా ఆయన సిద్ధాంతీకరించాడు. ఈ వాదంలో ఉన్న దగుల్బాజీతనాన్ని ఎంగెల్స్ ఒక్క పోలికతో వెల్లడించాడు. ఎంగెల్స్ యాడమ్ స్మిత్‌ని అర్థశాస్త్రం పాలిట మార్టిన్ లూథర్‌గా అభివర్ణించాడు. సంపదలకు మూలం, మనిషికి ఆవల ఉందని భావించే వాణిజ్య, వ్యవసాయార్థికవేత్తలు క్యాథలిక్కు ల్లాంటి వాళ్ళు. క్యాథలిక్కుల భ్రష్టాచారాలను వ్యతిరేకించి క్రైస్తవ ధార్మికతను మనుషుల ఆత్మిక జగత్తుకు మళ్లించినవాడు లూథర్. అదే రీతిలో, స్మిత్ కూడా మనిషికి ఆవలగా ఉన్న సంపద మూలాన్ని తుడిచిపెట్టి, దాన్ని మనుషులలోనే పాదుకొల్పాడు. అంతవరకూ బాగానే వుంది కానీ, అసలయిన మర్మం ఇక్కడే వుంది మరి! మతాన్ని మనుషుల ఆత్మిక వ్యవహారంగా మార్చడం ద్వారా లూథర్ మతాన్ని నిర్మూలించలేదు. సొంత ఆస్తిని, శ్రమనుంచి పుట్టినదానిగా నిర్ధరించడం ద్వారా స్మిత్ కూడా సొంత ఆస్తిని రద్దుచెయ్యలేదు. పైగా, దానికి ఆమోదం సంపాదించి పెట్టాడు!!

వేతనాలు, లాభాలు, కౌలు– ఇవి పెట్టుబడిదారీ వ్యవస్థ తాలూకు ప్రాథమిక ఆదాయ మార్గాలు. వాటిలో సకల సంపదల సృష్టికర్తలయిన శ్రామికులకు దక్కేవి వేతనాలు మాత్రమే! పెట్టుబడిదార్లకు దక్కేవి పెట్టుబడిపై వచ్చే లాభాలు! ఇక, భూమి యజమానులకు– దక్కేది భూమికౌలు. ఇలా, లోతుగా విశ్లేషించడం ద్వారా ఈ వ్యవస్థ తాలూకు అమానుష స్వభావాన్ని మార్క్స్ బట్టబయలు చేశాడు మార్క్స్. ఆయన ఈ వాస్తవాన్ని వెల్లడి చేసిన తీరు ఎంత స్పష్టంగా ఉందో వివరించడానికి ఎక్కువ మాటల అవసరం లేదు! సంపదలన్నింటికీ శ్రమే మూలం కానీ, శ్రామికుడికి అందులో అతితక్కువ భాగమే చేతికొస్తోంది. బతికి బట్ట కట్టడానికి కటాకటిగా సరిపోయేంత మాత్రమే కార్మికులకు దక్కుతుంది; కాదు దక్కనిస్తారు! అంటే, శ్రామికుల శ్రమఫలితంలో అత్యధిక భాగం – అదనపు విలువ రూపంలో – పెట్టుబడిదారుల

గుప్పిట్లోకి పోతోంది. ఫలితంగా, పెట్టుబడికీ శ్రమకూ మధ్య తీవ్ర వైరుధ్యం తలెత్తుతుంది; అది పోరాటానికి దారితీస్తుంది! కానీ, ఈ పోరాటంలో పరిస్థితులన్నీ పెట్టుబడిదారుల పక్షానికే అనుకూలంగా ఉంటాయనేమాట ఓ చేదునిజం!! వేతనాలను కనిష్ట స్థాయిలో ఉండేలా చెయ్యడమే ఈ పోరాటం ద్వారా పెట్టుబడిదారులు ఆశించే లక్ష్యం. కార్మికుడు ఆర్థికంగా ఎలా దిగజారుతున్నాడో, పెట్టుబడిదారులు ఎలా సంపన్నులవుతున్నారో మార్క్స్ నిరూపించాడు. సంపద నానాటికీ అత్యల్ప సంఖ్యాకుల చేతిలో కేంద్రీకృతమయ్యే ధోరణిని ఆనాడే గుర్తించాడు మార్క్స్. ఆ ధోరణి ఈవేళ విపరీత ప్రమాణాలకు చేరుకుందని మన కందరికీ తెలుసు. ముఖ్యంగా భారత దేశంలో ఈ ధోరణి వికృత స్వరూపం ఇటీవల మరింతగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గుత్తపెట్టుబడిదారులు మరిన్ని లాభాలు నొల్లుకుపోయే ధోరణినీ గుర్తించాడు మార్క్స్, పెట్టుబడిదారీ వ్యవస్థలోని అంతర్గత వైరుధ్యాలు పరస్పరం పోటీ పెంచుకోవడానికి దారితీస్తాయి; ఇది పరిశ్రమలకూ, వ్యవసాయానికి సమానంగా వర్తిస్తుంది – ఎందుకంటే, మట్టికి ఆపాదించిన మనోహరమయిన కల్పనలను, పెట్టుబడిదారీ దోపిడీ ధ్వంసం చేస్తుంది. పర్యవసానంగా ఆ వ్యవస్థ కుప్పకూలిపోతుంది.

ముందే చెప్పినట్లు 'రాతప్రతులు' చిట్టచివరి అధ్యాయంలో తన నూతన తాత్విక భూమిక గురించి చెప్పాడు మార్క్స్, సహజంగానే, ఇది హెగెల్ తాత్వికత గురించి లోతుగా విశ్లేషించడానికే అంకితమయింది. హెగెల్‌లో మనకి కొట్టొచ్చినట్టు కనిపించేది ఆయన ఆశావాదం. ఈ ప్రపంచం సమస్తాన్నీ – అంటే, చైతన్య ప్రపంచం మొత్తాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమేనని హెగెల్ చాటించాడు. ఈ క్రమంలో కేవల తాత్వికత, కేవల హేతువాదం విజయం సాధించాయని హెగెల్ తేల్చిచెప్పాడు. హెగెల్ ఏమంటున్నాడో చూడండి:

"మనిషి తనను తాను గౌరవించుకుని, అత్యున్నతుడనని భావించాలి. ఆత్మ (పరమాత్మ) ఔన్నత్యం గురించీ, శక్తిసామర్థ్యాల గురించీ అతిగా అంచనా వెయ్యకూడదు. గుప్తమయి, మార్మికమయి వుండే విశ్వసారం, తనను తాను ఇకపై రక్షించుకో జాలదు. అర్థం చేసుకోవడానికి తెగువ చూపించే మన సాహసం నుంచి దానికి రక్షణ లేదు! దాని ఆంతరిక నిధినిక్షేపాలు వెల్లడి కావలసిందే! దాని లోతు మనం కనుక్కోవలసిందే, ఆనందంగా అనుభవించాల్సిందే!!" కానీ, ఈ సందర్భంగా మార్క్స్ ఎత్తిచూపించిన అంశం ఒకటుంది.

అనిర్దిష్ట ప్రపంచంలో జీవిస్తూ ఉండిన హెగెల్, అనిర్దిష్ట మానవ శ్రమను మాత్రమే – అనగా, మేధో శ్రమను, ఆలోచనకూ జ్ఞానానికి సంబంధించిన శ్రమను మాత్రమే– గుర్తించాడు. అందువల్లనే హెగెల్ చెప్పిన పరాయీకరణ, మానసిక క్రమంగా మాత్రమే అధిగమన రూపం తీసుకుంది. దృగ్విషయ శాస్త్రానికీ, మానవ చరిత్రకూ కూడా కీలకమయినది శ్రమ ప్రక్రియే! తన దైనందిన జీవనంలో భాగంగా మనిషి చేసేది నిర్దిష్ట, సజీవ శ్రమ ప్రక్రియే! ఈ ప్రక్రియలో భాగంగానే మనిషి మనుగడ సాగిస్తాడు, తింటాడు, ప్రేమిస్తాడు, బాధలు అనుభవిస్తాడు. పరాయీకరణకూ, దాని అధిగమనానికి కూడా మూలాలు మానవ శ్రమలో, దైనందినజీవనంలో ఉండాలి. ఈ వాస్తవాన్ని గ్రహించడం లోనే హెగెల్ విఫలమయ్యాడు. ఈ అంశం చెప్పుకోదగిన బహుముఖ – వివరణలతో కూడిన సిద్ధాంత రూపం తీసుకుంది. హెగెల్ ప్రతిపాదించిన అనిర్దిష్ట, మార్మిక భావవాద సిద్ధాంతానికి జవాబు ఇది– మార్క్స్ ప్రతిపాదించిన భౌతిక వాద సిద్ధాంతమిది. మార్క్స్ సిద్ధాంతం కూడా – హెగెల్, ఫోయెర్‌బాఖ్ ఉపయోగించిన పారిభాషిక పదజాలంతోనే నిండివుంది. నిపుణులకు తప్ప సామాన్య పాఠకులకు అది కొరుకుడుపడదనే మాట నిజం. అయితే, ఈ సిద్ధాంత సారం మాత్రం సుస్పష్టం. మనిషిని " వస్తునిష్టం కాని ఆధ్యాత్మిక అస్తిత్వం"గా పరిగణించాడు హెగెల్. మనిషి ప్రకృతిలో భాగమయిన అస్తిత్వమనీ, ప్రాకృతిక జీవశక్తులను కలిగివున్నవాడనీ మార్క్స్ నొక్కిచెప్పాడు.

మార్క్స్ కొన్ని విషయాల గురించి "రాతప్రతులు" రాసిన తర్వాతి రోజుల్లో లోతుగా విశ్లేషించలేదనే మాట – పాక్షికంగా వాస్తవమే! వాటిల్లో ముఖ్యమయింది 'పరాయీకరణ' అనే భావన. అయితే, దీని గురించి రాతప్రతుల్లో మార్క్స్ విస్తృతంగా చర్చించాడు. తర్వాత దాని గురించి చర్చించకపోవడానికి ఉద్దేశాలు ఆపాదించే మహానుభావుల్ని వాళ్ళ ఖర్మకు వదిలేద్దాం. కుట్ర సిద్ధాంతాలు పుట్టించి వ్యాపింపచేసే పుణ్యాత్ములకు అందులో ఏదో ఆనందం దక్కుతుంది. కోవిడ్–19 గురించిన కుట్ర సిద్ధాంతాలే ఇందుకు నిదర్శనం! పోతే, 'రాతప్రతులు'లో పరాయీకరణ గురించిన విశ్లేషణ ఉన్న మాట నిజమే! ఈ పరాయీకరణ గురించి వేరే వాదాలు కూడా చర్చించిన మాట నిజమే!!

అలాంటి వాదాల్లో ముందుగా చెప్పుకోవలసింది 'అస్తిత్వవాదం' (ఎగ్జిస్టెన్షియాలిజం) గురించి. అస్తిత్వవాదం చెప్పే "పరాయికరణ", "రాతప్రతులు'లో మార్క్స్ ప్రస్తావించిన

'పరాయీకరణ' ఒకటేనా? మార్క్సిస్టులకూ, అస్తిత్వవాదులకూ మధ్య పరాయీకరణ గురించి చర్చ జరిగిన సంగతి మనకు తెలుసు. ఇది అరవై దశకంలో మాట. ఆ తర్వాత అరవై ఏళ్ళు గడిచిపోయాయి! పరాయీకరణ పాత్రకు సంబంధించిన ఈ చర్చలో, ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం ఒకటుంది. ఈ రెండు దృక్పథాలూ కూడా హెగెల్ తాత్వికతలోని అనిర్దిష్టత పట్ల వ్యతిరేకతలోంచే రూపుదిద్దుకున్నవే. హెగెల్ తాత్వికతలో వాస్తవ మానవుడు కాల్పనిక పురాణ పురుషుడిగానే కనిపిస్తాడు. ఎందుకంటే, హెగెల్ వాస్తవ వ్యక్తినీ, అతగాడి వ్యక్తిగత వాస్తవ జీవితాన్ని స్పృశించనే లేదు.

మార్క్సిజమూ, అస్తిత్వవాదమూ కూడా కొన్ని విషయాలు నొక్కి చెప్తాయి – మనుషుల హుందాతనాన్ని గురించి, కనీసం అటువంటి గౌరవ ప్రదమయిన జీవితాన్ని కలిగి వుండే హక్కు గురించీ– మానవుడి అద్వితీయ విశిష్టత గురించీ, అతగాడి ప్రాముఖ్యం గురించీ– ఈ రెండు వాదాలూ నొక్కి చెప్తాయి! కానీ, ఇక్కడినుంచి మార్క్స్ మరింత ముందుకుపోయి తన తాత్విక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. సంఘజీవయిన మనిషి వర్గ పోరాటం ద్వారా తన పరాయీకరణను అధిగమిస్తాడని ఆయన స్పష్టం చేశాడు. తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వాస్తవరూపం ఇవ్వగల సమాజాన్ని నిర్మించుకుంటాడని కూడా ఆయన స్పష్టం చేశాడు.

అస్తిత్వవాదానికి మూలపురుషుడుగా చెప్పుకునే సొరేన్ కీర్క్‌గార్డ్ (1813–55) మార్క్స్‌కు సమకాలికుడే.

కానీ, కీర్క్‌గార్డ్ ప్రతిపాదించిన సిద్ధాంతం ఇందుకు విరుద్ధంగా ఉంది. వ్యక్తికీ, దేవుడికీ మధ్య తలెత్తే ఘర్షణ ప్రాతిపదికగా కీర్క్‌గార్డ్ తన సిద్ధాంతాన్ని రూపొందించాడు. ఈ సిద్ధాంతం ప్రకారం మనిషిని పాపం తాలూకు స్పృహ వెంటాడుతూ ఉంటుంది. తీవ్రమయిన అంతస్సంఘర్షణాత్మక స్థితిలో మనిషి తన పరాయీకరణపై విజయం సాధించగలడు. అతగాడికి ఆ విజయం ఒకవేళ సాధ్యమయితే, అది గహనమయిన వ్యష్టితత్వంతో కూడిన మతం ద్వారానే సాధ్యం. ఈ సిద్ధాంతంలో, ఒక రకమయిన పరాయీకరణ స్థానంలో మరొకదాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం జరిగింది. అప్పటికి వెనుకబడిన డెన్మార్క్ సమాజంలో నెలకొనివున్న ఆర్థిక పరిస్థితులు కీర్క్‌గార్డ్ వైఖరిలో ప్రతిఫలించాయి.

ఈ విషయాన్ని మార్క్సిస్టులు తేలిగ్గానే గుర్తించగలరు. మార్క్సిస్టు దృక్పథం ప్రధానంగా ఆశావాదం. ప్రపంచ కార్మిక వర్గమంతా కలిసి సమష్టిగా సమాజ పునర్నిర్మాణం చేపడుతుందని మార్క్స్ భావించాడు. కానీ, అస్తిత్వవాదం మౌలికంగా నిరాశావాదం. మనిషి దైవాన్ని కోల్పోతే, శూన్యత పాలబడతాడని చెప్తుంది. తనమీద కత్తిగట్టిన పాడులోకంలో వ్యక్తి –మనిషి కాదు, 'వ్యక్తి–ఒంటరి అయిపోతాడని అస్తిత్వవాదం చెప్తుంది. ఘర్షణ పాలయిన వ్యక్తి ఒంటరితనంలోనే స్వేచ్ఛను సాధిస్తాడంటారు అస్తిత్వవాదులు. మార్క్స్ దృష్టిలో స్వేచ్ఛ అనేది ఓ చారిత్రిక భావన. సంఘజీవి ప్రకృతితోనూ, మానవాళి మొత్తంతోనూ సత్సంబంధాలు కలిగి వుండి సాధించుకోవలసినదే స్వేచ్ఛ.

ఒక్కముక్కలో చెప్తే, అస్తిత్వవాదం వ్యక్తివాదం – మార్క్సిజం సామాజిక వాదం. వాటికి పొంతన కుదిరే ప్రశ్నే లేదు!! అందుకే, ఈ చర్చ ఇప్పటికి షష్టిపూర్తి చేసుకున్నా ఓ కొలిక్కి రానే లేదు– ఇప్పట్లో వచ్చే సూచనా లేదు!! ❑

*"The increase in value of the world of things is directly proportional to the decrease in value of the human world."*

*-Karl Marx, Economic & Philosophic Manuscripts of 1844*

*"In fact, the proposition that man's species nature is estranged from him means that one man is estranged from the other, as each of them is from man's essential nature."*

*-Karl Marx, Economic and Philosophic Manuscripts of 1844*

*History calls those men the greatest who have ennobled themselves by working for the common good; experience acclaims as happiest the man who has made the greatest number of people happy.*

*Marx, Reflections of a Young Man (1835)*



# పార్టీ ఆర్గనైజరుగా, విప్లవకారుడిగా కారల్ మార్క్స్



ఇప్టూ ప్రసాద్
ఐఎఫ్‌టియు జాతీయ కార్యదర్శి

కారల్‌మార్క్స్ తనపై రాజకీయ ప్రత్యర్థులు చేసే విమర్శలను సాధారణంగా పట్టించుకోడు. పెట్టుబడిదారీ వర్గాలు, వారికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపయోగపడే రాజకీయ వర్గాలు మార్క్స్‌ను నిరంతరం కాకుల్లా పొడుచుకు తిన్నాయి. అలాంటి నిందారోపణలను పట్టించుకోకుండా ఉండటమే వారికి నిజమైన సమాధానంగా భావించే తత్వం మార్క్స్‌ది. అయితే ఆ రోజు జరిగిన రాజకీయచర్చ మార్క్స్ ఓర్పును పరీక్షకు గురి చేసింది.

అంతవరకూ తన రాజకీయ ప్రత్యర్థి వాదనలను వింటున్న మార్క్స్ ఆగ్రహంతో కుర్చీ మీది నుంచి లేచాడు. తన ఎదుటనున్న బల్ల మీద పిడికిలితో గట్టిగా చరిచాడు. ఆ దెబ్బకు బల్లమీది లాంతరు కంపించిపోయింది. ''అమాయకత్వమనేది ఏనాడూ ఎవరికి ఉపకరించలేదు" అనే వ్యాఖ్యను మార్క్స్ చేశాడు.

"బ్రసెల్స్ కమ్యూనిస్టు కరస్పాండెన్స్ కమిటీ" సమావేశం బ్రసెల్స్ నగరంలో 30.03.1846వ తేదీన జరిగింది. ఎంగెల్స్ చర్చను ప్రారంభించాడు. విప్లవంలో కార్మికవర్గ అగ్రగామి పాత్ర పట్ల విశ్వాసం లేని విల్ హెల్మ్ వైట్లింగ్ తన వాదన చేస్తున్నాడు. వాటికి జవాబుగా మార్క్స్ కార్మికవర్గ పాత్రను సమర్థిస్తూ మాట్లాడాడు. వెంటనే వైట్లింగ్ "విప్లవాత్మక సిద్ధాంతం వల్లించే వాళ్ళు వాస్తవ జీవితంతో సంబంధం కోల్పోయిన పడక కుర్చీ పండితులు. వారు ప్రజల కష్టాన్ని పట్టించుకోని వాళ్ళు!" అని మార్క్స్‌ను ఉద్దేశించి అవహేళనగా వ్యాఖ్యానించాడు. ఆ సందర్భంలో పైన పేర్కొన్న ఉద్రిక్త సంఘటన చోటుచేసుకుంది. పై సంఘటనను ఆనాటి సమావేశంలో పాల్గొన్న నాటి రష్యా విప్లవకారుడు అనెంకోవ్ తన జ్ఞాపకాలలో ఉదహరించడం గమనార్హం!

వైట్లింగ్ ప్రతిపాదించిన "వాస్తవ సోషలిజం" (True socialism) విప్లవంలో కార్మికవర్గ అగ్రగామి పాత్రను నిరాకరిస్తుంది. దానితో మార్క్స్, ఎంగెల్స్‌లు విభేదించారు. వైట్లింగ్ వాదనలను "బ్రస్సెల్స్ కమ్యూనిస్టు కరస్పాండెన్స్ కమిటీ" కూడా తిరస్కరించింది. (వైట్లింగ్ ఓటమి పొంది, తుదకు 1846 మే నెలలో బ్రసెల్స్ నుంచి నిష్క్రమించాడు) మార్క్స్‌ను పడకకుర్చీ సిద్ధాంతవేత్తగా విమర్శించిన రాజకీయ ప్రత్యర్థులలో వైట్లింగ్ మొదటి వాడు కావచ్చునేమో! కానీ చివరివాడు మాత్రం కాదు. తదనంతర కాలంలో ప్రౌడనిజం, లాసెలియనిజం, బకూనినిజం, బ్లాంక్విజం వంటి పెటీబూర్జువా సోషలిస్టు సిద్ధాంతాల మీద వివిధ సందర్భాలలో రాజకీయ చర్చలు జరిగాయి. ఆయా సందర్భాలలో కూడా అరుదుగానైనా ఇలాంటి ఆరోపణలు వచ్చాయి.




మార్క్స్ కాలంలో ప్రధాన పారిశ్రామిక దేశాలలో ప్రౌడనిజం, లాసెలియనిజం, బకూనినిజం, బ్లాంక్విజం వంటి పెటీ బూర్జువా సోషలిస్టు విప్లవ సిద్ధాంతాలు, వాటి వెలుగులో విప్లవాచరణలు ఉనికిలో వున్నాయి. కాని వాటి తాత్విక పునాది యాంత్రిక భౌతికవాదం లేదా ఆదిభౌతిక వాదం. అందులో కొందరైతే సామాజిక విప్లవాలకు కార్మికవర్గానికి బదులు పెటీబూర్జువా వర్గాలను లేదంటే లంపెన్ శ్రామిక వర్గాన్ని పునాదిగా భావించడం కూడా గమనార్హం. తద్భిన్నంగా మార్క్స్, ఎంగెల్స్‌లు గతి తార్కిక భౌతికవాద సిద్ధాంత ప్రాతిపదికన శ్రామికవర్గ సోషలిస్టు విప్లవ సిద్ధాంతాన్ని రూపొందిస్తున్న కాలమది. తమ కాలంలో రోడ్ల మీద పిడికిళ్ళు బిగించి విప్లవాచరణ సాగించిన పెటీబూర్జువా విప్లవకారుల వలె కాకుండా, సిరా, పాళీలతో సిద్ధాంత సృష్టికర్తల బాధ్యతను వారి భుజస్కందాల మీద "చరిత్ర" మోపింది. ఆనాటి ఈ వాస్తవ పరిస్థితి మన దృష్టిలో ఉండాలి.

మార్క్స్, ఎంగెల్స్‌లు సృష్టించిన మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతాన్ని విశ్వసించిన వివిధ విప్లవ నిర్మాణ సంస్థలలో తరతమ స్థాయిల్లో పనిచేసే కార్యకర్తలు, ఆర్గనైజర్లలో కూడా మార్క్స్‌ను విప్లవ తాత్విక మేధావిగా తప్ప, విప్లవకారుడిగా, ఆర్గనైజరుగా చూడలేని స్థితి వుంది. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక రూపకర్తలుగా తప్ప, ఆ పార్టీ ఆర్గనైజర్లుగా వారిని గుర్తించలేని స్థితి వుంది. అందుకు కారణం మార్క్స్‌లో దాగిన విప్లవకారుడు, పార్టీ ఆర్గనైజర్ పాత్రలు తగినంత ప్రాచుర్యం పొందకపోవడమే. వలలను అల్లే వృత్తి నిపుణుడు అదే వలలతో చేపల వేట కూడా చేస్తాడు.

అయినా చేపల వేటగాడిగా కంటే ప్రధానంగా వలల తయారీదారుడిగానే లోకం గుర్తిస్తుంది. వాహనాల మెకానిక్ వాటిని అద్భుతంగా డ్రైవింగ్ కూడా చేస్తాడు. కానీ అతణి డ్రైవరుగా కంటే, ప్రధానంగా మెకానిక్‌గానే సమాజం గుర్తిస్తుంది. నిజానికి సాధారణ డ్రైవర్లకంటే మెకానిక్‌లే ఎక్కువ నైపుణ్యంగా డ్రైవింగ్ చేయగలరు. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక వెలుగులో పార్టీ నిర్మాణం చేసే ఆర్గనైజర్ల కంటే, ఆ ప్రణాళిక రూపకర్తలే పార్టీ నిర్మాణం చేస్తే పొందే ఫలితాలు, గుణపాఠాలు మరింత ఫలవంతంగా ఉంటాయి. మార్క్సిస్టు సిద్ధాంత వెలుగులో పనిచేసే విప్లవకారుల కంటె, ఆ సిద్ధాంతకర్తలే దాని అమలుకోసం ఆచరణాత్మక విప్లవ కృషికి పూనుకుంటే అధిక ఫలితాలు వస్తాయి. అట్టి పనిని మార్క్స్, ఎంగెల్స్‌లు దిగ్విజయంగా చేపట్టారు. అయితే దానికి ప్రాచుర్యం లభించలేదు.

మార్క్సిస్టు సిద్ధాంత పండిత వర్గాలలో నేడు ఒక తప్పుడు రాజకీయ ధోరణి వుంది. వారు మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతానికి యిచ్చే ప్రాధాన్యత, మార్క్సిస్టు విప్లవ సంస్థల నిర్మాణానికి యివ్వడం లేదు. విప్లవ నిర్మాణం లేకుండా విప్లవ సిద్ధాంతం వాస్తవ ఫలితాలను యివ్వదు. అట్టి నిర్మాణాల ఆవశ్యకతను నిరాకరిస్తూ, విప్లవ సిద్ధాంత ప్రబోధానికి ఏకైక ప్రాధాన్యతనిచ్చే మరో తప్పుడు ధోరణి కూడా ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభాలకు గురై, ఆకస్మికంగా శ్రామికవర్గ విప్లవాలు తలెత్తుతాయట! తన బరువును తాను మోయలేక, ప్రకృతిలో అంతరించిన రాక్షస బల్లుల (డైనోసారస్) వలె పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక దశలో కుప్పకూలిపోతుందట! శ్రామికవర్గ విప్లవ సంస్థల నిర్మాణం, వర్గ సంఘాల నిర్మాణం, ప్రజా సంఘాల నిర్మాణం, కమిటీల నిర్మాణం, వృత్తి విప్లవకారుల (హోల్ టైమర్స్) ఎంపిక వంటివి అవసరం లేదని వీరు చెబుతారు. నిజానికి మార్క్స్, ఎంగెల్స్‌లు విప్లవకార్యాచరణకు విశేష ప్రాధాన్యత నిచ్చారు. శ్రామికవర్గ విప్లవ సంస్థల నిర్మాణానికి కూడా అధిక ప్రాధాన్యతనిచ్చారు.

1840లలో వైట్లింగ్ నుండి 1870లలో బకూనిన్ వరకూ కారల్ మార్క్స్‌ను పడక కుర్చీ రాజకీయ పండితుడంటూ నిందించారు. ఎంగెల్స్‌పై అలాంటి నిందా ప్రచారం చెయ్యలేదు ఎందుకంటే ఆయన యూరప్ నగరాల బారికేడ్ల తిరుగుబాట్లలో స్వయంగా పాల్గొని, గెరిల్లా వ్యూహరచయిత పాత్రను పోషించారు. అందుకే ఆనాడు ఆయన్ని 'జనరల్ ఎంగెల్స్' అని పిలిచేవాళ్ళు. జనరల్ అంటే సేనాని. అందుకే ఎంగెల్స్‌ను మినహాయించి, కేవలం మార్క్స్ మీద ప్రత్యర్థుల నిందా ప్రచారం సాగేది. ఇక్కడ పడక కుర్చీ సిద్ధాంత పాండిత్యమంటే ఏమిటో కూడా నిర్వచించుకోవాల్సి వుంది.

చేపలు పట్టడమే కాదు, వాటిని పట్టించడం కూడా చేపల వేటలో అంతర్భాగమే. దుక్కి దున్నడమే కాదు, దుక్కిదున్నే నాగలి కర్రుకై కొలిమి పని కూడా సాగు కృషిలో అంతర్భాగమే. పెట్టుబడిదారీవర్గంపై వర్గ పోరాటంలో రోడ్డెక్కిన శ్రామికవర్గమే కాదు, వారిని రోడ్డెక్కించడానికి నిర్మాణాత్మకంగా ప్రేరేపించిన విప్లవ శక్తులు కూడా ఉద్యమాచరణలో భాగస్థులే. సమ్మెల్లో పాల్గొనే వాళ్ళే కాదు, వాటికి వారిని నిర్మాణాత్మకంగా సంసిద్ధం చేసిన ఉత్ప్రేరక శక్తులు కూడా సమ్మె కార్యాచరణలో భాగస్తులే. విప్లవోద్యమ పథంలో నడిచే శ్రామికవర్గమే కాదు, వారు నడవడానికి టార్చిలైట్లు సమకూర్చిన దీపదాతలు కూడా విప్లవ పురోగమన ప్రక్రియలో భాగస్థులే. యూరప్ దేశాలలో తన కాలంలో సాగిన కార్మికవర్గ తిరుగుబాట్లకు మార్క్స్ సైద్ధాంతికంగా తగు డైరక్షన్ యిచ్చాడు. దోపిడీ శక్తుల చీకటి రాజ్యంలో తిరగబడి ముందుకు నడిచే శ్రామికుల చేతుల్లో మార్క్సిజం ఒక టార్చిలైటు అయ్యింది. బారికేడ్ల దగ్గర నిలబడి మార్క్స్ రాజ్య సాయుధ బలగాలతో ముఖాముఖిగా యుద్ధం చేయకపోవచ్చు. కానీ విప్లవ సంస్థల నిర్మాణాలకూ, విప్లవ పోరాటాలకూ మార్క్స్ సృష్టించిన విప్లవ సిద్ధాంతం వారికి దిశానిర్దేశం చేసింది. అందుకే అది పడక కుర్చీ సిద్ధాంత పాండిత్యం కాజాలదు.

కాయలు కాచిన చెట్లను ఎక్కకుండా, వాటిని ఎక్కే వాడికి సాయపడకుండా, వాటిని రాల్చడానికి రాళ్ళు విసిరే వాళ్ళ చేతికి కనీసం రాళ్ళను అందించకుండా 'ఈ చెట్టు పండ్లు ఎంతో మధురమైనవి. యీ కాయలు ఎంతో రుచికరమైనవి." అంటూ నోరూరించే ప్రసంగాలు చేయడాన్ని పడక కుర్చీ కబుర్లు అంటారు. అంతే తప్ప, తాను స్వయంగా చెట్లు ఎక్కలేకపోయినా, ఎక్కేవారి

కోసం నిచ్చెన్లు వేసేవాళ్ళు, చెట్టు ఎక్కిన వారికి కాయలు కోసే చిక్కాల్ని అందించే వాళ్ళు పడక కుర్చీ పండితులు కారు. లండన్‌లో ప్రవాస జీవితం సాగిస్తూ కూడా జర్మన్ సహా వివిధ యూరప్ దేశాల శ్రామికవర్గ విప్లవ కార్యాచరణతో మార్క్స్ రాజకీయంగా, మానసికంగా మమేకమయ్యాడు. అదేవిధంగా 1900 నుండి 1917 ఏప్రిల్ వరకూ (1905 విప్లవ కాలంలో కొద్ది నెలలు తప్ప) లెనిన్ రష్యా మొఖం చూడలేదు. కానీ విదేశాలలో ప్రవాస జీవితం సాగిస్తూనే రష్యా విప్లవ పోరాటాలలో నిరంతరం మమేకమయ్యాడు. జారిస్టు రష్యా పరిస్థితులలోనూ, విప్లవ గమనంలోనూ వచ్చే ప్రతి మలుపులో తదనుగుణ్యమైన వ్యూహం ఎత్తుగడలతో లెనిన్ విభిన్న గ్రంథాల రచన సాగించాడు. మార్క్స్ సైద్ధాంతిక, తాత్విక కృషి గానీ, లెనిన్ సైద్ధాంతిక తాత్విక కృషి గానీ నాటి విప్లవాలకు మార్గదర్శకత్వాన్ని అందించాయి. అవి పడక కుర్చీ పాండిత్యం క్రిందికి రావు.

క్షేత్రస్థాయిలో శ్రమ దోపిడీ రాజ్యం మీద ముఖాముఖిగా యుద్ధం చేసే వెయ్యిమంది విప్లవయోధుల కార్యాచరణకంటే మార్క్స్ విప్లవకృషి ఉన్నతమైనది. చీకట్లో తడుముకుంటూ యుద్ధం చేసే శ్రామికవర్గ విప్లవ వీరుల చేతికి ఆయుధాలు అందించడం కంటే టార్చిలైట్లు అందించడం కొన్నిసార్లు అత్యధిక ఉపయోగ కరమైనది. ఎటునుంచి తూటాలు వచ్చి తమను గాయపరుస్తాయో, తాము ప్రత్యర్థులపై ఎలా తుపాకులు గురి పెట్టి కాల్చాలో చీకట్లో ఆ యోధులు తడుముకుంటున్న నిర్దిష్ట పరిస్థితులలో వారికి టార్చిలైట్లు అందించడం ఎక్కువ అవసరం. బెర్లిన్, పారిస్, వార్సా, వియన్నా, బ్రసెల్స్, కొలోన్ వంటి నగరాలలో బారికేడ్ల వద్ద మార్క్స్ ఒక యోధుడిగా పాల్గొనే విప్లవ కార్యాచరణ కంటే, అట్టి విప్లవ పోరాటాలకు మార్గదర్శకత్వాన్ని అందించడం ఎక్కువ విప్లవాత్మకమైనది. అదే ప్రధానంగా నాడు మార్క్స్ చేసింది.

మార్క్స్ శత వర్ధంతి సందర్భంగా మార్క్స్ జీవిత చరిత్రను గెన్రిక్ వొల్కోవ్ రచించారు. దీనిని తెలుగులో "మహా మేధావి మార్క్స్'' శీర్షికతో 1983లో విశాలాంధ్ర పుస్తకంగా ప్రచురించింది. అందులో మార్క్స్ ఏఏ రంగాలలో నిష్ణాతుడో గ్రంథ రచయిత వొల్కోవ్ యిలా పేర్కొన్నాడు. "కారల్ మార్క్స్‌ను తత్వవేత్తగా, ఆర్థికవేత్తగా, సామాజికశాస్త్రజ్ఞునిగా, చరిత్రకారుడిగా, విప్లవకారుడిగా, ఆర్గనైజరుగా, పత్రికా రచయితగా, భాషా శాస్త్రజ్ఞుడిగా, సాహిత్యవేత్తగా, జర్నలిస్టుగా చెప్పడం పూర్తి సమర్థనీయం."

పై పేరాలో పది రూపాలలో మార్క్స్‌ను గ్రంథకర్త ఆవిష్కరించడం గమనార్హం. మార్క్స్‌ను దశావతారాలలో చూడవచ్చు. ఇందులో ఐదవది విప్లవకారుడు! ఆరవది ఆర్గనైజరు! ఈ ఐదవ, ఆరవ పాత్రలలోని మార్క్స్‌ని యీ వ్యాసంలో ప్రస్తావించుకోబోతున్నాం. చరిత్రలో పెద్దగా ప్రాచుర్యం పొందని యీ రెండు పాత్రలలో మార్క్స్‌ను గూర్చి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత వుంది.

మార్క్స్ రాజకీయ జీవితాన్ని విశ్లేషిస్తూ పై గ్రంథకర్త వొల్కోవ్ యిలా అంటాడు. "శాస్త్రీయ ప్రపంచ దృక్పథాన్ని వివరించడం అనే మహాత్కార్యానికి తన జీవితంలో చాలా భాగం అంకితం చేసిన తర్వాత ప్రత్యక్ష రాజకీయ, నిర్మాణ కృషికి కాలాన్ని వెచ్చించడానికి మార్క్స్ ఏనాడూ చింతించలేదు."

పై సూత్రీకరణలో ప్రత్యక్ష రాజకీయ, నిర్మాణ కృషి అనే పదాల ప్రత్యేకత మనకిక్కడ ముఖ్యమైనది. ఇందులో ప్రత్యక్ష రాజకీయ మరియు ప్రత్యక్ష నిర్మాణ అనే రెండు విధులున్నాయి. ప్రత్యక్ష రాజకీయమంటే విప్లవకారుడిగా, ప్రత్యక్ష నిర్మాణమంటే ఆర్గనైజరుగా మార్క్స్‌ను గ్రంథకర్త ఆవిష్కరించడం గమనార్హం!

మార్క్స్‌కు అత్యంత రాజకీయ సన్నిహితులలో కుగెల్‌మన్ ఒకరు. "పెట్టుబడి" గ్రంథరచనలో మునిగిన మార్క్స్ ఒకసారి దానికి విరామం పెట్టి, విప్లవ రాజకీయ కార్యాచరణ పైకి దృష్టిని మళ్ళించాల్సి వచ్చింది. అప్పుడు కుగెల్‌మన్ జోక్యం చేసుకున్నాడు. మార్క్స్‌ను విప్లవ కార్యాచరణలో పాల్గొనవద్దని కోరాడు. పెట్టుబడి గ్రంథ రచనను కొనసాగించాల్సిందిగా మార్క్స్‌ను ఒప్పించ జూశాడు. అందుకు ఆగ్రహించిన మార్క్స్ తన మిత్రుడైన కుగెల్‌మన్‌తో స్నేహాన్ని తెగతెంపులు చేసుకోవడానికి కూడా సిద్ధపడ్డాడు. దీన్నిబట్టి సిద్ధాంత రచనతో పాటు విప్లవకారుడిగా కూడా మార్క్స్ ప్రదర్శించిన విప్లవాసక్తిని అర్థం చేసుకోవచ్చు.

ఫ్రీడ్రిఖ్ లెస్నర్ మార్క్స్ సమకాలీన రాజకీయ మిత్రులలో ఒకడు. మార్క్స్‌తో తన జ్ఞాపకాలలో మొదటి ఇంటర్నేషనల్‌లో మార్క్స్ పనిభారం గూర్చి ప్రస్తావిస్తూ ఇలా వ్యాఖ్యానించాడు. "ఇంటర్నేషనల్ తరపున ప్రచురించబడ్డ ప్రణాళికలూ, విజ్ఞప్తులూ, ఇతర విషయాలన్నీ మార్క్స్ రాసేవాడు. అవేకాకుండా ఆయనకు చాలా విస్తృతంగా ఉత్తర ప్రత్యుత్తరాల పని వుండేది. లండన్‌కు వలస వచ్చిన పారిస్ కమ్యూనార్డులు ఆయన కాలాన్ని ఎక్కువగా హరించే వాళ్ళు".

ఆనాడు ఇంటర్నేషనల్‌లో మార్క్స్ మోసిన పనిభారం ఏ స్థాయిలో వుందో. దీన్ని బట్టి అర్థమవుతుంది.

పారిస్ కమ్యూనార్డులు ఆనాడు మృత్యుముఖం నుండి ప్రాణంతో బయటపడి లండన్ చేరిన వాళ్ళు. వారి కష్టాలపట్ల మహోన్నత మానవుడిగా మార్క్స్ స్పందించాడు. అలాంటి వ్యధార్థ బాధామయ జీవులు మార్క్స్ విలువైన కాలాన్ని హరించారంటూ మార్క్స్ సన్నిహితుడు ఓ వ్యాఖ్యానం చేశాడంటే, అట్టి బాధితుల కోసం మార్క్స్ ఎంత గొప్పగా లీనమై కృషి చేశాడో అర్థం చేసుకోవచ్చు. అవసరమైన విప్లవ కార్యాచరణ కోసం తన విలువైన సిద్ధాంత రచనలను సైతం మార్క్స్ ఎలా ప్రక్కకు పెట్టి అందులో లీనమైపోతాడో కూడా అర్థం చేసుకోవచ్చు.

'కారల్ మార్క్స్' శీర్షికతో 1878లో ఎంగెల్స్ రచించిన వ్యాసంలో "మొదటి ఇంటర్నేషనల్" లో మార్క్స్ చేపట్టిన కృషిని ఇలా వ్యాఖ్యానించాడు. 1864 నాటి "ప్రారంభోత్సవ విజ్ఞప్తి" నుండి 1871 నాటి "ఫ్రాన్స్‌లో అంతర్యుద్ధం మీద విజ్ఞప్తి" వరకూ ఇంటర్నేషనల్ యొక్క జనరల్ కౌన్సిల్ విడుదల చేసిన పత్రాలలో దాదాపు ప్రతి ఒక్క దానినీ మార్క్స్ స్వయంగా రచించాడు. ఇంటర్నేషనల్‌లో మార్క్స్ కృషిని వర్ణించడమంటే, ఆ సంఘం చరిత్రను రాయడమవుతుంది.

పైన పేర్కొన్న లెస్నర్ జ్ఞాపకాల ప్రకారమే కాక, ఎంగెల్స్ దృష్టిలో కూడా మార్క్స్ ఉత్తమ ఆర్గనైజరుగా, ఉన్నత విప్లవకారుడిగా దర్శనమిస్తాడు. ఆయన కేవలం సిద్ధాంతకర్తగా పరిమితం కాలేదు. దానిని ఆచరణలో అమలుచేసిన, అన్వయించిన ఆర్గనైజరుగా, విప్లవకారుడిగా కూడా మనకు కనిపిస్తాడు.

మాస్కోలోని 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్క్సిజం, లెనినిజం' సంకలనం చేసి, 1973లో ఏడువందల పేజీలతో మాస్కో ప్రోగ్రెస్ పబ్లిషర్స్ కారల్‌మార్క్స్ శీర్షికతో ప్రచురించిన మార్క్స్ జీవిత చరిత్ర యీ క్రింది విధంగా పేర్కొన్నది.

"ఒకవైపు ఇంటర్నేషనల్‌కు దిశానిర్దేశం చేస్తూ, మరోవైపు విస్తారమైన సైద్ధాంతిక పరిశోధనా కృషిని కొనసాగించడానికి వాస్తవానికి మార్క్స్ మానవాతీతుడుగా శ్రమించాల్సి వచ్చింది. కార్మిక నాయకులతో సమావేశాల నిర్వహణ, ఉత్తర ప్రత్యుత్తరాలు, సభలకు హాజరు కావడం, తీర్మానాల రూపకల్పన, ప్రసంగాలు చేయడం, కామ్రేడ్లకు సలహాలు ఇవ్వడం, అనేక చిన్నా పెద్దా సంస్థాగత నిర్మాణ సమస్యలను అడ్రస్ చేయడం వంటివాటితో తలపడాల్సి వచ్చేది".

నిర్విరామ, వుద్యమ నిర్మాణ బాధ్యతలలో తలమునకలైన మార్క్స్‌ను గూర్చి ఇతరులు చెప్పడమే కాదు, మార్క్స్‌లో దాగిన ఆర్గనైజరు మరియు విప్లవకారుడి పాత్రలను అర్థం చేసుకోవడానికి స్వయంగా మార్క్స్ చెప్పిన మాటలనే ఉదహరిద్దాం.

1865 వేసవిలో ఎంగెల్స్‌కు రాసిన లేఖలో మార్క్స్ ఇలా అన్నాడు. "ఆ పుస్తకం రాసే పనిలో ఉంటుండగానే ఇంకో వైపు అంతర్జాతీయ కార్మికసంస్థ ఎంతగానో నా సమయాన్ని హరిస్తున్నది. ఎందుకంటే, ఆ సంస్థకు నేనే నాయకుణ్ణి కదా! దానితోనే చాలా విలువైన నా సమయం వృథా అవుతోంది. ఫ్రెంచ్ వారితో నడి జామురాత్రుళ్ళ వరకూ జరిగిన ఎడతెగని సమావేశాలే అందుకు ఉదాహరణ".

పై లేఖలోనే తమ ప్రాణమిత్రుడైన ఎంగెల్స్‌కు తనపనిభారం గురించి మనస్సు విప్పి చెప్పుకున్నాడు. వరసగా తాను ఏఏ పని వత్తిళ్ళు అనుభవించిందీ ఎంగెల్స్‌కు మార్క్స్ ఇలా విన్నవించు కున్నాడు.

"28.2.1865 :- పారిస్ నుండి టొలాయిన్ మరియు ఫ్రీబర్‌లు వచ్చారు. ఆరోజు అర్ధరాత్రి వరకూ వాళ్ళతో సంభాషించాను. ఆ తర్వాత బొల్లేటర్‌లోని ఓ సత్రంలో మరో రాత్రి సమావేశంలో పాల్గొన్నాను. అక్కడ 200 కార్డుల మీద సంతకాలు చేశాను. 1.3.1865 :- పోలీస్ సమస్యపైన సమావేశంలో పాల్గొన్నాను. 4.3.1865 :- ఫ్రెంచి సమస్యపై సబ్ కమిటీ సమావేశంలో అర్ధరాత్రి ఒంటిగంట వరకు పాల్గొన్నాను. 6.3.1865:- అదే ఫ్రెంచ్ సమస్యపై సబ్ కమిటీ సమావేశంలో అర్ధరాత్రి ఒంటి గంట వరకు పాల్గొన్నాను. 7.3.1865 :- సెంట్రల్ కౌన్సిల్ సమావేశంలో అర్ధరాత్రి వరకూ పాల్గొన్నాను".

పై పని ఒత్తిళ్ళ వల్ల మార్క్స్ ఆరోగ్యం దెబ్బతిన్నది. అందుకే మూడు వారాలపాటు (19.3.1865 నుండి 8.4.1865 వరకు) నెదర్లాండ్‌లోని జాల్ట్ బొమ్మేల్‌లో తన బంధువుల యింటికెళ్ళి విశ్రాంతి తీసుకోవడం మరో సంగతనుకోండి. అసలు విషయమేమిటంటే, మార్క్స్ కేవలం సిద్ధాంతకర్తగా, రాజకీయ ప్రభోధకుడిగా, గ్రంథ రచయితగా, పత్రికాసంపాదకునిగా, మాత్రమే పరిమితం కాదని చెప్పడమే. ఆయన నిర్మాణ రంగంలో గొప్ప ఆర్గనైజరుగా, ఆచరణలో ఉత్తమ విప్లవకారుడిగా కూడా వర్ధిల్లాడు.

1859 డిసెంబరులో శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతాల మీద, ముఖ్యంగా మార్క్స్ వ్యక్తిత్వం మీద నిందాపూర్వక ఆరోపణలతో మాజీ ఫ్రాంక్‌ఫర్ట్ శాసన సభ్యుడు, క్షుద్రప్రజాతంత్రవాది, జర్మన్ రాజకీయవేత్త హెర్ర్ వోగ్ట్ ఒక కరపత్రం ప్రచురించాడు. (ఆయన 1859 సెప్టెంబరులోనే నెపోలియన్ బోనపార్టీ నుండి 40,000 ఫ్రాంకులు లంచంగా తీసుకున్నట్లు అనంతర కాలంలో బహిర్గతమైనది.) మార్క్స్‌ని కుట్రదారునిగా, ప్రభుత్వ రహస్య ఏజంటుగా నిందించాడు. గూఢచారి పోలీసుతో మార్క్స్ రహస్య సంబంధం కలిగి వున్నాడనీ, నకిలీ కరెన్సీని ముద్రించి వినియోగించుకుంటున్నాడనీ నిందించాడు. కమ్యూనిస్టు లీగ్ ఓ కుట్రదారీ సంస్థగా, కార్మికవర్గ సంస్థల నిర్మాణాలు కార్మికవర్గానికి వ్యతిరేకమైనవిగా నిందా ప్రచారానికి దిగాడు. ఆ స్థితిలో కార్మికవర్గ విప్లవాల విజయానికి కార్మికవర్గ విప్లవ సంస్థల నిర్మాణ ప్రాసంగికత గూర్చి ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దానిమీద మార్క్స్ దృష్టిపడింది.

నిజానికి బూర్జువా వర్గం హెర్‌వోగ్ట్‌ను ఏజంటుగా మార్చుకుని ఇలాంటి దుష్ప్రచారానికి దిగిందని మార్క్స్ భావించాడు. వోగ్ట్ ఓ వ్యక్తి కాదనీ, బూర్జువావర్గ రాజకీయ దాడికి ఓ ఏజెంటు అనీ, అందుకే దానికి సమగ్ర జవాబు ఇవ్వాలని మార్క్స్ 1860 జనవరిలో నిర్ణయించుకున్నాడు. దాస్ క్యాపిటల్ రచన కోసం సాగించే తన ఆర్థిక రచనల అధ్యయనాన్ని నిలిపివేశాడు. వోగ్ట్ కరపత్రానికి జవాబుగా సమాచార సేకరణ కోసం 50 మంది మిత్రులకు ఉత్తరాలు రాశాడు. తాను వోగ్ట్‌కు జవాబుగా రాయనున్న పుస్తకరచన గూర్చి ఎంగెల్స్‌తో చర్చించేందు కోసం 1860 ఫిబ్రవరి మధ్యలో మాంచెస్టర్ వెళ్ళాడు. అక్కడ 25.3.1860 వరకూ 40 రోజులు ఉండటం విశేషం. మార్క్స్ రాజకీయ మిత్రులు చాలామంది వోగ్ట్ రాసిన పిచ్చిరాతలకు జవాబు కోసం మార్క్స్ యింత శ్రమ, ప్రయాసలు అక్కరలేదని అన్నారు. అయినా మార్క్స్ దాదాపు ఏడాదిపాటు దీనిమీద నిర్విరామంగా శ్రమించాడు. హెర్ర్‌వోగ్ట్ శీర్షికతో కౌంటర్ కరపత్రాన్ని 1860 డిసెంబర్‌లో లండన్‌లో ప్రచురించాడు. (యూరప్‌లో కరపత్రమంటే పుస్తకమని అర్థం) ఆ పుస్తకంలో మార్క్స్ గొప్ప కార్మికవర్గ విప్లవకారుడిగా, పార్టీ ఆర్గనైజరుగా ఆవిష్కృతం కావడం విశేషం.

తాను రాస్తున్న జవాబు గూర్చి 1860 ఫిబ్రవరి 23న తన మిత్రుడు ఫ్రెలిగ్రాత్‌కు మార్క్స్ లేఖ రాశాడు. పార్టీ నిర్మాణావశ్యకతకు గల నిర్ణయాత్మక ప్రాధాన్యతను వివరించే ఉద్దేశ్యంతోనే వోగ్ట్‌కు తాను జవాబు యివ్వబోతున్నట్లు ఆ లేఖలో నొక్కి చెప్పారు. అదేవిధంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్క్సిజం-లెనినిజం రచించిన "కారల్ మార్క్స్" గ్రంథం యీ సందర్భాన్ని ఉదహరిస్తూ యిలా పేర్కొన్నది. "ఈ కౌంటర్‌కు రెండు లక్ష్యాలున్నాయి. వ్యక్తిగతంగా కాకుండా ఒక ధోరణికి ప్రతినిధిగా వోగ్ట్‌ను బహిర్గతం చేయడం మొదటి లక్ష్యం. ప్రజలలో కార్మికవర్గ విప్లవాల ఆధిక్యతను బలోపేతం చేయడం రెండవ లక్ష్యం". అది యింకా యిలా పేర్కొన్నది. "కార్మికవర్గ విప్లవసంస్థ నిర్మాణ కోసం గత వీరోచిత కార్మికవర్గ విప్లవ పోరాటాలను అందులో మార్క్స్ సాధికారిక పత్రాల ఆధారంతో నిరూపించగలిగాడు". పై కౌంటర్‌ను చదివిన తర్వాత 19.12.1860వ తేదీన మార్క్స్‌కు రాసిన లేఖలో ఎంగెల్స్ యిలా అంటాడు. "నీవు రాసిన రచనలలో ముమ్మాటికీ యిదో ఉత్తమ రాజకీయ రచనగా భావిస్తున్నాను".

మార్క్స్ కేవలం బోధకుడు, గ్రంథకర్త, సిద్ధాంతవేత్త, తత్వవేత్త మాత్రమే కాదు. వాటన్నింటి వాస్తవ అంతిమ లక్ష్యం శ్రామికవర్గ రాజ్య స్థాపనే! విప్లవాలు జయప్రదం కావడం ద్వారానే అది సాధ్యం. అందుకు కార్మికవర్గ పార్టీ నిర్మాణం కావాలి. అది మార్క్స్ లక్ష్యాలలో ఒక ముఖ్యమైనది. అందుకే ఆయన విప్లవకారుడిగా మరియు పార్టీ ఆర్గనైజరుగా తన జీవితకాలంలో అనన్య కృషి చేశాడు. యీ కౌంటర్ కరపత్రంలో అలా మార్క్స్ ఆవిష్కృతం కావడం గమనార్హం!

1842 నుండి 1883లో మరణించేంతవరకూ నాలుగు దశాబ్దాలు పైబడి మార్క్స్ రాజకీయ జీవితం సాగింది. ఈ 40 ఏళ్ళలో అత్యధిక కాలాన్ని శ్రామికవర్గ విప్లవ సిద్ధాంత రచనల కోసం వెచ్చించాడు. అందుకోసం నిరంతర అధ్యయనం చేశాడు. ఆయన చేసిన యీ అధ్యయనం, రచనలు విప్లవాచరణతో సంబంధం లేనివికావు. అవన్నీ శ్రామికవర్గ విప్లవకార్యాచరణకు ఉపకరించేవే. అట్టి విప్లవాచరణకు ఉపకరించే గ్రంథరచనలు సాగించడం పడకకుర్చీ పాండిత్యం క్రిందకు రాదు. ఫలానా వాతావరణ మండలంలో ఫలానా భూముల్లో పండించడానికి తగు వంగడాలను ప్రయోగశాలలో రూపొందించే వ్యవసాయ శాస్త్రవేత్తలు స్వయంగా వ్యవసాయదారులు కాకపోవచ్చు. కానీ వారి మేధోపరిజ్ఞానం వ్యవసాయానికి ఉపకరించేదే. అట్టి శాస్త్రవేత్తలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా

వ్యవసాయ క్షేత్ర పర్యటనలలో మరో ముందడుగు వేసి రైతాంగ సాగు కృషిలో భాగస్వాములు అయ్యారనుకుందాం. సరిగ్గా మార్క్స్ చేసిందదే. శ్రామికవర్గ విప్లవ సిద్ధాంతాన్ని సృష్టించాల్సిన రాజకీయ బాధ్యతను మార్క్స్, ఎంగెల్స్‌ల మీద ఆనాటి చరిత్ర మోపింది. ఒకవైపు దీనిని నిర్వర్తిస్తూనే, మరోవైపు తాము రచించిన రచనలను యుద్ధ క్షేత్రంలో అమలుచేసి, అన్వయించే విప్లవ కర్తవ్యాన్ని కూడా మార్క్స్, ఎంగెల్స్‌లు చేపట్టడం విశేషం! మార్క్స్ పార్టీ ఆర్గనైజరుగా, పోరాట క్షేత్ర స్థాయిలో విప్లవకారుడిగా పోషించిన పాత్రల వివరాలలోకి వెళ్తే ఒక గ్రంథమవుతుంది. అందులో కొన్ని ముఖ్యమైనవాటిని ప్రస్తావించుకోవడానికే పరిమితమవుదాం.

విప్లవ తాత్విక, సైద్ధాంతిక రచనారంగం నుంచి మార్క్స్, ఎంగెల్స్‌లు తొలిసారి విప్లవ కార్మికసంస్థల నిర్మాణం వైపుకు 1846 ప్రారంభంలో మొగ్గారు. ఇది కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక (క.పా.ప్ర) రచన కంటే రెండేండ్ల ముందుకావటం గమనార్హం. ఫలితంగా బ్రసెల్స్ కమ్యూనిస్టు కరస్పాండెన్స్ కమిటీ 1848 ప్రారంభంలో బ్రసెల్స్‌లో ఏర్పడింది. అది బ్రసెల్స్, లండన్, పారిస్, కొలోన్ వంటి కేంద్రాలకు తన శాఖలను విస్తరించుకో గలిగింది. ఏడాదికిపైగా దీని కార్యకలాపాలు సాగాయి. ఆ తర్వాత యీ కమిటీ మరియు లీగ్ ఆఫ్ జస్ట్ విలీనమై 1.6.1847వ తేదీన లండన్‌లో కమ్యూనిస్టు లీగ్ ఏర్పడింది. అది 1847 నవంబర్ మహాసభలో ఒక ప్రణాళిక రూపొందించుటకు మార్క్స్ ఎంగెల్స్‌లకు బాధ్యత అప్పగించింది. ఫలితమే 1848 ఫిబ్రవరిలో ఆవిష్కరించబడ్డ కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక! (అందులోని మూడు పదాలలో సెంటర్ పదం పార్టీ కావడం గమనార్హం! అది కేవలం సిద్ధాంత పత్రం మాత్రమే కాదు. పార్టీ నిర్మాణ లక్ష్యంతో కూడిన దిశానిర్దేశ పత్రం. అందులో అంతర్భాగంగా లండన్‌లోని జర్మన్ రాజకీయ శరణార్థులతో మార్క్స్ కృషితో జర్మన్ వర్కర్స్ ఎడ్యుకేషనల్ సొసైటి 1847 ఆగస్టు చివరలో ఏర్పడింది. ఇది 37 మంది సభ్యులతో ప్రారంభమై 100 మందికి పెరిగింది. వీరు కమ్యూనిస్టు లీగ్‌ను జపించడంలో కీలకపాత్రదారులుగా మారడం విశేషం. ఈ లీగ్ 1847 జూన్ నుండి 1852 నవంబర్ వరకు మొత్తం ఐదున్నర ఏండ్లు కొనసాగింది. ఈ కాలంలో లీగ్‌ను భూమికగా చేసుకుని కార్మికవర్గ పార్టీల నిర్మాణం కోసం మార్క్స్, ఎంగెల్స్‌లు అసాధారణ కృషిచేశారు.

కమ్యూనిస్టు లీగ్ కేంద్ర కార్యాలయం లండన్ నుండి కొలోన్‌కు మారింది. దానిపై ప్రభుత్వ దృష్టి పడింది. 1951 మేలో కొలోన్‌లోని లీగ్ కేంద్రబ్యూరో సభ్యులందరూ అరెస్టయ్యారు. 3.6.1851న జరిగిన ప్రష్యా మంత్రివర్గ సమావేశం మార్క్స్‌తో సహా నిర్బంధితులపై ఒక కుట్రకేసు బనాయించడానికి ప్లాన్ చేసింది. 1852 అక్టోబర్‌లో కుట్రకేసు విచారణ ప్రారభమైంది. మార్క్స్‌పై కేసును కోర్టు కొట్టివేసింది. ముద్దాయిలలో ఏడుగురికి కఠిన శిక్షలను విధించింది. ఆ సందర్భంగా మార్క్స్ రచించిన 'కొలోన్ కమ్యూనిస్టులపై కేసు–నిజానిజాలు' అనే పుస్తకం బాగా ప్రాచుర్యం పొందింది. అందులో కార్మికవర్గ పార్టీ నిర్మాణావశ్యకతను మార్క్స్ వివరించాడు. కొలోన్ కేసు సందర్భంగా కూడా మార్క్స్ ఓ విప్లవకారుడిగా, పార్టీ ఆర్గనైజరుగా కనిపిస్తాడు.

1840వ దశాబ్దంలో వెల్లువగా సాగిన ఇంగ్లీష్ చార్టిస్టు కార్మికోద్యమం ఆ తర్వాత స్థబ్దతకు గురైనది. 1850వ దశాబ్దంలో దాని పునర్నిర్మాణ ప్రయత్నాలు జరిగాయి. 'ది పీపుల్స్ పేపర్' పేరుతో అది పత్రికను ప్రారభించింది. దాని నేత ఎర్నెస్ట్ జోన్స్ విజ్ఞప్తితో మార్క్స్ వారికి సహకరించాడు. ఆ పత్రికకు మార్క్స్ మొత్తం 17 వ్యాసాలు రాశాడు. దాని ఎడిటింగ్‌లో కూడా సంపాదకులకు సహకరించాడు. దానిని కార్మికవర్గ విప్లవ పత్రికగా మార్చడానికి కూడా మార్క్స్ ప్రయత్నించాడు. చార్టిస్టు నేతలు 1854లో మాంచెస్టర్‌లో ట్రేడ్ యూనియన్ల మరియు వర్కర్స్ క్లబ్స్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సదస్సుకు మార్క్స్ ఒక సందేశం పంపాడు. తన సందేశంలో కూడా కార్మికవర్గ పార్టీని నిర్మించాల్సిన ఆవశ్యకతను ప్రత్యేకంగా గుర్తు చేశాడు.

లండన్‌లో కార్మిక వర్గానికి ఆదివారం సెలవు దినం. వారికి సరుకుల కొనుగోళ్ళకి వీలున్న రోజు ఆదివారమే. కానీ 1855 వేసవిలో ఆదివారం వ్యాపారంపై నిషేధం విధించింది. దానిపై నిరసనోద్యమం వెల్లువెత్తింది. మార్క్స్ లండన్‌లో ప్రవాసి. రాజకీయ ప్రదర్శనలలో పాల్గొనకూడదు. అయినా పాల్గొన్నాడు. (తృటిలో అరెస్టును తప్పించుకున్నాడు.) ఆయన ఇంట్లో కూర్చొని సిద్ధాంతరచనలకే పరిమితం కాలేదు. రోడ్డుమీద ఆందోళనా కారుడి పాత్రను కూడా పోషించడం గమనార్హం!

జర్మన్‌లోని కార్మికసంఘాలతో నిర్మాణ సంబంధాల సాధన కోసం మార్క్స్ 1861లో జర్మనీ వెళ్ళాడు. 1863 మేలో లీప్జిగ్‌లో జర్మన్ కార్మిక సంఘ స్థాపనకు కృషి చేశాడు. అదే ఏడాది పోలెండ్ ప్రజా తిరుగుబాటు జరిగింది. పోలండ్ జాతీయ విప్లవ శక్తులు

మార్క్సును కలుసుకుని మద్దతును కోరాయి. పోలండ్ దేశ భక్తులకి సంఘీభావంగా లండన్‌లో మార్క్స్ చొరవతో కమ్యూనిస్టు వర్కర్స్ ఎద్యుకేషనల్ సొసైటీ ఏర్పడింది. ఇవన్నీ మార్క్స్‌లో విప్లవకారుణి అవిష్కరిస్తాయి.

28.09.1864లో లండన్‌లో జరిగిన వివిధ దేశాల కార్మిక సంస్థల ప్రతినిధుల సభ జరిగింది. అది ఇంటర్నేషనల్ వర్క్‌మన్స్ అసోషియేషన్‌ను ఏర్పరచింది. దీనినే చరిత్రలో మొదటి ఇంటర్నేషనల్‌గా పేర్కొంటారు. అందులో మార్క్స్ ప్రారంభోపన్యాసం చేశాడు. దాని నిబంధనావళిని రూపొందించే బాధ్యత కూడా మార్క్స్‌పై పడింది. ఆ రోజునుంచి 1872 హేగ్ కాంగ్రెస్‌లో అది రద్దు అయ్యేంతవరకు సర్వం మార్క్స్ భుజ స్కంధాల మీదుగా నడిచింది. మొత్తం ఎనిమిదేండ్ల (1864-1872) కాలంలో ఇంటర్నేషనల్ నిర్వహణ సమస్తం మార్క్స్ ద్వారానే జరిగింది. వాటికి తోడు నాటి రష్యా ప్రతినిధుల కోరిక మేరకు రష్యా విప్లవసంస్థల తరపున ఇంటర్నేషనల్‌లో ప్రాతినిధ్యం వహించాల్సి వచ్చింది. ఈ అన్నింటా మార్క్స్ గొప్ప పార్టీ ఆర్గనైజరుగా కనిపిస్తాడు.

1871లో ఆవిర్భవించిన పారిస్ కమ్యూన్ పట్ల ఇంటర్నేషనల్ ప్రతినిధిగా మార్క్స్ సాగించిన పర్యవేక్షణ పాత్ర ఆదర్శప్రాయమైనది. అందులో ఓ సాహసిక విప్లవయోధుడు వున్నాడు. ఓ మహోన్నత మానవుడున్నాడు. ఓ సుశిక్షిత ఆర్గనైజరు వున్నాడు. అంతేకాకుండా కార్మికవర్గ నియంతృత్వ ప్రాతిపదికగా రేపటి సోషలిస్టు రాజ్యాలలో బూర్జువావర్గ పునరుద్ధరణకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన చారిత్రక పాత్ర గూర్చి ఓ చారిత్రిక జ్యోతిష్కుడిగా కూడా మార్క్స్ కనిపిస్తాడు. అదేవిధంగా భావి కార్మికవర్గ విప్లవాలలో రైతాంగ మైత్రీ ఆవశ్యకతను గుర్తించి ప్రభోధించిన మార్క్సును చూస్తాము. 1875లో గోధా కార్యక్రమం మీద విమర్శగా రాసిన పత్రంలో అవకాశవాద ప్రాతిపదిక మీద కమ్యూనిస్టు పార్టీల విలీనం పట్ల వ్యతిరేకతను చూస్తాము. రాజకీయ, సైద్ధాంతిక సూత్రబద్ధత పార్టీల విలీనానికి అవసరమని చాటిన నిబద్ధుణ్ణి చూస్తాము. ఇవన్నీ మార్క్స్ విప్లవ కార్యాచరణను, పార్టీ నిర్మాణ సామర్థ్యాన్ని చాటిచెబుతాయి.

మార్క్స్ ఎక్కడో లండన్‌లో నివసిస్తూ బ్రిటీష్ ఇండియా మీద సమగ్ర దృష్టితో రాజకీయ రచనలు చేశాడు. ఐర్లాండ్, పోలండ్ జాతీయోద్యమాలను లోతుగా విశ్లేషించాడు. పర్షియా, ఈజిప్టు, చైనా వగైరా దేశాల గూర్చి విశ్లేషించాడు. ఇక యూరప్, అమెరికాల గురించి చెప్పనక్కరలేదు. మార్క్స్ మెదడే ఓ ఎన్‌సైక్లోపీడియా గ్రంథం వంటిది. అయితే అది ఆచరణతో సంబంధం లేని అకడమిక్ విజ్ఞాన భాండాగారం కాదు. శ్రామిక వర్గ విప్లవాచరణతో కూడిన ప్రయోగశాల వంటిది. మార్క్స్ రాజకీయ జీవితమే ఓ విప్లవం. ఈ భిన్న దృక్కోణంలో కూడా మార్క్స్‌కు విశేష ప్రాచుర్యం కల్పిద్దాం.

పెట్టుబడిదారీ వ్యవస్థ తన గొయ్యిని తానే త్రవ్వుకుని పతనమవుతుందని మార్క్స్, ఎంగెల్స్‌లు చెప్పిన మాట నిజమే. దాని నుంచి నేడు కొందరు అపర మార్క్స్ భక్తులు పెట్టుబడిదారీ వ్యవస్థ తనంతట తానే మరణిస్తుందనే ఊహాజనిత సూత్రీకరణలు చేస్తున్నారు. పైగా వాటిని మార్క్స్‌కు అంటగడుతున్నారు. శ్రామికవర్గ విప్లవ నిర్మాణాలు అక్కరలేదని సూత్రీకరిస్తున్నారు. నేడు మరికొందరు ఊహాజనిత సోషలిస్టు స్వాప్నిక మేధావులు విప్లవ పార్టీ నిర్మాణాలతో పాటు విప్లవాల అవసరం కూడా లేకుండానే పెట్టుబడిదారీవ్యవస్థ తనకు తానే పేకమేడలా కుప్పకూలిపోతుందని నర్మగర్భంగా చెవులు కొరికే వరకు వెళ్తున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థ తన గొయ్యిని త్రవ్వే శ్రామికవర్గాన్ని సృష్టించుకుంటుందని మార్క్స్, ఎంగెల్స్‌లు చెప్పారు. ఆ గొయ్యిని త్రవ్వే పనిముట్లను కూడా వారికి అది అందుబాటులోకి తెస్తుందన్నారు. తనను గోతిలో పూడ్చిపెట్టే చారిత్రక కర్తవ్యాన్ని శ్రామికవర్గం నిర్వరిస్తుందని సూత్రీకరించారు. దీనర్థం శ్రామిక వర్గం మీద విప్లవించే కర్తవ్యం వుందని చెప్పడమే. బూర్జువావరం ఏ ఆయుధాలతో నేడు ప్రజలను పాలిస్తుందో, అవే ఆయుధాలను బూర్జువావర్గం నుంచి స్వాధీనం చేసుకోవాల్సిన చారిత్రక కర్తవ్యం శ్రామిక వర్గంమీద వుందని చెప్పడమే. అంతేతప్ప తనకు తానే బూర్జువావర్గం అస్త్రసన్యాసం చేసి గొయ్యిలోకి దిగి తమపై మట్టి కప్పించుకొని ఆత్మహత్యకు దిగదు.


సిద్ధాంతవేత్తగానే కాకుండా ఆచరణాత్మక విప్లవకారుడిగా, పార్టీ నిర్మాణ ఆర్గనైజరుగా మార్క్స్ విశేషకృషి చేశాడు. ఈ క్రమంలోనే ఆయన సృష్టించిన విప్లవ సిద్ధాంతం ఆయన చేతుల మీదుగానే ప్రయోగశాలలో తొలి పరీక్షకు గురైనది. (అనంతర కాలంలో లెనిన్ నేతృత్వంలో మరింత పరీక్షకు గురైనది) అట్టి సుసంపన్న మార్క్సిస్టు శ్రామికవర్గ విప్లవపథంలో మార్క్స్ విప్లవ కారుడిగా, ఆర్గనైజరుగా పోషించిన పాత్రకు విశేష ప్రాధాన్యత యిచ్చి ప్రచారం చేద్దాం. ❑



# 'కమ్యూనిస్టు భూతం' అనే కట్టుకథను ఎదుర్కోవడానికే ప్రణాళిక

**డి సోమసుందర్**

కమ్యూనిస్టు ప్రణాళిక 1848 ఫిబ్రవరిలో తొలిసారి వెలువడినప్పటి నుండీ దాని ప్రాసంగికత మీద చర్చ నిరంతరాయంగా కొనసాగుతూనే వచ్చింది. కమ్యూనిస్టు ప్రణాళికకు మార్క్స్, ఎంగెల్స్ సంయుక్తంగానూ, మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ ఒక్కడే రాసిన ముందు మాటలు చాలా ఆసక్తికరమైన సమాచారాన్ని అందిస్తాయి. ముందుమాటలు అన్నింటిలోనూ ప్రణాళిక చరిత్ర మనకు కన్పిస్తుంది. పలుభాషల్లోకి జరిగిన అనువాదాలు, వెలువడిన ప్రచురణలు, ప్రణాళిక వ్యాప్తి, దాని ప్రాచుర్యం, ప్రచురణకర్తల ఇబ్బందుల గురించి ఎంగెల్స్ చాలా వివరాలు వెల్లడించాడు. కమ్యూనిస్టు ప్రణాళిక వ్యాప్తిని బట్టి అంతర్జాతీయ కార్మికోద్యమ విస్తరణకు అంచనా వేయవచ్చునని ఎంగెల్స్ అంటాడు. కార్మికోద్యమం ఎదుర్కొన్న ఆంక్షలు, నిర్బంధాలు, ఆటుపోట్లు దాడుల వంటి వాటినే కమ్యూనిస్టు ప్రణాళిక కూడా చవిచూసిందని ఎంగెల్స్ వివరణలలో మనకు అర్థం అవుతుంది. కమ్యూనిస్టు ప్రణాళికలోని మౌలిక ప్రతిపాదనలు కార్ల్‌మార్క్స్ చేసినవేనని ఎంగెల్సు పదేపదే స్పష్టం చేస్తాడు. ప్రణాళిక భావనలపై వచ్చిన విమర్శలనూ, వక్రీకరణలనూ ఎదుర్కోడానికి ఎంగెల్స్ చేసిన కృషి అపారమైనదని మనకు తెలిసినదే.




కమ్యూనిస్టు ప్రణాళికకు బకూనిన్ చేసిన రష్యన్ అనువాదం తొలిసారిగా 1869లో వెలువడింది. "పశ్చిమ దేశాల వాళ్లు కమ్యూనిస్టు ప్రణాళిక రష్యన్ కూర్పును సాహిత్యరంగంలో జరిగిన వింతగా మాత్రమే గ్రహించినారు' అని మార్క్స్, ఎంగెల్స్ ప్రణాళికకు రాసిన ఒక ముందుమాటలో ప్రస్తావిస్తారు. ఆనాటి నుండీ ఈనాటి వరకూ మార్క్సిజాన్ని ఒక సాహితీ ధోరణిగా కొట్టి పారేసే ప్రయత్నం నిరంతరం కొనసాగుతూనే వచ్చింది. సమాజాన్ని మార్చే విప్లవకర సిద్ధాంతంగా మార్క్సిజాన్ని నిలబెట్టేందుకు మార్క్స్, ఏంగెల్స్, లెనిన్ వంటి మహోపాధ్యాయుల నుండి నేటి మార్క్సిస్టుల వరకూ నిరంతర పోరాటం సాగించాల్సి వస్తోంది.

సాహిత్యరంగంలో జరిగిన వింతగా రష్యన్ కూర్పును విమర్శించిన వారికి లెనిన్ చాలా గట్టి సమాధానం ఇచ్చాడు. అజ్ఞాతవాసంలో ఉన్న కాలంలోనే లెనిన్ వివిధ భాషలలో కమ్యూనిస్టు ప్రణాళికను అధ్యయనం చేసినట్లు ఆయన సతీమణి నజెద్దా కృపస్కయా ఒక వ్యాసంలో ప్రస్తావించారు. "ప్రణాళిక సారాంశాన్ని ఆయన అవగతం చేసుకోవడమే కాదు, తన రచనల్లో, లేఖల్లో సంభాషల్లో తరచూ ఉల్లేఖిస్తూ ఉండేవారని " కృపస్కయా పేర్కొన్నారు.

'కమ్యూనిస్టు ప్రణాళిక'పై వచ్చిన విమర్శలకు సమాధానంగా లెనిన్ చేసిన వ్యాఖ్యల్ని పలు సందర్భాలలో మనం చూడవచ్చు. ప్రణాళిక సారాంశాన్ని అత్యంత క్లుప్తంగా కేవలం మూడు, నాలుగు వాక్యాలలో లెనిన్ వివరించిన తీరు మనకు విస్మయం కల్గిస్తుంది, 'మహామేధావులకు సహజమైన స్పష్టతతోనూ, ప్రజ్ఞతోనూ ఈ గ్రంథం నూతన ప్రపంచ దృక్పథాన్ని స్థూలంగా చిత్రీకరిస్తుంది. ఈ నూతన ప్రపంచ దృక్పథంలో మనకూ, సామాజిక జీవితానికీ వర్తించే భౌతికవాదమూ అత్యంత సమగ్రమైన, గంభీరమైన గతితర్కం అనే అభివృద్ధి సిద్ధాంతమూ ఇమిడి ఉంది. వర్గ పోరాటాన్నీ, నూతన సమాజ సృష్టికర్త అయిన కార్మికవర్గం యొక్క చారిత్రాత్మక అంతర్జాతీయ విప్లవ పాత్రనూ వివరించే సిద్ధాంతం ఉంది" అని లెనిన్ పేర్కొన్నాడు.

కార్ల్‌మార్క్స్ సిద్ధాంత చారిత్రక భవితవ్యం శీర్షికలో 1913 మార్చిలో ప్రావ్దాలో లెనిన్ రాసిన ఒక వ్యాసం కమ్యూనిస్టు ప్రణాళిక సారాంశపు పద్ధతిని వివరిస్తుంది. "మార్క్సిస్టు సిద్ధాంతానికి అఖండమైన, క్రమబద్ధమైన వివరణ కమ్యూనిస్టు ప్రణాళికలో ఉంది. ఈనాటికీ అదే అత్యుత్తమ వివరణ" అంటాడు లెనిన్.

"మార్క్సిజం తాను అవతరించినప్పటి నుండో ప్రపంచ చరిత్రలో జరిగిన అన్ని దశలలోనూ మార్క్సిజానికి కొత్త ధృవీకరణనూ, కొత్త విజయాలనూ తెచ్చింది. రాబోయే చారిత్రక దశలో కార్మికవర్గ సిద్ధాంతంగా మార్క్సిజం ఇంకా గొప్ప విజయాన్ని సాధించ బోతున్నది. కమ్యూనిస్టుప్రణాళిక ప్రవచించిన కార్మికవర్గ విప్లవాత్మక పాత్ర నూతన యుగాన్ని ఆవిష్కరిస్తుంది" అని లెనిన్ పేర్కొన్నాడు.

## కమ్యూనిస్టు భూతం

కమ్యూనిజం ఒక భూతంగానూ, తిట్టుపదంగాను భావిస్తున్న రోజుల్లో మార్క్స్, ఎంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికను రచించారు. ప్రణాళిక ఎత్తుబడిలోనే కమ్యూనిస్టు భూతం అనే కట్టుకథను ఎదుర్కోవడానికి, కమ్యూనిస్టు లక్ష్యాలను వివరించడానికీ ప్రణాళిక అవసరమయ్యిందని మార్క్స్, ఎంగెల్స్ స్పష్టం చేశారు. కమ్యూనిస్టు ప్రణాళిక ఉపోద్ఘాతం "యూరోపును ఒక భూతం ఆవహించింది, కమ్యూనిజం అనే భూతం' అనే వాక్యంతో మొదలవుతుంది. "ఈ భూతాన్ని ఉచ్చాటన చేయడానికి యూరోపులోని అధికార శక్తులన్నీ ఒక పవిత్రకూటమిగా ఏర్పడినాయి" అంటూ కొనసాగుతుంది. యూరోపులోని పురాతన అధికార శక్తులుగా పోప్, మెటర్నిక్, గీజో, ఫ్రెంచిరాడికల్ పార్టీ వాళ్ళు, జర్మన్ గూఢచారులు వంటి వారిని మార్క్స్, ఎంగెల్స్ ప్రస్తావించారు.

కమ్యూనిజమే ఒక శక్తిగా యూరోపియన్ శక్తులు గుర్తించడం వల్లనే కమ్యూనిజాన్ని అణిచివేయడానికి, పవిత్ర కూటమి ఏర్పాటయ్యిందనీ వారు వివరిస్తారు. కమ్యూనిజం భూతం అనే కట్టు కథను ఎదుర్కోవడానికి వివిధ జాతుల కమ్యూనిస్టులు లండన్‌లో సమావేశమై ప్రణాళికను రచించారని మార్క్స్, ఎంగెల్స్ పేర్కొన్నారు. 1848 ఫిబ్రవరిలో ప్రణాళిక వెలువడిన నాటి నుండీ 'కమ్యూనిస్టు భూతం' ప్రపంచమంతటా ఆవహించిందనీ, ఈనాటి అధికార శక్తులన్నీ 'పవిత్రకూటమి'గా ఏర్పడుతూనే ఉన్నాయన్న వాస్తవాన్ని గుర్తించాల్సి ఉంటుంది.

కమ్యూనిజం అంతరించిపోయిందనీ, ప్రణాళిక కేవలం సాహిత్యలోకపు వింత మాత్రమేనని చెప్పే అధికారశక్తులు వీలైన అన్ని చోట్లా కమ్యూనిస్టు భూతం అనే కట్టుకథను ఇప్పటికీ కొనసాగిస్తున్నాయన్న సంగతిని కూడా గమనించాల్సి ఉంది.

## నాలుగు భాగాలుగా ప్రణాళిక

మార్క్స్, ఎంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికను నాలుగు భాగాలుగా రాసారు. 'బూర్జువాలు–కార్మికులు' శీర్షికతో రాసిన మొదటి భాగంలో గతితార్కిక, భౌతికవాద దృష్టిలో చరిత్ర గమనాన్ని, సమాజ పరిణామక్రమాన్ని వివరించారు. ఆయా చారిత్రక యుగాల్లోని ఉత్పత్తి సాధనాలు, వర్గ సంబంధాలను నిర్వచిస్తాయనీ, అయితే నిరంతరం అభివృద్ధి చెందే లక్షణం కలిగిన ఉత్పత్తి సాధనాలు తమ పురోభివృద్ధి క్రమంలో పాతవర్గ సంబంధాలను యధాతథంగా కొనసాగించలేని పరిస్థితులను సృష్టిస్తాయని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. 'ఉత్పత్తి సంబంధాలు పురోభివృద్ధి చెందే క్రమంలో పాత ఉత్పత్తి సంబంధాల చట్రం అనివార్యంగా బద్ధలవుతుందని, పాత పాలకవర్గాల స్థానంలో కొత్త పాలకవర్గం ఆవిర్భవిస్తుందనీ'' మార్క్స్, ఎంగెల్స్ పేర్కొన్నారు.

ఈ కీలక ప్రతిపాదన ఆధారంగా "చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర" అనే సూత్రీకరణ చేస్తారు. గడచిన చరిత్రలో ఆదిమ, ఫ్యూడల్ సమాజాలలో జరిగిన చారిత్రక పరిణామాన్ని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. పాత సమాజ గర్భంలోనే నూతన సమాజ శక్తులు ఆవిర్భవిస్తాయనీ, మధ్యయుగాల నాటి వర్గాలను వెనక్కి నెట్టి ఆధునిక బూర్జువా వర్గం ఆవిర్భవించి పైచేయి సాధించడానికి దారి తీసిన పరిస్థితులను మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు.

పారిశ్రామిక విప్లవంతో ఆధునిక పరిశ్రమల ఏర్పాటు, సమాచార, రవాణా సాధనాల విస్తరణ ప్రపంచమార్కెట్‌ను సృష్టించిన వైనాన్ని వారు ఒక క్రమానుగత రీతిలో వివరిస్తారు. ఆధునిక పారిశ్రామికాభివృద్ధి ఫలితంగా ఉత్పత్తి సాధనాలు అపారంగా వృద్ధి చెందుతున్న తీరు, అంతవరకూ కొనసాగుతూ వచ్చిన ఫ్యూడల్ సంబంధాల చట్రం దానిని అడ్డుకునే క్రమంలో ఉత్పత్తి సాధనాల అభివృద్ధికీ, పాత ఉత్పత్తి సంబంధాలకూ మధ్య అనివార్యమైన ఘర్షణ తలెత్తుతుందన్న పర్యవసానాన్ని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. దోపిడీ స్వభావం కలిగిన పాత ఉత్పత్తి సంబంధాలను రద్దు చేస్తే తప్ప కొత్త ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందలేని పరిస్థితి నుండి ఒక సహజమైన పర్యవసానంగా వర్గ ఘర్షణ, దాని నుండి విప్లవం అనివార్యమని మార్క్స్, ఎంగెల్స్ స్పష్టంగా చెబుతారు,

ఉత్పత్తిసాధనాలనూ, ఉత్పత్తి విధానాన్ని నిరంతరం అత్యంత వేగంగా మార్చుకోలేని పక్షంలో ఆధునిక బూర్జువా వర్గం మనుగడ సాధించలేని పరిస్థితి తలెత్తుతుందని అందువల్ల బూర్జువా వర్గం ఉత్పత్తి సాధనాలను విప్లవీకరిస్తుందని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. ఫ్యూడలిజం నుండి బూర్జువా వర్గ ఆవిర్భావానికి ఉత్పత్తి విధానమూ, మారకపు విధానమూ పునాది అయినట్లే బూర్జువా వర్గం కూడా మరో కొత్త పరిణామానికి జన్మనిస్తుందని

వారు వివరిస్తారు. లాభాల కోసం చేసే అధికోత్పత్తి తర్వాత ఉత్పత్తి సంక్షోభంగా మారుతుందనీ, పర్యవసానంగా జరిగే వాణిజ్య యుద్ధాలు మొత్తం బూర్జువా ఆర్థికవ్యవస్థనే సంక్షోభంలోకి నెట్టేస్తాయని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. సంక్షోభ పరిష్కార యత్నాలు మరిన్ని నూతన సంక్షోభాలను, సృష్టిస్తాయని, బూర్జువా వర్గం కొత్త రూపాలలో వచ్చే సంక్షోభాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కోల్పోతుందని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. ఫ్యూడలిజంపై తాను ఎక్కుబెట్టిన ఆయుధాలే తనపై తిరగబడే పరిస్థితులను బూర్జువా వర్గం ఎదుర్కోవాల్సి వస్తుందని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు.

## బూర్జువా వర్గానికి సమాధి కట్టే కార్మికవర్గం

పాత ఉత్పత్తి శక్తులూ, పాత ఉత్పత్తి సంబంధాల గర్భం నుండి నూతన శక్తిగా కార్మికవర్గం ఆవిర్భవించే క్రమాన్ని మార్క్స్, ఎంగెల్స్ చాలా వివరంగా తెలియచేస్తారు. కార్మికవర్గం పని ఉంటేనే జీవించే వర్గమనీ, పెట్టుబడిని వృద్ధి చేయగలిగేంత వరకే పని దొరికే వర్గమని, ఆధునిక పారిశ్రామిక సమాజంలో యంత్రాల వృద్ధి వల్లా, శ్రమ విభజన వల్లా కార్మికుడు కూడా ఒక యంత్రంగా మారిపోవడంతో పాటు తానే ఒక సరుకుగా రూపాంతరం చెందుతాడనీ, ఉత్పత్తి సాధనాల వృద్ధీ, మార్కెట్ల విస్తరణ కార్మికుడి జీవితాన్ని పూర్తిగా అనిశ్చితం చేస్తుందని, వేతనాలు పడిపోతాయనీ, పని సైతం ఒక భారంగా తయారవుతుందనీ మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. కార్మికుడు తాను చేసే పనికి పరాయివానిగా మారిపోయే వైనాన్ని వారు వివరిస్తారు.

అయితే కార్మిక వర్గం పుట్టుకతోనే బూర్జువా వర్గంతో పోరాడటం మొదలు పెడుతుందనీ, ముందు వ్యక్తులుగా, తర్వాత బృందాలుగా పోరాడతారని, తొలుత తమ పాత వృత్తి పనివాడి హోదా పునరుద్ధరణ కోసం పోరాడిన కార్మికుడు తర్వాత కాలంలో ఒక వర్గంగా రూపొందే పరిణామం జరుగుతుందని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. పోరాటంలో ఎగుడు దిగుడు క్రమాన్ని అధిగమించి ఒక అంతర్జాతీయ వర్గంగా ఒక విప్లవకర వర్గంగా బలోపేతమవుతుందని వారు వివరిస్తారు. కార్మికవర్గానికి పోయే సదుపాయాలు గానీ అధికారం గానీ, ఆస్థి గానీ లేనందున అదొక విప్లవకర వర్గం అవుతుందని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు.

## కార్మికులు, కమ్యూనిస్టులు

కమ్యూనిస్టు ప్రణాళికలోని రెండో భాగం కార్మిక వర్గానికీ, కమ్యూనిస్టులకు గల సంబంధాన్ని వివరించడానికి మార్క్స్, ఎంగెల్స్ వినియోగించారు. విప్లవం అంటే బూర్జువా వర్గపాలనను కూలద్రోసి కార్మిక వర్గమే పాలకులు కావడమని మార్క్స్, ఎంగెల్స్ స్పష్టం చేస్తారు. బూర్జువా వర్గం తన ప్రయోజనాలకు అనుగుణమైన భావాలను, నియమాలనూ, శాసనాలను రూపొందించి ప్రాచుర్యంలోకి తెస్తుంది. ఆ రకంగా సమాజాన్ని నియంత్రిస్తూ ఉంటుంది. సొంత ఆస్థినీ, స్వేచ్ఛనూ, కుటుంబాన్ని కీర్తించే భావాలను వ్యాప్తి చేస్తుంది. బూర్జువా వర్గ ప్రయోజనాలనే సామాజిక ప్రయోజనాలుగా నమ్మించే ప్రయత్నం చేస్తుంది. సొంత ఆస్థి వ్యవస్థ కారణంగా ఏర్పడుతున్న అసమానతలనూ, వివక్షలనూ, దోపిడీని కప్పిపుచ్చడానికి బూర్జువా విలువలను సార్వత్రిక విలువలుగా చిత్రీకరిస్తుంది.

కమ్యూనిస్టు ప్రణాళికలోని రెండో భాగంలో కార్మికవర్గ కర్తవ్యాన్నీ, కమ్యూనిస్టు సమాజంలో తీసుకోవాల్సిన చర్యలనూ వివరిస్తూ కమ్యూనిస్టులపై బూర్జువా వర్గం చేసే విమర్శలకూ, ఆక్షేపణలకూ మార్క్స్, ఎంగెల్స్ గట్టి సమాధానాలు ఇస్తారు. చరిత్ర క్రమం అనేది తన దారిన పోయే ఒక ప్రభావ వంతమైన శక్తి, అది నిరంతరం పురోగమిస్తూనే ఉంటుంది. అది అనివార్యంగా మొత్తం సమాజాన్ని ఒక నైతికాదర్శం వైపు పయనిస్తూనే ఉంటుంది. ఆ చారిత్రక పరిణామ క్రమంలో కార్మికవర్గం, కమ్యూనిస్టులు నెరవేర్చే పాత్రను మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. సొంత ఆస్థి పునాదిపై ఏర్పడిన ఉత్పత్తి సంబంధాలు బూర్జువా విలువలను రూపొందిస్తాయని, అయితే అవి సమాజ పురోభివృద్ధికి అవరోధాలుగా మారతాయని దాంతో బూర్జువా ఉత్పత్తి సంబంధాల చక్రాన్ని కార్మికవర్గం బద్ధలు కొడుతుందని మార్క్స్, ఎంగెల్స్ వివరిస్తారు. దోపిడీని, వివక్షనీ, అసమానతలని అంతం చేయడానికి బూర్జువా ఉత్పత్తి సంబంధాలను కూలద్రోయాలని వారు స్పష్టం చేస్తారు. సొంత ఆస్థి, వ్యక్తి స్వేచ్ఛ, కుటుంబ విలువలు వంటి అంశాలలో బూర్జువా వర్గ కుటిల వాదనలని మార్క్స్, ఎంగెల్స్ చావుదెబ్బ కొడతారు. బూర్జువా వర్గ ఆక్షేపణలకు మార్క్స్, ఎంగెల్స్ ఇచ్చే సమాధానాలు తీవ్రమైన వ్యంగ్యం, పరిహాసం, ఎగతాళి, కఠినమైన విమర్శనా స్వరంతో నిండి ఉంటాయి.

“వర్గాలూ, వర్గ విభేదాలు గల పాత బూర్జువా సమాజం స్థానంలో ఒక నూతన సమాజం ఆవిర్భవిస్తుందనీ, ప్రతి ఒక్కడూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందినప్పుడే అందరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందగల ఒక నూతన సమాజం అనీ’ మార్క్స్, ఎంగెల్స్ స్పష్టం చేస్తారు.

## సోషలిస్టు సాహిత్యంపై విమర్శ

మూడో భాగంలో అప్పటి వరకూ వ్యాప్తిలో ఉన్న సోషలిస్టు సాహిత్యంలోని లోపాలపై, పరిమితులపై మార్క్స్, ఎంగెల్స్ గట్టి విమర్శలు చేస్తారు. 'సోషలిస్టు-కమ్యూనిస్టు సారసత్వం' శీర్షికతో రాసిన ఈ భాగంలో వారు ఫ్యూడల్ సోషలిజం, పెటీ బూర్జువా సోషలిజం, జర్మన్ సోషలిజం లేక అసలు సోషలిజం, యథాతథ వాద సోషలిజం లేక బూర్జువా సోసలిజం, విమర్శనాత్మక ఊహాస్వర్గ సోషలిజం, కమ్యూనిజం వంటి రకరకాల సోషలిస్టు వక్రీకరణ ధోరణులను సమీక్ష చేస్తారు.

కమ్యూనిస్టు ప్రణాళిక ముందు మాటల్లో ఈ నానా రకాల సోషలిస్టులను గురించి ఎంగెల్స్ వివరిస్తాడు. ప్రణాళికను సోషలిస్టు ప్రణాళిక అనకుండా 'కమ్యూనిస్టు ప్రణాళిక' అని అనడానికి గల కారణాలను ఎంగెల్స్ విశదీకరించాడు. '1847లో సోషలిస్టులంటే ఊహాస్వర్గ సిద్ధాంతాలను అనుసరించే వాళ్లు. అనగా ఇంగ్లండులో ఓవెన్ అనుయాయులు, ఫ్రాన్సులో ఫోరియర్ అనుయాయులూ అప్పటికే కేవలం ముఠాల స్థితికి దిగజారి అంతరించి పోతూ ఉండినారు. మరోవైపున నానా రకాల సామాజిక దొంగ వైద్యులు పెట్టుబడికీ, పెట్టుబడిదార్ల లాభాలకూ ఏమీ ప్రమాదం లేకుండా రకరకాల చిట్కాలతో అన్ని రకాల సామాజిక బాధలు తీరుస్తామనేవారు, కార్మికవర్గ ఉద్యమంతో సంబంధం లేకుండా విద్యావంతుల తోడ్పాటు కొరకే మొగ్గు చూపించే వాళ్ళు" అంటూ ఎంగెల్స్ వారి అసలు రంగును బైట పెట్టాడు. అందువల్ల ప్రణాళిక పేరులో 'సోషలిస్టు' పదాన్ని వాడలేదని ఎంగెల్స్ స్పష్టం చేస్తాడు.

కేవలం రాజకీయ విప్లవాలతో సమస్యలు పరిష్కారం కావన్న అవగాహనతో సమూలమైన సమాజ పునర్నిర్మాణం కావాలన్న డిమాండ్ చేసే ఒక భాగం కార్మికులు కమ్యూనిస్టులమని చెప్పుకునే వారు. సోషలిజం అంటే బూర్జువావర్గ ఉద్యమంగానూ, కమ్యూనిజం అంటే కార్మికోద్యమంగానూ భావించేవారని ఎంగెల్స్ వివరిస్తాడు. "కార్మికుల విమోచన కార్మికవర్గమే సాధించాల్సిన కార్యం అనే దృఢమైన అభిప్రాయం కల్గి ఉండటం చేత ప్రణాళికకు 'కమ్యూనిస్టు ప్రణాళిక' పేరును ఖరారు చేయడంలో ఎలాంటి సంకోచం లేకుండాపోయిందని ఎంగెల్స్ స్పష్టం చేస్తాడు. ఈ విమర్శ నేపథ్యంలో ప్రణాళికలోని మూడో భాగాన్ని చూడాల్సి వుంటుంది.

ఇక నాలుగో భాగం ఆనాటికి ఉనికిలో వున్న వివిధ ప్రతిపక్ష పార్టీల ఎడల కమ్యూనిస్టులు తీసుకోవాల్సిన వైఖరి గురించి వివరిస్తుంది. "సకలదేశాల ప్రజా తంత్ర పార్టీల మధ్య ఐకమత్యమూ, అభిప్రాయస్వామ్యమూ నెలకొల్పడానికి కమ్యూనిస్టులు కృషి చేస్తారు" అంటూ మార్క్స్, ఎంగెల్స్ మార్గదర్శనం చేసారు. 'వర్తమాన సాంఘిక పరిస్థితులను బలవంతంగా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధిస్తాయని వాళ్లు బహిరంగంగానే ప్రకటిస్తారు" అని స్పష్టం చేసారు. "కార్మికులు పోగొట్టుకునేదేమీ లేదు, తమ శృంఖలాలను తప్ప, వాళ్ళు సాధించాల్సింది ఎంతైనా ఉంది, సకలదేశ కార్మికులారా ఏకం కండి' అంటూ మార్క్స్, ఎంగెల్స్ ప్రణాళికను ముగించారు.

## ప్రణాళిక ప్రాసంగికత

'కమ్యూనిస్టు భూతం' కట్టుకథ ఇంకా ప్రపంచ దేశాల్లో కొనసాగుతూనే వుంది. "సాహిత్యవింత"గా ఇప్పటికీ వ్యాఖ్యానిస్తున్న వారు ప్రబలంగానే ఉన్నారు. కమ్యూనిజం అంతమై పోయిందనీ, మార్క్స్‌కు సమకాలీనత లేదని, న్యూడీల్, వెల్ఫేర్‌స్టేట్ వంటి మార్పులతో పెట్టుబడిదారీవ్యవస్థ సుస్థిరంగా కొనసాగుతుందని వాదించేవారు ఎక్కువే ఉన్నారు. అయితే పెట్టుబడిదారీ సమాజాల్లో తరచూ విరుచుకుపడే ఆర్థిక సంక్షోభాలకు వారి వద్ద సమాధానం లేదు. వ్యవస్థలు కుప్ప కూలినప్పుడు ఈ సంప్రదాయ ఆర్థికవేత్తలు కళ్ళు తేలేస్తున్నారు 2008 సబ్ ప్రైమ్ సంక్షోభం మరోసారి పెట్టుబడిదారీ వ్యవస్థ సామర్థ్యంపై సందేహాలను లేవనెత్తింది. గేలప్ పోల్ సంస్థ 'సమస్యలు పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిష్కారమవుతాయా, సోషలిస్టు సమాజంలో పరిష్కారమవుతాయా' అనే ప్రశ్నకు సమాధానాలు సేకరించింది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది సోషలిజం వైపు మొగ్గు చూపినట్లు గేలప్ ప్రకటించింది. బ్రిటన్‌కు చెందిన సుప్రసిద్ధ మార్క్సిస్టు సాహితీ విమర్శకుడు టెర్రీ ఈగల్టన్ 'కమ్యూనిస్టు ప్రణాళిక'పై వివిధ విశ్వవిద్యాలయాల్లో చేసిన ప్రసంగాలకు విశేష స్పందన లభించింది. 1869 నాటి పశ్చిమ దేశాల 'సాహితీ లోకంలో వింత' వ్యాఖ్యను టెర్రీ ఈగల్టన్ 2019లో ప్రస్తావించి గట్టి సమాధానం ఇచ్చారు. 'కమ్యూనిస్టు ప్రణాళిక సాహితీ లోకంలో వింత ఎంత మాత్రమూ కాదు, ఉత్పత్తి శక్తుల వృద్ధితో పాటు అనివార్యంగా సంభవించే ఉత్పత్తి సంబంధాల మార్పును వివరించే విప్లవ సిద్ధాంతం' అంటూ టెర్రీఈగల్టన్ చెప్పిన వివరణ కమ్యూనిస్టు ప్రణాళిక ప్రాసంగికతను యువతరానికి తెలియచెప్పింది.

అమెరికాలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో రేడియో, టీవీ

షోలలో మార్క్సిజం గురించి ప్రసంగిస్తున్న రిచర్డ్ డేవిడ్ ఉల్ఫ్ యువశ్రోతల్ని ఆకట్టుకుంటున్నారు. "పెట్టుబడిదారీ విధానంలోని అంతర్గత కల్లోలాలు, వైషమ్యాలు, ఘర్షణలు వ్యవస్థకు ప్రాణాంతకంగా మారతాయని" 1848లోనే కమ్యూనిస్టు ప్రణాళిక వివరించిందన్న సంగతిని రిచర్డ్ తన విద్యార్థులకు వివరిస్తున్నారు,

అమెరికాలో సుప్రసిద్ధమైన విశ్వవిద్యాలయాల్లో కార్ల్‌మార్క్స్ కేపిటల్ గ్రంథం గురించి డేవిడ్ హార్వే నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. మార్క్సిజంపై కొత్త కొత్త పుస్తకాలు వెలువడుతున్నాయి. కమ్యూనిస్టులు కాని ఆర్థికవేత్తలు, సామాజికవేత్తలు సైతం మార్క్సిజం గురించి, కమ్యూనిస్టు ప్రణాళిక గురించి జరుగుతున్న చర్చల్లో భాగస్వాములు అవుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికాలో అమలు చేసిన 'మెకార్తీయిజం' ఫలితంగా కొన్ని దశాబ్దాల పాటు మార్క్స్‌ను ఒక నిషిద్ధ వ్యక్తిగా పరిగణించారు. కొన్ని తరాలను మార్క్సిజానికి, కమ్యూనిజానికి దూరంగా ఉంచారు. అయినప్పటికీ తమ వ్యవస్థలో తలెత్తే సంక్షోభాలకు పరిష్కారాలు లభిస్తాయన్న ఆర్తితో అనేక మంది నేడు మార్క్స్ రచనలను చదువుతున్నారు. అమెరికా, యూరోపు సమాజాల్లో 'కమ్యూనిస్టు భూతం' గురించిన కట్టుకథల్ని 'కమ్యూనిస్టు ప్రణాళిక' తోనే ఎదుర్కొనే ప్రయత్నం మరోసారి మొదలయ్యింది. 'కార్మికవర్గ విజయమూ, బూర్జువా వర్గ పతనమూ అనివార్యమే' అంటూ మార్క్స్, ఎంగెల్స్ చెప్పిన చారిత్రక జోస్యాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రపంచంలో ప్రయత్నం జరుగుతోంది. 'కమ్యూనిస్టు ప్రణాళిక' ప్రాసంగికత నేడు మరింతగా ముందుకు వస్తోందని పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ❑

## తత్వశాస్త్రాన్ని భువికి దించిన మార్క్స్

**(31వ పేజీ తరువాయి)**

ఎలా ఎంత కారణమో... ఎవరికి వాళ్లం ఆలోచించుకోవచ్చు.

"తమ ఉనికికి అవసరమైన సాధనాలను సామాజికంగా ఉత్పత్తి చేసే క్రమంలో, మనుషులు నిర్దిష్టమైన, అత్యవసరమైన సంబంధాలలో ప్రవేశిస్తారు. ఈ ఉత్పత్తి సంబంధాలు మనుషుల కోరికల నుంచి స్వతంత్రంగా ఉంటాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో నిర్దిష్ట దశకు అనుగుణంగా ఉత్పత్తి సంబంధాలు ఉంటాయి. ఉత్పత్తి సంబంధాల సగటు మొత్తం (అగ్రిగేట్) సమాజం నిర్మాణాన్ని ఏర్పరుస్తుంది. ఈ వాస్తవిక పునాది నుంచి న్యాయ, రాజకీయ ఉపరితల నిర్మాణం తలెత్తుతుంది. నిర్దిష్ట సామాజిక చైతన్య రూపాలు దానికి అనుగుణంగా ఉంటాయి. మనిషి ఉనికికి అవసరమైన భౌతిక సాధనాలను ఉత్పత్తి చేసే విధానమే మొత్తం సామాజిక, రాజకీయ, బౌద్ధిక జీవితాన్ని నిర్ణయిస్తుంది. మనుషుల ఉనికిని వారి చైతన్యం నిర్ణయించడం కాదు, దానికి విరుద్ధంగా, వారి సామాజిక ఉనికియే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. అభివృద్ధిలోని ఒక దశలో, సమాజం యొక్క భౌతిక ఉత్పత్తి శక్తులకు అప్పటి ఉత్పత్తి సంబంధాలతో, లేక, చట్టం పరిభాషలో చెప్పాలంటే అప్పటి వరకు తమను నిర్దేశించిన ఆస్తి సంబంధాలతో వైరుధ్యం ఏర్పడుతుంది. అప్పటి వరకు ఉత్పత్తి శక్తుల అభివృద్ధి రూపాలుగా ఉండిన ఉత్పత్తి సంబంధాలు కాస్తా అభివృద్ధికి సంకెళ్లుగా మారిపోతాయి. అప్పుడు ఒక సామాజిక విప్లవ యుగం తలుపులు తెరుచుకుంటుంది. ఆర్థిక పునాది మారడంతో మొత్తం ఉపరితల నిర్మాణం దాదాపు త్వరితంగా మారిపోతుంది. ఆర్థిక ఉత్పత్తి పరిస్థితులలో వచ్చే భౌతిక విప్లవానికి న్యాయం, రాజకీయం, మతం, సాహిత్యం కళలు, తాత్విక భావనలలో మార్పులకు- అంటే, భావజాలంలో మార్పులకూ మధ్య తేడా ఉంటుంది. ఆర్థిక విప్లవాన్ని చాల శాస్త్రీయంగా అంచనా వెయ్యొచ్చు. భావజాలం రంగంలో మనుషులు తమ సంఘర్షణ గురించి తాము చైతన్యవంతులై, పోరాడుతారు. వ్యవస్థ పరిధి లోపల అభివృద్ధి చెందడానికి వీలున్న ఉత్పత్తి శక్తులన్నీ అభివృద్ధి చెందకుండా, ఎప్పుడూ ఏ సామాజిక వ్యవస్థా నాశనం కాదు. అలాగే, పాత వ్యవస్థ గర్భంలో తమ ఉనికికి తగిన భౌతిక పరిస్థితులు పరిపక్వం కాకుండా, మునుపటి కన్న ఉన్నతమైన కొత్త ఉత్పత్తి సంబంధాలు ఉనికి లోనికి రావు. అందువల్ల మానవ జాతి ఎప్పుడూ తాను పరిష్కరించగలిగిన సమస్యలనే చేపడుతుంది. కాస్త నిఘాగా చూస్తే మనకే తెలుస్తుంది, సమస్య పరిష్కారానికి అవసరమైన భౌతిక పరిస్థితులు అప్పటికే ఉన్నప్పుడే, లేదా, కనీసం ఆ పరిస్థితులు తయారవుతున్నప్పుడే సమస్య అనేది ముందుకొస్తుంది. విహంగ దృష్టితో చూస్తే ఆసియాటిక్, ప్రాచీన, భూస్వామ్య, ఆధునిక బూర్జువా ఉత్పత్తి విధానాలు ముందడుగులు అని భావించవచ్చు. అందువల్ల, నేటి బూర్జువా సాంఘిక వ్యవస్థతో, చరిత్ర పూర్వ సమాజం (ప్రీహిస్టరీ) ఒక ముగింపుకు వచ్చింది."

మార్క్స్, ('క్రిటిక్ అఫ్ పొలిటికల్ ఎకానమీ', 1859). ❑

# మార్క్స్ వాంగ్మయంలో '18వ బ్రూమెయిర్' స్థానం



కొండూరి వీరయ్య

చరిత్ర అంటే గతానికి చెందినదే. ఈ విషయాన్ని ఎవ్వరూ తిరస్కరించరు. వర్తమానం కూడా చరిత్రే అంటే మాత్రం కొందరు కళ్లెగరేస్తారు. నేటిలోనే నిన్నటి మూలాలు ఒదిగి ఉంటాయనీ, రేపటి ఆశలు పొదిగి ఉంటాయని శక్తివంతంగా విశ్లేషించిన వ్యక్తి కారల్ మార్క్స్. లూయీ బోనపార్తె అటువంటి వర్తమాన చరిత్రపై శక్తివంతమైన వ్యాఖ్యానం. అత్యంత ఉద్విగ్నభరితమైన పరిణామాలను, వాటికి మూలధారమైన పాత్రదారులు, ఆయా పాత్రధారులు ముందుకు తెచ్చిన డిమాండ్లు, వాటికున్న వర్గ నేపథ్యం, భావి కార్మికోద్యమ విప్లవాలు పాటించాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన ఎత్తుగడలు వంటి ఎన్నో అంశాలను వంద పేజీల్లో సమగ్రంగానూ, సమర్ధవంతంగానూ వివరించాడు మార్క్స్.




పరిమితంగానే అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా వాయువేగంతో జరిగిన పరిణామాలు ముగిసీ ముగియగానే మార్క్స్ తన అంచనాలు, అవగాహనలు మదింపు వేసి ఈ రచన రూపంలో మనముందుంచాడు. ఈ పరిణామాలు జరిగిన నేటికి దాదాపు 173 ఏళ్లవుతోంది. ఈ 173 ఏళ్లలో చరిత్ర పరిశీలన, పరిశోధన, అధ్యయనం, విశ్లేషణ ఎన్నో కోణాల్లో విస్తరించింది. ఆధునిక యూరప్ చరిత్ర గురించీ, ఆధునిక ఫ్రాన్స్ చారిత్రక పరిణామాల గురించీ విలక్షణమైన పరిశోధనాత్మక రచనలు కోకొల్లలుగా వచ్చాయి. అందుబాటులో ఉన్న అటువంటి కొన్ని రచనల్లో విశ్లేషించిన అంశాలు, మన తరం ముందుంచిన వివరాలను మార్క్స్ రాసిన లూయీ బోనపార్తెలోని వివరాలు, విశ్లేషణలతో పోల్చి చూస్తే నేటి తరం చరిత్రకారులకంటే మార్క్స్ విశ్లేషణా సామర్థ్యమే ఓ మెట్టు పైనుందని చెప్పకతప్పదు.

మార్క్స్‌తో పాటు విక్టర్ హ్యూగో, ప్రౌధాన్లు కూడా లూయీ బోనపార్తె కుట్ర గురించి అప్పట్లోనే రాశారు. అయితే హ్యూగో రచన ఆద్యంతమూ బోనపార్తె గురించిన వ్యంగ చిత్రణే తప్ప వాస్తవిక పరిణామాలు, వాటి కార్యాకారణ సంబంధాల గురించిన వ్యాఖ్యానం కాదు. ప్రౌధాన్ రచన బోనపార్తె పట్ల సానుభూతితో రాసిందే తప్ప యథాతథ పరిణామాల వాస్తవిక మూలాల ప్రాతిపదికన సాగిన విశ్లేషణ కాదు. బోనపార్తెను కేంద్రంగా చేసుకుని సాగిన ఈ రెండు రచనల కంటే భిన్నంగా సాగింది మార్క్స్ రచన. ఓ ఆధునిక ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు చరిత్ర పడిన పురిటినొప్పులు ఒక్కొక్కటీ లెక్కించి మరీ రాసిన రచన. భూస్వామ్య కబంధ హస్తాలనుండి ఫ్రాన్స్ తనను తాను విముక్తి చేసుకునే క్రమంలో బూర్జువా విప్లవానికి తెరతీస్తున్న వైనాన్ని ఎంత దగ్గరగా చూశాడో మార్క్స్ అంతే ఆసక్తికరంగా అక్షరబద్ధం చేశాడు. పరిణామాల యదార్ధ గాధను యథాతథంగా ఇస్తే మిగిలిన చరిత్రకారులకు మార్క్స్‌కు మధ్య తేడా ఏముంటుంది? అందుకే సగానిపైగా పేజీల్లో ఆధునిక ఫ్రాన్స్ నిర్మాణం కోసం సాగిన ప్రయత్నంలో ఎవరు కథానాయకులు, ఎవరు ప్రతినాయకులు, ఎవరు అల్లాటప్పాగాడు, జుట్టుపోలిగాడెవరు, వదురుబోతులెవరు, మధ్యలోనే అస్త్రసన్యాసం చేసిందెవరు, అస్త్రసన్యాసాన్ని ప్రేరేపించిన కారణాలు, పరిస్థితులు ఏమిటి వంటి వివరాలన్నింటినీ ఆయా పాత్రధారుల వర్గనేపథ్యం నుండి వివరించాడు. ఇటువంటి ఉదిగ్నపరిణామాలు చోటు చేసుకుంటున్న తరుణంలో కార్మికవర్గం ఏ విధంగా మాటల పటాటోపానికి బోల్తా కొట్టే ప్రమాదం ఉంది, 1848 తిరుగుబాటుకు నాయకత్వం వహించి ఫ్రాన్స్ చరిత్రలో నూతన అధ్యాయాన్ని ఆవిష్కరించిన కార్మికవర్గం 1851 వచ్చేసరికి పరాజిత వర్గంగా ఎందుకు మారింది. వీరితో పాటు నడిచిన మిత్రులెవరు, నడుస్తున్నట్లు నటించిన కపటవేషగాళ్లెవరు అన్న వివరాలను కూడా అంతే లోతుగా వివరించాడు కాబట్టే మార్క్స్ మార్క్స్ అయ్యాడు.

లూయీ బోనపార్టె గ్రంథం మొదటిసారి 1852లో అచ్చయ్యింది. తిరిగి 1869లో అమెరికాలో పునర్ముద్రణ జరిగింది. ఈ 17 ఏళ్ల వ్యవధిలో అందుబాటులోకి వచ్చిన సమాచారం ఆధారంగా తొలి ప్రతిలో ఉన్న కొన్ని అంచనాలను, అభిప్రాయాలను సవరించుకున్నట్లు 1869 పునర్ముద్రణకు రాసిన ముందుమాటలో మార్క్స్ పేర్కొన్నాడు. రెండో ప్రతికి రాసిన ముందుమాటలో "ఫ్రాన్స్ లో జరిగిన అంతర్యుద్ధం ఓ అర్భకుడిని సైతం అధినేతగా నిలిపి ఉంచేందుకు దారితీసిన పరిస్థితులు, సంబంధాలను విశ్లేషించటమే" తన రచన ఉద్దేశ్యమని స్పష్టం చేశాడు. మూడో జర్మన్ ప్రతికి రాసిన ముందుమాటలో కూడా ఏంగెల్స్ ఇదే విషయాన్ని వక్కాణిస్తాడు. బోనపార్టె రచనలో మార్క్స్ చరిత్ర అధ్యయనానికి ఉపయోగించిన పద్ధతినే తర్వాతి కాలంలో మార్క్సిస్టు అధ్యయనకారులు చారిత్రక భౌతికవాద అధ్యయన పద్ధతిగా క్రోడీకరించారు. లెజిటమిస్టులు భూస్వామ్య వర్గానికి ప్రతినిధులుగా ఉంటే ఓర్లియానిస్టులు అప్పుడప్పుడే ఆవిర్భవిస్తున్న ద్రవ్య పెట్టుబడికి, పరిశ్రమాధిపతులకు, వ్యాపారస్తులకు ప్రతినిధులుగా ఉన్నారు. ఈ వర్గాల ఆశలు, ఆకాంక్షల గురించి ప్రస్తావిస్తూ మార్క్స్ "నిర్దిష్ట సామాజిక పరిస్థితుల్లో ఉనికిలోకి వచ్చిన వేర్వేరు ఆస్తిరూపాలే పునాదిగా ఏర్పడే ఉపరినిర్మాణంలో విలక్షణమైన భావోద్వేగాలు, భ్రమలు, ఆలోచించే అలవాట్లు, జీవితం గురించిన దృక్పథాలు ఏర్పడతాయి. ఒక వర్గం తమ భౌతికపునాదులపై ఆధారపడి నిర్దిష్ట సామాజిక సంబంధాలకు ఉమ్మడిగా రూపురేఖలద్దుతుంది. అటువంటి ఆలోచనలు ఎవరి ద్వారా వ్యక్తీకరించబడతాయో, వారికి వారసత్వంగా అందిన సారస్వతం, విద్యాబుద్ధులు కారణంగా నిజంగా తమ ఆలోచనలు, కార్యాచరణలే అటువంటి సామాజిక సంబంధాలను నిర్మిస్తాయని భ్రమపడుతుంటారు." అంటూ మేధోవర్గం పాత్రను సిద్ధాంతీకరిస్తాడు.

కార్మికవర్గం, ప్రజాతంత్ర బూర్జువా వర్గం, పెటీబూర్జువా వర్గాల మధ్య ఉమ్మడి కార్యాచరణ విషయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి హెచ్చరిస్తూ ఈ కూటమి మొత్తం సమాజాన్ని విప్లవీకరించే యజ్ఞంలో భాగస్వామి కావాలని అలాకాక ఈ యజ్ఞం నుండి వైదొలగితే మొత్తం విప్లవోద్యమం వెనకపట్టు పడుతుందని హెచ్చరించాడు. కార్మికవర్గం ప్రైవేటు లావాదేవీల నడుమ ఈ వ్యవస్థ ఏర్పర్చిన కట్టుబాట్లు, నియంత్రణలకు లోబడి వ్యవహరించినంత కాలం విముక్తి సాధించలేదని కూడా 1851 నాటి బోనపార్టె తిరుగుబాటు, దాని పర్యవసానాలను పరిశీలించిన తర్వాత వ్యాఖ్యానిస్తాడు. ఈ రచనలో కార్మికవర్గ ఉద్యమం ఎదుర్కొంటున్న అనేక ఎగుడుదిగుడులు, ఎత్తుగడల విషయంలో తలెత్తే గందరగోళాలకు సంబంధించిన అనేక విశ్లేషణలు, వ్యాఖ్యానాలు, అంచనాలు, సూత్రీకరణలు కనిపిస్తాయి. ప్రపంచ కార్మికోద్యమం 173 ఏళ్ల తర్వాత నేటికీ ఇవే సమస్యలను ఎదుర్కొంటోంది. అందువల్ల ప్రపంచీకరణ దశలో కార్మికోద్యమం, వామపక్ష ఉద్యమ నిర్మాతలు తప్పక చదవాల్సిన రచన ఇది.

కార్మికవర్గ విప్లవాలకు బూర్జువా విప్లవాలకు మధ్య ఉన్న వ్యత్యాసం గురించి చెప్తూ కార్మికవర్గ విప్లవాలు "నిరంతరం ఆత్మ విమర్శ చేసుకుంటాయి. పురోగంచే క్రమంలో నిరంతరం అవాంతరాలు ఎదుర్కొంటూ ఉంటాయి. ఉద్యమాన్ని పునర్నిర్మించ టానికి తాజా చర్యలు చేపడుతుంది. తొలి విశ్లేషణలు, బలహీనతలు, అన్యమనస్కంగా తీసుకునే నిర్ణయాలను చీల్చి చెండాడటానికి వెనకాడవు." అని గుర్తు చేస్తాడు. తమ శత్రువులను కూలదోసామని అనుకుంటున్నపుడు వర్గ శత్రువులు నేలను తాకిన ప్రతిసారీ రెట్టించిన బలంతో తలపడటానికి సిద్ధమై పైకి లేస్తారు. ఈ ప్రయత్నంలో చివరకు వెనుతిరగలేని స్థితికి నెట్టబడినప్పుడు కార్మికవర్గం విజయదుంధుభి మోగిస్తుందన్న భరోసా ఇస్తాడు ఇక్కడ ఓ మహాభారతంలోని భీమ జరాసంధుల ద్వంద్వ యుద్ధం గురించిన కథ చెప్పాలి. అజ్ఞాతవాసంలో ఉన్న సమయంలో భీముడు జరాసంధుతో తలపడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. శ్రీకృష్ణుడు భీముడికి తోడుగా వెళ్తాడు. ద్వంద్వ యుద్ధంలో జరాసంధుడిని కిందపడేసి శరీరాన్ని నిలువునా చీల్చి విసిరేస్తాడు. అయినా జరాసంధుని శరీర భాగాలు రెండూ ఒకటవుతుంటాయి. అప్పుడు కృష్ణుడు జరాసంధుని శరీరముక్కలను వ్యతిరేక దశలో పడేయాలని సూచిస్తాడు. అదేవిధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుత్థానానికి లాభార్జన ద్వారాలు తెర్చుకునే మార్గాల కోసం నిరంతరం వెతుకుతుంది. లాభాలు పిండుకునే మార్గాలు ఒక్కోటీ మూసుకుపోతున్నప్పుడు గంగవెర్రులెత్తుతుంది. నేటి కమ్యూనిస్టు ఉద్యమం ప్రయాణించాల్సిన మార్గం ఇదే. పెట్టుబడిదారీ వ్యవస్థ లాభాలు పోగుచేసే మార్గాలకు గండికొట్టటానికి ఉన్న అవకాశాలు పరిశీలించాలి. ఆ దిశగా ఉద్యమ నిర్మాణం ఉండాలి.

ఈ నూతన విప్లవోద్యమం 16వ శతాబ్దికి చెందిన పార్లమెంటరీ యుద్ధాలకూ, 18వ శతాబ్దిలో ప్రపంచాన్ని ఓ ఊపు ఊపిన ఫ్రెంచి విప్లవాల కంటే భిన్నమైది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఈ నూతన విప్లవోద్యమం తన లక్ష్యాలు, స్ఫూర్తికి తగ్గట్లు నూతన వ్యక్తీకరణలు ముందుకు తేవాల్సి ఉంటుందని

గుర్తు చేస్తాడు. మార్క్స్ మాటల్లో "19వ శతాబ్దిలో చోటుచేసుకునే సార్వత్రిక విప్లవం తనదైన నమూనాల కోసం కృషి చేయాలి. పాతకాలపు మూఢనమ్మకాల నుండి సంపూర్ణంగా తనను తాను విముక్తి చేసుకునేంత వరకూ విప్లవ సాధన దిశగా నిజమైన పనిని ప్రారంభించలేదు. ఇంతకు పూర్వం జరిగిన విప్లవాలన్నీ తమ ప్రాధాన్యతను నిలబెట్టుకోవటానికి గతకాలపు చరిత్రపుటలు తవ్వి మరీ తనను పోలిన పాత్రలను వెతుక్కున్నాయి. 19వ శతాబ్ది విప్లవాలు గతాన్ని పూర్తిగా పూడ్చి పెట్టాలి. అప్పుడే తన నిజమైన అర్థాన్ని సంతరించుకుంటాయి. పాతకాలపు విప్లవాల్లో సారం సున్నా. రూపం మిన్న. ఆధునిక విప్లవంలో రూపం కంటే సారం నిండుగా ఉంటుంది." అంటూ భవిష్యత్తు విప్లవోద్యమపు గతిని, గతిశీలతను, గమ్యాన్ని, దానికి కావల్సిన మార్గాలను ప్రతిపాదిస్తాడు ఈ రచనలో.

ప్రజాతంత్రవాదులమని, మిగిలిన వారికంటే తామే అసలైన విప్లవకారులమనీ ఫోజులు కొట్టేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ రచనలో మార్క్స్ హెచ్చరిస్తాడు. మన దేశంలో ఎన్నో శక్తులు తమను మించిన విముక్తి సిద్ధాంతం మరోటి లేదనీ, తమను మించిన విప్లవకారులు మరొకరు లేరని తరచూ వాదించుకోవటం చూస్తూనే ఉన్నాము. నిజమైన విప్లవశక్తుల లక్ష్యాలు, కార్యక్రమాలు జనబాహుళ్యానికి చేరకుండా ఈ శక్తులు అడ్డుగోడగా నిలబడతాయి. ఇటువంటి కుహనా ప్రజాతంత్రవాదుల గురించి హెచ్చరిస్తూ మార్క్స్, "ప్రజాతంత్రవాదులు తమ నినాదాల ధాటికి పాలకవర్గాల కోటగోడలు కుప్పకూలతాయని నమ్ముతారు. ఈ తరగతి పాలకవర్గ హర్మ్యాల ముందు నిలబడి నినాదాలిచ్చేటప్పుడు నిజంగా అలా జరగాలని కూడా కాంక్షిస్తారు. అయితే ఇవన్నీ శత్రువులను భయపెట్టడానికి చేసే తాటాకు చప్పుళ్లు మాత్రమే. అసలైన గడువు ఎదురుపడినప్పుడు వీరంతా తుపాకులు కింద పారేసి అస్త్రసన్యాసం చేస్తారు." అని హెచ్చరిస్తాడు. ఈ హెచ్చరికలు నేడు దేశంలో ఎవరెవరికి వర్తిస్తాయో నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం దేశంలోని వామపక్ష శక్తులందరికీ ఉంది.

సమాజమార్పుకు సంస్కరణలు కూడా ఓ మార్గమేనని భావించే వారిని ఎండగడుతూ మార్క్స్ ఈ రచనలో చాలా ఘాటైన వ్యాఖ్యలు చేస్తాడు. వాస్తవిక సమాజంలో వర్గపోరాటం చేయటానికి సుముఖంగా లేని శక్తులు సంస్కరణల ద్వారా కూడా సహజం మారుతుందని, అటువంటి సంస్కరణోద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిస్తుంటారని మార్క్స్ ఎద్దేవా చేశారు. దోపిడీకి గురవుతున్న వర్గాలు తక్షణం నేడు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి వర్తమాన వర్గసమాజంలో అటువంటి సమస్యల నుండి పీడిత వర్గాలకు ఏ మాత్రం ఉపశమనం కల్గించవచ్చో అన్న దిశగా ప్రయత్నం చేయటానికి బదులు శాశ్వత లక్ష్యానికి సంబంధించిన కార్యాచరణ మీదనే కేంద్రీకరించటం విముక్తిక కార్యాచరణలో భావవాదానికి నిదర్శనంగా మార్క్స్ భావిస్తాడు. ఈ దిశగా 1848–1851 మధ్య కాలంలో ఫ్రాన్స్‌లో కార్మికవర్గ తిరుగుబాటుకు నాయకత్వం వహించిన నాయకులు ఇచ్చిన నినాదాలు, వాటి ప్రాసంగికతల గురించి వివరంగా చర్చిస్తాడు. కళ్ల ముందున్న శత్రువును అంగుళం కూడా 'కదిలించలేని స్థితిలో సైతం ఈ సంస్కరణలవాదులు ఎలా భ్రమలకు లోనవుతారో వివరిస్తూ "తమ శత్రువును తుత్తునియలు చేశామని భావిస్తారు. ఎందుకంటే ఊహాల్లో వీళ్లు వర్గశత్రువుపై విజయం సాధించి ఉంటారు. భవిష్యత్తులో సుందరలోకం నిర్మాణం కోసం పని చేస్తున్నామని చెప్తూ నేటి నిర్దిష్ట వాస్తవాన్ని విస్మరిస్తూ ఉంటారు." అంటూ విప్లవకారులు ఇచ్చే నినాదాలు దైనందిన జీవన సమస్యల పరిష్కారానికి మార్గం చూపేవిగా ఉండాల్సిన అవసరాన్ని మనముందుంచుతాడు.

ఐక్యసంఘటనల గురించి ఇచ్చిన వివరణ మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ఏయే భౌతిక రాజకీయ వాస్తవికతల ఆధారంగా ఏయే తరహా సంకీర్ణాలు ఉనికిలోకి వస్తాయో తెలుసుకోవాలంటే మార్క్స్ రాసిన ఈ వాక్యాలు తప్పక చదవాలి. "ఏకతాటిగా నిలిచిన బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా సోషల్ డెమొక్రటిక్ ఐక్య సంఘటన ఉనికిలోకి వస్తుంది. 1848 జూన్ రోజుల తర్వాత తమకు సముచిత ప్రతిఫలం దక్కలేదనీ, తమ భౌతిక ప్రయోజనాలు ప్రమాదంలో పడ్డాయనీ, ఈ ప్రయోజనాలు గ్యారంటీ చేసే ప్రజాతంత్ర హామీలను ప్రతీఘాత విప్లవం సవాలు చేస్తుందని గుర్తించిన పెటీబూర్జువాలు కార్మికులతో జతకట్టారు. మరోవైపు 1793 నాటి ఫ్రెంచి విప్లవంలో కీలక పాత్ర పోషించి భూస్వామ్యవ్యవస్థ శిధిలాలను కూలదోసి బూర్జువా వర్గ ప్రయోజనాలకు పెద్దపీట వేసేందుకు కృషి చేసిన బూర్జువా వర్గం లోని ఓ భాగం ఈ కాలంలో తన ప్రాబల్యాన్ని పునఃస్థాపించుకుంది. సోషలిస్టులతో సయోధ్య కుదుర్చుకున్నది. ఉభయపక్షాలూ ఓ ఉమ్మడి ఎన్నికల ప్రణాళికను ప్రకటించి ఉమ్మడి అభ్యర్థులను రంగంలోకి దించింది" అని మార్క్స్ వివరిస్తారు. వివిధ వర్గాలు తమ ప్రయోజనాల సాధన కోసం సంకీర్ణాల్లో చేరేటప్పుడు తమ డిమాండు సంకీర్ణపు సార్వత్రిక డిమాండ్లుగా ఎలా మారుస్తాయో ఈ రచనలో మార్క్స్ వివరిస్తాడు.

ఆధునిక ప్రజాస్వామ్యం సకల సమానత్వాలూ సార్వత్రికం చేస్తుంది. దీనికి స్థానంలో కార్మికవర్గ నియంతృత్వం అల్పసంఖ్యాకులైన దోపిడీదారులపై అధిక సంఖ్యాకులైన పీడితులు పెత్తనం చేస్తారని చెప్తుంది. బూర్జువా ప్రజాస్వామ్యం అందరికీ ఆస్తి సంపాదించుకునేందుకు సమానావకాశాలు రాజ్యాంగబద్ధం చేసింది. దీనికి భిన్నంగా కార్మికవర్గ విప్లవం వ్యక్తిగత ఆస్తిని రద్దు చేయటమే తన మౌలిక లక్ష్యమని ప్రతిపాదిస్తుంది. ఇటువంటి కొన్ని తేడాలు చూసినప్పుడు సాధారణ ప్రజల్లో కార్మికవర్గ ప్రజాస్వామ్యం కంటే బూర్జువా ప్రజాస్వామ్యం మెరుగన్న భ్రమలకు లోను కావటం, కనీస హక్కులు గ్యారంటీ చేస్తుందన్న విశ్వాసంతో ఉండటం సహజపరిణామమే. అటువంటి బూర్జువా ప్రజాతంత్ర కార్యక్రమానికి ఉన్న పరిమితుల గురించి వివరిస్తూ మార్క్స్ "సోషల్ డెమొక్రసీ ప్రజాతంత్ర గణతంత్ర వ్యవస్థల డిమాండ్లు ముందుకు తెస్తుంది. పెట్టుబడి, వేతనం అన్న రెండు భిన్న ధృవాలను రూపుమాపటం ఇటువంటి డిమాండ్ల లక్ష్యం కాదు. ఈ రెండు భిన్న ధృవాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని సంయమనంగా మార్చటం, పరస్పర వ్యతిరేకతను ఓ పరిధికి లోబడి ఉండేలా కట్టడి చేయటమే ఈ డిమాండ్ల లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించటానికి అనేక మార్గాలు ప్రతిపాదించ వచ్చు. రూపంలో విప్లవకరమైన నినాదాలే తెరమీద కనిపించ వచ్చు. కానీ సారంలో మాత్రం బూర్జువావర్గ నిజ స్వరూప స్వభావాల్లో ఏమాత్రం మార్పు ఉండదు. సమాజాన్ని ప్రజాతంత్ర పద్ధతుల్లో పెటీబూర్జువా వర్గం నాయకత్వంలో సాధించాలని ప్రతిపాదిస్తుంది." అంటూ బూర్జువా రాజ్యాంగాల డొల్లతనాన్ని బట్టబయలు చేస్తాడు.

విముక్తి పట్ల మధ్యతరగతి పెటీ బూర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికి ఉన్న దృక్పథాల్లో తేడాను కూడా మార్క్స్ ఈ రచనలో ప్రస్తావిస్తాడు. భూస్వామ్య వ్యవస్థ కబంధ హస్తాల నుండి తమను తాము విముక్తి చేసుకోవటం అంటే సమాజాన్ని విముక్తి చేయడమే అన్న భావనను బూర్జువావర్గం ప్రాచుర్యంలో పెట్టింది. అదే విధంగా బూర్జువా సమాజంలో పెటీబూర్జువావర్గం సమాజ నిర్మాణంలో తానున్న నిర్దిష్ట పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో తన విముక్తే సమాజ విముక్తిగా భావిస్తుంది. అయితే ఈ విముక్తి వర్గపోరాటం అవసరం లేకుండానే సాధించాలన్నది పెటీ బూర్జువావర్గం ఆశిస్తుంది. మిగిలిన అన్ని అంశాల్లో సారూప్యత ఉన్నా వర్గపోరాటం లేనిదే తమ విముక్తి సాధ్యం కాదని కార్మివర్గం భావిస్తుంది. ఈ పోరాటంలో కార్మికవర్గం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమలాంటి వారందరితో జట్టు కడు తుందని చెప్తాడు. ఇదే రెండింటి మధ్యా ఉన్న మౌలిక వైరుధ్యమని మార్క్స్ విశ్లేషిస్తాడు. బోనపార్తె అధికారాన్ని హస్తగతం చేసుకునే క్రమంలో అప్పటివరకు కార్మికవర్గ శక్తులతో జత కట్టిన పలు వర్గాలు ప్లేటు ఫిరాయించి బోనపార్తె పక్షాన చేరటానికి దారితీసిన పరిణామాలు, ఆయా వర్గాలను ప్రభావితం చేసిన అంశాలు, ఆలోచనలు విశ్లేషించే సందర్భంలో మార్క్స్ ఈ వ్యాఖ్య చేస్తాడు.

పారిస్ కార్మికవర్గాన్ని బోల్తా కొట్టించటానికి ఉనికిలోకి వచ్చిన రాజ్యాంగ పరిషత్ గురించి మార్క్స్ విశ్లేషణను గమనిస్తే 1905 రష్యాలో తొలి విప్లవయత్నానికి 1917 ఫిబ్రవరి పరిణామాలకు మధ్య జరిగిన అనేక సంఘటనలు కళ్ల ముందు మెదులుతారు. ఫిబ్రవరి 1848 కార్మికవర్గ తిరుగుబాటు స్ఫూర్తికి ప్రతిఘటనగా రాజ్యాంగ పరిషత్ ఉనికిలోకి వచ్చిందనీ, జాతీయ విప్లవాన్ని బూర్జువా మార్గంలో బంధించాలన్న లక్ష్యమే రాజ్యాంగ పరిషత్ ఉనికిలోకి రావటానికి కారణమన్న మార్క్స్ విశ్లేషణ వలసదేశాల విముక్తి సందర్భంగా పాలకవర్గాల మధ్య కుదిరిన ఒప్పందాలు, పార్లమెంటరీ వ్యవస్థల నిర్మాణంపై కొత్త వెలుగులు ప్రసరించాల్సిన అవసరాన్ని ముందుకు తెస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు దారితీసిన స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను కూడా మననం చేసుకుంటే భారత స్వాతంత్ర్యోద్యమం లో నిర్దిష్ట దశలోని ఉద్యమం, డిమాండ్లకు, వాటి వెనకనున్న వర్గ ప్రయోజనాలకు మధ్య ఉన్న సంబంధాన్ని పునః పరిశీలించాల్సిన ఆవశ్యకత కూడా కనిపిస్తోంది.

రాజ్యాంగ పరిషత్తులు, పార్లమెంటరీ వ్యవస్థలు కార్మికవర్గ ప్రతిఘటనకు వేదికలు కాలేకపోతే ముస్సోలిని, హిట్లర్ వంటి ఫాసిస్టు శక్తులు ఈ వేదికలను ఎలా వశపర్చుకుంటారో అటువంటి శక్తుల వద్ద ఉన్న చట్టబద్ధ, చట్టవిరుద్ధ శక్తుల పొందిక ఎలా పని చేస్తుందో మార్క్స్ విశ్లేషణ చూస్తే సమకాలీన ప్రపంచం లో మితవాద రాజకీయాలను అధ్యయనం చేస్తున్నప్పుడు బోనపార్తె గురించి మార్క్స్ అంచనాలు గుర్తుకురావటం ఖాయం. బోనపార్తె ప్రైవేటుసేనల గురించి వివరిస్తూ "డిసెంబరిస్టులు కేవలం బోనపార్తె వ్యక్తిగత సైన్యం. బోనపార్తా వెళ్లే అన్ని చోట్లకూ ఈ బృందాలు ముందుగానే వెళ్లి మకాం వేస్తాయి. బోనపార్తె సభలకు జనసమీకరణపై దృష్టి సారిస్తాయి. చక్రవర్తి... చక్రవర్తి అని నినాదాలు ఇస్తూ అదే జనాభిప్రాయం అన్నట్లు వ్యవహరించేవారు. (పోలీసుల లోపాయికారీ సహకారంతో) రిపబ్లికన్లను గేలి చేయటం వీరి పని. డిసెంబరిస్టుల సంఘం అన్నది బోనపార్తె

☞ మిగతా 71వ పేజీలో

# గోథా కార్యక్రమంపై విమర్శ

## కార్మికవర్గ పార్టీలకు కరదీపిక




**డి వి వి ఎస్ వర్మ**

గోథా కార్యక్రమంపై మార్క్స్ చేసిన విమర్శలోని అంశాలను ప్రస్తావించడానికి ముందు దానికి గల నేపథ్యాన్ని తెలుసుకోవాలి.

జర్మన్ సోషల్ డెమోక్రసీకి మార్క్స్ – ఎంగెల్స్‌లు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యతను యిచ్చారు. అది అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖపాత్ర పోషిస్తుందని భావించారు. అందువల్ల దాని నాయకత్వం విప్లవకర విధానాలను అనుసరించాలని, ఎలాంటి పెడధోరణులను అంగీకరించ కూడదని భావించారు.

1860 దశకంలో జర్మనీలో రెండు కార్మికవర్గ పార్టీలు ఏర్పడ్డాయి. 1863లో జనరల్ అసోసియేషన్ ఆఫ్ వర్కర్స్ సంస్థ ఏర్పడింది. దీనికి లాసెల్లీ నాయకుడు. లాసెల్లీ భావజాలం రూపంలో సోషలిస్టుగా కనిపిస్తుంది. సారంలో అది బూర్జువా చట్రం పరిధిలో వుంటుంది. ఆయనకు కమ్యూనిస్టు భావజాల పునాది లేదు. పదాడంబరమూ, మాటలగారడీతో కార్మికుల్ని ఆకర్షించడం తప్ప సూత్రబద్ధ వైఖరి గలవాడు కాదు. 1864లో ఆయన మరణించినా ఆయన అనుయాయులు అదే పద్ధతిని కొనసాగించారు.




రెండోది సోషల్ డెమోక్రటిక్ పార్టీ. ఇది 1869లో ఐసినాచ్ పట్టణంలో ఏర్పడింది. అందువల్ల దీనిని ఐసినాచ్ బృందంగా పిలుస్తారు. లీబ్‌క్నెఖ్ట్ బృందంతో ఇది ఏర్పడింది. ఈ పార్టీతో మార్క్స్ – ఎంగెల్స్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. వారు లాసెల్లీ బృందంతోనూ సంబంధాలను కలిగివున్నారు.

జర్మనీ ఏకీకరణపై ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర విభేదాలు వుండేవి. బిస్మార్క్ నాయకత్వంలో జర్మన్ ఏకీకరణ జరిగిన తర్వాత ఈ విభేదాలు కనుమరుగయ్యాయి. కార్మికవర్గ ప్రయోజనాల కోసం ఈ రెండు బృందాలు ఏకం కావాలన్న నినాదం ముందుకు వచ్చింది. కార్మికులలో ఇది బలమైన అభిప్రాయంగా రూపొందింది. దీంతో ఈ పార్టీల నాయకత్వాలు కూడా విలీనం కావాలని భావించాయి.

మార్క్స్ – ఎంగెల్స్‌లు ఈ విలీనానికి వ్యతిరేకం కాదు. అయితే ఆ విలీనం సూత్రబద్ధంగా, సిద్ధాంత పునాది మీద జరగాలని భావించారు.

1875 మార్చిలో మార్క్స్ –ఎంగెల్స్‌లతో సంప్రదించకుండా ఐసినాచ్ బృందం ముందుకు సాగింది. మే నెలలో గోథాలో ఈ విలీనసభ జరపాలని, దానికి ఒక కార్యక్రమ ముసాయిదాను రూపొందించారు. ఈ కార్యక్రమం ఆసాంతం, లాసెల్లీ భావజాల దారిద్ర్యం ఆధారంగా వుంది. ఐసినాచ్ బృందం సభ్యుడు బ్రాకే ఈ కార్యక్రమ ముసాయిదాను మార్క్స్ అభిప్రాయాల కోసం పంపించాడు.

విలీనం కోసం రూపొందించిన గోథా కార్యక్రమం ముసాయిదాపై మార్క్స్ స్పందిస్తూ అందులోని పదాడంబరం వెనుక వున్న అసలు రూపాన్ని బహిర్గతం చేస్తూ తన విమర్శను, వ్యాఖ్యలను బ్రాకేకు ఒక కవరింగ్ ఉత్తరంతో కలిపి పంపించాడు. దీనిని లీబ్‌క్నెఖ్ట్, బీబెల్ మరో ఇద్దరికి చూపించమని తర్వాత దానిని తనకి తిరిగి పంపించమని రాశాడు. ఐసినాచ్ బృందంలో ఐదుగురికి మాత్రమే ఈ విమర్శ చేరింది. కాని వారు దీనిని పట్టించుకోలేదు. ఎందుకంటే ఒకసారి విలీనం జరిగితే, ప్రజాస్వామ్యబద్ధమైన అంతర్గత చర్చల ద్వారా అన్నీ పరిష్కారం అవుతాయన్న భ్రమలో పడ్డారు.

ఈ రాతప్రతి మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్‌కి చేరింది. 1891లో జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఎర్ఫర్ట్‌లో జరిగే మహాసభలో కొత్త కార్యక్రమాన్ని ఆమోదించనున్నట్టు ప్రకటించింది. ఆ పార్టీ గతంలో చేసిన తప్పునే తిరిగి చేస్తుందేమో నన్న ఆందోళనతో మార్క్స్ రాసిన "గోథ కార్యక్రమంపై విమర్శను" ఎంగెల్స్ పుస్తకంగా ప్రచురించాడు. ఈ పుస్తకం జర్మన్ పార్టీలో

కలకలం రేపింది. దాంతో ఎర్‌ఫర్ట్ సభలో కొత్త కార్యక్రమాన్ని మార్క్స్ విమర్శ ఆధారంగా రూపొందించి ప్రకటించారు. కొత్త కార్యక్రమంపై ఏంగెల్స్ తన సంతృప్తిని ప్రకటించాడు. అలా విస్మరణకు గురైన అత్యంత ప్రతిభావంత రచన అంతిమంగా విజయాన్ని సాధించింది

మార్క్స్ గోథా కార్యక్రమంపై చేసిన విమర్శ నాలుగు భాగాలుగా వుంది. 1891లో ఏంగెల్స్ దీనిని పుస్తకంగా ప్రచురించారు. తన ముందుమాటతో పాటు, ఆయన బీబెల్‌కు రాసిన ఉత్తరం, బ్రీకేకు మార్క్స్ రాసిన ఉత్తరం, అనుబంధాలు వున్నాయి. ఈ పుస్తకం నేటికీ పార్టీ రాజకీయ కార్యక్రమాలు రూపొందించుకోడానికి కరదీపికగా వుంది.

**1. గోథా కార్యక్రమ ముసాయిదా మొదటి పేరాలోని ఈ క్రింది వాక్యంపై మార్క్స్ విమర్శ ప్రారంభం అవుతుంది.**

"సంపదకీ, సంస్కృతికీ శ్రమే మూలం. ఉపయోగ శ్రమ అనేది సమాజంలో సమాజం ద్వారా మాత్రమే సాధ్యం. అందువల్ల శ్రమ ఉత్పాదితాలకు ఎలాంటి తగ్గింపులూ లేకుండా సమాజం లోని సభ్యులందరికీ చెందే సమానహక్కు కావాలి".

ఈ వాక్యం పైకి చూడడానికి బాగానే కనిపిస్తుంది. కాని మార్క్స్ ఎక్స్‌రే కళ్ళతో పరిశీలించి దానిలోని డొల్లతనాన్ని వెల్లడిస్తాడు. శ్రమలాగే ప్రకృతి కూడా ఉపయోగపు విలువలకు మూలం అని పేర్కొంటూ గోథ కార్యక్రమంలోని పై వాక్యం అర్థవంతం కావాలంటే "శ్రమ అనేది మొత్తం సంపదకు మూలం గనుక ఎవరైనా శ్రమ ఉత్పాదితంగానే దానిని పొందాలి. సమాజంలో వున్న ఇతరులెవ్వరూ దానిని సంపదగా స్వంతం చేసుకోకూడదు. అంటే ఎవరైతే పనిచేయరో వారు ఇతరుల శ్రమ మీద బతికేవారు, ఇతరుల శ్రమతోనే సంస్కృతిని పొందే వారవుతారు" అంటూ శ్రమ దోపిడీ మీద స్పష్టత లేనితనాన్ని వివరిస్తాడు. ఉపయోగ శ్రమ అనేది "సమాజంలో, సమాజం ద్వారానే సాధ్యం" అన్న వాక్యాన్ని విశ్లేషిస్తూ అంటే సమాజం ద్వారా కాకపోతే ఉపయోగశ్రమ వుండదా? అని ప్రశ్నించి, వానరుడు నరునిగా మారే తొలి మొరటు దశలో అతను ఒక రాతితో జంతువుని వేటాడటం, పండ్లను సేకరించడం కూడా ఉపయోగపు విలువేనని సూచిస్తాడు. సమాజానికి దూరంగా విడి వ్యక్తులుగా చేసే శ్రమ సంపదను గాని సంస్కృతిని గాని సృష్టించదు అని స్పష్టం చేస్తాడు.

**2. వేతనాల ఇనప చట్రం :**

గోథా కార్యక్రమం "స్వేచ్ఛా రాజ్యాన్ని చట్టబద్ధమైన మార్గాల ద్వారా సాధిస్తుంది. అలా స్వేచ్ఛా రాజ్యాన్ని , సోషలిస్టు సమాజాన్ని సాధిస్తుంది. వేతన వ్యవస్థని, వేతనాల ఇనపచట్రం సూత్రాన్ని తొలగిస్తుంది. అన్ని రూపాల దోపిడీని, సామాజిక ఆర్థిక అసమానతలను తొలగిస్తుంది" అని ప్రకటిస్తుంది.

ఈ ముసాయిదాను ఆమోదిస్తే జర్మన్ వర్కర్స్ పార్టీ లాసెల్లీ ప్రవచించే వేతనాల ఇనపచట్రం భావనని ఆమోదించాలి. లాసెల్లీ అనుయాయులు వేతన శ్రమ మీద చేసే దాడి కంటే "వేతనాల ఇనుపచట్రం సూత్రం మీదే వారి దాడి ప్రధానంగా వుందని మార్క్స్ పేర్కొంటూ" నేను వేతన శ్రమని రద్దు చేస్తే దానితోపాటే సహజమైన దాని సూత్రాలు రద్దు అవుతాయి – అవి ఇనుప సూత్రాలైనా – స్పాంజ్ సూత్రాలైనా అని స్పష్టం చేస్తాడు. అలాగే లాసెల్లీ అనుయాయులు వల్లిస్తున్న ఈ వేతనాల ఇనుపసూత్రం మాల్థూస్ జనాభా సిద్ధాంతం నుండి పుట్టుకొచ్చిన భావన అనీ. జనాభా పెరుగుదల వల్ల ఎంత తక్కువ వేతనం ఇచ్చినా పని చెయ్యడానికి మనుషుల కొరత వుండదనీ, ఇది ప్రకృతి సిద్ధమైంది, అన్ని సమాజాలకు వర్తించేదీ అందువల్ల ఇది వారికి 'ఇనుప చట్రం' అయిందనీ దీనినే బూర్జువా ఆర్థికవేత్తలు గత 50 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నారన్న అంశాన్ని మార్క్స్ ప్రస్తావిస్తూ ఇదే వాస్తవం అయితే "వేతన వ్యవస్థను రద్దు చేసినా" అన్ని "సమాజాలకూ వర్తించే" 'ఇనుపచట్రం' రద్దు కాదు గదా అంటూ వీరికి వేతన వ్యవస్థ అర్థం కాలేదంటాడు. 'వేతనాలు అనేవి పైకి కనిపించే రూపంలో వున్నవి కావని శ్రమ యొక్క విలువ లేదా ధర అనేది ముసుగు వేసుకున్న శ్రమశక్తి విలువ, ధర మాత్రమే ఇది వేతనాలకు మించి అదనపు శ్రమ చేసే పద్ధతి మీద ఆధారపడింది. అందుకే ఈ అదనపు శ్రమని మరింత పెంచడానికి పనిదినాల నిడివి పెంచడం, సాంద్రతను పెంచడం ద్వారా ఉత్పాదకతను పెంచడం వగైరాలకు పాల్పడుతున్నారని మార్క్స్ వివరిస్తాడు అందువల్ల వేతన శ్రమ అనేది ఒక బానిస వ్యవస్థ లాసెల్లీ వర్గం కేవలం వేతన వ్యవస్థ రూపాన్నే చూస్తున్నారు గాని దాని సారాన్ని గ్రహించడం లేదని మార్క్స్ విమర్శిస్తాడు.

మరో రెండు అంశాలను ప్రస్తావించి ఈ పరిచయాన్ని ముగిస్తాను. మార్క్స్ తన విమర్శను కొనసాగిస్తూ జర్మన్ వర్కర్స్ పార్టీ ఈ ముసాయిదాను ఆమోదించడం అంటే దానికి సోషలిస్టు భావజాలం పట్ల లోతైన అవగాహన లేదని అర్థం అంటాడు. ప్రస్తుతం వున్నది పెట్టుబడిదారీ వ్యవస్థ. ఈ వ్యవస్థే ప్రస్తుత రాజ్యవ్యవస్థకు పునాది అన్న అంశాన్ని ఈ ముసాయిదా విస్మరించి, ఈ రాజ్యం ఒక స్వతంత్రమైన వ్యవస్థగా

పరిగణిస్తున్నది. ఈ "ప్రస్తుత రాజ్య వ్యవస్థలో వివిధ దేశాలలో వివిధ రూపాలులో వుంది. కాని వాటన్నింటికీ కొన్ని సమాన లక్షణాలు వున్నాయంటూ ప్రస్తుత రాజ్య వ్యవస్థను భవిష్యత్ రాజ్యవ్యవస్థతో పోల్చి చెప్పడం మాత్రమే సాధ్యం పడుతుందని అంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థకు, కమ్యూనిస్టు వ్యవస్థకు మధ్య ఒక విప్లవకర పరివర్తన దశ వుంటుందని ఇది ఒక వ్యవస్థ నుండి మరొక వ్యవస్థకు మారడం, దీనితోపాటే రాజకీయ పరివర్తన దశకూ కూడా వుంటుంది..... ఈ పరివర్తన దశలో రాజ్యం అన్నది ఒక విప్లవకర కార్మికవర్గ నియంతృత్వంగా వుంటుంది. అయితే ఈ ముసాయిదా కార్యక్రమం దీనిని గురించి మాట్లాడడం లేదు పైగా వారు లేవనెత్తిన డిమాండ్‌లు అన్నీ పాతకాలపు నినాదాలు మాత్రమేనని అంటాడు.

కార్మిక వర్గ అంతర్జాతీయతను ప్రస్తావిస్తూ కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రతిపాదించిన దానికి విరుద్ధంగా లాసెల్లీ బృందం ఒక సంకుచితమైన జాతీయ దృక్పథాన్ని తీసుకున్నదని పేర్కొంటాడు. "కార్మికులు ఒక వర్గంగా సంఘటితం కావాలన్నది అందరికీ తెలిసిందే. దాని పోరాటానికి తన దేశమే తక్షణ కార్యక్షేత్రంగా వుంటుంది. ఇంతవరకు ఆ పోరాటం జాతీయ పరిధిలోదే అన్నది కేవలం రూపంలో మాత్రమే కాని దాని సారం అది కాదు" అంటాడు మార్క్స్.

ప్రస్తుతం వున్న జర్మన్ సామ్రాజ్యాన్ని తీసుకుంటే అది పైకి జాతీయ రాజ్యాల చట్టంలో వున్నట్టు కనిపిస్తుంది. కాని జర్మన్‌ట్రేడ్ లోని విదేశీ వ్యాపారంలో ప్రత్యేకత బిస్మార్క్ అనుసరించే అంతర్జాతీయ విధానంలో వుందని పేర్కొంటాడు. గోథ కార్యక్రమ ముసాయిదా దీనిని పూర్తిగా విస్మరించింది. కార్మిక వర్గం తన విముక్తిని ప్రస్తుత జాతీయ రాజ్యాల చట్రంలోనే సాధించడానికి పూనుకుంటుందని చేసిన ప్రకటన కార్మికవర్గ అంతర్జాతీయతను ఎలా నీరు గారుస్తుందో వివరిస్తాడు.

మార్క్స్ గోథా కార్యక్రమంపై చేసిన విమర్శ శాస్త్రీయ కమ్యూనిజానికి సంబంధించిన పలు కోణాలను ఆవిష్కరిస్తుంది. కార్మికవర్గ పార్టీల కార్యక్రమాల రూప కల్పనకు నేటికీ అది కరదీపికగా దారి చూపిస్తుంది. ❑


## మార్క్స్ వాఙ్మయంలో '18వ బ్రూమెయిర్' స్థానం

**(68వ పేజీ తరువాయి)**

మానస పుత్రిక. ఇక తాను పొందిన మిగిలినవన్నీ సమయం, సందర్భాల ఫలితమే. ప్రజలు రాజ్యాంగం, వ్యక్తిగత ఆస్తి మతం వంటి అంశాలను లేవనెత్తినప్పుడు బోనపార్టె నోరు పెగలదు. డిసెంబరిస్టు సంఘం చరిత్ర అంటే స్వయంగా బోనపార్టె చరిత్రే! అని విశ్లేషిస్తాడు. ఈ విశ్లేషణ లోతుగా పరిశీలించినప్పుడు భారతదేశంలో మోడీ పరిణామం గుర్తుకు రాకమానదు. "పారిస్ కార్మికవర్గం 1848 ఫిబ్రవరి విప్లవం జయజయ ధ్వానాల నడుమ తలుపులు తెర్చుకుంటున్న రేపటి గురించి కలలుగంటూ సమస్యల పరిష్కారానికి వ్యూహాలు రచిస్తుంటే పరాజితులైన పాతసమాజపు శక్తులన్నీ కూటమి కట్టాయి. మార్గదర్శనం పొందాయి. అనూహ్య స్థాయిలో రైతాంగం మొదలు పెటీబూర్జువాల వరకూ దేశవాసుల నుండి వీరికి మద్దతు దక్కింది." అంటూ బోనపార్టె ప్రతీఘాత విప్లవం విజయవంతం కావటం వెనక వర్గపొందికను కళ్లకు కట్టినట్లు వివస్తాడు. ఈ వాక్యాలు చదివినప్పుడు స్పెయిన్‌లో విప్లవ సన్నాహాలు విఫలం కావటం వెనక, రష్యాలో బోల్షివిక్ విప్లవం సఫలం కావటం వెనక జరిగిన పరిణామాలను మార్క్స్ ముందుగానే ఊహించినట్లనిపిస్తుంది.


సమాజమంతా పెట్టుబడిదారులు, కార్మికులు అన్న వైరి వర్గాలుగా చీలిపోతుందని, మధ్యంతర వర్గాలంటూ ఉండవని మార్క్స్ చెప్పినట్లు వాదించేవారంతా బోనపార్టె రచనలోని మార్క్స్ వర్గ విశ్లేషణను చదవాలి. అర్థం చేసుకోవాలి. ఈ రచనలో భూ యాజమాన్యవర్గం, వాణిజ్య పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి, అప్పుడప్పుడే ఆవిర్భవిస్తున్న ద్రవ్య పెట్టుబడి వర్గాలను, వాటి పునాదులను, ఆయా పునాదుల నుండి ఉత్పన్నమయ్యే వర్గ స్వభావాలను, రాజకీయ రంగంలో వాటి ఫలితాలు, పర్యవసానాలను ప్రస్తావిస్తాడు. రైతాంగాన్ని ఓ ప్రత్యేక తరగతిగా పరిగణిస్తాడు. ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో కీలక భాగస్వాములైన బూర్జువావర్గం, కార్మికవర్గంతో పాటు పెటీ బూర్జువా వర్గం గురించిన లోతైన విశ్లేషణ మనకు ఈ రచనలో కనిపిస్తుంది. విద్య లేదా ఉపాధి ద్వారా పెటీ బూర్జువా వర్గంగా మారిన తరగతి ప్రతీఘాత శక్తిగా ఉంటుందన్న సూత్రీకరణతో ఈ రచనను ముగిస్తాడు. ఇటువంటి అనేక పోలికలను వర్తమాన విముక్తి పోరాటాల చరిత్రలో ఎన్నింటినైనా ప్రస్తావించుకోవచ్చు. విముక్తి మార్గంలో పోరాడుతున్న ఉద్యమకారులందరికీ వర్గ సమాజంలో రాజకీయాలను అర్థం చేసుకోవటానికీ, విశ్లేషించ టానికీ, కార్యాచరణను రూపొందించుకోవటానికీ లూయీ బోనపార్టె ఓ పాఠ్యపుస్తకమే. ❑

# మార్క్స్ పదునైన రచన : 'తత్వశాస్త్ర దారిద్ర్యం'



వై.వి. రమణారావు

'తత్వశాస్త్ర దారిద్ర్యం' గ్రంథాన్ని మార్క్స్ 1847లో ఫ్రెంచి భాషలో రచించాడు. రష్యాలోని "విదేశీ భాషల ప్రచురణ సంస్థ, మాస్కో" వారు చేసిన దీని ఆంగ్ల అనువాదం నుండే తెలుగు అనువాదం చేయబడింది. 'దారిద్ర్యం యొక్క తాత్వికత' అనే ప్రౌధాన్ రచనకు సమాధానంగా మార్క్స్ వ్యంగ్యంగా పేరు పెట్టి రచించిన గ్రంథమే ఈ 'తత్వశాస్త్ర దారిద్ర్యం'. కాబట్టి, ఈ పుస్తకం పేరు చూసి దీనిలో తత్వశాస్త్రం గురించి మార్క్స్ పూర్తిగా వివరిస్తాడనే ఆశతో పుస్తకం తెరిస్తే, మనం భంగపడతాం. బదులుగా, ఇందులో రాజకీయార్థిక శాస్త్రం గురించీ, హెగెల్ తాత్వికతపై, గతితర్క భావాభివర్గాల (categories)పై విశ్లేషణాత్మక విమర్శ ఉంటుంది.




ఈ పుస్తకంలోకి వెళ్ళే ముందు మనం వీటిని టూకీగా తెల్సుకుందాం: (1) తత్వ శాస్త్రం-వాస్తవికత, (2) హెగెల్ తత్వ శాస్త్రం, (3) అధి-భౌతిక శాస్త్రం, (4) మార్క్స్ ఇతర గ్రంథాలు, (5) కొన్ని తాత్విక అంశాలు.

**(1) తత్వశాస్త్రం :** ఈ అంశంపై అనువాదకుని వివరణల్లో వున్నా, దాన్ని ("మార్క్సిస్టు తత్వశాస్త్రం " నుండి) టూకీగా చూస్తే, "తత్వశాస్త్రాన్ని ఇతర శాస్త్రాలన్నింటికీ ప్రతిగానూ, వాటన్నిటికన్నా ఉత్తమమైనదిగానూ నిలపడాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు తిరస్కరించారు. ప్రకృతి, మానవ సమాజం, మానవుని ఆలోచనా క్రమాల అభివృద్ధికి సంబంధించిన అత్యంత సాధారణమైన నియమాలను వివరించే శాస్త్రంగా తత్వశాస్త్రాన్ని వారు నిర్వచించారు. అలా, వారు గతితార్కిక చారిత్రక భౌతిక పద్ధతి గల్గిన భౌతికపర భావనను/ భౌతికవాదాన్ని ఆవిష్కరించి, "తత్వ శాస్త్రాన్ని భూమార్గం పట్టించారు".

మనకు తెల్సిన భావవాదం, అజేయవాదం, గతితార్కిక చారిత్రక భౌతికవాదం గురించి సారాంశరూపంలో అనువాదకుని వివరణల్లో ఉంది. సమాజ అభివృద్ధి క్రమంలో ఓ వ్యక్తి కేంద్రంగా గల 'మానసిక శాస్త్రం (ఫ్రాయిడ్), అస్తిత్వవాదం (Existentialism)', (రూఢీవాదం (positivism), (మానవవాదం+నాస్తికత్వం+ సైన్సు) గురించీ ఉంది.

**(2) హెగెల్ తత్వ శాస్త్రం :** దీనికై ఈ పత్రిక సంచికలోనే "పవిత్ర కుటుంబం 'గ్రంథంపై గల వ్యాసం మొదట్లో చూడండి.

**(3) అధి-భౌతికశాస్త్రం (Metaphysics) :** ప్రౌన్ తన గ్రంథంలో అధి భౌతిక శాస్త్ర పదాల్ని వాడటం గురించి మార్క్స్ ఈ గ్రంథంలో ఎక్కువగా వివరిస్తాడు కనుక, దాని గురించి తప్పక తెల్సుకోవాలి. తత్వశాస్త్ర ప్రధాన శాఖ ఐన ఇది విషయాల/పదార్థాల మొట్టమొదటి సూత్రాలతో వ్యవహరిస్తుంది. అమూర్త భావనలైన సత్తు/సత్వం (Spirit), తెలుసుకోవటం, అస్తిత్వం, కాలం, స్థలం, (కారణం, ఫలితం, కార్యకారణత్వం) (causality), సంఖ్య, సృష్టి, వగైరాలకి సంబంధించిన ప్రాథమిక స్థితులు, వగైరాలు ఈ శాఖకు చెందినవిగా భావింపబడతాయి. 'వాస్తవం' లో 'ఏ ఆధారం లేని' 'అమూర్త సిద్ధాంతం'గా పరిగణింపబడుతూ (అంటే, వాడి ఆలోచన అధి-భౌతికమైనది (అంటే, ఏ ఆధారం/రుజువు లేనిది) అనే) తీసివేత/ తోసివేత ధోరణితో వుంటుంది. ప్రాకృతిక విషయాల పరిశీలనకు మించి, ఆవల, వెనుక గల వాటిని ఇది పరిశీలన చేస్తుంది. ఇది అత్యంత కల్పనాత్మక మైనదిగా భావింపబడుతుంది. అయినా, కొన్ని రంగాల్లో, ఆధునిక శాస్త్రీయ, సమాచార, వగైరా రంగాల్లోనూ శాస్త్రీయ పరిశీలనతో కలిపి దీన్ని సహాయకారిగా వాడుతూ, కొన్ని ఫలితాల్ని రాబడతారు.

**(4) మార్క్స్ ఇతర గ్రంథాలు :** (i)మార్క్స్, ఎంగెల్స్‌ల తొలి ఆర్థిక రచనలు (పోటీ, గుత్తాధిపత్యం, వగైరాల కొరకై (ఈ పుస్తకం తెలుగులో లభ్యమౌతున్నది, అనువాదం : ఎ.గాంధీ), (ii) మార్క్స్ తొలి రచనలైన "ఆర్థిక, తాత్విక రాతప్రతులు, 1844' లోని తొలి రెండు రాతప్రతులు (తెలుగులో ఈ గ్రంథం కాపీలు

అరుదుగా లభ్యమౌతున్నాయి, అనువాదం : కీ.శే. పొట్లూరి వెంకటేశ్వరరావు), (iii) 'పెట్టుబడి', సంపుటి–1, అధ్యాయం–1 (సరుకు–డబ్బు) (సరుకు, శ్రమ, శ్రమ–శక్తి, సరుకు యొక్క ఉపయోగము–విలువ, మారకపు విలువ, 'విలువ', డబ్బు గురించిన వాటి కొరకై), (iv) 'వాగ్నర్‌పై విమర్శ' (సరుకు విలువ భావన, విలువ, ఉపయోగపు విలువ, మారకపు విలువ, మొదలగు వాటిపై మార్క్స్ తన మరణానికి 2 సంవత్సరాల ముందు (1881 లో) ఇచ్చిన స్పష్టమైన వివరణకై).

**(5) కొన్ని తాత్విక అంశాలు :** అమూర్త ఆలోచన (abstract thinking), స్పెక్యులేటివ్ తత్వశాస్త్రం (దీనికై 'పవిత్ర కుటుంబం' గ్రంథంలోనూ, ఈ పత్రిక ఇదే సంచికలో దీనిపై గల వ్యాసాన్ని చూడండి).

ప్రౌధాన్ తన 'దారిద్ర్యం యొక్క తాత్వికత' (philosophy of poverty) లో తన సొంత 'అధి–భౌతిక' పదాల ద్వారా హెగెల్ తాత్వికతనూ, చాలా మేరకు అతని గతితర్కాన్ని రాజకీయ అర్థశాస్త్రానికి వర్తింపజేస్తూ, కార్మికులు, శ్రమ, వగైరాల గురించి చాలా చులకన అభిప్రాయాలు వెలిబుచ్చుతూ, రాజకీయార్థిక శాస్త్రాన్నీ, చరిత్రను సైతం వక్రీకరిస్తాడు కాబట్టే మార్క్స్ మనకు వివరణాత్మకంగా విశదీకరిస్తాడు. కారణం : సమాజ చలనాన్ని, ముఖ్యంగా ఆర్థికవిషయాల్ని దర్శించే క్రమంలో వాటి నియమాల, గమనాల కారణాల్ని పట్టుకోలేక అధి–భౌతిక శాస్త్రంలో శరణుజొచ్చిన ప్రౌధాన్ అలా ఎంత సేపూ మన భారతదేశంలోని సాములోర్లు, రుషులు, బాబాలు చెప్పే 'విధి'ని మధ్యలోకి తెస్తూ, అధి–భౌతికమైన తాత్విక పదాల్నే(ఉదా॥కి, సామాజిక తెలివరి, విధీకృత లక్ష్యం) కాక, అధి–భౌతిక రాజకీయార్థిక పదాలనూ (ఉదా॥కు అంచనా విలువ, స్థాపిత విలువ) వంటివి వాడతాడు కనుకా, పైగా ఆ పదాలు, వాటి అర్థాలపై అతనికే స్పష్టత ఏదీ లేక, మధ్యలో భగవంతుని ప్రస్తావన పదేపదే నేరుగానూ, పరోక్ష పేర్లతోనూ తెస్తాడు కనుకా.

ఈ గ్రంథంలో మార్క్స్ మనకు ఆర్థిక భావాభివర్గాలకి అర్థం ఏమిటి; అసలైన గతితర్కం ఎలా వుంటుంది, గతితర్కాన్ని ప్రౌధాన్ ఎలా ఇష్టారీతి వాడాడో, పైగా తనదే అసలైన గతితర్కమంటూ ఎలా దబాయిస్తాడో కూడా మార్క్స్ వివరిస్తాడు. ఆర్థిక, చారిత్రక విషయాల వాస్తవాల మధ్యలోకి అధి–భౌతిక భావాభివర్గాలను చొప్పించి, మనకు అర్థంకాని రాజకీయార్థిక శాస్త్రం, సామాజిక, చారిత్రక విషయాలకు తప్పుగా భాష్యం చెప్పటం చేయకూడని విషయమని చెప్పటానికి ప్రౌధాన్ని ఒక ఉదాహరణగా చూపిస్తూ, అతని పుస్తకంలో ప్రౌధాన్ ఎంత మతిమాలిన లెక్కలు చేస్తాడో కూడా చూపించి, మార్క్స్ గేలి చేస్తాడు. కేవలం 'మంచి', 'సమానత్వం' వంటి ఆదర్శ (ideal), ఊహాస్వర (utopian) భావనలపై ఆధారపడి ఆర్థిక భావాభివర్గాలకు భాష్యం చెప్పటం, సామాజిక సమస్యలకు పరిష్కారాలను వెతకటం అనేది ఎంతటి చారిత్రక, ఆర్థిక, వాస్తవ సామాజిక అవగాహనా లోపమో మార్క్స్ మనకు అత్యంత విపులంగా ఈ పుస్తకంలో చూపిస్తాడు. అయితే, 'శ్రమ–శక్తి' అనే అర్థం వచ్చేట్లే ఎక్కువసార్లు శ్రమ' అనే పదాన్ని మార్క్స్ వాడాడని ఎంగెల్స్ ముందు– మాటలోనూ, ఈ పుస్తకం చదివేటప్పుడు మనకూ అవగతమౌతుంది. ఇక, ఈ గ్రంథానికి ఎంగెల్స్ జత చేసిన రెండు మార్క్స్ ఉత్తరాలు, రెండు అనుబంధాలైన : (1) అర్థశాస్త్ర విమర్శకు ఒక చేర్పు, (2) స్వేచ్ఛా వాణిజ్యంపై వ్యాసం ఈ ప్రౌధోనిజాన్ని ఎండగట్టటానికి తగి వున్నట్లుగా ఉంటాయని మనం చూస్తాం.

**మార్క్స్ అనెంకోవ్‌కి రాసిన ఉత్తరం :** ఈ గ్రంథంలోకి వెళ్ళే ముందు మార్క్స్ అనెంకోవ్‌కి రాసిన ఉత్తరం చూద్దాం. (i) చరిత్రలో ఒక సామాజికాభివృద్ధి పరంపరను ప్రౌధాన్ చూశాడనీ, కానీ దానికి కారణాల్ని అతను వివరించలేదు కనుక, సార్వత్రిక హేతువు తనను తాను అభివ్యక్తం చేసుకుంటుందన్న పరికల్పన (hypothesis) ఆయనకు వాటంగా ఉంది. నిగూఢమైన అస్పష్ట కారణాలను అంటే, లోకజ్ఞానం కొరవడిన మాటలను కల్పించడం కన్నా తేలికైన పని మరొకటి లేదు. (ii) యంత్రాలను, యంత్ర–వ్యవస్థను ప్రౌధాన్ 'ఆర్థిక భావాభివర్గం' అనటం తప్పనీ, ఎందుకంటే, యంత్రాలు కూర్చబడి, కార్మికులచే నడపబడే వ్యవస్థ ఐన 'వర్కుషాపు' మాత్రమే ఒక ఆర్థిక భావాభివర్గం కనుక అంటాడు మార్క్స్. (iii) " 'బానిసత్వం' ఒక ఆర్థిక భావాభివర్గం కనుకే, ప్రపంచ ఆరంభం నుండీ మనం ప్రతీ దేశంలో బానిసత్వాన్ని చూస్తాం" అని బూర్జువా ఆర్థికవేత్తలందరివలెనే ప్రౌధాన్ కూడా తప్పుగా అంటాడని మార్క్స్ విమర్శిస్తాడు. (iv) బూర్జువా జీవితం శాశ్వతమని ప్రౌధాన్ ఎప్పుడూ నేరుగా చెప్పడు. బదులుగా, భావ రూపంలో 'బూర్జువా సంబంధాల' లను ఆరాధ్యం చేసి, ఈ విషయాన్ని పరోక్షంగా చెబుతాడు. (V) పెట్టీ– బూర్జువా ఐన ఈ ప్రౌధాన్ కూడా అందరు బూర్జువాల్లాగే 'పోటీ యొక్క వినాశకర ఫలితాలు లేకుండానే పోటీ ఉండాలి' అని చెబుతాడు. (vi) బడా బూర్జువావర్గపు వైభవం పట్ల ఒకవైపు విభ్రాంతమవుతూ, మరోవైపు ప్రజల బాధల పట్ల సానుభూతి కల్గి, వారిని ఉద్ధరించటానికి ఒక శాస్త్రాన్ని కనుగొన్న శాస్త్రకారుని గా ఉండాలని ఉవ్విళ్ళూరేవాడైన 'పెట్టి బూర్జువా'యే ఈ ప్రౌధాన్ అంటాడు మార్క్స్. ఈ పెట్టీ బూర్జువా మనస్తత్వమనేది అతని

అస్తిత్వానికి పునాది అనీ, అందుకే ప్రొధాన్ ఒక సజీవ సామాజిక వైరుధ్యం అనీ అంటాడు మార్క్స్.

**మార్క్స్ ష్వీట్జర్‌కి రాసిన ఉత్తరం :** ఈ ఉత్తరంలో మార్క్స్ "ఒక పెటీ బూర్జువా అతని ఆర్థిక ప్రయోజనాలలో ఎలా వుంటే, అతని 'మత, రాజకీయ, కళా' దృక్పథాల్లోనూ అతడలాగే వుంటాడు " అనీ, ప్రొధాన్ కుతర్కాన్ని ఎన్నడూ వీడలేదనీ అంటాడు మార్క్స్.

**ఎంగెల్స్ ముందుమాట :** ఈ పుస్తకానికి తాను రాసిన ముందుమాటలో ఎంగెల్స్ ఈ క్రింది విషయాలు చెబుతాడు : (1) ఈ గ్రంథంలోని అధ్యాయాలు ఒక విషయంపై ఆధారపడి ఉంటాయి. అదే 1821 నుండి రికార్డో సూత్రాల్ని సామ్యవాద సిద్ధాంతానికి జతచేయటం/వర్తింపజేయటం. ఆ రెండు సూత్రాలు (1) ఏ సరుకు విలువ అయినా దాన్ని ఉత్పత్తి చేయటానికి అవసరమైన " శ్రమ పరిమాణం"చే నిర్ధారింపబడుతుంది. {ఈ సూత్రాన్ని ప్రొధాన్ వంకరగా వర్తింపజేయటంపై మార్క్స్ చేసే విమర్శతోనే అధ్యాయం-1 అంతా ఉంటుంది. } (2) సామాజిక ఉత్పాదితమంతా మూడు వర్గాలకి పంపకమవుతుంది: భూ యజమానికి భూమి-అద్దె రూపంలో, కార్మికుడికి 'వేతనం' రూపంలో, పెట్టుబడిదారుడికి 'లాభం' రూపంలో.. {అధ్యాయం-2 లో 'ఆస్తి-భూమి-అద్దె' విభాగం చూడండి.} (ii) ఆర్థిక వాస్తవం' 'కేవల నైతికత'కి విరుద్ధంగా ఉంటుంది. అందుకే, మార్క్స్ తన కమ్యూనిస్టు సూత్రీకరణల్ని నైతికతపై ఆధారపడి ఎన్నడూ చేయడనీ, బదులుగా, పెట్టుబడిదారీ విధానం యొక్క నివారింపలేని పతనంపై ఆధారపడే చేస్తాడంటాడు ఎంగెల్స్. ... కాబట్టి, సాంప్రదాయకంగా వాస్తవం అన్పించినది 'ఆర్థికం'గా వాస్తవం కాకపోవచ్చంటాడు ఎంగెల్స్. ఉదా॥కి, 'బానిసత్వం చెడ్డది' అని ఆనాటి ప్రజలచే ఎలుగెత్తి చాటబడిందంటే దానర్థం 'బానిసత్వం కంటే మరింత ప్రభావవంతమైన, పురోగమించిన ఆర్థికాంశం అప్పటికే పైకి లేచింది' అని అర్థమంటాడు ఎంగెల్స్. కాబట్టి, నైతికంగా చెడ్డదైన ఆర్థిక విషయం వెనుక 'ఆర్థికంగా సరైనదైన సామాజిక వాస్తవం' దాగుంటుందంటాడు ఎంగెల్స్. (iii) 'సరుకు తయారీకి శ్రమ తప్ప ఇంకేమీ ఖర్చు కాదు, కాదు, ..... " అని రాడ్‌బెర్టస్ వంటివాళ్ళు పదేపదే ఊదరగొట్టటం వల్ల శ్రమ ప్రక్రియలో జరిగే అసలు విషయం, శ్రమకీ, విలువకీ గల సంబంధం' గురించీ మనకేమీ తెలీదంటాడు మార్క్స్. (iv) 'భూ యజమానులు, పారిశ్రామిక పెట్టుబడిదారులు కూడా కొన్ని రకాల సామాజికంగా ఉపయోగకరమైన లేదా ఆవశ్యక క్రియల్ని చేస్తారు కనుక, రాడ్ ఫెర్టస్ వంటి బూర్జువావర్గం వారు కనీసం మరో 500 సంవత్సరాల పాటు వుండాలనీ, కానీ అదనపు-విలువ మాత్రం 200% దాటరాద'నీ రాడ్‌బెర్టస్ ఉద్దేశ్యమని ఎంగెల్స్ ఎద్దేవా చేస్తాడు.

**మార్క్స్ ముందుమాట :** సగం అర్థశాస్త్రం తెలిసి ఫ్రాన్స్‌లో ఆర్థికవేత్తగానూ, సగం తత్వశాస్త్రం తెలిసి జర్మనీలో తత్వవేత్తగానూ ఫోజులు పెట్టే ప్రొధాన్ చేసే ద్వంద్వ దోషానికి, "ఒకే సమయంలో జర్మన్‌గానూ, ఆర్థికవేత్తగానూ ఉన్న మేము అందుకనే ఖండిస్తున్నా మంటాడు మార్క్స్. ప్రొధాన్ పుస్తకం ఒక బైబిల్ వంటిదనీ, దానిలో మార్మికతలు, అకస్మాత్తుగా పిలువబడేవీ, దేవుని హృదయం నుండి లాక్కోబడేవీ ఉంటాయని అంటాడు మార్క్స్. ఈ పుస్తకం ఆరంభమే కాకుండా ఆసాంతం కఠినంగా ఉంటుందనుకునే, దానికి తగినట్లుగా పాఠకుడు తయారై ఉండాలని {'పెట్టుబడి' గ్రంథంలో చెప్పినట్లే} మార్క్స్ అంటాడు.

**పుస్తకంలోని విషయాలు :** ఈ పుస్తకంలో రెండు అధ్యాయాలుంటాయి. అధ్యాయం-1 లో ఉపయోగపు విలువ, మారకపు విలువ, విలువ, డబ్బు, అదనపు-శ్రమ గురించి ప్రొధాన్ అతని రాజకీయార్థిక శాస్త్రంలో ఎలా అధి-భౌతికంగా నిర్మాణం చేస్తాడో మార్క్స్ మనకు 3 విభాగాల్లో చూపిస్తాడు. అధ్యాయం-2 లో రాజకీయార్థిక శాస్త్రం యొక్క అధిభౌతికత గురించి 5 విభాగాల్లో మార్క్స్ విశదీకరిస్తాడు. 'పవిత్ర కుటుంబం', 'జర్మన్ భావజాలం' గ్రంథాల్లో కంటే మెరుగ్గా ఇందులో రాజకీయార్థిక శాస్త్రం గురించి మార్క్స్ విశదీకరిస్తాడు. అయితే, పూర్తిగా సైద్ధాంతిక భావనలతో సాగే అధ్యాయం-1 కంటే ముందు వీటికి మూలమైన హెగెల్ తత్వశాస్త్రాన్నీ, అధి-భౌతిక శాస్త్రాన్ని ప్రొధాన్ ఎలా వంకరగా వాడాడో మార్క్స్ మనకు విశ్లేషణాత్మకంగా వివరించినదైన అధ్యాయం-2 చదివితే, బాగా అర్థమవుతుంది.

ప్రొధాన్ వాడిన ఈ పద్ధతిని తెల్సుకునే ముందు 'అమూర్త ఆలోచన', 'అమూర్త హేతువు' గురించి తెల్సుకోవాలి. Abstract అనే పదానికి (1) అనిర్దిష్టమైనది అనీ, (2) అమూర్తమైనది అనీ అర్థాలున్నాయి. నిర్దిష్టమైనదానికి (concrete) వ్యతిరేకమైనదైన "అనిర్దిష్టమైనది' కూడా, వాస్తవానికి 'అమూర్తమైనదే (అంటే, 'మూర్తం కానిది', 'మూర్తం' అంటే : 'వాస్తవ అస్తిత్వం/స్వరూపం కలది'). కానీ, వాస్తవ వస్తువులు, విషయాల నుండి అమూర్తంగా చేసే ఆలోచనలు 'వాస్తవ అస్తిత్వం' కలవే అయితే, అవి 'మూర్త/వాస్తవ విషయాలే' అవుతాయి. అలా కాక, "వాస్తవ అస్తిత్వం లేని/కనపడని/స్వరూపం-లేని వస్తువులు, విషయాల్ని (ముఖ్యంగా, తత్వశాస్త్రంలోనూ, మానసిక, ప్రకృతి శాస్త్రాలోనూ, సామాజిక

శాస్త్రంలోని విషయాల్నీ)" మనం 'అమూర్త వస్తువులు/విషయాలు/భావాలు/భావనలు అంటాము. 'అమూర్త ఆలోచన' లో అలా మనం తాత్విక భావాల/భావనల/విషయాల వెంబడే అవతలివారు చెప్పే విధంలోనే అనుసరిస్తూ వెళుతూ ఆలోచన సాగిస్తే, వారెలా అమూర్తంగా వివరిస్తున్నారో మనకు కూడా తెలిసిపోతుంది. దీన్నే ప్రధానంగా నేటి కాలపు యువత, ఇంకెవరైనా అభ్యాసం చేయాల్సింది. అయితే, అమూర్త ఆలోచన చేయటం (abstract thinking)లో (ముఖ్యంగా, తాత్విక ఆలోచనలో) ఎన్నో నిర్దిష్ట అనిర్దిష్ట వస్తువుల్లోని లక్షణాలన్నింటి నుండి ఒక 'సాధారణ లక్షణాన్ని' మనం వేరుచేసి (దీన్నే 'సాధారణీకరించటం' (generalisation) అంటారు), ఒక 'తాత్విక ఆలోచనా భావాభివర్గాన్ని' నిర్మించటం జరుగుతుంది. వాస్తవ వస్తువుల, విషయాల (ఉదా॥కి, చెట్టు, పండు, జంతువు, కుర్చీ) గురించి అలా చేసేటప్పుడు దాన్ని 'అనిర్దిష్టీకరణ' (abstraction) అంటారు. అమూర్త, స్పెక్యులేటివ్ తాత్విక వస్తువులు, విషయాలు (ఉదా॥కి, మంచి, చెడు, నీతి), అలానే వాస్తవ అస్తిత్వం – లేని వస్తువుల విషయాలకి (ఉదా॥కి, సత్వం, దైవం, దైవాంశ, ఆత్మ, విలువ––వీటిలో కొన్ని హాస్యాస్పద అధి–భౌతిక విషయాలుండవచ్చు (ఉదా॥కి, ప్రౌధాన్ చెప్పే 'స్థాపిత–విలువ, సామాజిక తెలివరి, అనుపాత సంబంధం, సార్వత్రిక హేతువు) చేసే 'అమూర్త ఆలోచించటానికి మాత్రం 'అమూర్తీకరణ' (abstraction) అనే అనాలి. ఇక, ఇక్కడినుండి తత్వశాస్త్ర సంబంధ అంశాలు మనకు తేలికయిపోతాయి. ఈ గ్రంథానికి సంబంధించి అలా చూస్తే, 'అమూర్త హేతువు' (abstract reason)ను 'తర్కం' ఆధారంగా వాడుతూ హెగెల్ తన గతితర్క పద్ధతికి, తన సొంత భావవాదాన్ని కలిపి, ఒక 'భావ వ్యవస్థ'ను నిర్మాణం చేసే విధానంలోని డాంబికతనూ, డొల్లనూ మార్క్స్ తేటతెల్లం చేస్తాడు (1–7 పరిశీలనల్లో). దీని తర్వాత 'స్పెక్యులేటివ్ తత్వశాస్త్రం' అని మా ఉప శీర్షిక తగిలించినదైన 'హెగెల్ తత్వశాస్త్రం' గురించి మనం తెల్సుకోవాల్సి ఉంటుంది (ఇదే పత్రిక, ఇదే సంచికలో 'పవిత్ర కుటుంబం' పై వ్యాసం చూడండి).

**7 పరిశీలనలు :** ఒకటవ పరిశీలనలో మార్క్స్ ఏమంటాడంటే : హెగెల్ తన స్పెక్యుటివ్ ఆలోచనా పద్ధతిలో తర్కాన్ని ఆధారం చేసుకుని, 'అమూర్త హేతువు' ద్వారా 'పరమ పద్ధతి (absolute method)ని కనుగొన్నాడన్నట్లు వ్యవహరిస్తూ, అలా తాను వస్తువు/విషయం మూల సారాన్ని దర్శించానని చెప్పుకుంటాడు. దీన్నే మార్క్స్ ఖండిస్తూ, దానినదే తెల్సుకునే/విమర్శించుకునే', వగైరాలు చేసుకునే 'అమూర్త హేతువు' ఎలా నిజాయితీగా ఉండగలదని సరైన ప్రశ్న సంధిస్తాడు. అలా 'వాస్తవ వస్తువులు/విషయాల' నుండి ఆ విషయాల 'సారాన్ని/అసలైన లక్షణాల్ని' 'అమూర్త ఆలోచన'లో ఒక్క దగ్గరకి చేర్చి చేసే అటువంటి 'అమూర్త భావాభివర్గాల' నిర్మాణం సాయంతో ఎవరైనా 'సృష్టి, సమాజం, మానవ ఆలోచన, చరిత్ర' ల వాస్తవ సారాన్ని దర్శించామని చెప్పుకోవచ్చు. ఇక అక్కడి నుండి 'భూమిపై అన్ని వాస్తవ వస్తువులు/విషయాలనేవి' '''ఆ అమూర్త భావాభివర్గాల' ద్వారా 'అమూర్తంగా సృష్టించిన 'పరమ పద్ధతి" నుండి జనించాయని చెప్పకుండా, 'అవి వాస్తవంగానే భావం నుండి అలా జనించాయి' అంటూ, అవి జనించిన ఆ 'పరమ పద్ధతి'నే తాను దర్శించానని చెప్పుకుంటూ వ్యవహరిస్తే, వారిని అపేదెవరంటూ వ్యంగ్యంగా అంటాడు మార్క్స్. కానీ, అలా చేసుకుంటూ పోయే అమూర్త తార్కిక భావాభివర్గ ప్రపంచం/నిర్మాణం ద్వారా ప్రతీ వాస్తవ వస్తువు/విషయం అధి–భౌతిక పద రూపానికి తగ్గించబడగలదంటాడు మార్క్స్. ఇలా మతం, న్యాయం, వగైరాలకు హెగెల్ ఏదైతే చేశాడో, రాజకీయార్థిక శాస్త్రానికి అది చేయడానికి ఎమ్. ప్రౌధాన్ వెతుకుతాడని మార్క్స్ అంటాడు. ఆ తర్వాత 2–7 వరకు గల పరిశీలనల్లో మార్క్స్ ఏమంటాడంటే : హెగెల్ తత్వశాస్త్రంలోని విషయాల్ని, రాజకీయార్థిక శాస్త్రంలోని చారిత్రక విషయాల్ని శాశ్వతమని తలుస్తూ ప్రౌధాన్, వాటిని ప్రజలు నిర్మించిన తాత్కాలికమైనవి'గా తెల్సుకోలేక, అతని సొంత దృష్టితోనే రాజకీయార్థిక శాస్త్రాన్ని వ్యాఖ్యానిస్తూ, మధ్యలో విధిని తెస్తూ, అధి–భౌతికమైన ' తాత్విక, సామాజిక, రాజకీయార్థిక శాస్త్ర' పదాలు వాడుతూ, చర్చిస్తున్న విషయం/సూత్రం/భావాభివర్గం నుండి అకస్మాత్తుగా మరో అధి–భౌతిక భావాభివర్గానికి గెంతుతాడని చెబుతాడు. ప్రౌధాన్ అలా చేసేటప్పుడు తాను మాత్రమే దర్శించగల్గిన "అమూర్తమైన 'పరమ హేతువు' హృదయంలో దాచబడిన పరిష్కారాన్ని" వాడి తాను సమస్యను వైరుధ్య–రహితం చేశానని చెబుతాడు. ఈ ప్రకారం సైద్ధాంతిక నిర్మాణం చేసే ప్రౌధాన్ శ్రమ–విభజన, యంత్ర వ్యవస్థ, పోటీ, గుత్తాధిపత్యం, భూమి–అద్దె, సమ్మెలు, కార్మిక సంఘాలపై అదే రకపు అధి–భౌతిక పదాల్ని వాడుతూ వ్యాఖ్యానిస్తాడని మార్క్స్ మనకు విమర్శనాత్మకంగా విశదీకరిస్తాడు.

అధ్యాయం–1 ఐన 'ఉపయోగపు విలువ, మారకపు విలువల ప్రతి–సిద్ధాంతం'లో ప్రౌధాన్ ఉపయోగపు–విలువ, మారకపు విలువలను సరఫరా, గిరాకీలతో పోల్చి, ఆ తర్వాత వాటి సామరస్యక సంశ్లేషణకై 'స్వేచ్ఛాయుత సంకల్పం' కల్గిన

కొనుగోలుదారుడినీ, అమ్మకందారుడినీ నిర్మించి, వాటి మధ్యన మళ్ళీ సంశ్లేషణ (అంటే, వైరుధ్యం పోయేట్లు చేయటం)కై 'వాడకం, అంచనాల ప్రతి-సిద్ధాంతాన్ని ముందుంచుతాడు. సమాజంలో వాస్తవంగా లెక్కకు మిక్కిలిగా గల కొనుగోలుదార్లను, అమ్మకందార్లను అలా ఒక్కటిగా కలిపేసి, "ఏకైక కొనుగోలుదారు', 'ఏకైక అమ్మకందారు' అనే వాళ్ళు సమాజం మొత్తంగా తీసుకుంటే, సామాన్యులకు అగుపడని, తెలియని విధంలో సమాజంలోనే ఆ కాలానికి 'అమూర్త ఆర్థిక చలనం'గా ఉంటారంటూ, అలా "ఒక్క మొత్తంగా వుండే అధిభౌతిక 'కొనుగోలుదారు, అమ్మకందారు' " ను సృష్టిస్తాడు ప్రొధాన్. అయినా, సమాజ సరుకుల విలువల్లో (ఉప॥-వి॥, మా॥వి॥ల్లో) సమానత స్థాపించబడకపోవటాన్ని తీసేయటానికై ఒక్క గెంతులో ప్రొధాన్ "కృత్రిమ విలువ/స్థాపిత విలువ' అనే అధి-భౌతిక పదాన్ని సృష్టించి, దాని ద్వారా వాడకం, అంచనాల మధ్య వైరుధ్యం పోయేలా ఈ స్థాపిత విలువ సమాజంలో అంతర్గతంగా పనిచేస్తుందంటూ ఏదో చెబుతాడు. అంటే, సమాజంలో జరిగే 'వాస్తవ' ఆర్థిక చలనాలను, భావాభివర్గాలను కనుగొనలేక, హెగెల్ తత్వశాస్త్రాన్నీ, తన అధి-భౌతికతనూ మేళవించే ప్రొధాన్, రెంటినీ తన ఇష్టారీతిలో కలిపేసి, రాజకీయార్థిక శాస్త్ర విషయాల్ని అస్తవ్యస్తంగా వ్యాఖ్యానిస్తాడు. ఈ రకంగా వాడే అధి-భౌతికమైన 'రాజకీయార్థిక సామాజిక తాత్విక' పదాల సృష్టితో, వ్యాఖ్యానాలతో ప్రొధాన్ తదనంతరం రికార్డో శ్రమవిలువ సిద్ధాంతాన్ని తన ఇష్టారీతి వక్రీకరించి, సమాజంలో 'సమానత' స్థాపించానని ప్రకటించు కుంటూనే, ఇతరులెవరూ అలా చేయలేదని (ఇతరులు చేశారని రుజువులున్నా పట్టించుకోకనూ, అవి సరైన పరిష్కారాలు కావంటూనూ) గావుకేకలు పెడుతూ చేసే అధిభౌతిక చెత్తకి మార్క్స్ విమర్శనాత్మక సమాధానాన్ని ఇస్తాడు. దీన్ని సులభంగా అర్థం చేసుకోడానికై మొదట మార్క్స్ చెప్పిన మూల-భాగం చదివి, ఆ తర్వాత వెంటనే తెలుగు అనువాదకుని ఉల్లేఖనలు చదువుతూ, అమూర్త ఆలోచన చేసుకుంటూ పోతే పుస్తకమంతా అర్థమవుతుంది. ఆ లక్ష్యం కోసమే తెలుగు అనువాదకుని ఉల్లేఖనలు రాయబడ్డాయి.

**తెలుగు అనువాదకుడు చేర్చిన అనుబంధాలు :** మార్క్స్ రచనా ఖండికలు మూడు ఇందులో అనుబంధాలుగా ఇవ్వ బడ్డాయి. అనుబంధం-1 : 'చరిత్ర గురించిన భౌతికపర భావన సారాంశం' (దీని మెరుగుపరచిన అనువాదం 'జర్మన్ భావజాలం', పేజీ-65,66 ల్లో ఉంది). అనుబంధం-2 ఐన 'రాజకీయార్థిక శాస్త్ర విమర్శకు ఒక చేర్పు', అనుబంధం-3 ఐన 'రాజకీయార్థిక శాస్త్ర పద్ధతి' ద్వారా రాజకీయార్థిక శాస్త్రంపై ప్రాథమిక అవగాహన, దాని అధ్యయనానికి ఆధారంగా ఉండాల్సిన 'సమాజ వాస్తవ చరిత్ర', రాజకీయార్థిక శాస్త్ర 'వాస్తవ భావాభివర్గాల' అధ్యయనం, శాస్త్రీయ దృష్టి, విశ్లేషణా పద్ధతి మనకు టూకీగా తెలుస్తాయి.

14.06.2020 నాటి 'Discord/ వేదిక' అంతర్జాల సదస్సులో అనువాదకుని ఆడియో ప్రసంగానికై ఈ క్రింది లింకులో వినవచ్చును :: https://drive.google.com/file/d/1D9QfRV4ZIh5 XXbsi7ec3YUE-SyE_kGN7/view?usp=drivesdk ❑

# కార్ల్ మార్క్స్ ఆఖరి ఆర్థిక రచన : వాగ్నర్ పై విమర్శ


కార్ల్ మార్క్స్ (1818-1883) 1881 లో తన ఆఖరి ఆర్థిక రచన "అడాల్ఫ్ వాగ్నర్ రచన 'రాజకీయార్థిక శాస్త్రంపై ఒక పాఠ్య పుస్తకం' పై మార్జినల్ నోట్స్" అనే పెద్ద వ్యాసం రాశాడు. అడాల్ఫ్ వాగ్నర్ (Adolph Wagner) (1885-1917: జర్మన్ ఆర్థికవేత్త) తాను రాసిన పై పుస్తకాన్ని ఎర్విన్ నాస్ (Erwin Nasse) తో కలిసి 1879లో ప్రచురించాడు. ఎహర్బార్ (Hans G. Ehrbar) ఉల్లేఖనాల (annotations)తో గలదైన కార్వర్ చేసిన ఆంగ్ల అనువాదం నుండి 'వాగ్నర్ పై విమర్శ' పేర జనవరి, 2020 లో ఈ తెలుగు అనువాదమొచ్చింది..

ఈ రచనలో మార్క్స్ రాసినవి 10 లోపలే శీర్షికలు, ఉపశీర్షికలు ఉంటాయి. మొత్తం వ్యాసాన్ని అర్థం చేసుకున్న తర్వాతే, తెలుగు అనువాదకుడు విషయ సూచికతో సహా 50 కి మించి శీర్షికలు + ఉప శీర్షికలు ఇవ్వటం జరిగింది (వాటి క్రింద గల విషయాలకు తగ్గట్టుగా). దీనిలో 3 భాగాలుంటాయి: (1) సరుకు విలువ : భావన, వాస్తవం, (2) వాగ్నర్ విలువ భావనకు సమర్థనగా బూర్జువా ఆర్థిక వ్యవస్థ సారాంశం, (3) బూర్జువా ఆర్థిక వ్యవస్థ నియమాల అశాశ్వతత్వానికి రుజువులు.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని ప్రాథమిక కణం వంటిది అని

మార్క్స్ పెట్టుబడి–1వ సంపుటి(1867) మొదట్లోనే పేర్కొన్న 'సరుకు' విలువ గురించి 'పెట్టుబడి'లో విస్తారంగా విశదీకరించినా, సరుకు 'విలువపై వాగ్నర్ వంటి వారు 1879 లోనే వంకరగా సిద్ధాంతాలు తీయటం, వ్యాఖ్యానించటం వల్ల మార్క్స్ మరోసారి వివరణ ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించాడు కనుకే తన చివరి రోజుల్లో ఈ నోట్స్ రాశాడు.

1) సరుకు, విలువ, ఉపయోగపు–విలువ, మారకపు విలువ, విలువ రూపాలు : సరుకులో విలువ, ఉపయోగపు–విలువల గురించి చూసే ముందు, వాటిపై 'పెట్టుబడి' గ్రంథంలో మార్క్స్ చెప్పింది చూద్దాం. బార్టరు పద్ధతి, మెరుగైన బార్టరు, పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తి వ్యవస్థలోనూ జరిగే మారకపు అభివృద్ధుల్లో క్రమంగా చోటు చేసుకున్న సరుకుల మెరుగైన చలనాన్నీ, వేగాన్నీ, విస్తృతినీ మార్క్స్ 'పెట్టుబడి గ్రంథంలో విలువ రూపాల గురించి చెప్పేటప్పుడు వివరిస్తాడు.




**'పెట్టుబడి' నుండి :** మానవులు ఏదో ఒక పద్ధతిలో ఒకరి కోసం మరొకరు పనిచేయడం ప్రారంభించగానే వారి శ్రమ 'సామాజిక' రూపం ధరిస్తుంది. ..... సరుకు విలువ అనే వాస్తవం "ఎక్కడ దొరుకుతుందో" మనకు తెలియదు. ఆ రకంగా అది దొరసాని క్విక్లీ కంటే భిన్నమైనది. సరుకుల విలువ వాటి ముతక పాదార్థికతకి పూర్తిగా వ్యతిరేకం. పదార్థానికి సంబంధించిన ఒక్క పరమాణువు సైతం దాని విలువలోకి ప్రవేశించదు. ఒక సరుకుని ప్రత్యేకంగా పరిశీలించండి. అది 'విలువున్న వస్తువు'గా ఉన్న మేరకు, ఆ విలువ ఏమిటో గ్రహించడం అసాధ్యం అనిపిస్తుంది. అయితే, సరుకు విలువకి ఉన్నది కేవలం 'సామాజిక అస్తిత్వం' అనీ, 'మానవ శ్రమ' అనే 'సామాజిక పదార్థానికి సాకార రూపంగా లేదా 'వ్యక్తీకరణ'గా ఉన్న మేరకే 'విలువ'కి ఈ అస్తిత్వం వస్తుందనీ మనం దృష్టిలో ఉంచుకుంటే, సరుకుకీ సరుకుకీ మధ్య ఉన్న సామాజిక సంబంధం ద్వారా మాత్రమే సరుకు విలువ వ్యక్తమవుతుందని స్పష్టమవుతుంది. ...... విలువ తనేమిటో తెలియజేసే చీటీని నుదుటి మీద అంటించుకుని తిరగదు. ఒక 'ఉపయోగకర వస్తువు'కి 'విలువ' అనే ముద్ర తగిలించడం అనేది 'భాష' లాగానే 'సామాజిక ఉత్పాదితం. ..... 'మార్పిడి విలువ' అనేది ఒక వస్తువులో ఎంత శ్రమ ఇమిడి వుందో వ్యక్తంచేసే ఒక నిర్దిష్ట సామాజిక పద్ధతి మాత్రమే. .....ఒంటరిగా ఉన్నప్పుడెప్పుడూ సరుకు ఈ (మార్పిడి విలువ) రూపాన్ని సంతరించుకోదు. వేరే రకమైన మరో సరుకుతో "విలువ సంబంధం'లోనో, 'మార్పిడి సంబంధం'లోనో ఉంచినప్పుడు మాత్రమే ఈ రూపం ధరిస్తుంది...... 20 గజాల వస్త్రం = 1 కోటు (విలువ ప్రాథమిక రూపం) ('క' రూపం) (సాపేక్ష విలువ) (సమ విలువ) ప్రతీ సరుకులోనూ అంతర్గతంగా ఉపయోగపు–విలువకీ, విలువకీ మధ్య ఉన్న వైరుధ్యం రెండు సరుకుల్ని ఒకలాంటి సంబంధంలో ఉంచడం ద్వారా బాహ్యంగా స్పష్టం అవుతుంది. ఈ సందర్భంలో 'విలువ తెల్సుకోవలసిన సరుకు' (వస్త్రం) 'ఉపయోగపు–విలువ'గానూ, 'ఆ విలువని వ్యక్తం చేసే సరుకు'(కోటు) ' కేవలం మార్పిడి /మారకపు విలువ'గానూ వ్యవహరిస్తాయి (అంటే, వాటి 'సహజ' లక్షణాలకు బదులు, మానవులు వాటికి ఆపాదించే లక్షణాల్ని (లేదా మనచే " 'వాటికి అసహజ–మని' మనకనిపించే (మన సాంఘిక అవసరం నుండి జనించే) లక్షణాల్ని") ప్రదర్శించాల్సినవిగా బలవంతపెట్ట బడతాయి. ఈ సహజ, అసహజ లక్షణాల మధ్య గల వైరుధ్యమే మనం చెప్పుకునేది. 'పెట్టుబడి', పేజీలు : 31–85.

సరుకుల విస్తృతీ, జనాభా, అవసరాలు, ఉత్పత్తి, సామాజిక సంబంధాలు పెరిగే కొద్దీ పెరిగే మారకాల విస్తృతీ,వేగం దృష్ట్యా సరుకులు 'ఉపయోగపు విలువలు'గా కంటే 'మారకపు విలువలు'గా వ్యక్తీకరించుకోవటంలో విస్తృతంగా, వేగంగా పెరగాల్సి వచ్చింది. ఆరకంగా,

"విస్తృత విలువ రూపం'లో ('చ' రూపం)

20 గజాల వస్త్రం = 1 కోటు,

= 1/4 బస్తా ధాన్యం

= 1/2 టన్ను ఇనుము

(సాపేక్ష విలువ రూపం)(సమ–విలువ రూపం)

(ఇటువంటి ఎన్నో 'విస్తృత–విలువ' రూపాల్లో ఎన్నో సరుకులు, ఎన్నో ఉపయోగపు విలువల్ని ఎన్నో ఇతర సరుకుల్లో వ్యక్తం చేయాల్సి వచ్చేది.

ఇది సరుకుల మరింత అభివృద్ధి, చలామణీతో పాటు, పెరిగే మరిన్ని అవసరాలు, సంబంధాల కారణాలు మార్పిడిలో మరో ఆర్థికాంశాన్ని వాడాల్సిన అవసరాన్ని తీసుకొచ్చాయి). అంటే, 'పెట్టుబడి'లో చెప్పినట్లు, ఈ విస్తృతమైన సరుకులు తమ ఉపయోగపు విలువల్ని విసర్జిస్తూ, తమ మారకాల్లో 'మారకపు విలువ'ను ప్రస్ఫుటం చేసేలా దాన్ని 'విలువ రూపం'గా, ఏకంగా 'విలువ'గా స్థిరీకరణ చేయాల్సి వచ్చింది. అదే 'విలువ సాధారణ రూపం'. (అంటే, అన్ని తరహాల వాస్తవ శ్రమనీ వాటి ఉమ్మడి స్వభావం అయిన 'సాధారణ మానవ శ్రమ'గా, 'మానవ శ్రమ-శక్తి వ్యయం'గా కుదించటమే. : 'పెట్టుబడి', పేజీ-61నుండి).

విలువ సాధారణ రూపం ('ట' రూపం)

1 కోటు =

1/4 బస్తా ధాన్యం = 20 గజాల వస్త్రం

1/2 టన్ను ఇనుము = (సార్వత్రిక సమ-విలువ)

దాన్నుండే క్రమంగా ఈ క్రింది 'డబ్బు' రూపం వచ్చింది. ('త' రూపం)

20 గజాల వస్త్రం = 2 ఔన్సుల బంగారం.

1/4 బస్తా ధాన్యం = ( = 2U అనుకుందాం).

1/2 టన్ను ఇనుము = (సార్వత్రిక సమ-విలువ)

(మొదట విలువైన లోహాలు, తర్వాత వెండి,బంగారాలు, ఆ తర్వాత డబ్బు, నేడు ఎలక్ట్రానిక్ మనీ, వగైరాలు వచ్చాయి.)

ఈ రూపంలో ఎడమ ప్రక్కన 'సాపేక్ష' రూపంలో గల ప్రతీ సరుకు విలువ దాని ఉపయోగపు-విలువ నుండే కాక, ఇతర సరుకుల ఉపయోగపు-విలువల నుండి వేరు చేయబడు తుంది / విసర్జించబడుతుంది. దాని విలువ (ఉపయోగపు-విలువతో సహా) మారకం చేయబడ్డ కుడి ప్రక్కన గల సరుకు (బంగారం) తో కల్సిపోతుంది (ఇది, మారకం జరిగిన తర్వాత మారకం చేసుకునేవారు అనుకునేది). ("మిగిలిన సరుకులన్నిటికీ ఇప్పుడు బంగారమే డబ్బు. ఎందుకంటే, ఇదివరకు అది వాటిలాగే ఒక మామూలు సరుకు. మిగిలిన సరుకులన్నింటి లాగానే దానికి కూడా గతంలో సమ-విలువగా వ్యవహరించే శక్తి ఉండేది. ఒంటరి మార్పిడులలో మామూలు సమ-విలువగానూ, అలాగే ఇతర సరుకుల ప్రక్కన వాటితో పాటు నిర్దిష్ట సమ-విలువగానూ అది వ్యవహరించింది. క్రమక్రమంగా అది వివిధ పరిమితులలో సార్వత్రిక గుత్తాధిపత్యం స్థాపించుకోగానే 'డబ్బు సరుకు'గా మారుతుంది. అప్పుడు మాత్రమే – అంత వరకు కాదు – 'త' రూపం 'ట' రూపం నుండి వేరవుతుంది; 'విలువ సాధారణ రూపం' 'డబ్బు రూపం'గా మారుతుంది." – 'పెట్టుబడి'-1, పేజీ-64). (ఈ అంశం కొనసాగింపు అంశం-10 లో వస్తుంది).

2) వాగ్నర్ తన పరిశోధనకు కావాల్సిన అంశాల్ని రాడ్ బెర్టస్, లాంగే, స్కాఫుల్ ఆసరికే చేసిన పరిశోధన ఫలితాల్నుండి కాపీ కొడతాడు. మీదుమిక్కిలి ప్రైవేటు కౌన్సిలర్ ఐన అతను తనను తాను ఒక 'ఉత్పాదక శ్రామికుని'గా చిత్రించుకోటానికే తనవంటి వారి మేధో శ్రమల్ని ఆర్థిక వినియోగ వస్తువులు (వి.వి.) (goods) క్రింద జమకట్టాలని రౌ అనునతడు ఆసరికే చెప్పినదాన్ని కాపీ కొడతాడు.

3) భాగం-1 లో ఇంకా సరుకు విలువ భావన, ఆ విలువ భావన గురించిన నిరూపణ, వాగ్నర్‌ను సమర్థించే రాడ్ బెర్టస్ యొక్క సైద్ధాంతిక లోపం, మూర్ఖత్వం గురించి ఉంటాయి.

4) వాగ్నర్ వలె భాషాపరంగానూ, గారడీతోనూ సరుకు 'విలువ'ను రాబట్టటం శాస్త్రీయ పద్ధతితో సంబంధం లేనిదంటాడు మార్క్స్.

5) తన పరిశీలనాంశం వాగ్నర్ బయల్దేరి చేసిన అంశాలు, భావనలు ఐన 'విలువ, ఉపయోగపు-విలువ, మారకపు విలువలు కాదనీ, బదులుగా 'సరుకు' అనీ, దాని మరింత పరిశీలన ద్వారా సరుకనేది ఖచ్చితమైన అర్థంలో ఉపయోగపు-విలువ, విలువ అనీ కనుగొని, అలా 'సరుకు ద్వంద్వ స్వభావం' కలదని తెల్సుకున్నానంటాడు మార్క్స్. దాని తర్వాతి పరిశీలన ద్వారా 'సరుకు ద్వంద్వ స్వభావం'లోనే 'శ్రమ ద్వంద్వ స్వభావం' కూడా ఉంటుందని తెల్సుకున్నానంటాడు. దీన్నుండే ఆ తర్వాత ఉపయోగపు విలువను విశదీకరిస్తాడు మార్క్స్.

6) సరుకు విలువని వాగ్నర్ ఒక 'భావన' (concept) నుండి రాబడితే, మార్క్స్ 'వాస్తవ సాంఘిక మారకపు సంబంధం' నుండి రాబడతాడు వాగ్నర్ : బాహ్య ప్రపంచంలో తన అవసరాల్ని తీర్చే వినియోగ వస్తువులకి ప్రతిఫలంగా ఒక 'విలువ' అనే గుణాన్ని ఇచ్చి, ఆ 'విలువ'నే, కర్మపరంగా (subjective) ఆ విలువ కట్టినదాన్నే అసలైన ఉపయోగపు విలువ అంటాడు వాగ్నర్. పైగా, ఆ ఉపయోగపు-విలువ నుండి బయల్దేరి, ఈ అంశంపై అసలైన శాస్త్రీయ ఆర్థిక విశ్లేషణ చేయకుండా, 'విలువ' అనే పదాలతో గారడీ చేస్తూ, జర్మన్ నిఘంటువుల్లో సాంప్రదాయకంగా తప్పుగాగల అర్థాల సాయంతో తప్పుగా అన్వయిస్తూ 'విలువ భావన'ను తాను పైన వస్తువుకి ఆపాదించిన

'ఉపయోగపు-విలువ' నుండి రాబట్టడమే కాక, అదే అసలైన 'సరుకు విలువ' అని దబాయిస్తాడు. అలా, సరుకు 'విలువ'ను ఒక కేవల 'భావన' నుండి రాబడతాడు వాగ్నర్.

మార్క్స్ : "కానీ, నేను 'భావనల' నుండి బయల్దేరననీ, అందుకే 'విలువ భావన' నుండి కూడా బయల్దేరననీ, బదులుగా, "వర్తమాన సమాజంలో శ్రమోత్పాదితం తనను తాను వ్యక్తపరచు కునే 'అత్యంత సరళ రూపం" నుండి బయల్దేరతాననీ, అదే 'సరుకు' " అనీ అంటాడు మార్క్స్. "దాని పరిశీలన నుండి బయల్దేరే, నేను "సామాజిక 'శ్రమ-శక్తి' వ్యయం"గా ఉనికిలో గల పేరైన సాధారణార్థంలోని శ్రమ (ఒక 'సామాజిక లక్షణం'గా గల శ్రమ) అనేది అన్ని చారిత్రక రూపాల్లో ఉనికిలో వుండే ఈ సామాజిక లక్షణాన్ని వ్యక్తపరచేదిగా "సరుకు లోపలనే 'విలువ' అనబడుతూ, 'అంతస్సారం'గా ఇమిడిపోతుంది" అనీ, తర్వాత, ఆ 'విలువే' సరుకుల మారకపు 'సాంఘిక సంబంధం'లో తనను తాను వ్యక్తం చేసుకోగల్గిన లేదా అది వ్యక్తపరచబడే ఒకే ఒక స్వతంత్ర రూపమైన "మారకపు-విలువ'గా ఉంటుంద"నీ కనుగొన్నానంటాడు మార్క్స్. అలా, "ఒక సరుకు అంటే : "ఒక 'ఉపయోగపు-విలువ' లేదా వాడుక కోసం గల వస్తువు" మరియు 'విలువ'." "దాని సహజ రూపం కంటే విలక్షణంగా వుండే ఒక స్వతంత్ర వ్యక్తీకరణ రూపాన్ని (అంటే, మారకపు విలువ రూపాన్ని, వగైరా రూపాన్ని), దాని విలువ అందుకున్న ధరించిన వెన్వెంటనే, ఈ ద్వివిధములైన విషయంగా/ వస్తువుగా అది ఏదైే వున్నదోః దాన్ని అది వ్యక్తీకరించుకుంటుంది. ఈ విధంగా, నేను, వేటిలోకి అయితే ''విలువ'' అనే అమూర్తీకరణ (abstraction) విడిపోతుందో, అలాంటి పరస్పర వ్యతిరేకంగా వుండే ఉపయోగపు విలువ, మారకపు-విలువలుగా "విలువ"ను విభజించను; బదులుగా, శ్రమోత్పాదితం యొక్క నిర్దిష్ట సామాజిక రూపం అయిన "సరుకు" అంటే ఒకవైపున ఉపయోగపు విలువ, మరో వైపున "విలువ", "మారకపు విలువ కాదు", ఎందుకంటే, కేవల వ్యక్తీకరణ 'రూపం' అనేది దాని సొంత 'లోవిషయం '(content) కాదు' గనుక " అంటాడు మార్క్స్. ఈ విషయంలో అందుకే వాగ్నర్‌ను మసక మనిషి అని వ్యంగ్యంగా అంటాడు మార్క్స్.

7) సరుకు ఉపయోగ-విలువ ప్రాధాన్యతపై మార్క్స్ విశదీకరణ : వాగ్నర్ చెప్పే "మార్క్స్ సిద్ధాంతం సరుకు ఉపయోగపు-విలువ ప్రాముఖ్యతను తక్కువచేసి, మారకపు విలువను ప్రధానం చేస్తుంది" అన్నదాన్ని మార్క్స్ ఖండించి, సరుకు ఉపయోగపు-విలువ ప్రాముఖ్యతను తాను ఆసరికే 'పెట్టుబడి-1'లో చెప్పానని ఉదహరించి, 'వాగ్నర్ పై విమర్శ'లో దాన్ని ఈ క్రింది విధంగా విశదీకరిస్తాడు :

(అ) "సహజంగానే, ఉపయోగపు-విలువ అనేది దానికి వ్యతిరేకమైనదైన "విలువ" పోషించే పాత్రను పోషించదు." (పేజీలు-46,47)

(ఆ) "అతని సొంత శ్రమ యొక్క ఉత్పాదితంతో అతని అవసరాలను నేరుగా సంతృప్తిపరుచుకునే ఎవరైనా సరే, నిజానికి, ఉపయోగపు విలువలనే ఉత్పత్తి చేస్తాడు కానీ, సరుకులను కాదు. సరుకులను ఉత్పత్తి చేయాలంటే, అతను ఉపయోగపు-విలువను ఉత్పత్తి చేయటమే కాక, ఇతరుల కొరకు ఉపయోగపు-విలువలను అంటే, సామాజిక ఉపయోగపు-విలువలను కూడా తప్పకుండా ఉత్పత్తి చేయాలి."

(ఇ) "సరుకు గురించిన నా విశ్లేషణలో కూడా నేను, దానిని అది (సరుకు) వ్యక్తం చేసుకునే దాని ద్వంద్వ స్వభావం వద్ద విరామం తీసుకోలేదు, బదులుగా, వెంటనే ఈ క్రిందిది చూపేందుకు ముందుకెళ్ళాను:

సరుకు యొక్క ఈ ద్వంద్వ స్వభావంలోనే,

(1) సరుకు దేని ఉత్పాదితమో, 'ఆ శ్రమ యొక్క ద్వంద్వ స్వభావం' దానిని అది వ్యక్తం చేసుకుంటుందనీ, అంటే,

(i) ఉపయోగకరమైన శ్రమ గురించి, ఇంకా, ఉపయోగపు విలువను సృష్టించే శ్రమల నిర్దిష్ట విధాలను గురించి,

(ii) అనిర్దిష్ట శ్రమ గురించి, అంటే, 'శ్రమ-శక్తి వ్యయం' అయ్యే శ్రమ గురించి (అది ఖర్చు చేయబడిన "ఉపయోగకరమైన" విధంతో సంబంధం లేకుండా),

(2) సరుకు విలువ రూపం అభివృద్ధిలో, అంటే, దాని డబ్బు రూపం యొక్క చివరి సందర్భంలో, ఆ విధంగా డబ్బు యొక్క చివరి సందర్భంలో, ఒక సరుకు విలువ, దానిని అది ఇతర సరుకు యొక్క ఉపయోగపు విలువలో (అంటే, సరుకు సహజ రూపంలో) వ్యక్తం చేసుకుంటుందనీ, (3) ఏకంగా అదనపు విలువే 'శ్రమ-శక్తికి మాత్రమే ప్రత్యేకించి చెందిన ఒక "నిర్దిష్టమైన" ఉపయోగపు-విలువ' [1] నుండి రాబట్టబడుతుందనీ, వగైరా, వగైరా; అంటే, మరో మాటల్లో, పూర్తిగా వేరుగా వుండే ఒక ముఖ్యమైన పాత్రను, నాకు సంబంధించి, ఉపయోగపు-విలువ పోషిస్తుంది, కానీ, ఏ గమనిక క్రింద అంటే, అది ఆర్థిక నిర్మాణాలకు సంబంధించిన విశ్లేషణ నుండి మొలకెత్తే ఒక పరిగణనలోకి తీసుకున్నప్పుడు మాత్రమే, అంతేకానీ, ఇక్కడోసారి,

అక్కడోసారి అంటూ సాగే భావనల లేదా "ఉపయోగపు-విలువ", "విలువ"వంటి పదాల గురించి వాదించటం నుండి మొలకెత్తదు." (పేజీలు:48,49, 'వాగ్నర్ పై విమర్శ' చూడండి.)

[1]("ఒక సరుకు అనుభోగం నుండి 'విలువ'ని రాబట్టటానికి వీలుగా మన మిత్రుడైన డబ్బు-సంచి గారికి చలామణీ రంగం లోనే, మార్కెట్‌లోనే "విలువకి మూలంగా వుండే 'ప్రత్యేక స్వభావం గల ఉపయోగపు-విలువ ఉన్న' సరుకు" దొరికే అదృష్టం ఉండాలి. ఆ సరుకు వాస్తవ అనుభోగం అనేదే "స్వయంగా శ్రమకి సాకార రూపం, కనుక విలువ సృష్టి." డబ్బు గలవాడు మార్కెట్లో శ్రమ చేయగల సామర్థ్యం లేదా 'శ్రమ-శక్తి' అనే ప్రత్యేక సరుకుని కనుగొంటాడు."(పేజీ-153). "ఒక వైపున రోజువారీ శ్రమ-శక్తి పోషణకి అర రోజు శ్రమ మాత్రమే ఖర్చవుతుంది. మరో వైపున అదే శ్రమ-శక్తి మొత్తం రోజంతా పని చేయగలదు. కనుక, పెట్టుబడిదారుడు దాని ఉపయోగానికి చెల్లించే దానికంటే, ఒక రోజులో అది రెట్టింపు విలువని సృష్టిస్తుంది. ఈ పరిస్థితి నిస్సందేహంగా కొనుగోలుదారుని అదృష్టం, కానీ అమ్మేవానికి ఏవిధంగానూ హాని కలిగించదు {అంటే, పెట్టుబడిదారీ మారకపు, మార్కెట్ నియమాల కనుగుణంగా, మార్కెట్లో సాంప్రదాయంగా శ్రమకి అలానే విలువ ఉంది(తరతరాలుగా). పెట్టుబడిదారునికి మార్కెట్లో సహజంగానే లభించే ప్రత్యేక సరుకు ఇదే}."(పేజీ-177, పెట్టుబడి'-1).)

8) సరుకులు మారకం చేసుకోబడినప్పుడల్లా సరుకుల మారకపు విలువలో తనను తాను వ్యక్తపరచుకునే ఉమ్మడి పదార్థం /అసలు విషయం (substance) 'వాటి విలువ' అంటాడు మార్క్స్. అలా అది 'శ్రమ' అని తాను చెప్పనని అంటాడు. ఎందుకు చెప్పడో క్రింద వ్యయ సిద్ధాంతం' గురించిన వివరణలో మనం చూస్తాం. పెట్టుబడి' గ్రంథం, సంపుటి-1లో కూడా ఇలానే చెప్పానంటాడు మార్క్స్. ఈ సందర్భంలోనే "రికార్డో చెప్పిన 'వ్యయ సిద్ధాంతం' (cost theory) అనేది 'విలువ సాధారణ సిద్ధాంతం (general theory of value) అయినంతగా, మార్క్స్ సిద్ధాంతం కాదు" అని వాగ్నర్ చెప్పడానికి గల కారణాన్ని మార్క్స్ ఇలా చెబుతాడు : "రికార్డో సరుకు 'విలువ పరిమాణం' గురించి మాత్రమే పట్టింపు కల్గి వుండి, 'డబ్బు సిద్ధాంతం'తో అతని 'విలువ సిద్ధాంతం'కి గల ఏ లంకెనూ కనుగొనలేకపోయాడు, కానీ తన సిద్ధాంతం అలా ఉండదు కనుకే" అంటాడు. ఇక్కడే ఎహర్‌బార్ చాలా సరిగ్గా ఇలా ఉల్లేఖిస్తాడు : "..ఒక వి.వ. విలువను దాన్ని ఉత్పత్తి చేయటానికి అవసరమైన అన్ని పదార్థాల (ingredients) (శ్రమ-శక్తితో సహా) {శ్రమతో సహా అనుకోవచ్చు} (అంటే, ఆ వి.వ.ను ఉత్పత్తి చేయటానికి తప్పక కొనబడాల్సిన) విలువల మొత్తంగా కనుక ఎవరైనా నిర్వచించేందుకు ప్రయత్నిస్తే, అది తప్పవుతుంది." ఎందుకంటే, మార్క్స్ ప్రకారం, 'సరుకు విలువ' సైద్ధాంతికమైన ఒక భావన కాదు, బదులుగా, "అది ఒక చారిత్రకంగా అభివృద్ధి చెందిన రూపంలో ఏదో ఒక విషయాన్ని, ఏదైతే సమాజం యొక్క ఇతర అన్ని చారిత్రక రూపాల్లో కూడా ఉనికిలో ఉంటుందో దాన్ని కేవలం వ్యక్తపరుస్తుంది, కాకపోతే,ఒక వేరైన రూపంలో, దాన్నే చెప్పాలంటే, అది : "సామాజిక" శ్రమ-శక్తి వ్యయంగా ఉనికిలో వుండే మేరకు గల పేరైన "శ్రమ యొక్క సామాజిక లక్షణం" " కనుక.

9) అలానే, "ఆర్థిక శాస్త్రం అంటే, 'అనువర్తిత మానసిక శాస్త్రం' (Applied Psychology) అంటాడు వాగ్నర్" అని ఎహర్‌బార్ చెబుతాడు. తద్వారా వాగ్నర్ 'వ్యక్తి-కేంద్ర శాస్త్రం' ఐన ఆ మానసిక శాస్త్రంపై గల భావనతో మారకపు సాంఘిక-సంబంధం ఆధారంగా గల 'విలువ' అనే లక్షణాన్ని పట్టుకోలేక పోయాడనీ, ఆ మార్గంలో అది అసాధ్యమనీ, తప్పనీ మనం తెలుసుకునేట్లు ఎహర్‌బార్ చేశాడు.

10) సరుకు, విలువ, ఉపయోగపు విలువ, మారకపు విలువ (1వ అంశం కొనసాగింపు) : మనమిప్పుడు 'వాగ్నర్ పై విమర్శ'లో ఈ 'ఉపయోగపు-విలువ', 'విలువ పై మార్క్స్ చెప్పింది చూద్దాం. రెండు సరుకుల మధ్య సమాన మారకంలో మార్పిడయ్యే 'ఉపయోగపు-విలువ'[*] అంటే 'సమాన మానవ శ్రమ-శక్తి వ్యయం" అని మార్క్స్ చెబుతాడు. అలా మారకాల్లోని సరుకుల్లో 'తమ సరుకుకి బదులుగా వచ్చే అవతలివాని సరుకులో ఈ ఉపయోగపు-విలువ[*] సమానంగా ఉన్నది కనుకే మారకం చేసుకుంటాం' అని ఆ మారకందార్లు అనుకోరు. (దానికి విరుద్ధంగా, మార్పిడిలో మన విభిన్న ఉత్పాదితాలను విలువలుగా సమం అని చూపినప్పుడల్లా వాటిపైన వ్యయమైన విభిన్న తరహాల శ్రమని కూడా 'మానవ శ్రమగా సమం' అని చూపుతున్నామన్న మాట. : 'పెట్టుబడి', పేజీ-67). అయినా కానీ, ఈ అవగాహన ఉన్నందు వల్లే ఈ ఉపయోగపువిలువ ఒక్కదాని సహాయంతోనే వారి సరుకుకి 'సమాన విలువ' వచ్చే కొలత ఏదీ లేదు. కనుక, 'విలువ'ను 'సమానంగా పంచేలా' చేసే ఆ కొలతకై మారకాల్లో అలా విలువైన లోహాలు, వెండి, బంగారాల్లో మన్నికైన 'సార్వత్రిక సమ-విలువ'ను చరిత్రలో స్థిరీకరించుకుంటూ మారకాలను విస్తృతం, వేగవంతం చేసుకున్నారు. అలాంటి సమానం చేసే

కొలతయే/కొలమానమే' 'మారకపు విలువ'గా విలువ వ్యక్తీకరణను సులభం చేస్తుంది. అంటే, దీనర్థం: మార్పిడి అయ్యే సరుకు 'సార్వత్రిక సమ–విలువ రూపంలో ఎంత పరిమాణం'లో 'సమాన విలువ'గా చేతికొస్తుంది అనేదే. అలా 'విలువ' అనేది దాని స్వతంత్ర రూపంగా మారకాల్లో (అదీ, 'సరుకుల' స్థాయికి చెందిన అభివృద్ధి గల మారకాల్లో) తనను తాను వ్యక్తం చేసుకునే రూపంగా పైకొస్తుందంటాడు మార్క్స్. రెండు సరుకులు మాత్రమే మారకం అయ్యే సందర్భంలో, పెట్టుబడిదారీ మారకపు–నియమాల ప్రకారం, 'సమాన విలువలు' ఆ రకంగా,

(1) 'సమానం' (=సమాన మానవ శ్రమ–శక్తి వ్యయం) అనే లక్షణం ఐన 'ఉపయోగపు విలువ'లు{**}, (2) అదే సమయంలో 'ఆ ఉపయోగపు విలువ'లు{**} ఎంత పరిమాణంలో మారకం అవ్వాలి, అయ్యాయి అని తెలిపే 'సార్వత్రిక కొలత' వేయబడాలి. అప్పుడు, అలా 'ఆ సమాన విలువ యొక్క పరిమాణాన్ని' కొలిచేందుకు బహిర్గతమవటానికి 'విలువ' అనేది " 'మారకపు సాంఘిక సంబంధం'లో తనను తాను వ్యక్తం చేసుకోగల్గే సాధ్యమైన ఒకే ఒక 'వ్యక్తీకరణే' " ఈ మారకపు విలువ. ఇప్పుడు, 'డబ్బు రూపం'ని పరిశీలిస్తే, వస్త్రం అనేది ఇక ధాన్యంతోనూ, ఇనుముతోనూ, ఆ వరుసలో క్రిందికి గల లెక్కలేనన్ని సరుకులతోనూ రకరకాల నిష్పత్తుల్లో బంగారం అనే సార్వత్రిక సమ–విలువ ఐన సరుకుకి గల అత్యున్నతమైన, మెరుగైన కొలమానం చేయగల శక్తిని వాడుకలో చూస్తున్న దృష్ట్యా) పోల్చబడగలదు, మారకం చేయబడగలదు (ఎలాగంటే, సమీకరణం కుడివైపు గల Uను వాడుతూ, ఉదా॥కు : 40 గజాల వస్త్రం =4U=2x2U=2X1/4 బస్తా ధాన్యం =1/2 బస్తా ధాన్యం). అలానే మిగిలినవీ. (సమగ్ర వివరణకై 'పెట్టుబడి' చూడండి.)

కాబట్టి, సరుకులో ఉండే ఉపయోగపు విలువ, విలువ అనే లక్షణాలు మధ్యగల వైరుధ్యం పోయే వైపుగా, సమాజాభివృద్ధి క్రమంలో 'మారకపువిలువ' రూపంలో 'విలువ' తనను తాను వ్యక్తం చేసుకుంటుంది.


11) 'పెట్టుబడిపై లాభం, అదనపు–విలువ దోపిడీ'పై వాగ్నర్, మార్క్స్: వాగ్నర్ : "పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఉన్నంత కాలం పెట్టుబడిపై లాభం కూడా నిజానికి విలువ యొక్క ఒక ఆంగిక మూలాంశం. అంతే తప్ప సామ్యవాద దృష్టిలో గల 'పని వాని నుండి ఏదో మామూలుగా చేసిన ఒక కోతనో/తగ్గింపో' లేదా పనివాన్ని 'దోపిడీ' చేసినదో కాదు."

మార్క్స్ : వాగ్నర్ తనకు అంటగట్టిన పై నిందని ఖండిస్తూ, మార్క్స్ ఇలా అంటాడు : "'పెట్టుబడిపై లాభం' అంటే, శ్రామికున్ని చేసే దోపిడీ కాదు, విలువ యొక్క ఆంగిక మూలాంశం కాదు; పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి–ప్రక్రియకు ఆవశ్యక కార్యనిర్వాహకునిగా వుండే పెట్టుబడిదారుడు తాను 'దోచగల్గే భాగాన్ని ఉత్పత్తి చేసేలా శ్రామికున్ని ఒత్తిడిచేసి, అలా బయల్పడే 'అదనపు విలువ'ను శ్రామికునికి అతని శ్రమ–శక్తి యొక్క నిజమైన విలువను అతను చెల్లించిన వెన్వెంటనే అదనపు–విలువపై గల ప్రతి హక్కునూ, అంటే, ఈ ఉత్పత్తి సరళికి అనుగుణంగా వుండేటటు వంటి హక్కునూ కల్గివుంటాడనీ, నేను వివరంగా నా రచనలో విశదీకరించాను."

మార్క్స్ : "కార్మికులచే ఉత్పత్తి చేయబడిన అదనపు–విలువ ఒక్కటి మాత్రమే పెట్టుబడిదారీ ఔత్సాహిక వ్యాపారస్తుల (entrepreneurs) చేతుల్లో ఒక అసంమంజసమైన/అన్యాయమైన విధంలో మిగులుతుంది" అనే దృక్పథాన్ని ఆ మసక–మనిషి (వాగ్నర్) నాకు తప్పుగా అంటగడతాడు/ఆపాదిస్తాడు. వాస్తవానికి దానికి ఖచ్చితంగా వ్యతిరేకమైనదాన్ని నేనిలా చెబుతాను :(1) సరుకుల ఉత్పత్తి ఒక నిర్దిష్ట దశ వద్ద అత్యావశ్యకంగా 'పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తి'గా అవ్వాలనీ, (2) దాన్ని నిర్దేశించే విలువ నియమం ప్రకారం, అదనపు–విలువ' హక్కుగానే పెట్టుబడిదారునికి చెందుతుంది, కార్మికునికి చెందదు–అనీ."

12) ఉత్పాదక శ్రామికునిగా తనను తాను స్థాపించుకోడానికే తనవంటి వారి మేధోశ్రమల్ని 'సేవల' క్రింద పరిగణించాలంటూ వాగ్నర్ అందుకే అతని భావనలోని అంశాలకు సమర్థనగా 'బూర్జువా ఆర్థిక వ్యవస్థలోని ఆ అంశాల్నీ' శాశ్వతమంటూ దన్నుగా పెట్టుకుంటే, ఆ అంశాల అశాశ్వతత్వాన్ని వాగ్నర్ రచనల్లో నుండే ఉదహరిస్తూ మార్క్స్ విమర్శిస్తాడు. మొత్తం బూర్జువా ఆర్థిక వ్యవస్థ నియమాల అశాశ్వతత్వానికి రుజువుల్నీ వాగ్నర్ నుండే ఉదహరిస్తూ మార్క్స్ విమర్శిస్తాడు. 'వాగ్నర్‌పై విమర్శ' పుస్తకంలో మార్క్స్ చెప్పినదాని సారాంశమిదే.


సరుకు విలువ పై మార్క్స్ చేసిన ఈ విశదీకరణల తర్వాత కూడా సరుకు విలువపై మరిన్ని అధ్యయనాలకీ, ఈ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థనూ, అది ఆధారపడిన సరుకుల ఉత్పత్తినీ, సంబంధాలనూ సమూలంగా మార్చివేసే వైపుగా ఆ అధ్యయనాల ఫలితాలను సామాజిక విప్లవాలకు అన్వయించటానికి ఈ అనువాదం తోడ్పడుతుందని ఆశిస్తూ ❏



# ఇండియాలో బ్రిటీష్ పరిపాలన అధ్యయనానికి ఉపకరణాలు అందించిన మార్క్స్

కొప్పర్తి వెంకట రమణమూర్తి

భారతదేశంలో బ్రిటీష్ పాలన గురించి కార్ల్‌మార్క్స్ 1853 జూన్, జులై నెలల్లో మూడు వ్యాసాలు రాశాడు. లండన్ నుంచి న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ కోసం రాసిన ఆ వ్యాసాలు అందులోనే అచ్చయ్యాయి. అవి భారతదేశ బ్రిటిష్ ఆక్రమణ దాని ఫలితాలపై మార్క్స్ మౌలిక అవగాహనను మనకు తెలియజేస్తాయి. ఆ తర్వాత 1857లో తిరుగుబాటు సంభవించినపుడు ఆయన చాలా వ్యాసాలే రాసినా అవి తిరుగుబాటు గమనానికి పరిమితం కావడం గమనించవచ్చు. మార్క్స్ అన్ని రచనల్లో ప్రతిఫలించినట్టుగానే ఆయన విస్తారమైన అధ్యయనం, గతి తార్కిక భౌతిక వాద అన్వయం, సుదూరం నుంచైనా స్థితిగతులను దర్శించగల సునిశితమైన చూపు, భవిష్యత్ నిర్ధారణలు భారతదేశం గురించిన రచనల్లో కూడా ప్రతిఫలించాయి. ఒక్కసారి కూడా భారతదేశాన్ని సందర్శించని మార్క్స్‌కు భారతదేశ చరిత్ర మీద, సామాజిక ఆర్థిక వ్యవస్థల మీద, ప్రజల మానసిక బల దౌర్బల్యాల మీద, మతం మీద ఉన్న అవగాహన చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ మూడు రచనల్లో సమకాలీనులెవరూ దర్శించలేని భారతదేశ చిత్రపటాన్ని మార్క్స్ ఆవిష్కరించాడు. ఆయన చేసిన సూత్రీకరణలు బ్రిటిష్ ఆర్థిక దోపిడిని బట్టబయలు చేసి వారి విధానాలు సామాజిక వ్యవస్థలో తీసుకువచ్చిన పెను మార్పులను ప్రతిబింబించాయి. బ్రిటిష్ పాలనా ప్రభావాన్ని, ఫలితాలను అర్థం చేసుకోవడంలో అర్థశాస్త్రవేత్తలను, అర్థశాస్త్ర చరిత్రకారులను, చరిత్రకారులను విశేషంగా ప్రభావితం చేసిన మార్గదర్శకాలు ఆ వ్యాసాల్లో ఉన్నాయి. ఆ వ్యాసాలలో ఒక దాన్ని స్థూలంగా పరిశీలిస్తూ ఆ ప్రతిపాదనల సారాంశాన్ని గ్రహించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.




'ఇండియాలో బ్రిటిష్ పరిపాలన' అనే మొదటి వ్యాసం జూన్ 10, 1853న రాయబడి అదే నెల 25 న ప్రచురింప బడింది. 1853తో భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ వర్తక గుత్తాధిపత్య కాలపరిమితి ముగుస్తున్న నేపథ్యంలో బ్రిటిష్ పార్లమెంట్‌లో జరుగుతున్న చర్చ ప్రస్తావనతో ఈ వ్యాసం మొదలౌతుంది కానీ ఆ అంశం కొనసాగించబడలేదు. వెంటనే మార్క్స్ ఇండియాని యూరోపియన్‌లకు పరిచయం చెయ్యడానికా అన్నట్లు ఇటలీతో పోలిక తెచ్చి ఇటలీకి ఉత్తరాన మంచుతో నిండిన ఆల్ప్ పర్వతాలున్నట్టుగా ఇండియాకి హిమాలయాలు ఉన్నాయని మొదలుపెట్టి ఇటలీకి సిసిలీ ద్వీపం ఉన్నట్టు ఇండియాకు లంక ద్వీపం ఉందంటూ అనేక సాదృశ్యాలు చూపాడు. అన్నిటికన్నా ముఖ్యమైంది రెండు దేశాలూ అంతర్గతంగా చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయి ఉండడం. మార్క్స్ ప్రస్తావించలేదు కానీ ఈ రెండు దేశాల మధ్య మరికొన్ని పోలికలు కూడా ఉన్నాయి. రెండు దేశాలూ పురాతన నాగరికత లకు పుట్టిళ్లు. ఒకటి రోమన్ మరొకటి సింధు. రెండూ రెండు ప్రాచీన భాషలకు నెలవులు. ఒకటి లాటిన్ రెండు సంస్కృతం. రెండూ ద్వీపకల్పాలే. రెండు దేశాలూ దేశాలుగా చలామణీ అవుతున్నాయ్ గానీ దేశాలు కావు. ఇటలీని Geographical Expression అన్నారు ఇండియాని అనలేదు కానీ సారాంశంలో ఇండియా అదే. Geographical Expression అంటే భౌగోళిక వ్యక్తీకరణ. అంటే భౌగోళికంగా కొన్ని సరిహద్దుల మధ్య ఉండే నేలని దేశం అంటూ ఉంటారు. కానీ అందులో నివసించే ప్రజలు తామంతా ఒక దేశానికి చెందినవారమనే భావన కలిగి ఉండరు. నామమాత్రమైన అంటే పేరుకు మాత్రమే దేశం ఉంటుంది కానీ భావన ఉండదు. దీన్నే గురజాడ 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్నాడు. అయితే రాజకీయంగా ఇటలీ లాంటి ఇండియా సామాజికంగా మాత్రం ఎంతో వైవిధ్యం ఉన్న ఐర్లాండ్ వంటిదంటాడు మార్క్స్. ఈ సందర్భంగా హిందూ సమాజంలోని ఒకవైపు ఇంద్రియ లోలత్వం మరోవైపు కఠోర హింసల పాల్జేసే సన్యాసత్వం, ఒక వైపు లింగారాధన మరోవైపు జగన్నాథ (విష్ణు) భక్తి వంటి ద్వైదీ లక్షణాల్ని ప్రస్తావిస్తాడు.

ఈ సందర్భంగానే మార్క్స్ భారతదేశం గతంలో స్వర్ణ యుగాన్ని అనుభవించిందనే భావనను నిరాకరిస్తూ బ్రిటీష్ యుగంలో అది అంతకు ముందెప్పుడూ లేనంత దారిద్ర్యాన్నీ దైన్యాన్నీ చవిచూసిందనే కఠిన సత్యాన్ని ముందుకు తెచ్చాడు. గతంలో దేశం అంతర్యుద్ధాలతో దండయాత్రలతో, కరువు కాటకాలతో కునారిల్లి సర్వ విధ్వంసపూరితంగా కనపడినప్పటికి అది వ్యవస్థ ఉపరితలాన్ని దాటి మూలాలలోకి దిగలేదని అంటూ బ్రిటిష్ రాకడ మాత్రం భారత సామాజిక చట్రాన్నంతటినీ

తుత్తునియలు చేసింది అంటాడు. తన పురాతన వ్యవస్థను కోల్పోయిన భారతీయుడు నూతన ప్రపంచ నిర్మాణం జరగక పోవడం వల్ల ఏర్పడిన అనిశ్చితిలో ఉండడాన్ని ప్రస్తావిస్తాడు.


ఈ స్థితి ఎట్లా దాపురించిందో చెబుతూ ఇతర ఆసియా దేశాల్లో మాదిరిగానే ఇండియాలో కూడా మానవ నిర్మితాలైన కాల్వలు వంటి జలాధారాల మీద ఆధారపడి వ్యవసాయం సాగిందనీ, దాని నిర్వహణ కేంద్ర ప్రభుత్వ శక్తియుక్తుల మీద ఆధారపడి ఉండేదని అంటూ బ్రిటన్ భారతదేశంలో ఆర్థిక, యుద్ధ శాఖలను సంపూర్ణంగా వినియోగించుకుని లాభపడింది కానీ, పబ్లిక్‌వర్క్స్ శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందంటాడు. ఈ సందర్భంలోనే 'యూరప్‌లో అనుకూల అననుకూల రుతువులపై పంటలు ఎలా ఆధారపడుంటాయో, ఆసియాలో అనుకూల అననుకూల ప్రభుత్వాలపై పంటలు అలా ఆధారపడుంటాయి' అనే సూత్రీకరణ చేస్తాడు. ఇక్కడే మార్క్స్ అనంతర కాలంలో రెండు శతాబ్దాల పాటు భారతీయ ఆర్థిక వ్యవస్థ మీద ప్రభావం చూపిన పారిశ్రామిక విప్లవ ప్రభావం గురించి మాట్లాడుతాడు. పారిశ్రామిక విప్లవం అనే మాటను ఉపయోగించకుండా బ్రిటిష్ ఆవిరియంత్రమూ విజ్ఞానశాస్త్రమూ భారతీయ ఆర్థికవ్యవస్థకు వెన్నెముక లాంటి చేనేత పరిశ్రమను ఎట్లా విచ్ఛిన్నం చేశాయో వెలికి తెస్తాడు. మొదట భారతీయ వస్త్రాలను ఎగుమతి చేసుకుని వెండి బంగారాలను దిగుమతి చేసిన ఇంగ్లండ్‌కు ఆవిరి యంత్రాల సహాయంతో మరమగ్గాలను నడపడంతో విశేషంగా వస్త్రోత్పత్తి జరిగి భారతీయ వస్త్రాల అవసరం తీరిపోయింది. దాని స్థానే తమ మిల్లులకు ముడిసరకుగా పత్తి అవసరం కాగా, దేశం అది పండించే భూవనరుగా మారిపోయింది. దీన్ని ప్రస్తావిస్తూ ' భారతదేశపు చేమగ్గాన్ని నాశనం చేసినదీ, వడకురాట్నాన్ని ధ్వంసం చేసినదీ దేశంలో చొరబడిన బ్రిటిష్‌వాడే. యూరోపియన్ మార్కెట్ల నుండి హిందూ దేశపు నూలు బట్టలను తరిమివేయడంతో ప్రారంభించిన ఇంగ్లండ్ హిందూస్థానానికి నూలు ఎగుమతి ప్రారంభించి చివరికి పత్తికి పుట్టినిల్లయిన దేశాన్నే నూలు వస్త్రాలతో ముంచేసింది' అన్నాడు. చివరికి వ్యవసాయానికీ చేతి పరిశ్రమకీ మధ్యనున్న ఐక్యతను బ్రిటిష్ వాడు దేశం నుంచి పెకలించి వేయడాన్ని గుర్తించాడు మార్క్స్.

కామన్స్ సభ ప్రాచీన నివేదిక నొకదాని నుంచి భారతీయ గ్రామీణ వ్యవస్థ స్వరూప స్వభావాల గురించిన విలువైన సమాచారాన్ని ఉటంకిస్తాడు మార్క్స్ ఈ వ్యాసంలో. పటేలు, కరణం, తోటి, సరిహద్దుల మనిషి, నీటి పంపకం మనిషి, పురోహితుడు, బడిపంతులు వంటి ఉద్యోగులు నౌకర్లతో ప్రతి గ్రామానికీ పౌర ప్రభుత్వం ఒకటి ఉండేదనీ, గ్రామం ఉత్పత్తిలో నిర్వహణలో స్వయం సమృద్ధమై అది చెక్కు చెదరకుండా ఉన్నంత కాలం రాజ్యాలెలా విచ్ఛిన్నమైనా ఎవరి పాలన అంతమై ఎవరి పాలన ఆరంభమైనా ప్రజలు పట్టించుకునేవారు కాదని అంటూ అటువంటి వ్యవస్థని కూడా బ్రిటిష్ ఆర్థిక విధానం ముఖ్యంగా ఆవిరి యంత్రమూ laissez faire మీద ఆధారపడిన స్వేచ్ఛా వ్యాపారం విచ్ఛిన్నం చేశాయంటాడు. ఒక్క భారతదేశ వ్యవస్థలోనే కాదు, ఆసియా సామాజిక వ్యవస్థలోనే ఇటువంటి విప్లవం మున్నెన్నడూ జరగలేదు అంటాడు.

అయితే ఈ గ్రామ వ్యవస్థల పతనం విషాదకరమే అయినప్పటికీ ఆసియా దేశాల నిరంకుశ రాచరికాలకు ఇవే పునాదులుగా ఉన్నాయని, బావిలో కప్పల మాదిరిగా మానవ మేధను ఎంతగా కుదించాలో అంతగా కుదించివేసి, మూఢ నమ్మకాలతో సంప్రదాయిక నిబంధనల క్రింద మనిషిని బానిసగా, ప్రతిఘటనా రహితమైన పనిముట్టుగా మార్చివేశాయనీ విస్మరించ రాదంటాడు. అంతే కాదు కాస్తంత మడిచెక్క మీద దృష్టి నిలిపి మహా సామ్రాజ్యాలపతనం పట్ల సైతం ఉదాసీనంగా ఉండగల అనాగరిక స్వార్థం ఏ దురాక్రమణదారుని ఆక్రమణకో గురి కావడంలో ఆశ్చర్యం లేదని కూడా అంటాడు. ఆత్మగౌరవం లేకుండా జడత్వంతో స్థంభించిపోయిన ఈ జీవితమూ, సాత్వికమైన ఈ మనుగడలే రెండో వైపున వివిధశక్తుల్ని పురిగొల్పి నరహత్యనే మతకాండగా పరిగణించేటట్టు చేసిందని మరువ కూడదంటాడు. బానిసత్వంతో కులవివక్షతో కల్మషపూరితాలైన గ్రామ సమాజాలు పరిస్థితులపై ఆధిపత్యం వహించే శక్తి గల మనిషిని వాటికి లొంగిపోయేట్టు చేస్తున్నాయనీ, తాను స్వయంగా సాధించవలసిన అభివృద్ధిని ప్రకృతి ధర్మానికి వదిలివేసే పశువు లాగా మనిషిని మార్చి ఆ మనిషిని హనుమంతుడు, గోవు వంటి పశువుల ముందు మోకరిల్లే నీచ స్థితికి దిగజార్చాయంటాడు మార్క్స్.

ఆఖరుగా, ఇంగ్లండ్ స్వార్థ ప్రయోజనాల ఫలితంగానే ఇండియాలో సామాజిక విప్లవం సంభవించిందనడం ఎంత సత్యమో ఇండియాలోనే కాదు ఆసియాలోనే ఒక మౌలిక విప్లవం సాధించడంలో ఇంగ్లండ్ తనకు తెలియకుండానే ఒక పనిముట్టు అయిందనేది కూడా అంతే సత్యం అంటాడు.

మార్క్స్ హిందూ మతంలో నరహత్య కర్మకాండగా మారడం గురించీ, కులవ్యవస్థ గురించీ, హనుమంతుణ్ణీ గోవునూ దేవతలుగా ఆరాధించడం గురించీ చేసిన ప్రస్తావనలు అందులో మిళితమై ఉన్న అనాగరిక అర్ధనాగరిక లక్షణాలను బహిర్గతం చేస్తున్నాయి మొత్తంగా మార్క్స్ భారతదేశం మీద రాసిన ఈ తొలి వ్యాసంలోనే భారతీయ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన ఆర్థిక ఉపకరణాలను, ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న సామాజిక నిర్మాణాన్ని గతితార్కిక దృక్పథంతో చూశాడు. గడచిపోయిన తర్వాత కాకుండా పరిణామాలు సంభవిస్తున్న కాలంలోనే గుర్తించి విశ్లేషించడం మార్క్స్ మేధోశక్తికి నిదర్శనం. మార్క్స్ ఈ వ్యాసంలో వేసిన దారిలోనే అనంతర కాలపు భారతదేశంపై బ్రిటిష్ పరిపాలనా ఆర్థిక సామాజిక ప్రభావ అధ్యయనం అంతా నడచింది. ❑



# ఇండియాలో బ్రిటిష్ పరిపాలన భావి ఫలితాలు

మార్క్స్

లండన్, శుక్రవారం,
జూలై 22, 1853

ఇండియాపై నా అభిప్రాయాల వివరణను ఈ లేఖలో పూర్తి చేయనుద్దేశిస్తున్నాను.

ఇండియాలో ఇంగ్లీషు సార్వత్రిక పెత్తన స్థాపన ఎలా సంభవించింది? మొగల్ పాదుషా యొక్క సర్వాధికారాన్ని మొగల్ వైస్‌రాయిలు భగ్నం చేశారు. ఈ వైస్‌రాయిల అధికారాన్ని మహారాష్ట్రులు భగ్నం చేశారు. మహారాష్ట్రుల అధికారాన్ని ఆఫ్ఘనులు భగ్నం చేశారు. ఇక వీరందరూ ఒకరితో ఒకరు పోరాడుకుంటూన్న సమయంలో బ్రిటిష్ వాడు వీరిమధ్య చొరబడి వీరినందరినీ అణచివేయగలిగాడు. మహమ్మదీయుడూ హిందువుడూ అవే వ్యత్యాసం వల్లనే కాకుండా, తెగకీ తెగకీ, కులానికీ కులానికీ ఉన్న వ్యత్యాసంతో చీలిపోయిన దేశం; సమాజ సభ్యులందరి మధ్య సాధారణమైన అనిష్టమూ స్వాభావికంగానే ఉన్నట్టి ఒంటెత్తుతనమూ ఫలితంగా ఏర్పడిన ఒక విధమైన సమతాస్థితి ప్రాతిపదికపైన రూపొందిన నిర్మాణం గలిగిన సమాజం – ఇటువంటి దేశం, ఇటువంటి సమాజం విజేతల పాల పడితీరడమే దాని నిర్ణీత ఘటనగాక మరేమిటవుతుంది? హిందూస్థానం యొక్క భూతకాల చరిత్ర ఒకవేళ మనకేమీ తెలియదనే అనుకున్నప్పటికీ, ఇండియా ఖర్చు పైనే ఇండియన్ సైనికులతో కూడిన ఇండియన్ సైన్యమే ఈనాడు కూడా ఇండియాను ఇంగ్లీషు బానిసత్వం కింద అణచిపెట్టి ఉంచుతూందనే బృహత్తరమైనట్టీ నిర్వివాదమైనట్టీ వాస్తవ విషయం ఎక్కడికి పోతుంది? ఈ విధంగా వున్నప్పుడు విజేతల స్వాధీనంలో ఉండవలసిన గతిని ఇండియా తప్పించుకోలేక పోయింది; పోతే ఇక ఇండియా చరిత్ర అంతా కూడా దానిని జయించిన దిగ్విజయాల చరిత్రే తప్ప మరొకటి కానేకాదు. హిందూదేశపు సమాజానికి చరిత్ర అంటూ, అధమం చరిత్రకు తెలిసినవరకూ, లేనేలేదు. హిందూదేశపు చరిత్ర అని మనం అంటూన్నది, ప్రతిఘటన లేనట్టీ మార్పు లేనట్టీ సమాజం యొక్క జడమైన ప్రాతిపదికపై సామ్రాజ్యాలను స్థాపించినట్టి ఒకరి వెంట ఒకరు వరుసగా జొరబడినవారి చరిత్రే తప్ప మరేమీకాదు. అందుచేత, ఇండియాను జయించడానికి ఇంగ్లీషువారికి అధికారం ఉందా లేదా అనే ప్రశ్న కాకుండా, టర్కీ వాడిచేత, పర్ష్యా వాడిచేత, రష్యను వాడి చేత జయించబడడం ఇండియాకు మంచిదని మనం అనుకుంటామా, లేక బ్రిటిష్ వాడిచే జయించ బడడం ఇండియాకు మంచిదనుకుంటామా అన్నదే ప్రశ్న.

ఇండియాలో ఇంగ్లండు నిర్వహించవలసిన కర్తవ్యాలు రెండున్నాయి. ఒకటి విధ్వంసన కర్తవ్యం, రెండవది పునరుద్ధరణ కర్తవ్యం – పాతబడిపోయిన ఆసియాఖండపు సమాజాన్ని నాశనం చేయడమూ, ఆసియాలో పాశ్చాత్య సమాజం యొక్క పాదార్థిక పునాదులకు శంకుస్థాపన చేయడమూ.

ఇండియాపై వరుసగా దండెత్తి వచ్చిన అరబ్బులూ, తురుష్కులూ, తార్తారులూ, మొగలులూ ఆనతికాలంలో హిందూ దేశస్థులైపోయారు. నిర్వివాదమైన చారిత్రక నియమాన్ని అనుసరించి, అనాగరికులైన విజేతలు తమ పాలితుల ఉన్నత నాగరికత చేత జయించబడ్డారు. బ్రిటిష్ వారు ఉన్నత నాగరికత కలిగిన తొలి విజేతలైనందున హిందూ నాగరికత ప్రభావానికి అతీతులుగా ఉండిపోయారు. దేశీయమైన సమాజాలను భగ్నం చేసివేసి, దేశీయ పరిశ్రమను సమూలంగా పెళ్లగించివేసి, దేశీయ సమాజంలోని ఉదాత్తోన్నతములైనవాటినన్నింటినీ భూమట్టము గావించుటతో ఆ నాగరికతను వారు ధ్వంసం చేసివేశారు. ఆ విధ్వంసకార్యమే తప్ప వారి పరిపాలనా చరిత్ర పుటలలో మరేమీ లిఖితం కాలేదు. శిథిలాల నడిమధ్య నుండి పునరుద్ధరణ కార్యం కానరావడం దుస్సాధ్యమే. ఐనప్పటికీ అది ప్రారంభమయింది.

ఈ పునరుద్ధరణకు, మొగల్ పాదుషాల కింద దృఢపడిన దానికంటెనూ, విస్తరిల్లి నంతటికంటెనూ అపరిమితంగా దృఢపడిట్టిన్నీ విస్తరిల్లినట్టిన్నీ భారత రాజకీయ ఐక్యత ప్రథమ షరతుగా పరిణమించింది. బ్రిటిష్ ఖడ్గంచే బలాత్కారంగా ఇండియా నెత్తిని రుద్దబడిన ఈ ఐక్యత, ఇప్పుడు ఎలెక్ట్రిక్ టెలిగ్రాఫ్ మూలంగా బలపడి శాశ్వతమవుతుంది. హిందూదేశపు స్వయం విముక్తికీ, దారంటపోయే ప్రతి విదేశీయ దురాక్రమణదారుని వాత బడకుండా రక్షించుకోవడానికీ, బ్రిటిష్ డ్రిల్ సార్జెంటుచే నిర్మితమై, తర్ఫీదు పొందిన దేశీయ సైన్యమే sine qua non అయింది. మొట్ట మొదటిసారిగా ఆసియా ఖండపు సమాజంలో ప్రవేశపెట్టబడినట్టీ, హైందవ యూరపియను జననీజనకుల సంతానమైన వారిచే ప్రధానంగా నిర్వహింపబడుతూన్నట్టీ స్వేచ్ఛాయుతమైన వార్తాపత్రికలు ఈ పునర్నిర్మాణానికి నూతనమూ శక్తివంతమూ అయిన సాధనం. ఏహ్యాములే

అయినట్టి జమీందారీ, రైత్వారీ పద్ధతులు రెండూ, ఆసియా ఖండపు సమాజానికి అత్యంతావశ్యకమైన భూమిరూపంలో వుండే ప్రైవేటు ఆస్తి యొక్క ప్రత్యేకములైనట్టి వివిధములైన రెండు రూపాలు. ఇంగ్లీషు వారి అజమాయిషీ కింద అనిష్టతతోనూ అతిస్వల్పంగానూ కలకత్తాలో విద్యాబోధ గరపబడుతూన్న ఇండియా వాసులలోనే, పరిపాలనా విధులను నెరవేర్చే సామర్థ్యాలనూ, యూరపియన్ విజ్ఞాన శాస్త్రీయ భావాలనూ అవగాహన చేసుకున్నట్టి ఒక నూతన వర్గం ప్రాదుర్భవించు తూంది. యూరప్‌తో ఇండియాకు క్రమమైనట్టీ త్వరితమైనట్టీ రవాణా అవకాశాలను ఆవిరిశక్తి ఏర్పరచి, ఆగ్నేయ సముద్ర ప్రాంత మందలి రేవుపట్టణాలన్నిటితోనూ ఇండియాలోని రేవు పట్టణాలకు సంబంధాన్ని స్థాపించి, దాని జడత్వానికి ప్రధాన కారణమైన ఏకాంత జీవిత స్థితి నుండి దానిని పునరుద్ధరించింది. ఇంగ్లండుకూ ఇండియాకూ ఉన్న దూరాన్ని కాలాన్ని బట్టి గనుక కొలిచినట్టయితే, రైల్వేలూ స్టీమర్ల కలయిక ఫలితంగా, ఈ దూరం ఎనిమిది దినాలకు తగ్గించబడి, అద్భుతమైన ఆ దేశాన్ని ఈలాగున పాశ్చాత్య ప్రపంచం తనతో వాస్తవంగా కలిపివేసుకొనే రోజులు ఎంతో దూరంలో లేవు.

ఇండియా ప్రగతిపట్ల గ్రేట్ బ్రిటన్‌లోని పాలకవర్గాలకు ఇంతవరకూ కేవలం యాదృచ్ఛికమైనట్టి, తాత్కాలికమైనట్టీ, అసాధారణమైనట్టి ఆసక్తే ఉంటూ వచ్చింది. దానిని జయించాలనే ఆసక్తి ప్రభువర్గానికుండేది; దానిని కొల్లగొట్టి దోపిడిచెయ్యాలనే ఆసక్తి డబ్బుసంచులవర్గానికుండేది; దాని సరకులకంటె తమ సరకులను కారుచవకగా అమ్మాలని పరిశ్రమాధిపతివర్గాని కుండేది. కాని ఇప్పుడిదంతా అపసవ్యమయింది. సరకులను ఉత్పత్తి చేసే దేశంగా ఇండియా మార్పు చెందడమే తమకు ప్రాణతుల్యమైన విషయమనీ, ఇందుకుగాను అన్నిటికంటే ముఖ్యంగా నీటివసరులనూ, దేశంలో రవాణా సదుపాయాలనూ ఆ దేశానికి ప్రసాదించడం అత్యవసరమనీ పరిశ్రమాధిపతివర్గం కనిపెట్టింది. ఇండియా అంతటా రైలు మార్గాలు అల్లివేయాలని ఇప్పుడు వారి ఉద్దేశ్యం. కాగా తమ ఉద్దేశ్యాన్ని వారు నెరవేర్చు కుంటారు కూడా. దాని ఫలితాలు అనూహ్యామే అయి తీరుతాయి.

ఉత్పత్తి చేయబడే వివిధ రకాల సరుకులను రవాణా చేసేందుకూ, వాటిని మార్పిడి చేసుకునేందుకూ ఏవిధమైన అవకాశాలూ బొత్తిగా లేకపోవడం కారణంగానే ఇండియా యొక్క ఉత్పాదకశక్తులు కుంటుపడిపోయాయన్న విషయం జగత్ప్రసిద్ధమే. మార్పిడి సాధనాలు లేకపోవడం వల్ల ప్రకృతి ప్రసాదించిన సమృద్ధి నడిమధ్య సమాజంలో లేమి ఇండియాలో కనబడేటంతగా మరెక్కడా కూడా మనకు కనబడదు. 1848లో విచారణ జరిపిన ఒక హౌస్ ఆఫ్ కామన్స్ కమిటీ ఎదుట ఈ విధంగా రుజువైంది:

"ఖాందేష్ లో పావుటన్ను ధాన్యం 6 షిల్లింగుల నుండి 8 షిల్లింగుల వరకూ అమ్ముతూండిన సమయంలో, మట్టిరోడ్ల మీద బళ్లు నడవడం దుస్సాధ్యమయిన కారణంగా ఖాందేష్ నుండి దినుసు వచ్చే అవకాశం లేక పూనా పట్టణంలో పావుటన్ను ధాన్యం 64 షిల్లింగుల నుండి 70 షిల్లింగుల వరకూ అమ్ముతూ, కరువు మూలంగా ఆ పట్టణ వీధుల్లో జనం చచ్చిపోతున్నారు."

రైల్వే మార్గాలు వేయడానికి అవసరమైన కట్టలను నిర్మించేందుకు మట్టిని తీసే స్థలాలలో చెరువులను తవ్వించిన పక్షంలోనూ, వివిధ రైల్వే మార్గాల ప్రక్కనే పంట కాల్వలను తీయించిన పక్షంలోనూ, రైల్వేనిర్మాణం వ్యవసాయానికి సులువుగా తోడ్పడగలుగుతుంది. ఈలాగున ప్రాచ్యంలో వ్యవసాయానికి sine qua non అయిన పంటకాల్వలను విరివిగా విస్తరించ డానికి వీలుండి, తద్వారా నీరు లేకపోవడంవల్ల అతితరచుగా సంభవించే స్థానికమైన కరువుకాటకాలను నివారించడానికి వీలవుతుంది. ఈ విషయం దృష్టిలో పెట్టుకుని చూచినట్టయితే, తూర్పు పడమటి కనుమలకు చేరువనున్న జిల్లాలలో కాల్వ నీరు ఆధారం గల భూములు సహితము, అదే విస్తీర్ణం గల కాల్వనీరు ఆధారం లేని భూములకంటే మూడు రెట్లు అధికమైన పన్నులు చెల్లించుతూ, పది రెట్ల నుండి పన్నెండు రెట్ల వరకూ జీవనోపాధి కల్పించుతూ, పన్నెండు నుండి పదిహేను రెట్ల వరకూ అధికమైన లాభాలిస్తున్నాయన్న సంగతి మనం జ్ఞప్తికి తెచ్చుకుంటే రైల్వేల యొక్క సాధారణ ప్రాముఖ్యత ఎంతగా ఉంటుందో మనకు స్పష్టమై తీరుతుంది.

సైనిక స్థావరాల సిబ్బందినీ ఖర్చులనూ తగ్గించడానికి రైల్వేలు తోడ్పడతాయి. ఫోర్ట్ సెయింట్ విలియమ్‌లో టౌన్ మేజరైన కర్నల్ వారెన్, హౌస్ ఆఫ్ కామన్స్ సెలెక్ట్ కమిటీ ఎదుట ఈ విధంగా చెప్పాడు:

"దేశంలో దూరస్థలాల నుండి సమాచారం అందడానికి ఇప్పుడు ఎన్ని దినాలేమిటి, ఎన్ని వారాలు పడుతుందో అన్ని గంటలలోనే సమాచారం అందే సాధ్యతా, ఈ కొద్ది కాలపరిమితి లోనే సేనలనూ సామాన్లనూ ఉత్తరువులనిచ్చి పంపించే సాధ్యతా దృష్ట్యా ఈ విషయాల యొక్క ప్రాముఖ్యతను ఎంత అధికంగా చెప్పినప్పటికీ అతిశయోక్తి కానేరదు. మన సేనలను ఇప్పటికంటే ఇంకా మారుమూల వున్నట్టీ, ఆరోగ్యప్రదములైనట్టీ స్థావరాల్లో ఉంచడానికి వీలవుతుంది; వీటి కారణంగా జబ్బుల వల్ల మరణాలను విశేషంగా తగ్గించడానికి అవకాశం ఏర్పడుతుంది. అనేక గిడ్డంగులలో ఇప్పుడు సామానులను నిల్వచేసే స్థాయిలో అప్పుడిక నిల్వ చేయనవసరముండదు; కాగా శీతోష్ణస్థితి

కారణంగా సామానులు చెడిపోవడమువల్ల, ధ్వంసమవడము వల్ల కలిగే నష్టం కూడా అప్పుడు కలుగదు. సేవల సార్థకత హెచ్చయిన కొద్దీ అదే నిష్పత్తిలో వాటి సంఖ్యను కూడా తగ్గించి వేయడానికి వీలు కలుగుతుంది."

గ్రామ సంఘాల స్వయం పరిపాలనా నిర్మాణ, ఆర్థిక ప్రాతిపదికలు ధ్వంసం చేయబడ్డాయని మనకు తెలుసు; కాని వాటికున్న లక్షణాలన్నిటిలోనూ అత్యంత దుష్టలక్షణం, అచ్చు గుద్దినట్టు ఒకదానిని ఒకటి పోలినట్టి, ఒకదానితో ఒకదానికి సంబంధం లేకుండా వేర్వేరు అణువుల కింద విడిపోవడమనే లక్షణం మాత్రం ఇంకా అలాగే ఉండిపోయింది. ఈ గ్రామాల ఏకాంత జీవితస్థితి ఫలితంగానే ఇండియాలో రోడ్లు లేకపోవడం తటస్థించింది; రోడ్లు లేకపోవడం ఫలితంగా గ్రామాల ఏకాంత జీవితస్థితి మరింతగా శాశ్వతమయిపోయింది. ఈ పరిస్థితి ననుసరించి, ఒక నిర్దిష్టమైన హీనస్థాయినే వున్న సదుపాయాల తోనూ, కడమ గ్రామాలతో ఇంచుమించు సంబంధం లేకుండానూ, సాంఘిక ప్రగతికి ఆవశ్యమైన వాంఛలూ ప్రయత్నాలూ లేకుండానూ వున్న సంఘం తన మనుగడ సాగించుకుంటూ వచ్చింది. ఈ గ్రామాల స్వయంసమృద్ధ జడత్వాన్ని బ్రిటిష్ వారు భగ్నం చేసివేసిన తరువాత, రవాణా అవకాశాలను, ఇతర గ్రామాలతో పరస్పర సంబంధాలను నెలకొల్పుకోవాలనే నూతన వాంఛను రైల్వేలు ఇక కలిగించుతాయి. అంతేకాకుండా

"ఇతర దేశాలలో వున్న సాధనాలూ పనిముట్లను గూర్చిన జ్ఞానాన్ని, రైల్వేల ప్రభావానికి లోనైన ప్రతి గ్రామానికీ అందించి, వాటిని సంపాదించుకునే అవకాశం కలుగజేసి, కులవృత్తులను అనువంశికంగా అవలంభించుతూ జీతాలు పుచ్చుకుని పని చేస్తున్న గ్రామీణ చేతిపనివాళ్ల నైపుణ్యాన్ని దీని ఫలితంగా సంపూర్ణంగా వికసింపజేసి, అటుతరువాత దాని లోపాలను తీర్చుతుంది." (చాప్‌మన్ , "ఇండియా పత్తి, వాణిజ్యం").

తమ ఉత్పత్తులకు అవసరమయే పత్తి మొదలైన ముడి సరకులను చౌకగా గుంజుకొనే ఏకైక లక్ష్యంతోనే ఇండియాకు రైల్వేలను సమకూర్చే అభిప్రాయం ఇంగ్లీషు పరిశ్రమాధిపతి వర్గానికి ఉందని నాకు తెలుసు. కాని, ఒక దేశంలో వున్న రవాణా వ్యవస్థలో ఒకసారి గనుక మీరు యంత్రాలు ప్రవేశ పెట్టారంటే, ఆ దేశంలో ముడి ఇనుమూ రాక్షసిబొగ్గూ ఉన్న పక్షంలో, యంత్రోత్పత్తి చేయకుండా ఆ దేశాన్ని ఆపడం ఇక మీ తరం గాదు. రైల్వే రవాణా యొక్క తక్షణ, వర్తమాన అవసరాలను తీర్చగలిగే పారిశ్రామిక విధానాలను ఆ దేశంలో ప్రవేశపెట్టనిదే, ఒక బ్రహ్మాండమైన దేశంలో విస్తృతమైన రైల్వే మార్గాల అల్లికను మీరు కొనసాగించి దానిని సరైన స్థితిలో ఉంచలేరు; అంతేకాదు, రవాణా వ్యవస్థలో యంత్ర వినియోగాన్ని ప్రవేశ పెట్టడం, రైల్వేలతో తక్షణ సంబంధం లేనట్టి ఇతర పారిశ్రామిక రంగాలలో కూడా యంత్ర వినియోగానికి తప్పక దారితీసి తీరుతుంది. ఇందుచేత ఇండియాలో ఆధునిక పరిశ్రమకు రైల్వే వ్యవస్థ నిజమైన అంకురార్పణే అవుతుంది. నూతన శ్రమకు అలవాటుపడగలిగే ప్రత్యేక బుద్ధి కుశలతను అలవర్చుకోనేటట్టూ, అందుకు అవసరమయిన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకొనేటట్టూ హిందూ దేశస్థులకు బ్రిటిష్ వారి వల్లనే అవకాశాలు లభించుతాయి కాబట్టి ఇది జరగడం మరింత తథ్యం. కలకత్తా టంకశాలలో కొన్ని సంవత్సరాలుగా ఆవిరియంత్రాలను పని చేయించుతూన్నట్టి దేశీయ ఇంజనీర్లూ, హరిద్వార్ రాక్షసిబొగ్గు జిల్లాలలో ఉన్న అనేక ఆవిరి యంత్రాలు నడపడంలో నిమగ్నమైనట్టి ఇంకా ఇతరత్రానూ దేశీయ కార్మికులు ప్రదర్శించుతూన్నట్టి శక్తి సామర్థ్యాలూ, నైపుణ్య కుశలతలూ ఇందుకు ప్రబల నిదర్శనాలు. ఈస్ట్ ఇండియా కంపెనీ యొక్క రాగద్వేషాల ప్రభావాలు పూర్తిగా సోకినట్టి మిస్టర్ కాంబెల్ లాంటి వాడికే ఈ విధంగా ఒప్పుకోక తప్పింది కాదు:

"ఇండియా ప్రజానీకంలో అశేష జనానికి గొప్ప పారిశ్రామిక శీలమైన శక్తి వుంది; పెట్టుబడిని సంచయం చేసుకోవడానికి తగిన సామర్థ్యం వుంది; గణిత శాస్త్రాలను గ్రహించగలిగే స్ఫుటమైన మేధాశక్తి వుంది; లెక్కలు కట్టడానికీ, భౌతికశాస్త్రాలు ఆకళింపు చేసుకోవడానికి చక్కని ప్రజ్ఞ వుంది." "వారి బుద్ధి కుశలతలు అత్యంత శ్రేష్ఠమైనవి" అంటాడతడు.

హిందూ వర్ణ వ్యవస్థకు పునాదులైనట్టీ, హిందూదేశ ప్రగతికీ, హిందూ దేశశక్తికీ అంతిమ అవరోధాలైనట్టీ అనువంశికములైన శ్రమ విభజనలను, రైల్వే వ్యవస్థ ఫలితంగా ఏర్పడే ఆధునిక పరిశ్రమ తుడిచి పెట్టేస్తుంది.

ఇండియాలో బ్రిటిష్ బూర్జువావర్గం నిర్బంధంగా చేయవలసి వచ్చే కార్యాలేవీ కూడా ప్రజా బాహుళ్యాన్ని విముక్తి చేయనూ లేవు, దాని సాంఘిక స్థితిని భౌతికంగా మెరుగు పర్చనూ లేవు. కేవలం ఉత్పాదక శక్తుల అభివృద్ధి పైనే కాకుండా, ప్రధానంగా వాటిని ప్రజలు భుక్తం జేసుకోవడం పైనే ఇది ఆధారపడి వుంటుంది. ఈ రెండింటికీ తప్పనిసరిగా ఆవశ్యకము లైనట్టి భౌతిక పరిస్థితులను మాత్రం అవి తప్పకుండా స్థాపించి తీరుతాయి. బూర్జువా వర్గం ఎన్నడైనా ఇంతకు మించి చేసిందా? రక్త మలినాలలో నుండీ, దారిద్ర్యంలో నుండీ, అవమానంలో నుండీ వ్యక్తులనూ ప్రజలనూ ఈడ్వనిదే బూర్జువావర్గం ఎన్నడైనా ప్రగతిశీలమైన కార్యాన్నొక్కదానినైనా అమలు జరిపిందా?


గ్రేట్ బ్రిటన్‌లోనే నేడున్న పాలకవర్గాల స్థానాన్ని పారిశ్రామిక శ్రామికవర్గం ఆక్రమించుకొనే సమయం వస్తేనే తప్ప, లేదా ఇంగ్లీషు వారి దాస్యశృంఖలాలను హైందవులు తమంతటతామే తుత్తునియలుగా తెంచివేసుకునే శక్తిని అభివృద్ధి చేసుకోగలిగే సమయం వస్తేనే తప్ప, తమ మధ్య అక్కడక్కడ చెదురుమదురుగా బ్రిటిష్ బూర్జువావర్గం వెదజల్లిన నూతన సాంఘిక బీజాల ఫలితాలను ఇండియన్లు అంతవరకూ అనుభవించలేరు. ఏది ఏలా ఉన్నప్పటికీ, శాంతిస్వభావులైన దేశీయులలో అట్టడుగు వర్గాల వారు సహితమూ, ప్రిన్స్ పల్తికోవ్ చెప్పినట్టు "sont p us fins et plus adronts que les Ita lens" అయినట్టీ విదేశీయుల కింద అణగి వుండవలసి వచ్చినప్పటికీ, ఆ అణగి వుండడానికి సరియైత్తుగా ఒక విధమైన నిశ్చలమైన ఉదాత్తతను ప్రదర్శిస్తూన్నట్టీ, స్వాభావికంగా వారు సుళువుగా అలసటను చెందేవారే అయినప్పటికీ బ్రిటిష్ సైనిక ఆఫీసర్లకు భయ సంభ్రమాలను కొలిపినట్టి ధైర్యసాహసాలను ప్రదర్శించినట్టీ, మన భాషలకూ మన మతాలకూ పుట్టినిల్లయినట్టీ, జాట్ రూపంలో పురాతన జర్మన్ జాతి ప్రతినిధినీ, బ్రాహ్మణుని రూపంలో పురాతన గ్రీసు జాతి ప్రతినిధినీ మూర్తీభవింపజేస్తూందో, మహత్తరమైనట్టీ ఆసక్తిదాయకమైనట్టీ ఆ దేశం యొక్క పునరుద్ధరణ అద్య తనభావిలో కాకపోతే సుదూర భవిష్యత్తులోనైనా సరే తప్పక సంభవించి తీరుతుందనే మనం నిస్సందేహంగా ఆశించవచ్చు.

కొన్ని ముగింపు మాటలను చెప్పనిదే ఇండియా విషయాన్ని పూర్తి చేయడం భావ్యం గాదు.

తన స్వదేశంలో మర్యాద అయిన రూపాలను ధరించుతూ, తన స్వదేశాన్ని వదలివెళ్లి వలసదేశాల్లో మాత్రం తన నగ్నస్వరూపంలో స్వైరవిహారం చేస్తూన్నట్టి బూర్జువా నాగరికత యొక్క ప్రగాఢమైన కపటస్వభావమూ, స్వతస్సిద్ధమైన దాని బర్బరత్వమూ మనకళ్ల ముందు బట్టబయలుగా కనబడుతూనే వుంది. ఈ వర్గంవారు ఆస్తి హక్కులను సమర్థించుతారు; కాని బెంగాల్‌లోనూ, మద్రాసులోనూ, బొంబాయిలోనూ వచ్చినలాంటి వ్యావసాయిక విప్లవాలను ఏ విప్లవాత్మక పార్టీ అయినా, ఎన్నడైనా లేవదీసిందా? దొంగలలో గజదొంగ అయినట్టి లార్డ్‌క్లైవ్ స్వయంగానే అన్నట్టు, ఇండియాలో మామూలు అవినీతి వల్ల వారి డబ్బు దాహం తీరనప్పుడు దుర్మార్గమైన బలాత్కార చౌర్యానికి వారు ఒడిగట్టలేదా? జాతీయరుణం యొక్క అనుల్లంఘనీయమైన పవిత్రతను గూర్చి వారు యూరప్‌లో ప్రేలాపనలు గావించుతూ, అదే సమయంలో ఇండియాలో కంపెనీ నిధులకోసం తమ ప్రైవేటు నిల్వధనాన్ని పెట్టుబడి పెట్టిన రాజులకు లాభాలు పంచి పెట్టకుండా వాటిని వీరు జప్తు చేయలేదా? "పవిత్రమైన మన మతాన్ని" పరిరక్షించాలన్న సాకుతో ఫ్రెంచి విప్లవంపై వీరు యుద్ధం సాగించి, అదే సమయంలో ఇండియాలో క్రిస్టియన్ మత ప్రచారం చేయకూడదంటూ వీరు నిషేధించలేదా? ఒరిస్సా, బెంగాల్‌లలో వున్న దేవాలయాల యాత్రార్థం ప్రవాహాలుగా వచ్చే తీర్థ ప్రజల నుండి డబ్బుచేసుకోడానికై, జగన్నాథ దేవాలయంలో జరిగే హత్య, వ్యభిచారాల వర్తక వ్యాపారాన్ని వీరు కూడా సాగించలేదా? వీరూ "ఆస్తి, శాంతిభద్రతలు, కుటుంబం, మతం" అంటూ బోధించేవారు.

యూరప్ అంతటి బ్రహ్మాండమైన, 15 కోట్ల ఎకరాల విస్తీర్ణం కలిగిన ఇండియాకు సంబంధించి మనం పరిశీలించినట్టయితే, ఇంగ్లీషు పరిశ్రమ యొక్క వినాశకర ఫలితాలు ప్రస్ఫుటంగానూ, మనస్సును వ్యాకులపరచేవిగానూ ప్రత్యక్షమవుతున్నాయి. కాని, అవి నేడు అమలులో వున్నట్టి యావత్తు ఉత్పత్తి విధానం యొక్క కేవల స్వాభావిక ఫలితాలే అని మాత్రం మనం మర్చిపోగూడదు. 'పెట్టుబడి యొక్క సార్వభౌమాధిపత్య పాలన పైనే ఈ ఉత్పత్తి ఆధారపడుంది. ఒక స్వతంత్రమైన శక్తిగా పెట్టుబడి మనగల్గడానికి పెట్టుబడి కేంద్రీకరణ అనివార్యం. ప్రపంచమార్కెట్టుల పైన ఆ కేంద్రీకరణ యొక్క విధ్వంసకర ప్రభావం, నేడు నాగరికత చెందిన ప్రతి పట్టణంలోనూ పనిచేస్తూన్నట్టి అర్థశాస్త్ర అంతర్గత సజీవ నియమాలనే బృహత్తర పరిమాణాలలో బహిరంగపరుస్తున్నాయి. నూతన ప్రపంచం యొక్క భౌతిక ప్రాతిపదికను – ఇటు మానవాళి యొక్క పరస్పరాధారం పైనా, పరస్పర సాంగత్యానికి అవసరమైన సాధనాల పైనా ఆధారపడినట్టి విశ్వమానవ సాంగత్యమూ, అటు మానవుని ఉత్పాదక శక్తుల అభివృద్ధీ, ప్రకృతిశక్తుల యొక్క విజ్ఞానశాస్త్ర ప్రాబల్యస్వరూపంగా వనస్తూత్పత్తిని రూపొందించడమూ – బూర్జువా చారిత్రకయుగం సృష్టించాల్సి ఉంది. భూగర్భశక్తి జనితమైన విప్లవాలు ఏలాగైతే భూమి ఉపరితలాన్ని సృష్టించాయో, ఆ విధంగానే బూర్జువా పరిశ్రమా, వాణిజ్యమూ నూతన ప్రపంచం యొక్క ఈ భౌతిక పరిస్థితులను సృష్టించుతాయి. బూర్జువా శక ఫలితాలపై – ప్రపంచ మార్కెట్టు పైనా, ఆధునిక ఉత్పాదక శక్తులపైనా – బృహత్తరమైన ఒక సామాజిక విప్లవం ఎప్పుడైతే తన ఆధిపత్యాన్ని స్థాపించుకుని, ప్రజలందరిలోనూ ప్రగతిశీలురైన వారి సమిష్టి అదుపాజ్ఞలకు వాటిని లోను చేస్తుందో, అప్పుడు మాత్రమే, తాను సంహరించిన వారి పుర్రెల నుండే తప్ప వేరొక పాత్ర నుండి అమృతాన్ని పానం చేయని భయానక స్వరూపి అయిన ఆ పూజా విగ్రహ మూర్తిని మానవ ప్రగతి పోలడం మానుతుంది. ❑


మార్క్సుచే 1853 జూలై 22న రచించబడింది "New-York Daily Tribune" 1853 ఆగష్టు 8వ తేదీన 3840వ సంచికలో ప్రచురించడింది



# మార్క్స్ రచనల్లో పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాలు

కెవిన్.బి.యాండర్సన్

1850 దశకంలో మార్క్స్ పాశ్చాత్యేతర సమాజాల గురించి – ముఖ్యంగా భారత దేశం గురించి– చేసిన రచనలు, 1872 తర్వాతి కాలపు రచనల కన్నా ప్రచురమనే చెప్పాలి. ఈ తదుపరి రచనల్లో కొన్ని ఇప్పటికీ అముద్రితాలుగానే ఉండి పోయాయి. మార్క్స్ తన రచనల్లో ఒకే తరహా మూసకట్టు అభివృద్ధి పథం గురించిన, సాధారణంగా యూరప్ కేంద్రకమయిన, అవగాహన ప్రదర్శించాడనే విమర్శ, కొందరు విమర్శకుల రచనల్లో వినిపించడం కద్దు. మార్క్స్ తదుపరి రచనలు చదివితే, ఆయన ఈ తరహా అవగాహనకు దూరంగా జరిగాడనే అభిప్రాయం బలపడే అవకాశం ఉంది. దురదృష్టవశాత్తూ, ఈ తదుపరి రచనలు ఇప్పటికీ అముద్రితాలుగానే వున్నాయి. మార్క్స్ ఎంగెల్స్ సర్వరచనల సంకలనం –మెగా 2 లో భాగంగా వీటిని చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి.




**చైనా, భారత దేశం, రష్యాలపై 1848–59 మధ్యకాలంలో మార్క్స్ చేసిన రచనల్లో మూసకట్టు అభివృద్ధి పథం, యూరప్ కేంద్రక ఆలోచన విధానం, అంతకు మించిన విషయాలు**

మార్క్స్ ప్రధాన అధ్యయన రంగం పాశ్చాత్య పెట్టుబడిదారీ విధానమే. అయితే, ఆయన రెండు సందర్భాల్లో పాశ్చాత్యేతర పెట్టుబడిదారీ పూర్వ సమాజాల గురించి విస్తృతంగా రచనలు వెలువరించారు. యూరపియన్ కార్మికోద్యమం నిష్క్రియాపరత్వం లో కూరుకుని వుండిన దశల్లోనే మార్క్స్ ఈ తరహా రచనలు చేసి వుండడం కాకతాళీయం అయివుండదు. వాటిల్లో మొదటి దశ 1853–59 మధ్యకాలానికి చెందినది. అంతకు కొద్దికాలం ముందే మార్క్స్ లండన్ మహానగరానికి – ఒక అంతర్జాతీయ మహా సామ్రాజ్యం యొక్క బహుళజాతి కేంద్రానికి – మకాం మార్చి వున్నారు. అక్కడి బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీలోనే మార్క్స్ భారతదేశం గురించీ, చైనా గురించీ, టర్కిష్ ఆటమాన్ సామ్రాజ్యం గురించీ, రష్యా గురించీ విస్తృతంగా అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టారు. ఆయా సమాజాల గురించి మార్క్స్ వేలాది పేజీలకు విస్తరించిన విశ్లేషణాత్మక వ్యాసాలను 'న్యూయార్క్ ట్రిబ్యూన్' పత్రికలో ప్రచురించారు. ఈ వ్యాసాలను యూరప్ కేంద్రక అవగాహనతో చేసిన రచనలుగా తరచు పేర్కొనడం కద్దు. ఈ కోవకు చెందిన విమర్శనాత్మక వ్యాసాల సంకలనాల్లో అత్యంత ప్రచురమయిన పుస్తకానికి ష్లోమో అవినేరీ పరిచయ వాక్యాలు రాశారు. "యూరపేతర ప్రపంచం గురించి సామాన్యంగా మార్క్స్ వ్యక్తంచేసే అభిప్రాయాలు, 1848 నాటి కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలోనే, రూపుదిద్దుకోవడం జరిగింద''ని అవినేరీ అంటారు. 'మ్యానిఫెస్టోలో, సామ్రాజ్యవాదం గురించి క్లుప్తంగా వ్యాఖ్యానం చేశారు మార్క్స్. ఆసియా వెనకబాటుతనం గురించీ, పాశ్చాత్య పెట్టుబడిదారీ విధానం యొక్క ప్రగతిశీలత గురించీ – పాశ్చాత్య ఆధునికతావాదులు మాట్లాడే ధోరణిలోనే – మార్క్స్ వ్యాఖ్యానం కూడా సాగింది. ఆ వ్యాఖ్యానాన్ని ఒక్కసారి చూద్దాం:

"సకల ఉత్పత్తి పరికరాలను అత్యున్నత స్థాయికి చేర్చడం ద్వారానూ, సమాచార, రవాణా వనరులను అపారంగా అందుబాటులోకి తీసుకు రావడం ద్వారానూ, బూర్జువావర్గం అత్యంత అనాగరిక జాతులను సైతం నాగరికంగా మారుస్తుంది.

సరుకుల చవకధరలు బూర్జువా వర్గం దగ్గర వున్న భారీ ఫిరంగులు; వాటితో వాళ్లు చైనాగోడలను పేల్చిపారేస్తారు. ఈ ఫిరంగులతో, విదేశీయుల పట్ల అనాగరికులలో పాతుకుపోయిన అసహ్యాన్ని సయితం బూర్జువా వర్గం బలవంతంగా లొంగ దీస్తుంది. ప్రతి ఒక్క జాతీ బూర్జువా ఉత్పత్తి విధానాన్ని అవలంభించక తప్పని స్థితిని – లేదంటే, సమూలంగా అంతరించి

పోవలసిన దుస్థితిని– వాటి నెత్తిన రుద్దుతుంది బూర్జువా వర్గం. తాము నాగరికత అని పిలిచే జీవనవిధానాన్ని ఆయా సమాజాల్లో ప్రవేశపెట్టి, వాళ్లు కూడా బూర్జువాలుగా మారక తప్పని పరిస్థితి సృష్టిస్తుంది. ఒక్కమాటలో చెప్తే బూర్జువావర్గం మొత్తం ప్రపంచాన్ని తనకి ప్రతిరూపంగా సృష్టిస్తుంది."

ఈ వ్యాఖ్య చూస్తే, బ్రిటన్ చైనాపై 1842లో చేసిన మొదటి నల్లమందు యుద్ధాన్ని మార్క్స్ సమర్థిస్తున్నట్లు కనిపిస్తోంది. 1853లో "న్యూయార్క్ ట్రిబ్యునల్" వ్యాసాల్లో, భారత దేశం విషయంలో, మార్క్స్ ఇదే వైఖరి ప్రదర్శించినట్లు అనిపిస్తుంది. భారతదేశానికి, తనకంటూ ఓ వాస్తవ చరిత్ర కూడా కొరవడే టంతగా, ఆ దేశం స్తంభించిపోయిందన్నారు మార్క్స్. "భారత దేశంలో బ్రిటిష్ పాలన: భవిష్యత్ పర్యవసానాలు" పేరిట జులై 22న రాసిన వ్యాసలేఖలో ఆయన భారత్‌ను 'లొంగుబాటునే తలరాతగా కలిగివున్న అభాగ్య'గా అభివర్ణించారు. అనైక్యత కారణంగానే దానికా దుస్థితి ఎదురయిందన్నారు మార్క్స్. "భారత దేశం మహమ్మదీయులు, హిందువులుగా మాత్రమే చీలిపోయి లేదు; అక్కడ ఉండే ఒక తెగకు మరో తెగకూ మధ్య, ఒక కులానికీ మరో కులానికీ మధ్య ఆ దేశం చీలిపోయి వుం"దన్నారు మార్క్స్. "అంచేత, భారతదేశ చరిత్ర, ఒకదానివెంట ఒకటిగా సంభవించిన లొంగుబాట్లూ, ఓటముల చరిత్ర" అన్నారు మార్క్స్. అంతేకాదు– తీవ్రమయిన యూరప్ కేంద్రక వైఖరి ప్రదర్శిస్తూ, "భారత సమాజానికి చరిత్రే లేదు; కనీసం నలుగురికి తెలిసిన చరిత్ర భారత్‌కి లేదని చెప్తూ, భారతదేశం "దేన్నీ ప్రతిఘటించలేని, మార్పూచేర్పూ లేని సమాజంగా" తేల్చేశారు మార్క్స్. 1968లో అవినేరీ విమర్శ వెలువడిన దశాబ్దకాలానికి, 1978లో ఎడ్వర్డ్ సయీద్ ఈ వ్యాసాల్లో వ్యక్తమయిన యూరప్ కేంద్రక వైఖరిపైనా, జాతిపరమయిన దురభిమానం పైనా తన విమర్శను కేంద్రీకరించారు.

"భారత్ లాంటి పాశ్చాత్యేతర సమాజాలు ఆధునిక యూరపియన్ చరిత్రలో కనిపించిన రీతిలోనే పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరించక తప్పదన్నదే మార్క్స్ విశ్వాస"మని రాబర్ట్ టకర్ సూత్రీకరించారు. ఇటీవలివరకూ పరిశోధక పండితుల్లో అత్యధికులు టకర్ సూచించిన ఈ సూత్రీకరణనే ఆమోదిస్తూ వచ్చారు. మార్క్స్ ఒకేతరహా అభివృద్ధి పథాన్ని మాత్రమే గుర్తించాడనే చర్చకు పోస్ట్ మోడర్న్ మెరుగులు దిద్దారు జ్యాఁ ఫ్రాన్స్‌వా లయటార్డ్. నిర్దిష్టత–విశిష్టతలను దిగమింగే, ఆధునికీకరణకు సంబంధించిన మహత్తర సిద్ధాంతం ఉచ్చులో మార్క్స్ చిక్కుకుపోయాడని లయటార్డ్ ఆరోపించారు.

అయితే, రాజకీయ జాతీయవాదం, సాంప్రదాయిక–జాతి పరమయిన అస్తిత్వం, వలసవాదంలాంటి విషయాలపై మార్క్స్ అవగాహన గురించి సాధారణంగా వ్యక్తమయ్యే అభిప్రాయాల గురించి ఎరికా బెనర్ లాంటి నిపుణులయిన పరిశోధకులు కొన్ని హెచ్చరికలు చేశారు. ఈ విషయాల గురించిన మార్క్స్ రచనల్లో అనేక అర్థచ్ఛాయలున్నాయని ఎరికా బెనర్ వివరించారు. 1853లో భారత దేశం గురించి మార్క్స్ రాసిన వ్యాసాలపై ఎన్నో విమర్శలొచ్చాయి. అయితే, వాటిని ఆసాంతం అధ్యయనం చేస్తే, అప్పటి మార్క్స్ వైఖరి ఏకపక్షంగా ఉందనే సాధారణ అభిప్రాయానికి భిన్నమయిన అభిప్రాయం కలుగుతుంది. ఇంతకు ముందు ప్రస్తావనకి వచ్చిన ట్రిబ్యూన్' వ్యాసంలో మార్క్స్ ఇలాక్కూడా రాశారు మరి: "బ్రిటిష్ పెట్టుబడిదారులు, భారత సమాజంలో వెదజల్లిన నూతన సమాజ జీవన బీజాల ఫలాలను, అక్కడి ప్రజలు ఇప్పట్లో అనుభవించజాలరు. బ్రిటన్‌లో ప్రస్తుతం పెత్తనం వెలగబెట్టే పాలకవర్గాల స్థానంలో పారిశ్రామిక కార్మిక వర్గం అధికారంలోకి వచ్చేటంతవరకూ, లేదా హిందువులు (అంటే, భారతీయులు) స్వయంగా బలం పుంజుకుని ఇంగ్లీష్ పెత్తనం కాడిని విదిలించుకునేటంతవరకూ, భారతీయుల చేతికి ఆ ఫలాలు అందవు! ఏది ఎలా జరిగినప్పటికీ, సుదూర భవిష్యత్తులో ఆసక్తిని రేకెత్తించే ఆ మహత్తర దేశం తిరిగి జవజీవాలు పుంజుకోగలదని మాత్రం నమ్మకంగా చెప్పుకోవచ్చు'

(ఇంగ్లీష్ లో వచ్చిన 'మార్క్స్–ఎంగెల్స్ సంపూర్ణరచనలు' 12వ సంపుటం, 221 పేజీ)

భారతదేశం పట్ల మార్క్స్ వైఖరి గతితార్కికమయినదని దీన్ని బట్టి అర్థమవుతోంది. బ్రిటిష్ పాలకులు భారతీయ సమాజంలో పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థను కూలదోసి, ప్రగతి నెలకొల్పిన మాట నిజమే. కానీ, "పెట్టుబడిదారీ నాగరికతలో అంతర్భాగమయిన అనాగరికతతో నిండివుండే, ఈ ప్రగతి"ని భారతీయులు తమంత తామే అధిగమించాలని కూడా మార్క్స్ చెప్పారు. 'మ్యానిఫెస్టోలో ప్రకటితమయిన 'అనాగరిక' ప్రాచ్యం, నాగరిక పాశ్చాత్యం అనే జాతిపరమయిన వైరుధ్యం ఇందులో పల్చబడిన మాట నిజమే కానీ, ఈ ప్రకటనలోనూ ఒకేతరహా అభివృద్ధి వైఖరే సూచితమయివుంది. భారతదేశం పెట్టుబడిదారీ అభివృద్ధిపథంలో ముందుకుసాగడం సామాజిక విమోచనకు ఒక షరతులాంటిదని మార్క్స్ ప్రకటించడం గమనార్హం.

1856–59 సంవత్సరాల మధ్య చైనీయులూ, భారతీయులూ బ్రిటనను ప్రతిఘటించడాన్ని మార్క్స్ బలంగా

సమర్థించిన వాస్తవాన్ని గుర్తించినవారు తక్కువే. ఈ విషయంపై మార్క్స్ విస్తృతంగా రాశారు. 1842నాటి మొదటి నల్లమందు యుద్ధం గురించి 'మ్యానిఫెస్టో'లో రాసినదానికి విరుద్ధమయిన అభిప్రాయం ఈ దశలో ప్రకటించారు మార్క్స్. చైనీయులను అనాగరికులుగానూ, బ్రిటిష్ వారిని నాగరికులుగానూ అందులో రాసిన దానికి పూర్తి విరుద్ధమయిన భావాలను 1857నాటి ట్రిబ్యూన్ వ్యాసాల్లో మార్క్స్ ప్రకటించారు. మొదటి నల్లమందు యుద్ధం గురించి పునఃప్రస్తావిస్తూ మార్క్స్ ఇలా రాశారు: "ఆ యుద్ధంలో ఇంగ్లీష్ సైనికులు, కేవలం తమ పైశాచికానందం కోసం, జుగుప్సాకరమయిన దారుణాలకు తెగబడ్డారు. వారి దురాగతాలు, మతవిద్వేషం కారణంగా పెచ్చరిల్లినవి కావు; బలప్రయోగం చేసి, తమను పాదాక్రాంతం చేసుకుంటూన్న జాతిపై రేగిన ద్వేషమూ కాదది; శత్రువును ధైర్యంగా ప్రతిఘటించిన ప్రత్యర్థి కలగజేసిన కోపమూ కాదు; స్త్రీలపై అత్యాచారాలు సాగించడం, పిల్లలపై ఖాండ్రించి ఉమ్మేయడం, ఊళ్లకు ఊళ్లను మలమల మాడ్చిపారేయడం, ఇవన్నీ కేవలం వినోద క్రీడలు మాత్రమే! వాటికి సంబంధించిన సమాచారాన్ని నమోదు చేసింది కూడా చైనీయులు కాదు – స్వయంగా బ్రిటిష్ సైన్యాధికారులే ఈ విషయాలను చరిత్రకెక్కించారు."

(ఇంగ్లీష్ లో వచ్చిన 'మార్క్స్ ఎంగెల్స్ సంపూర్ణరచనలు' 15వ సంపుటం, 353–354 పేజీలు.)

1857 నాటి 'సిపాయి పితూరీ' గురించిన వ్యాసాలు రాస్తూ వుండిన సందర్భంగా, భారతదేశం విషయంలో కూడా, మార్క్స్ వైఖరిలో ఇటువంటి మార్పే కనిపించింది. నాగరికతనూ, అభివృద్ధినీ ప్రసాదించిన వనరుగా వలసవాదాన్ని చూపించే ప్రస్తావనలు మార్క్స్ వ్యాసాల్లో చాలామట్టుకు అంతరించిపోయాయి.

ఇదే రోజుల్లో మార్క్స్, యూరపియన్ నాగరిక ప్రపంచానికి అంచున వున్న, భారీ వ్యావసాయిక దేశం రష్యా గురించి తన వైఖరిని కూడా మార్చుకోవడం మొదలుపెట్టారు. 1840 దశకం మొదలుకుని 50 దశకం మధ్య వరకూ కూడా మార్క్స్ రష్యాను ఘోరమయిన అభివృద్ధి నిరోధక సమాజంగానే అభివర్ణిస్తూ వచ్చారు. "పద్దెనిమిదో శతాబ్దపు రహస్య దౌత్య చరిత్ర" లాంటి రచనల్లో ఈ ధోరణి కొట్టొచ్చినట్లు కనిపించేది. రష్యన్ సమాజానికి విప్లవం తీసుకువచ్చే సామర్థ్యం కొరవడిందనీ పైపెచ్చు – 1848 లో లాగా ఇతరత్రా యూరప్‌లో ఎక్కడయినా విప్లవ శక్తులు తలెత్తితే, రష్యా వాటిని అణచిపారేసే ప్రమాదం కూడా వుందనీ అప్పట్లో రాశారు మార్క్స్. అయితే, 1850 దశకం చివర్లో రష్యాలో వ్యావసాయిక సంక్షోభం తలెత్తడం, పర్యవసానంగా జార్ చక్రవర్తి రష్యన్ రైతులకు దాస్యం నుంచి విముక్తి కల్పించడం జరిగిన తర్వాత, రష్యాపట్ల మార్క్స్ దృక్పథంలో మార్పు మొదలయింది. 1858లో ఆయన 'ట్రిబ్యూన్'కి రష్యన్ రైతుల దాస్య విమోచన గురించి ఓ వ్యాసం రాశారు. రష్యాలో సామాజిక విప్లవం తలెత్తితే అది "రష్యన్ చరిత్రలో రెండో మూలమలుపు కాగలదు. చివరికది, అక్కడ పీటర్ ద గ్రేట్ ప్రవేశపెట్టిన బూటకపు, డాబుసరి నాగరికత స్థానంలో సార్వత్రిక నాగరికతను సంస్థాపించగలదని ఆ వ్యాసంలో మార్క్స్ రాశారు.

(ఇంగ్లీష్‌లో వచ్చిన 'మార్క్స్ ఎంగెల్స్ సంపూర్ణరచనలు' 16వ సంపుటం, 147వ పేజీ.)

ఇక్కడ గమనార్హమయిన విషయం ఏమిటంటే, 'మ్యానిఫెస్టో' ఒక్కటి తప్ప, భారత్ – చైనా – రష్యాలపై రాసిన వ్యాసాలన్నీ ఇంగ్లీష్‌లో రాసినవే; జెర్మన్‌లో రాసినవి కావు! 1849లో, లండన్‌కి మకాం మార్చిన తర్వాత ప్రపంచ నాగరికతలూ సంస్కృతుల వైవిధ్యం పట్ల మార్క్స్ మెరుగయిన పరిజ్ఞానం సమకూర్చుకున్నారనే వాస్తవంతో, ఈ మార్పు ముడిపడివుంది.

1857–58 సంవత్సరాల నాటి 'రాజకీయ అర్థశాస్త్ర సమగ్రరేఖా చిత్రం' (గ్రాంట్ రిసా)లో మార్క్స్ పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి విధానాల గురించి రాశారు. లారెన్స్ కేడర్ లాంటి పరిశోధకులు వాటిపై విస్తృతంగా చర్చించారు. మార్క్స్ ఒకే తరహా ఉత్పత్తి విధాన వైఖరి నుంచి దూరం జరగడం – అది కూడా విస్పష్టమయిన సైద్ధాంతిక స్థాయిలో జరగడం – ఈ విభాగాలతో మొదలైందని కేడర్ తదితరులు అన్నారు. అయితే, అప్పట్లో అనేక తరహాల ఉత్పత్తివిధానాలు ఉండగల అవకాశాలపై చేసిన సూచనాత్మక క్లుప్త వ్యాఖ్యలపై చర్చ కొనసాగించలేదు. దానికి బదులు తర్వాత 'రాజకీయ అర్థశాస్త్ర సమగ్ర రేఖాచిత్రం'లో ఆధునిక పెట్టుబడిదారీ విధానం గురించిన విభాగాన్ని దశాబ్దం పాటు విస్తృతంగా అభివృద్ధి చేశారు. చివరికి, 1867లో 'పెట్టుబడి' తొలిసంపుటాన్ని జెర్మన్‌లో ప్రచురించారు.

## బహుళ అభివృద్ధి పథాల దిశగా, సరికొత్త కేంద్రీకరణ వైపు; మార్క్స్ జీవితంలోని చిట్టచివరి దశాబ్దంలో - 1872-83 మధ్య కాలంలో- మూడు ఆలోచన స్రవంతులు

1871 మే చివరి వారంలో, ప్యారిస్ కమ్యూన్ పతనం పర్యవసానంగా, పాశ్చాత్య దేశాల్లో కార్మికోద్యమం కుప్పకూలిపోయింది. ఈ నేపథ్యంలో మార్క్స్ మరోసారి పాశ్చాత్యేతర సమాజాలపై కేంద్రీకరించారు. 1872–83 మధ్యకాలంలో,

మార్క్స్ జీవితంలోని చిట్టచివరి దశాబ్దంలో, ఆయన ఆలోచనలో మూడు మార్గాలు, లేదా స్రవంతులు ఏర్పడ్డాయి. ఆ రోజుల్లోని మార్క్స్ రచనలు చూస్తే ఈ మార్పు గోచరిస్తుంది. ఆ మూడు స్రవంతులూ ఇవి: 1. 'పెట్టుబడి' తొలి సంపుటం ఫ్రెంచ్ ప్రచురణలో చేసిన సవరణలు. ఒకే తరహా అభివృద్ధి పథానికి సంబంధించిన సూచనలను తొలగించే నిమిత్తం ఈ సవరణలను చేశారాయన. 2. రష్యాపై చేసిన కొత్త రచనలు. అక్కడి ఉమ్మడి గ్రామీణ వ్యవస్థ, సోషలిస్ట్ అభివృద్ధికి తొలి అడుగు కాగలదని సూచించడం. 3. 1879-82 మధ్యకాలంలో మార్క్స్ రాసుకున్న నోట్‌బుక్స్. ఇవి ఇప్పటి వరకూ ఏ భాషలోనూ ముద్రితం కాలేదు. ఈ నోట్‌బుక్స్‌ను, మొత్తంగా, 'మెగా 2,IV/27 సంపుటి'లో చేరుస్తున్నారు.

ఈ పుస్తకాలలో విస్తృత పరిధిలో, విభిన్న సమాజాల గురించిన అధ్యయనాలు ఉన్నాయి. భారత చరిత్ర గురించి, గ్రామీణ సంస్కృతి గురించిన అధ్యయనాలు సైతం ఈ నోట్‌బుక్స్ లో ఉన్నాయి. ఇండోనేసియాలో డచ్ వలసవాదం గురించీ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గురించీ- అటు అమెరికన్ మూలవాసుల లోనూ, ఇటు ప్రాచీన గ్రీకు - రోమన్ నాగరికులలోనూ స్త్రీ పురుష సంబంధాలు, బంధుత్వ వ్యవస్థల గురించీ- అల్జీరియా, లాటిన్ అమెరికా దేశాల్లో వలసవాదం ప్రవేశించకపూర్వం, వలసలు ఏర్పడిన తర్వాతా ఉండిన ఉమ్మడి - వ్యక్తిగత ఆస్తుల విధానాల గురించీ మార్క్స్ ఈ నోట్‌బుక్స్‌లో రాసుకున్నారు.

వీటిల్లో మొట్టమొదటివి 'పెట్టుబడి' తొలి సంపుటం ఫ్రెంచ్ ప్రచురణలో చేసిన సవరణలు. 1872-75 సంవత్సరాల మధ్య కాలంలో, వాయిదాల పద్ధతిలో అచ్చయిన ఈ ప్రచురణ తాలూకు ప్రతిని మార్క్స్ స్వయంగా అచ్చుకు సిద్ధం చేశారు. 1872లోనే, 'పెట్టుబడి' తొలి సంపుటం జెర్మన్ ప్రచురణ కూడా వెలువడింది. 1867లో అచ్చయిన 'పెట్టుబడి' తొలి ప్రచురణ ప్రతితో పోల్చి చూస్తే, ఈ రెండు ప్రతులలోనూ మార్క్స్ విస్తృతమయిన సవరణ లను చేశారని తెలుస్తుంది. 1872-75 మధ్యకాలంలో వెలువడిన 'పెట్టుబడి' తొలి సంపుటం ఫ్రెంచ్ ప్రచురణలో చేసిన సవరణ లను, ప్రామాణిక జెర్మన్, ఇంగ్లీష్ ప్రతులలో ఇప్పటికి కూడా చేర్చలేదు! అయితే, సరుకు పూజ గురించిన ప్రత్యేక విభాగాన్ని మాత్రం ప్రామాణీకరించి, ఈ ప్రతుల్లో చేర్చారు.

'పెట్టుబడి' ఫ్రెంచ్ ప్రచురణలో బహుళ అభివృద్ధిపథాల గురించి మార్క్స్ చేసిన రెండే సవరణలకు నేనిక్కడ పరిమితం అవుతున్నా. ఇవి, ప్రామాణిక ఇంగ్లీష్, లేదా జెర్మన్ ప్రతుల్లో కనిపించవు.

పెట్టుబడిదారీ సమాజాలకు, తద్భిన్నమయిన సమాజాలతో కలిగి వుండే సంబంధాల గురించిన ఈ ప్రకటన సుప్రసిద్ధం. 1976 నాటి ఆంగ్ల ప్రతిలో ఉన్న ప్రకటన అర్థమిది: "పారిశ్రామికంగా ఎక్కువ అభివృద్ధి చెంది వున్న దేశం, అంతకన్నా తక్కువ అభివృద్ధిని సాధించిన దేశానికి, తన భవిష్యత్ చిత్రాన్ని ప్రదర్శిస్తుంది." 'పెట్టుబడి' తొలి సంపుటాన్ని నిర్ధారణాంధత్వంతో కూడినదిగా విమర్శించే వారిలో కొందరు, ఇదే ప్రకటనను ఉటంకించడం కద్దు. మానవ సమాజాలన్నీ ఒకే అభివృద్ధిపథాన్ని -19వ శతాబ్దంలో ఇంగ్లండ్ అనుసరించిన పెట్టుబడిదారీ అభివృద్ధి పథాన్నే అనుసరించాల్సిందేనని మార్క్స్ భావించాడని భాష్యం చెప్పడానికి ఈ ప్రకటననే విమర్శకులు పేర్కొంటున్నారు. (ఉదాహరణకి 1983లో షానిన్ చేసిన విమర్శ.) అయితే, 'పెట్టుబడి' ఫ్రెంచ్ ప్రచురణలో దీన్ని మార్క్స్ ఎలా సవరించి, వివరించారో చూడండి: "పారిశ్రామికంగా ఎక్కువ అభివృద్ధి చెందిన దేశం, అదే పారిశ్రామిక పథాన్ని అనుసరించే దేశానికి మాత్రమే, తన భవిష్యత్ చిత్రాన్ని ప్రదర్శిస్తుంది"

ఒకానొక దేశం అమలుచేసే అభివృద్ధిపథాన్ని అనుసరించే మరో దేశానికి - పారిశ్రామికీకరణ దిశగా అభివృద్ధి చెందే వేరే దేశానికి మాత్రమే ఈ ప్రకటనను స్పష్టంగా పరిమితం చెయ్యడం కనిపిస్తోంది. ఆ రోజుల్లో పారిశ్రామికేతర సమాజాలుగా ఉండిన రష్యా, భారతదేశం లాంటి దేశాలను ఈ ప్రకటన పరిధిలోకి రానివ్వకుండా మార్క్స్ చేసిన సవరణ నివారిస్తోంది. తద్వారా, ఆయా సమాజాలు ప్రత్యామ్నాయ అభివృద్ధి పథాలను అనుసరించ గల అవకాశం ఉందని చెప్పినట్లయింది.

'పెట్టుబడి' గ్రంథం తొలిసంపుటంలోనే, 'ఆదిమ పెట్టుబడి సంచయనం' గురించి చర్చించిన మరో భాగంలో కూడా మార్క్స్ ఇదే మాదిరి సవరణలు చేశారు. రైతాంగం చేతిలోంచి సంపదను స్వాయత్తం చేసుకుని, పెట్టుబడిదారీ విధానం పుట్టుకురావడం గురించి చెప్పే భాగమది. ఇంగ్లీష్‌లోనూ, జెర్మన్‌లోనూ దొరికే ప్రామాణిక ప్రతులలో ఇలా ఉంటుంది: "రైతుల నుంచి సంపదను స్వాయత్తం చేసుకోవడమే, మొత్తం పెట్టుబడి సంచయన క్రమానికి మూలమై వుంటుంది. ఒక్క ఇంగ్లంలో మాత్రమే ఇది ప్రామాణిక రూపం తీసుకుని వుండడం వల్లనే, మనం దాన్ని ఉదాహరణగా తీసుకున్నాం" అయితే, తర్వాత రూపుదిద్దుకున్న ఫ్రెంచ్ ప్రచురణలో ఇదే భాగాన్ని మార్క్స్ ఇలా సవరించారు: "కానీ, రైతుల నుంచి సంపదను స్వాయత్తం చేసుకోవడమే, మొత్తం పెట్టుబడి సంచయన క్రమానికి మూలం. ఇంతవరకూ, ఇంగ్లండ్

ఒక్కటే ఈ క్రమాన్ని పూర్తిగా అమలుచేసింది... కానీ, పశ్చిమ యూరప్‌లోని దేశాలన్నీ ఇదే దారిలో సాగుతున్నాయి." అలా సవరించడం ద్వారా, రష్యాలోనూ, పాశ్చాత్యేతర దేశాల్లోనూ ఇందుకు భిన్నమయిన అభివృద్ధి పథం అనుసరించే అవకాశం ఉందని చెప్పినట్లయింది.

పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలను కలిగివున్న సమాజాల గురించిన మార్క్స్ తదుపరి రచనల్లో రెండో స్రవంతి రష్యాపై చేసిన రచనలకు సంబంధించినది. 1872లో 'పెట్టుబడి' గ్రంథాన్ని రష్యన్‌లోకి అనువదించడంతో, ఆ దేశంపట్ల ఆయనలో ఆసక్తి తిరిగి పుంజుకుంది. జెర్మన్‌లో కాకుండా, మరో భాషలో 'పెట్టుబడి' ప్రచురించడం అదే మొదలు. అన్నిటికీ మించి, రష్యాలో పెట్టుబడి' గ్రంథంపై విస్తృతంగా చర్చ జరగడం మార్క్స్‌లో ఆశ్చర్యాన్ని రేకెత్తించింది. 'రష్యా, ఆసియాలోని వ్యవసాయ సమాజాలు, పాశ్చాత్య వ్యవస్థల మాదిరిగానే ఆధునికతను సాధించి తీరాలా?" అనే అంశాన్ని మార్క్స్ పునఃపరిశీలించారు. రష్యా గురించి మార్క్స్ చేసిన ఈ రచనలను థియోడర్ షానిన్ తదితరులు –ఆయా సందర్భాల పూర్వరంగంలో– విశ్లేషించారు. 1877లో రష్యన్ రచయిత ఎన్.కే. మిఖయిలోఫ్ స్కియ్ 'పెట్టుబడి' గ్రంథంపై విమర్శనాత్మక విశ్లేషణతో కూడిన ఓ లేఖను మార్క్స్‌కు రాశారు. 'పెట్టుబడి'లో మార్క్స్ ఒకే తరహా అభివృద్ధి పథం ఉంటుందన్న వైఖరి ప్రదర్శించారన్నది మిఖయిలోఫ్ స్కియ్ విమర్శలలో ఒకటి. కాగా, 'పెట్టుబడి ఫ్రెంచ్ ప్రచురణ నుంచి, ఇంతకు ముందు ఉటంకించిన సవరణను చూపించే, మార్క్స్ తన వాదం వినిపించారు. "ఆదిమ పెట్టుబడి సంచయనం' అధ్యాయం పరిమిత ప్రయోజనం కోసమే ఉద్దేశించినది. ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థ గర్భంలో నుంచే పశ్చిమ దేశాల్లోని పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించిన మార్గం ఏ తీరున ఉందో చిత్రించడానికి మాత్రమే ఈ అధ్యాయం పరిమితమయిం''దని మార్క్స్ స్పష్టీకరించారు. ప్రపంచమంతటా ఒకే తరహా అభివృద్ధి మార్గం ఉంటుందన్నదే తన వైఖరి అనే ఆరోపణకు సమాధానమిస్తూ, "అన్ని దేశాల ప్రజల నెత్తినా బలవంతంగా రుద్దబడిన సార్వత్రిక అభివృద్ధి క్రమానికి సంబంధించిన చారిత్రిక–తాత్విక సిద్ధాంతాన్ని తాను రూపొందించా''ననే ఆరోపణను మార్క్స్ బలంగా తిరస్కరించారు. అయితే, ఈ లేఖ మిఖయిలోఫ్‌స్కియ్‌కి పంప లేదనడం స్పష్టం.

1881లో, మార్క్స్, రష్యన్ విప్లవకారిణి వేర జసూలిచ్‌కి ఒక లేఖ రాశారు. అందులో చర్చించిన విషయం కూడా ఇదే. పశ్చిమ యూరప్ దేశాల్లో సాగుతున్న పెట్టుబడిదారీ అభివృద్ధి పథాన్నే రష్యా కూడా అనుసరించి తీరవలసిందేనా? ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చే సందర్భంలో కూడా మార్క్స్ తిరిగి 'పెట్టుబడి' ఫ్రెంచ్ ప్రచురణలోని సవరణనే ప్రస్తావించారు. "అంచేత, ఈ తరహా అభివృద్ధి క్రమాన్ని అనుసరించడమనేది పశ్చిమ యూరప్ దేశాల విషయంలో మాత్రమే ఓ 'చారిత్రిక అనివార్యత'గా మారుతుందని ఆయన వివరించారు. ఈ పాశ్చాత్య పారిశ్రామిక అభివృద్ధి పథానికి ప్రత్యామ్నాయ అభివృద్ధిపథాలు రూపుదిద్దుకోవడం సాధ్యమేనని మార్క్స్ ప్రకటించారు. సాముదాయక సంపదతో కూడి వుండే రష్యన్ గ్రామీణ వ్యవస్థకూ మధ్య యుగాల నాటి పశ్చిమ దేశాల గ్రామీణ వ్యవస్థకూ మధ్య కొట్టొచ్చినట్లు కనబడే భిన్నత్వం ప్రాతిపదికగానే, ఆయన తన విశ్లేషణను ప్రధానంగా నిర్మించారు. అంతేకాదు ఇటీవల తను రష్యన్ సమాజం గురించి సాగించిన అధ్యయనాల ఆధారంగా "రష్యన్ సమాజం తిరిగి శక్తిసామర్థ్యాలు పెంపొందించుకునే క్రమానికి అక్కడి సముదాయమే (కమ్యూన్) ప్రాతిపదిక కాగలదని" తాను గట్టిగా నమ్ముతున్నట్లు కూడా మార్క్స్ పేర్కొన్నారు. ఈ లేఖకు ముసాయిదాల్లాంటి సుదీర్ఘమయిన ఉల్లేఖనాల్లో మార్క్స్, భారతదేశం లాంటి పాశ్చాత్యేతర సమాజాల్లో కూడా రష్యన్ గ్రామీణ సామాజిక సంబంధాల్లాంటివి కనిపిస్తాయని పేర్కొనడం గమనార్హం.

1882లో వెలువడిన 'మ్యానిఫెస్టో రష్యన్ ప్రచురణకు – ఎంగెల్స్ తో కలిసి మార్క్స్– ఓ ముందుమాట రాశారు. అందులో, ఆయన రష్యన్ గ్రామాల్లోని సాముదాయిక వ్యవస్థ –అబ్‌షీన లేదా కమ్యూన్– గురించి ఇలా పునఃప్రస్తావించారు.

"రష్యన్ సాముదాయిక సంపద వ్యవస్థ, అబ్‌షీన. ఈ లక్షణం క్రమంగా అంతరించిపోతో వున్నప్పటికీ, భూమిపై ఉమ్మడి యాజమాన్యానికి సంబంధించిన ఆదిమ సముదాయ సమాజ లక్షణమది. ఈ లక్షణాన్ని, కమ్యూనిస్టు సాముదాయిక స్వామ్యంగా ఆధునిక సమాజానికి అందించడం సాధ్యమా? లేదా, ముందుగా ఉమ్మడిస్వామ్యాన్ని రద్దుచేసి, పశ్చిమదేశాల చరిత్రలో జరిగినట్లుగా – అదే క్రమాన్ని అనుసరించి తీరాల్సిందేనా? ఈ దశలో ఈ ప్రశ్నకి చెప్పగలిగిన సమాధానం ఒక్కటే. రష్యన్ విప్లవం పశ్చిమ యూరప్ దేశాల్లోని కార్మికవర్గ విప్లవానికి సూచిక కాగలిగే పక్షంలో, అవి రెండూ పరస్పరం దోహదం చేసుకునే పక్షంలో, రష్యాలోని రైతాంగ సాముదాయిక భూ యాజమాన్య విధానం కమ్యూనిస్టు అభివృద్ధికి నాందీవాచకం కాగలదు!"

వేర జసూలిచ్ తో మార్క్స్ ఉత్తరప్రత్యుత్తరాలు ప్రచురమే. కానీ, 'పెట్టుబడి' ఫ్రెంచ్ ప్రచురణ గురించి గానీ, 1879–82 మధ్య కాలంలో 1883లో మరణించడానికి కొద్దికాలం ముందు– ఆయన రాసుకున్న నోట్స్ గురించిగానీ, తెలిసినవాళ్లు అరుదు. తన జీవితకాలంలోని చిట్టచివరి దశకంలో, పాశ్చాత్యేతర సమాజాల గురించి ఆయన రాసుకున్న ఈ నోట్స్ మార్క్స్ రచనల్లో మూడో స్రవంతిగా వున్నాయి. మార్క్స్ మరణానంతరం ప్రచురిత మయిన 'గ్రాంట్‌రిసా' తోనూ, "1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతులు'తోనూ పోల్చి చూస్తే, ఈ నోట్స్ చిత్తుప్రతుల రూపంలోనే వున్నాయని చెప్పాలి. వాటిల్లోని భాష మెరుగు పెట్టనిది; వ్యాకరణబద్ధం కానిది; దానికి తోడు మార్క్స్‌కు ఏక కాలంలో అనేక భాషలు ప్రయోగించే అలవాటుంది. చీమలబారు లా ఉండి, చదవజాలని రీతిలో వుంటుంది మార్క్స్ చేతిరాత. ఈ కారణాలన్నింటి చేతా, మార్క్స్ రాసుకున్న నోట్స్‌కు శుద్ధ ప్రతి తయారు చెయ్యడం పెనుసవాలుగా పరిణమించింది. అవి, తన రచనల యొక్క ముసాయిదాలో, చిత్తుప్రతులో కావు; తను చదువుతూ ఉండిన పుస్తకాల నుంచి సంగ్రహ రూపంలో ఎత్తి రాసుకున్న భాగాలవి. నిజానికి అవి ఆయా పుస్తకాల సంగ్రహ రూపాలను మించినవని చెప్పాలి. మార్క్స్ ఆలోచనలను పట్టిచ్చే అనేక లక్షణాలు ఆ నోట్స్‌కి వున్నాయి. మొదటిది, మా సొంత గొంతులో, అతి ముఖ్యమయిన వ్యాఖ్యలను అవి మనకి అందిస్తాయి. రెండోది, ఈ నోట్స్ మార్క్స్‌ను ఓ పాఠకుడిగానూ, అధ్యయన శీలిగానూ మనకి చూపిస్తాయి. తను చదివే రచయితల అభిప్రాయాలూ అంచనాలపై మార్క్స్ ప్రత్యక్ష, పరోక్ష వ్యాఖ్యలను మాత్రమే కాదు– ఆ పుస్తకాలతో ఆయన ఎలా లీనమయ్యేవాడో, వాటిలోని పాఠాలకు భిన్నమయిన విషయాలను ఆయన ఎలా ప్రస్తావించేవాడో కూడా ఈ నోట్స్‌లో చూడొచ్చు. మూడోది, మార్క్స్ దృష్టిలో పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాల అధ్యయనంలో ఆసక్తికరమయిన ఇతివృత్తాలూ, సమస్యలూ, సమాచారం ఏమిటో ఈ నోట్స్ సూచిస్తాయి. ఒక్క ముక్కలో చెప్తే– మార్క్స్ కొత్త బాటల దిశగా అడుగులు వేస్తున్న దశలో ఆయన ఆలోచనలు ఎలా వుండినాయనే విషయాన్ని మనకి తెలియచేస్తాయి నోట్స్. తన జీవితంలో చిట్టచివరి దశాబ్దంలో పాశ్చాత్యేతర సమాజాల గురించిన మార్క్స్ నూతన ఆలోచన విధానం ఎలా వుందన్నదే ఈ మూడు స్రవంతులలోకీ అత్యంత కీలకమయింది. వాటిని పొందుపరచుకున్న ఈ నోట్‌బుక్స్ ను ప్రచురించడానికి సంబంధించిన ప్రణాళికల గురించి తర్వాతి అధ్యాయంలో చర్చిస్తా.

## పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాల గురించీ, స్త్రీ పురుష సంబంధాల గురించీ చర్చించిన 1879-82 మధ్యకాలం నాటి మార్క్స్ నోట్ బుక్స్ - ఒక పిట్టచూపు

1972లో లారెన్స్ క్రేడర్ మార్క్స్ "జాతిపరమయిన అధ్యయనాలపై నోట్‌బుక్స్"ను ప్రచురించారు. ఈ నోట్ బుక్స్ ఒకే భాషలో లేవు– మార్క్స్‌కు ఎన్ని భాషలొచ్చో అన్ని భాషల్లోనూ ఇందులోని నోట్స్ ఉన్నాయి! లూయిా హెన్రీ మోర్గన్– హెన్రీ సమ్నర్ మైనే– జాన్ బడ్ ఫియర్– జాన్ లబ్బాక్ తదితరుల మానవశాస్త్ర పరిశోధన గ్రంథాలపై, 1880–82 సంవత్సరాల మధ్యకాలంలో, మార్క్స్ రాసుకున్న నోట్స్ ఇవి. ఈ నోట్స్ వందల పేజీలకు విస్తరించి వున్నాయి. వాటినే క్రేడర్, బహుభాషా గ్రంథం రూపంలో అచ్చు వేశారు. త్వరలోనే, ఈ ప్రచురణ యొక్క ఆంగ్లానువాదం –విపులమయిన సంపాదక వివరణలతో సహా– విడుదల కానున్నది. ఇంతకీ, పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాల గురించీ, స్త్రీ పురుష సంబంధాల గురించి చర్చిస్తూ 1879–82 మధ్యలో మార్క్స్ రాసుకున్న నోట్‌బుక్స్‌లో సగం మాత్రమే కేడర్ ప్రచురణలో చోటు సంపాదించుకోగలిగాయి. రష్యా, అమెరికా, నెదర్లండ్స్, జెర్మనీ దేశాల్లోని మార్క్స్ పరిశోధకులూ నిపుణుల సహకారంతో మెగా 2 ప్రాజెక్టులో భాగంగా ఈ నోటు పూర్తిగానూ, సందర్భోచితమయిన వ్యాఖ్యల తోనూ రూపొందించాలని మేం సంకల్పిస్తున్నాం. ఈ నోట్స్ సాధారణంగా జెర్మన్–ఇంగ్లీష్ కలగలిసిన భాషలో కనిపిస్తాయి. ఇవి, మూల ప్రతుల్లో ఎలా వున్నాయో అలాగే, బహుళ భాషల్లోనే, 'మెగా 2,IV/27 సంపుటి'లో చేరుస్తున్నాం. అంతేకాక పూర్తిగా ఇంగ్లీష్‌లోనే ప్రచురితమయిన తన "జాతిపరమయిన అధ్యయనాలపై నోట్‌బుక్స్"లో కేడర్ చేర్చని నోట్స్‌ను వీలయినంత ఎక్కువగా ఈ బహుభాషా ప్రచురణలో చేర్చాలని కూడా మేం అనుకుంటున్నాం.

తన జీవితంలోని చిట్టచివరి దశకంలో, 1879–83 మధ్య కాలంలో, మార్క్స్ ప్రచురించింది అతి పరిమితం. 'పెట్టుబడి' రెండు–మూడు సంపుటులను మార్క్స్ పూర్తిచెయ్యలేదు; వాటిని ఆయన మరణానంతరం ఎంగెల్స్ ప్రచురణకు సిద్ధం చేశారు. ఆయన ఈ దశలో అనారోగ్యంతో బాధపడుతూ, గంభీరమయిన మేధోకృషి కొనసాగించే సామర్థ్యం కొరవడి వున్నారనే మార్క్స్ జీవిత చరిత్రల్లో పేర్కొన్నారు. కానీ, 1960 దశకం తర్వాత, ఈ ప్రకటనను సవాలుచేస్తూ, మార్క్స్ తదుపరి రచనల గురించి విశ్లేషిస్తూ, చర్చలూ, ప్రచురణలు కూడా వెలువడ్డాయి.

అయినప్పటికీ, మార్క్స్ జీవిత చరిత్రల్లో పేర్కొన్న అభిప్రాయమే ప్రచురంగా వుంది. అయితే, తన "జాతిపరమయిన అధ్యయనాలపై నోట్ బుక్స్"లో మార్క్స్ పద్ధతి ప్రకారం కృషి చేశారని అర్థమవుతుంది. ఉదాహరణకి, ఈశాన్య అమెరికా ప్రాంతానికి చెందిన ఇరాక్వ్యోస్ ప్రజల గురించీ, కొలంబియా పెత్తనానికి ముందటి మెక్సికన్ తెగ అజ్టెక్ ప్రజల గురించీ ఆస్ట్రేలియా మూలవాసుల గురించీ, ఉత్తర భారత దేశానికి చెందిన గ్రామీణుల గురించీ, ప్రాచీన ఐర్లండ్ తెగకు చెందిన సెల్ట్ ప్రజల గురించీ – ఒక్క మాటలో చెప్తే– యూరపియనేతర ప్రజల వైవిధ్యం గురించి మార్క్స్ వ్యవస్థీకృత అధ్యయనం కొనసాగించారు. విభిన్న పెట్టుబడిదారీ పూర్వ సమాజాల్లో రక్తసంబంధం, గ్రామీణ సంస్కృతుల ప్రాధాన్యం గురించి మార్క్స్ నొక్కిచెప్పడానికి ఈ అధ్యయనం దారితీసింది. ప్రపంచమంతటా విస్తరించే పెట్టుబడిదారీ విధానం పరిధి ఏమిటో తెలుసుకోవాలనే మార్క్స్ తపనకు అన్ని విధాలా తగినట్లు ఉంది ఈ అధ్యయనం. మూడు కీలకమైన సైద్ధాంతిక సమస్యలను పరిష్కరించే ప్రయత్నం ఈ నోట్స్ లో ఉంది: (1) సామాజిక అభివృద్ధి ఒకే రూపంలో, ఒకే తరహాలో జరిగిందా? లేక బహురూపాల్లో జరిగిందా? (2) విభిన్న సామాజిక సంస్కృతులలో కుటుంబం, స్త్రీపురుష సంబంధాలు ఎలా వున్నాయి? (3) ఆటవిక తెగల సమాజ జీవనంలో సామాజిక వర్గాలు ఎలా తలెత్తాయి? (4) సాముదాయిక – వ్యక్తిగత ఆస్తి రూపాల చరిత్ర ఏమిటి? మార్క్స్ రచనల్లో ఈ సమస్యల గురించి, చెదురుమదురుగా క్లుప్తమయిన ప్రస్తావనలే తప్ప, ఏ దశలోనూ విపులమయిన అధ్యయనం జరగలేదు.

"జాతిపరమయిన అధ్యయనాలపై నోట్ బుక్స్"లో మార్క్స్ ఇతరులు కనిపెట్టిన విషయాలను గురించి మాత్రమే ప్రస్తావించి ఊరుకోలేదు. ఉదాహరణకి, అమెరికన్ మానవ శాస్త్రవేత్త మోర్గన్ రచనలపై నోట్స్ రాసుకునే సందర్భంగా, ఆదిమ అమెరికన్ సమాజం గురించిన మోర్గన్ కాల్పనిక భావనలనుంచి మార్క్స్ తనంతట తాను దూరంగా నిలబడ్డారు. అలాగే, ఇంగ్లిష్ న్యాయశాస్త్ర చరిత్ర పరిశోధకుడు ఎచ్.ఎస్.మైనే రచనలపై నోట్స్ తీసుకునే సందర్భంగా కూడా మార్క్స్ కొన్ని కీలకమయిన వ్యాఖ్యలు చేశారు. "తమ సొంత ఆస్తికి సంబంధించిన కొన్ని అంశాలపై భర్తలను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకునే అధికారం, హక్కు ఐరిష్ స్త్రీలకు కల్పించింది ప్రాచీన ఐర్లండ్ న్యాయశాస్త్రం. అయితే, మందబుద్ధులయిన ఇంగ్లిష్ న్యాయమూర్తులు 17వ శతాబ్ది మొదట్లో ఈ హక్కులవ్యవస్థను, మరికొన్ని వ్యవస్థలతో సహా, చట్టవ్యతిరేకంగా ప్రకటించి రద్దుచేశారని – జెర్మన్, ఇంగ్లిష్ కలగాపులగం శైలిలో వ్యాఖ్యానించారు మార్క్స్. మోర్గన్‌పై వ్యాఖ్యానించే మరో సందర్భంలో – ఇది, ప్రాచీన గ్రీక్ వ్యవస్థను గురించిన సందర్భం– మార్క్స్ తిరిగి స్త్రీ పురుష సంబంధాల గురించిన ప్రస్తావన చేశారు. "కావాలనే గ్రీకు పురుషులు, స్వార్థబుద్ధి ప్రదర్శించారు; తద్వారా, స్త్రీల స్థితిగతులను తక్కువచేసే దిశగా ఇది జరిగిందని మార్క్స్ మోర్గన్ రాసిన దాన్ని ఉటంకించారు. దానికి తన వ్యాఖ్య జోడిస్తూ ఆయన ఇలా అన్నారు: "గ్రీకు దేవతల నివాసస్థానమయిన ఒలింపస్‌పై స్త్రీల స్థితిగతుల గురించిన వర్ణనలు, మరింత శక్తిమంతులయిన ఒక నాటి స్వేచ్ఛాయుత గ్రీకు స్త్రీల స్థితిగతుల గురించిన తలపోతలకు నిదర్శనలు."

"జాతిపరమయిన అధ్యయనాలపై నోట్‌బుక్స్ " గురించి కేడర్‌ను మినహాయిస్తే– ప్రస్తావించి, చర్చించిన పరిశోధకులు చాలా అరుదు. వారిలో జెర్మన్ చరిత్ర పరిశోధకుడు హన్స్–పీటర్ హార్‌స్టిక్ ఒకరు. అల్జీరియా, భారత్, కొలంబియా పెత్తనానికి పూర్వపు అమెరికా ప్రాంతాలో 'సాముదాయిక సంపద' గురించి రష్యన్ మానవశాస్త్రవేత్త మక్సీమ్ కవలేఫ్ స్కియ్ రాసిన పుస్తకంపై మార్క్స్ 1879లో రాసుకున్న నోటు హార్‌స్టిక్ ప్రచురించారు. "మార్క్స్ దృష్టి, యూరప్ మీంచి ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాల వైపు మళ్లిం"దని హార్‌స్టిక్ వ్యాఖ్యానించారు. పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాల గురించీ, స్త్రీపురుష సంబంధాల గురించి చర్చించిన "జాతిపరమయిన అధ్యయనాల పై నోట్‌బుక్స్"నూ, తదితర మార్క్స్ 'తదుపరి రచనల'నూ మరింత ఎక్కువ మంది దృష్టికి తీసుకువచ్చిన మార్క్సిస్ట్ మానవతావాద పరిశోధకురాలు రయా దునయేఫ్ స్కయా. స్త్రీపురుష సంబంధాల గురించి మార్క్స్ ఈ రచనల్లో కేంద్రీకరించడం గురించి ఆమె నొక్కి చెప్పారు. ఏడ్రియెన్ రిచ్, దంగా విలీయ్‌సిస్ లాంటి స్త్రీవాద పరిశోధకులూ, పరేష్ చట్టోపాధ్యాయ్ లాంటి ఆర్థికవేత్తలూ కూడా ఈ చర్చలో పాల్గొన్నారు. మార్క్స్ నోట్‌బుక్స్‌ను 'తృతీయప్రపంచం పై వెలువరించిన రచనలు'గా పీటర్ హడీస్ అభివర్ణించగా, అమెరికన్ ఆదివాసులకు సంబంధించిన వాటి ప్రాధాన్యాన్ని ఫ్రాంక్లిన్ రోజ్‌మాంట్ నొక్కి చెప్పారు. కాగా, ఈ నోట్ బుక్స్‌ను, రోజా లగ్జెంబుర్గ్ కృషితో పోల్చారు డేవిడ్ నార్మన్ స్మిత్.

ఇంతకు ముందు చెప్పినట్లుగా, క్రేడర్ ప్రచురించిన "జాతిపరమయిన అధ్యయనాలపై నోట్ బుక్స్"లో చేర్చని నోట్స్ దాదాపు అన్నే పేజీలకు విస్తరించి వుంటుంది. అవి 1879–

82 సంవత్సరాల మధ్యకాలంలో రాసుకున్న నోట్స్. పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాల గురించీ, స్త్రీపురుష సంబంధాల గురించీ చర్చించిన నోట్‌బుక్స్‌లో అత్యధికం ఇంతవరకూ వెలుగు చూడలేదు. ఈ నోట్స్‌లో, అప్పుడప్పుడు, మార్క్స్ ప్రత్యక్ష వ్యాఖ్యలూ, ఈ విషయంలో ఆయన సొంత ఆలోచనలూ, అభిప్రాయాలూ కనిపిస్తాయి. అల్జీరియా– భారతదేశం– లాటిన్ అమెరికా సమాజాల గురించి రష్యన్ పరిశోధకుడు కవలేఫ్ స్కియ్ రాసిన పుస్తకంపై 1879లో మార్క్స్ రాసుకున్న నోట్స్‌లో ఆయన రష్యన్ పరిశోధకునితో విభేదించారు. యూరప్ కేంద్రక భూస్వామ్య వ్యవస్థలోని వర్గాలనూ అభివర్గాలనూ, కొలంబియా పెత్తనానికి పూర్వపు లాటిన్ అమెరికా సమాజాలపై రుద్దే ప్రయత్నాన్ని మార్క్స్ వ్యతిరేకించారు. రోమన్ల కుటుంబ వ్యవస్థ గురించి, లుడ్విగ్ లాంగ్ రాసిన దానితో కూడా మార్క్స్ ఇదేవిధంగా విభేదించారు. "వ్యక్తిగత ఆస్తినే ఆదిబిందువుగా చేసుకుని తన చర్చ ప్రారంభించి, తద్వారా సాముదాయిక ఆస్తి ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా లాంగ్ వాస్తవాలను వక్రీకరించారని మార్క్స్ విమర్శించారు.

ఇటువంటి వ్యాఖ్యల వల్ల ఈ నోట్స్ ప్రాముఖ్యం తగ్గకపోగా పెరుగుతోంది. తన చివరిదశలో మార్క్స్ ఏయే విషయాలపై కేంద్రీకరించి, అధ్యయనం కొనసాగించారో, తను చదివే పుస్తకాల్లోంచి విషయాలను ఎలా జల్లెడపట్టి, ఏరి–కూర్చి, ఎలా వాటిని పునర్నిర్మించారో ఈ నోట్స్ చూపిస్తాయి. లాంగ్ రచనపై ఆయన నోట్స్ చూస్తే, పితృస్వామ్య రోమన్ కుటుంబవ్యవస్థలోని వివాహ వ్యవస్థ యొక్క భిన్న ముఖాలు గోచరిస్తాయి. అవి వర్గపరమయిన, జాతిపరమయిన వ్యవస్థలకే పరిమితం కావు. రోమన్ పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ కాలక్రమంలో ఎలా బలహీనపడి దిగజారిపోయిందనే చారిత్రిక పరిణామాన్ని కూడా మార్క్స్ నోట్స్ వివరిస్తాయి. రోమన్ బానిసల తిరుగుబాట్లు ఇతివృత్తంగా అర్థశాస్త్ర చరిత్రవేత్త కార్ల్ బూఖర్ పుస్తకంపై రాసుకున్న నోట్స్‌లో, రోమన్ కుటుంబాన్ని విస్తృతార్థంలో తీసుకున్నారు మార్క్స్. పితృస్వామ్య కుటుంబ వ్యవస్థలోని బాంధవ్యాలను, బానిసకూ బానిస యజమానికీ వుండే సంబంధం తో పోల్చారు మార్క్స్. ఇదే నోట్‌బుక్స్‌లో, మరోచోట, మరో సందర్భంలో మార్క్స్ చేసిన ఓ వ్యాఖ్యకు ఇది అన్నివిధాలా అనుగుణంగానే ఉంది. "కుటుంబ వ్యవస్థలో బానిసత్వమే కాదు అర్థబానిసత్వం కూడా బీజప్రాయంగా– నెలకొనివుంటుందని, ఆ సందర్భంలో ఆయన వ్యాఖ్యానించారు. బూఖర్ పుస్తకంపై రాసుకున్న నోట్స్‌లోనే, క్రీస్తుకుపూర్వం రెండో శతాబ్దంలో జరిగిన బానిసల తిరుగుబాట్ల గురించి మార్క్స్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. గ్రాకై కాలంలో రోమ్‌లోని స్వేచ్ఛాయుత పౌరులలో తలెత్తిన వర్గ కలహాల నేపథ్యంలో, ఏయేటికాయేడు జరుగుతూ వచ్చిన బానిసల తిరుగుబాట్లను విశ్లేషించారు మార్క్స్, భారతీయ చరిత్ర గురించిన నోట్లో కూడా మార్క్స్ వలసవాద వ్యతిరేక తిరుగుబాట్ల పైనే కేంద్రీకరించారు. భారత దేశీయులలో విదేశీయుల దురాక్రమణ లను నివారించే లక్షణం కొరవడిందని 1858నాటి ట్రిబ్యూన్ వ్యాసాల్లో మార్క్స్ చేసిన వ్యాఖ్యలకివి వ్యతిరేకంగా వున్నాయన్నది గమనార్హం. జావా గురించిన నోట్స్‌లో కూడా ఆయన గ్రామీణ సామాజిక వ్యవస్థపైనే కేంద్రీకరించారు. అదేకాలంలో భారత, రష్యా సమాజాలపై తాను రాసుకుని వుండిన నోట్స్‌కు, జావా నోట్స్ అనుగుణంగానే వున్నాయి.

## ఇండోనేసియా, రోమ్ పై మార్క్స్ అముద్రిత నోట్స్

ఈ వ్యాసాన్ని ముగిస్తూ, నేను రెండు పాఠాల గురించి సవివరంగా ప్రస్తావించదల్చుకున్నాను. వాటిని కూడా తొలిసారిగా 'మెగా 2,IV/27 సంపుటి'లో చేర్చనున్నాం. ఇవి ఇంతవరకూ ఏ భాషలోనూ ప్రచురితం కాలేదు!

1880–81 మధ్యకాలంలో మార్క్స్ ఇండోనేసియాలో డచ్ వలసవాదం గురించి నోట్స్ రాసుకున్నారు. అక్కడి సమాజం పట్లా, ప్రపంచమార్కెట్ యంత్రాంగానికి ఆ దేశం తొలి రోజుల్లోనే అనుసంధానమయిన తీరుపట్ల మార్క్స్‌కు కలిగిన ఆసక్తికి – ఇరవై వేల పదాలకు విస్తరించిన ఈ నోట్సే నిదర్శనం. సాంప్రదాయిక జావనీస్ గ్రామీణ వ్యవస్థపై మార్క్స్ కేంద్రీకరించారు. "వలసలను నియంత్రించి, నిర్వహించడమెలా? బ్రిటిష్ వలసగా ఉన్న భారత దేశంలో ఎదురయ్యే సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారం" పేరిట జేమ్స్ విలియం బేలీ మనీ 1861లో రాసిన పుస్తకం ఆధారంగా మార్క్స్ తన నోట్స్ రూపొందించారు. మన భారతదేశంలో పుట్టిన ఓ బ్రిటిష్ బారిస్టర్. భారతదేశంలో సిపాయి తిరుగుబాటు పతాకస్థాయికి చేరుకున్న తరుణంలో మనీ జావా వెళ్లాడు. సదరు యాత్ర ద్వారా తనకు సంక్రమించిన అనుభవం ఆధారంగానే మనీ ఈ పుస్తకం రాశాడు. సిగ్గూ ఎగ్గూ లేకుండా డచ్ వలస పాలకుల కీర్తి గానం చేసే స్తోత్ర పాఠకుడు ఈ బారిస్టర్ మహాశయుడు. వలస పూర్వ జావా సమాజంలో మార్పుచేర్పులు పెద్దగా చెయ్యలేదు డచ్ వలస వాదులు. భారతదేశంలో బ్రిటిష్ వలసపాలకుల వైఖరి అది కాదు. పర్యవసానంగా, భారతీయ సాంప్రదాయిక, సాముదాయిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మార్కెట్ శక్తులు ధ్వంసం చేశాయి.

అయితే, డచ్ వలసవాదుల వ్యూహం ఇందుకు భిన్నంగా ఉండింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోని భూమికౌలు ఏర్పాట్లనూ, రాజకీయ వ్యవస్థనూ, సాంప్రదాయిక, సాముదాయిక సంస్కృతిని కొనసాగ నిచ్చారు.

జావా మీద మార్క్స్ నోట్స్ రాసుకోవడం ఇదే మొదలుకాదు! 1853లో, భారతదేశం గురించి రాసే సందర్భంలో కూడా, ఆయన జావామీద కొన్ని నోట్స్ రాసుకున్నారు. 1817లో వెలువడిన ప్రామాణిక చారిత్రిక–జాతిపరమయిన అధ్యయనం, హెన్రీ శ్టామ్‌ఫర్డ్ రాఫిల్స్ రచన 'జావా చరిత్ర' ఆధారంగా రాసుకున్న నోట్స్ అవి. (1850 తొలినాళ్లలో మార్క్స్ రాసుకున్న నోట్స్‌తో పాటు ఈ నోటు కూడా 'మెగా'లో భాగంగా తర్వాత వెలువరించనున్నారు) స్థానిక గ్రామీణ జీవనం, సంస్కృతుల గురించీ – ముఖ్యంగా బాలి ప్రాంతంలో స్త్రీపురుష సంబంధాలతో సహా రాఫిల్స్ రచనపై రాసుకున్న నోట్స్‌లో నొక్కిచెప్పారు మార్క్స్. 1880–81లో మనీ పుస్తకంపై రాసుకున్న నోట్స్‌లో, రచయిత తీసుకున్న ఇతివృత్తాన్ని పూర్తిగా పక్కన పెట్టి, అతగాడు సేకరించిన ఆర్థిక గ్రామీణ జీవన సమాచారంపై మాత్రమే మార్క్స్ కేంద్రీకరించారు. (వివరాల కోసం 1983లో టీ షెల్మన్ రాసింది చూడండి.) జావా జీవితం గురించి పైపై అధ్యయనం మాత్రమే చేసిన మనీలాంటి స్తోత్ర పాఠకుడి దృక్కోణం గురించి కూడా మార్క్స్ ఎటువంటి విమర్శలూ, వ్యాఖ్యలు చెయ్యలేదు. మనీ రచనలోని అత్యంత అనుమానాస్పదమయిన భాగాన్ని వదిలిపెట్టి, అప్పట్లో జావా జీవనవిధానాన్ని గురించి విపులంగా వర్ణించిన ఆ పుస్తకాన్ని వినియోగించుకున్నారు మార్క్స్. కొన్ని భాగాలను పూర్తిగా వదిలేస్తూ, చాలా అధ్యాయాల్లోంచి విడివిడి వాక్యాలను మాత్రమే తీసుకున్నారాయన. మనీ పుస్తకంలో పేర్కొన్న వాస్తవ సమాచారం నుంచీ గణాంకాలనుంచీ పనికొచ్చేవనిపించిన వాటిని మాత్రమే మాత్రం జల్లెడపట్టి తీసుకుని, నాటు చెక్క భజనను విసర్జించారు మార్క్స్.

మార్క్స్ మరణానంతరం, ఎంగెల్స్ మనీ పుస్తకాన్నీ బహుశా మార్క్స్ నోట్‌బుక్స్‌నీ– చదివినట్లు అనిపిస్తుంది. 1884లో, ఆయన కార్ల్ కౌట్స్కియ్‌కి ఓ లేఖ రాస్తూ, ఇండోనేసియాలో డచ్ పాలన "స్టేట్ సోషలిజానికి నికార్సయిన యథాతథవాద నమూనా" లాంటిదనీ, ఈ నమూనా "ఆనాటి రష్యన్, భారత సమాజాల్లో మాదిరిగా గ్రామస్థాయిలో ఆదిమ కమ్యూనిజం పునాదిగా" రూపుదిద్దుకుందనీ వ్యాఖ్యానించారు (MECW 47: 102-3). ఎంగెల్స్ అభిప్రాయాలు మార్క్స్ తదుపరి రచనల్లో వ్యక్తమయిన భావాలకు భిన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా రష్యన్ గ్రామీణ సాముదాయిక సంపదపై వ్యాఖ్యానిస్తూ, అక్కడినుంచే విప్లవాత్మక పరిణామాల దిశగా లంఘించవచ్చునని మార్క్స్ వ్యాఖ్యానించారు. అదే అభిప్రాయం 1882 నాటి 'మ్యానిఫెస్టో' రష్యన్ ప్రచురణకు రాసిన ముందుమాటలో తామిద్దరం కలిసి ప్రకటించిన విషయాన్ని ఎంగెల్స్ విస్మరించినట్లు కనిపిస్తోంది.

1879–80 సంవత్సరాల మధ్యకాలంలో రోమ్ గురించి మార్క్స్ రాసుకున్న నోట్స్ 45 వేల పదాలకు విస్తరించి వున్నవి – గురించి మార్క్స్ రచనలపై నిపుణులకు అందరికీ అజ్ఞాతంగా మిగిలిపోయాయి; వాటిని ఏ భాషలోనూ ఎవ్వరూ ఎన్నడూ ప్రచురించి వుండలేదు! ఈ నోట్స్ కుటుంబవ్యవస్థ, సామాజిక వర్గాల చుట్టూ కేంద్రీకృతమయి ఉండినాయి. ఈ రెండు విషయాలు పరస్పరం సంబంధంలేని అంశాలు కావన్నదే మార్క్స్ అభిప్రాయం. 'రోమిస్చె ఆల్టర్‌తూమర్' (ప్రాచీన రోమ్ చరిత్ర) పేరిట లుడ్విగ్‌లాంగ్ 1854లో మూడు భాగాలుగా వెలువరించిన ఈ (రోమ్ రిపబ్లిక్ ఏర్పడ్డానికి ముందుకాలపు) చరిత్ర గ్రంథంలో ఆనాటి సామాజిక సంప్రదాయాలూ, ఆచారాల గురించి రచయిత విపులంగా వివరించారు. ఈ గ్రంథంపై మార్క్స్, 24 పేజీల సుదీర్ఘమయిన నోట్స్ రాసుకున్నారు. ఈ నోట్స్ ప్రధానంగా జెర్మన్‌లో ఉన్నా, ఎన్నో పేరాలు లాటిన్‌లోనూ, అక్కడక్కడా ఇంగ్లిష్ భావప్రకటనలూ కూడా లేకపోలేదు. రోమ్ రిపబ్లిక్ ఏర్పడ్డానికి ముందుకాలపు చరిత్ర పరిశోధకుల్లో లాంగ్ ముఖ్యులు. కాగా, పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ. వివాహ వ్యవస్థ, తెగల న్యాయ వ్యవస్థ, స్త్రీలు పోషించిన సామాజిక పాత్ర, ఆస్తి చట్టాల అభివృద్ధి క్రమం తదితర అంశాలపై మార్క్స్ తన నోట్స్‌లో కేంద్రీకరించారు. రోమ్‌లో భర్త భార్యపై చెలాయించే పెత్తనం పైనే కొన్ని సందర్భాల్లో కేంద్రీకరించడం కనిపిస్తుంది. మరికొన్ని సందర్భాల్లో రోమన్ కుటుంబ పెద్ద విశిష్టాధికారాల పైనే – సంతానం, మనవలూ మనవరాళ్లూ, స్వేచ్ఛాయుత కార్మికులూ, ఒప్పందాల ప్రాతిపదికగా తన దగ్గర పనిచేసే కూలీలూ, బానిసలూ, పశుసంపదా, భూ సంపద వగైరాలపై కలిగివుండే హక్కుల పైనే కేంద్రీకరించడం కనిపిస్తుంది. వేరే సందర్భాల్లో వంశం, తెగల బాంధవ్యాలూ లాంటి అంశాలపై కేంద్రీకరించడం కనిపిస్తుంది. రోమన్ నాగరికత అభివృద్ధి చెందే కొద్దీ, వివాహ వ్యవస్థ సాంప్రదాయిక చట్టాల పరిధిలోంచి బయటపడి, రాజ్యం యొక్క లౌకిక చట్టాల పరిధిలోకి రావడం పెరుగుతూ పోయిందని

☞ మిగతా 106వ పేజీలో

# మన మార్క్స్!



**ఆంటోనియో గ్రాంసీ**

మనం మార్క్సిస్టులమా? అసలు 'మార్క్సిస్టులు' అంటూ ఎవరయినా ఉంటారా? మూర్ఖత్వం అజరామరం సుమీ! మరికొద్ది రోజుల్లో, మార్క్స్ శతజయంతి మొదలు కానుంది. అప్పుడు, ఇక్కడ మనం వేసుకున్న ఇవే ప్రశ్నలు మరోసారి చర్చకు వస్తాయి! సి రా సెలయేళ్ళు పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తాయి!! వాటితో పాటే మూర్ఖత్వమూ కట్టలు తెగి పారుతుంది!! అర్థంపర్థంలేని సణుగుళ్ళూ, బడాయికోరు కబుర్లూ – ఇవి మానవాళికి సంక్రమించిన మచ్చలేని వారసత్వాలు మరి.

మార్క్స్ చక్కని, బుజ్జి సిద్ధాంత పత్రాన్ని మన కోసం రాసిపెట్టి పోలేదు! మార్క్సేమీ ప్రవక్త కాదు– నీతికథలు మనకోసం రాశిపోసి పెట్టలేదు! సుస్పష్టమయిన నియమనిబంధనలేవీ రూపొందించి పోలేదాయన. స్థలకాలాలకు అతీతమయిన సూత్రాలనేం సిద్ధం చేసి పెట్టలేదు మార్క్స్. ఆయన చెప్పిన నియమమయినా, నిబంధనయినా, సూత్రమయినా ఒక్కటే – "ప్రపంచ కార్మికులారా! ఏకం కండి!" అంచేత, కార్మికులను ఏకం చెయ్యడమనే విధికి పూనుకోవడమూ, వాళ్ళను ఒక గొడుగు కిందకి తీసుకురావడమనే విద్యుక్త ధర్మం గురించి ప్రచారం చెయ్యడమూ అనే లక్షణాలు మార్క్సిస్టుల్ని, మార్క్సిస్టులు కాని వాళ్ళతో వేరు చెయ్యాలి. ఒక రకంగా ఇది చాలా చిన్న విషయం; మరోవైపు నుంచి చూస్తే ఎంతో పెద్ద విషయం! ఈ ప్రమాణం ప్రాతిపదికగా చూస్తే, అసలు మార్క్సిస్టు కానివాడంటూ మిగులుతాడా?

వింతగా అనిపించినప్పటికీ, అదంతేమరి! మనలో ప్రతి ఒక్కరూ ఎంతో కొంత మార్క్సిస్టే– ఎటొచ్చీ చాలామందికి ఆ విషయం తెలీదంతే! మార్క్స్ చాలా గొప్పవాడు; ఆయన కృషి కొమ్మలూ, రెమ్మలూ, చిలవలూ, పలవలూ, ఊడలూ, వేళ్ళతో విస్తరించింది. ఆయన శూన్యం నుంచి పదార్థం పుట్టించిన మాంత్రికుడు కాదు; తన ఊహల్లోంచి చరిత్ర తాలూకు అసలు రూపాన్ని ఆవిష్కరించినవాడూ కాదు! ఖండితమూ, అసంపూర్ణమూ, అపరిపక్వమూ అయిన విషయం ఆయనలో పరిపక్వమూ, వ్యవస్థీకృతమూ, చైతన్యవంతమూ అయి కూచుంటుంది! ఆయన వ్యక్తిగత చైతన్యం అందరిదీ కాగలదు; అనేక మందికి అది ఏనాడో సొంతమయిపోయింది! అందుకే, మార్క్స్ కేవలం పండితుడు మాత్రమే కాదనేది; ఆయన చేతల మనిషి! ఆలోచనల మాదిరే ఆయన కృషి కూడా అల్లిబిల్లిగా అల్లుకుపోతూ, విస్తరిస్తుంది! మార్క్స్ పుస్తకాలు ఆలోచనల్ని మార్చినట్లే ప్రపంచాన్ని మార్చేశాయి.

మానవ చరిత్రలో మేధస్సు ప్రవేశానికి, చైతన్యశకానికి సూచిక కార్ల్ మార్క్స్.

చరిత్రలో మనిషి పాత్ర ఏమిటనే అంశంపై థామస్ కార్లైల్‌కూ, హెర్బర్ట్ స్పెన్సర్‌కూ మధ్య సాగిన మహా మేధో సమరానికి అక్షరాలా సమకాలికం, మార్క్స్ కృషి.

కార్లైల్ దృష్టిలో – మనిషి అనేవాడో మహాయోధుడు, మహానుభావుడు; ఆత్మిక సంయోగం తాలూకు మార్మిక సమన్వయం; ఊహాజనిత–పరిపూర్ణ–పవిత్ర లోకంలోని అజ్ఞాత, అస్థిర లక్ష్యం దిశగా మానవాళి భవిష్యత్తును నడిపిస్తాడీ మహాయోధుడు!

స్పెన్సర్ దృష్టిలో ప్రకృతి అనేది యాంత్రికమూ–అచేతనమూ – పరిణామాత్మకమూ అయిన అస్తిత్వం. అందులో మనిషి అనే వాడు ప్రకృతిసిద్ధమయిన, పరమాణు సదృశమయిన జీవపదార్థం. అనిర్దిష్టమయిన ఏదో ఆదేశాన్ని మనిషి శిరసావహిస్తాడు; సదరు ఆదేశం, తక్షణమే అమల్లోకి వచ్చే నిర్దిష్ట చారిత్రక నిర్దేశంగా మానవాళిలో స్థిరపడిపోతుంది.

మార్క్స్, తనను తాను ఒక మహత్తర అస్తిత్వంగా చరిత్రలో నిట్టనిలువునా నిలబెట్టుకుంటాడు. ఆయన మార్మికుడూ కాదు; భూత భవిష్యత్ వర్తమానాలు ఏనాడో నిర్ణయమైపోయాయని నమ్మిన నిశ్చయాత్మక ఆధ్యాత్మికవాదీ కాదు! ఆయన మౌలికంగా చారిత్రకవాది. గతానికి సంబంధించిన పత్రాలన్నింటికీ – కొన్నింటికి మాత్రమే కాదు, ప్రతి ఒక్కదానికీ– భాష్యం చెప్పిన వాడు; మన చరిత్ర రచనలన్నింటిలోనూ, గతం గురించి జరిగిన పరిశోధనలన్నింటిలోనూ సహజంగా ఉండే లోపం ఒకటే– పాక్షిక దృష్టి: చారిత్రక పత్రాలలో కొన్నింటిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడమూ, పరీక్షించడమూను– అదికూడా ఏదో చారిత్రక సంకల్పంతో చేసేపని కాదు – పక్షపాత దృష్టితోనూ, ప్రతికూలత తోనూ చేసేదే. కొందరికి తామలా చేస్తున్న విషయం స్పృహలో ఉండకపోవచ్చు; ఏ దుర్బుద్ధి లేకపోయి వుండొచ్చు కూడా! అయినప్పటికీ, ఆ పరిశోధన సత్యశోధన–నిశ్చితమయిన వాస్తవ

పరిశీలన. గతాన్ని సమగ్రంగా పునర్నిర్మించే ప్రయత్నం కాజాలదు కదా! ముందే ఏర్పర్చుకున్న ఒకానొక సైద్ధాంతికభావన ప్రాతిపదికగా ఏదో ఒక్క కార్యకలాపాన్ని గురించి మాత్రమే ప్రముఖంగా ప్రస్తావించడమే అవుతుందది. "చరిత్ర అనేది కేవలం భావనాలోకం" అనేదే ఆ సైద్ధాంతిక భావన! మనిషిని, పరిపూర్ణ చైతన్యంగా, కేవలం ఆత్మగా పరిగణిస్తుంది ఈ భావన. దాన్లో నుంచి రెండు దురవగాహనలు పుట్టుకొస్తాయి. మొదటిది– భావనలు అనేవి సాధారణంగా యథేచ్ఛగా ఏర్పర్చుకునేవి; అవి కల్పితమయినవి కూడా, చారిత్రక భావనలను వివరించే సందర్భంగా ప్రస్తావనకు వచ్చే వాస్తవాలు కేవలం ప్రాస్తావికాలు మాత్రమే, చారిత్రకాలు కావు! ఇక రెండవ దురభిప్రాయం ఏమిటంటే– చరిత్రను రచించడమే జరిగితే, అది ఆయా వ్యక్తుల అద్భుత అంతర్దర్శనాల ఆధారంగానే జరుగుతుంది తప్ప ఓ పద్ధతి ప్రకారం, చైతన్యవంతమయిన, శాస్త్రీయ కార్యకలాపంగా మాత్రం అది జరగదు!

కానీ, మార్క్స్ విషయానికి వచ్చే సరికి– ఆయన కూడా చరిత్రను భావనల లోకంగానే చూస్తాడు; అది చైతన్యసీమ అనే ఆయనా భావిస్తాడు; వ్యక్తులు విడివిడిగా గానీ, ఇతరులతో సంబంధాల ద్వారా గానీ చేసే చైతన్యవంతమయిన కార్యకలాపం గానే చరిత్రను ఆయనా పరిగణిస్తాడు. అయితే, ఈ భావనలు, చైతన్యం, స్ఫూర్తి ఇవన్నీ పాదార్థిక వాస్తవంతో తలపడినప్పుడు వాటి యథేచ్ఛతను కోల్పోతాయి. అవి ఆ మీదట కాల్పనిక, ధార్మిక, సామాజిక శాస్త్రసంబంధమయిన భావాలుగా మిగలవు. ఆ భావాల పాదార్థిక పునాది ఆర్థికరంగంలోనూ, ప్రత్యక్ష కార్యాచరణలోనూ, ఉత్పత్తి–వినిమయ సంబంధాల వ్యవస్థల్లోనూ మాత్రమే మిగులుతుంది. జరిగింది జరిగినట్లుగా చూస్తే, చరిత్ర కేవలం ఆర్థిక, నైతిక రూపాల్లో వుండే ప్రత్యక్ష కార్యాచరణ మాత్రమే! ఒకానొక భావం వాస్తవరూపం తీసుకునేది, అది శుద్ధ సత్యంతో తార్కికంగా సరిపోలినందువల్ల కాదు– అది మానవాళి కార్యాచరణకు తగినరీతిలో వున్నందువల్ల! భావంగా అది ప్రణాళిక రూపంలో, మానవాళి తాలూకు సార్వత్రిక నైతిక లక్ష్యం రూపంలో వుంటుంది. ఫలానీ సాధనం ద్వారా ఆర్థిక వాస్తవంగా రూపుదిద్దుకోవడంతో మాత్రమే, ఆ భావం వాస్తవరూపం తీసుకోగలుగుతుంది! ఒకానొక దేశం, సమాజం, లేదా మానవ సమూహం తాలూకు చారిత్రక లక్ష్యం ఏమిటనేది కచ్చితంగా తెలుసుకోవాలంటే, ముందుగా ఆ దేశంలోగానీ, సమాజంలోగానీ ఉత్పత్తి – వినిమయ వ్యవస్థలు ఏమిటో తెలుసుకుని తీరాలి. ఈ సమాచారం లేకుండా రాసే చరిత్రలన్నీ పాక్షిక వ్యాసాలు, సిద్ధాంత పత్రాలు మాత్రమే కాగలవు! సంస్కృతి యొక్క చరిత్ర ఏమిటో తెలుసుకోడానికి అవి వుపయోగపడగలవు; చరిత్ర తాలూకు పరోక్ష ప్రతిఫలనాలను గ్రహించడానికి, సుదూర పర్యవసానాలను గ్రహించడానికి అవి వుపయోగపడగలవు. అంతే తప్ప ఈ పాక్షిక వ్యాసాలు చరిత్రను గ్రహించడానికి మాత్రం వుపయోగపడవు. ప్రత్యక్ష కార్యాచరణ, కట్టుదిట్టమయిన తన పొందికను, అలాంటి వ్యాసాల్లో సమగ్రంగా వెల్లడి కానివ్వదు.

విగ్రహాలు పూజాపీఠాల మీంచి విరిగిపడతాయి; సాంబ్రాణి మేఘాలు చెదిరిపోతాయి; మనిషి మాత్రం వస్తుగత వాస్తవాల పట్ల చైతన్యం సంపాదిస్తాడు! చారిత్రక పరిణామాల వెనుక దాగి వుండే రహస్య క్రమాన్ని కనిపెట్టడంలో అతగాడు ఆరితేరిపోతాడు! తన గురించి తాను లోతుగా తెలుసుకుంటాడు; తన వ్యక్తిగత సంకల్పం సత్తా ఎంతటిదో అర్థం చేసుకుంటాడు; ఆ సంకల్పానికి తలవంచడం ద్వారా, అవసరానికి తగినట్లు తన సంకల్పాన్ని తీర్చిదిద్దుకోవడం ద్వారా, దాన్ని ఎంత బలవత్తరమయిన శక్తిగా మలచుకోవచ్చునో మనిషి గ్రహిస్తాడు; చివరికి ఆ సంకల్పం దాని అవసరం పైన పైచేయి సాధించి, లక్ష్యంతో మమేకమయి పోతుంది! తన గురించి తానే తెలుసుకోగలిగినవాడెవడు? మొత్తం మీద మనుషులందరూ అలా తెలుసుకోలేరు– అవసరం కాడి బరువు మోసేవాడికే ఈ ఆత్మ సాక్షాత్కారం జరుగుతుంది! చరిత్ర సారమేమిటో తెలుసుకోవాలనే శోధన, ఉత్పత్తి–వినిమయ సంబంధాల్లోనే దాని సారం వుందనే అవగాహన, మానవ సమాజం రెండు వర్గాలుగా చీలివుందన్న వాస్తవాన్ని గ్రహించ డానికి దారితీస్తాయి. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం కలిగి వుండే వర్గానికి ఈ వాస్తవం ఎప్పుడో తప్పక తెలుసుంటుంది! తన అధికారం, తన సత్తా, తన ప్రయోజనాల గురించి ఆ వర్గం చైతన్యం కలిగి వుంటుంది. కాకపోతే, సదరు చైతన్యం ముక్కలు ముక్కలుగానూ, గందరగోళంతోనూ నిండివుండొచ్చు! ఆ వర్గానికి కొన్ని సొంత లక్ష్యాలు, ప్రయోజనాలు ఉంటాయి. నిదానంగా, నిశ్శబ్దంగా తన శక్తిసామర్థ్యాలను కూడదీసుకుంటుంది; తన లక్ష్యానికి తనను తీసుకుపోయే మార్గం ఆకలికో, యుద్ధాలకో ఆహుతయిపోయిన పీనుగులతో నిండి వున్నప్పటికీ అది చెక్కుచెదరదు!

సిసలయిన చారిత్రక కార్యకారణ సంబంధాన్ని వ్యవస్థీకృతం చెయ్యడం అనే సవాలు అన్యవర్గం గురించిన అవగాహనతో ముఖాముఖీ తలపడుతుంది. పసుల కాపరి లేకుండా, మందను మళ్ళేయడం లాంటిదే ఆ సవాలు! ఆలమందకు స్వస్వరూప జ్ఞానం కలిగి, తనంతట తాను ఒక వర్గంగా నిలదొక్కుకుని,

నిర్దిష్ట ఫలితం కోసం కృషి చెయ్యాలంటే ఏం చెయ్యాలనే విషయంలో చైతన్యం అప్పుడే ఏర్పడుతుంది. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం తన చేతిలోకి తీసుకోనంతవరకూ, ఈ సొంత సంకల్పాలూ ఇచ్ఛలూ నోటికొచ్చినట్లు పలికే మాటలనీ, మాటలు మాత్రమేననీ, శూన్య-శుష్క అతిశయోక్తులు మాత్రమేననే స్పృహ కలుగుతుంది!


ఇచ్ఛావాదం, అనేది అర్థం లేని మాట! ఇష్టానుసారంగా ఏర్పర్చుకునే ఇచ్ఛే సకల కార్యాచరణకూ మూలమనే అర్థంలో ఆ మాటను వాడడం అర్థవిహీనం!! మార్క్సిస్టు పరిభాషలో ఇచ్ఛ లేదా సంకల్పం అంటే, ఫలితం గురించిన చైతన్యమనే అర్థం. అనగా, తన శక్తిసామర్థ్యాల గురించిన కచ్చితమయిన అవగాహన అనీ, దాన్ని ఆచరణలో ప్రదర్శించే సాధనమనీ అర్థమన్నమాట. ఫలితార్థంలో సంకల్పం అనేది ముందు విశిష్టమయిన, ప్రత్యేక అస్తిత్వంగా మారుతుంది; నిర్దిష్ట వర్గ ప్రయోజనాల కోసం కట్టుదిట్టంగా వ్యవస్థీకృతమయి, క్రమశిక్షణయుతంగా, ఊగిసలాట లేకుండా, పెడతోవలు పట్టకుండా వ్యవహరించడ మన్నదే సంకల్పం అనే దాని అర్థం!!! అంతిమ లక్ష్యం దిశగా, సరళరేఖలో ముక్కుసూటిగా సాగిపోయే ప్రేరణే సంకల్పం అనే మాటకు అర్థం. అలా సాగిపోవడమంటే, అన్యవర్గీయుల నుంచి అడపాదడపా సాదర సోదరభావం రుచిచూస్తూ, వారి పచ్చిక బయళ్ళలోకి దారితప్పి చొరబడకుండా వుండడం; అవతలిపక్షం వారి పట్ల గౌరవాదరాలను ప్రకటిస్తూ మృదువయిన మెచ్చుకోలు ప్రకటనలు చెయ్యకుండా నియంత్రించుకోవడమేనని భావం!! పైన ప్రస్తావించిన "మార్క్సిస్టు పరిభాషలో" అనే పదబంధం అర్థరహితమయిందనే చెప్పాలి. "మార్క్సిస్టు పరిభాషలో", "మార్క్సిజం ప్రకారం" లాంటి పదబంధాలు సందిగ్ధాన్ని కలిగిస్తాయి. బుద్ధిహీనమయిన మాటల మూటలను మన ముందు విప్పి, పరుస్తాయి. ఇలాంటి పదబంధాలు పదిమంది నోళ్ళల్లో నాని, నాని అరిగిపోయి, అర్థం కోల్పోతాయి!

మనకు సంబంధించినంత వరకూ మార్క్స్ దుడ్డుకర్ర చేతపట్టుకున్న పసులకాపరి కాదు- స్ఫూర్తిమంతమయిన నైతిక జీవితానికి నేతృత్వం వహించేవాడతడు. మానసిక జడత్వాన్ని వదిలించే ఉద్దీపన మార్క్స్; మనలో నిద్రావస్థలో వున్న సానుకూల శక్తులను మేల్కొలిపే వైతాళికుడు మార్క్స్. అమీతుమీ తేల్చుకోవలసిన పోరాటంలో మనం గెలవాలంటే, ఈ శక్తియుక్తులు మేల్కోక తప్పదు! భావాల తాలూకు సిసలయిన, నిక్కమయిన సారం సాధించేందుకు చేయవలసిన తీవ్రమయిన, చెక్కుచెదరని కృషికి మార్క్స్ మన ముందున్న ఆదర్శం! అనిర్దిష్ట విషయాల గురించి శుష్క ప్రలాపాలు చెయ్యకుండా నియంత్రించుకోవడానికి మన ముందున్న సిసలయిన సంస్కారం మార్క్స్, జ్ఞానసముపార్జన చేసే, లోతుగా ఆలోచించే మానవాళికి అతగాడు అఖండరూపం- మాట్లాడ్డానికి ముందు మార్క్స్ తన నాలుక ఎక్కడుందో వెతుక్కోడు; తన హృదయ స్పందనను తెలుసుకోవడానికి గుండెని తడుముకోడు; అయితే, వాస్తవం తాలూకు సారాన్ని చుట్టుముట్టివుండే ఉక్కు సూత్రాలను నిర్మిస్తాడు. అవి ప్రజల మెదళ్ళలోకి దూసుకుపోతాయి; విషయం తెలియక ముందే ఏర్పర్చుకునే అభిప్రాయాలనూ, గడ్డకట్టిపోయిన తప్పుడు భావాలనూ ఈ ఉక్కుసూత్రాలు దులిపి పారేస్తాయి; నైతిక శీలాన్ని దృఢతరం చేస్తాయవి!

మనకు సంబంధించినంతవరకూ, మార్క్స్, ఉయ్యాలలో కేరింతలు కొట్టే శిశువూ కాదు- జీబురుగడ్డంతో పూజారులను బెదరగొట్టే భయంకరుడూ కాదు! ఆయన జీవిత కథల్లో చెప్పుకునే స్వానుభవ ఘట్టాల్లో కనిపించే వ్యక్తి కాదు మార్క్స్. బాహ్య రూపం మాత్రమే గమనిస్తే ఆయన మహామేధావిగానో, లేక తెలివిలేని మూర్ఖుడిగానో తోచవచ్చు; కానీ ఆయన అదికాదు-ఇదికాదు! మార్క్స్ విశాలంగానూ, ప్రశాంతంగానూ ఆలోచించే మేధావి. తన ఉనికిని గురించీ, తన పరిణామశీలాన్ని గురించి తెలుసుకోవడానికి మానవాళి అనేక శతాబ్దాలుగా అన్వేషణ సాగిస్తున్నది. చరిత్రకున్న అంతుబట్టని లయవిన్యాసాన్ని అర్థం చేసుకుని, మరింత బలవత్తరంగా దృఢంగా, మరింత మెరుగ్గా మారాలని మానవజాతి ప్రయత్నం చేస్తున్నది; ఈ అన్వేషణ క్రమంలో మా ఒక విశిష్ట క్షణం మాత్రమే! మనకు దక్కే స్ఫూర్తిమంతమయిన శీలంలో మార్క్స్ ఒక అవిభాజ్యమయిన, అత్యవసరమయిన భాగం! మార్క్స్ అనేవాడొకడు లేనట్లయితే, అతగాడు అలా ఆలోచించి వుండకపోతే, మార్క్స్ ఆలోచనలూ-సంకల్పాలూ, ఆయన ఆదర్శాలూ-బాధలతో ఢీకొని, నిప్పురవ్వలు వెదజల్లి వుండకపోతే, మన శీలం ఇంత దృఢంగా వుండేది కాదు!

మార్క్స్ శతజయంతి సందర్భంగా ఆయన ఘనతను గురించి తలపోసుకోవడమంటే, కార్మికవర్గం తన సొంత ఘనతను తానే తలపోసుకున్నట్లు అవుతుంది. చైతన్యవంత మయిన తన బలాన్ని గురించీ, విశిష్టాధికారాలను కలిగినవాళ్ళ పెత్తనంపై విజయం సాధించే క్రమంలో ప్రదర్శించే చైతన్యశీలత గురించీ కార్మికవర్గం తన ఘనతను తానే తలపోసుకున్నట్లు అవుతుంది. అలా చెయ్యడం ద్వారా కార్మికవర్గం తన శ్రమకూ, త్యాగానికి పట్టంకట్టే తుది సమరానికి తలపడినట్లు అవుతుంది! ❑

ఇల్ గ్రిడో డెల్ పపోలో (జనవాణి) 04-మే-1918



# ప్రపంచానికి మార్క్స్ ఇచ్చిన బహుమతులు

## కార్ల్‌మార్క్స్‌కు, ఒక అవిశ్వాసి కృతజ్ఞత

**అవిజిత్ పాథక్**
సామాజిక శాస్త్ర ఆచార్యులు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ

కారల్ మార్క్స్ జయంతి అనగానే నాకొక లోపలి పిలుపు వినిపించింది. ఆ ఆధునిక యుగ ప్రవక్తను ఆవాహన చేసుకుని అంజలి ఘటించాలనిపించింది. మార్క్సిస్టు అంటే కొన్ని ఖచ్చితమైన మార్గదర్శకాలను పాటించి తీరడం, చారిత్రక భౌతికవాదాన్ని భేషరతుగా అంగీకరించడం, తప్పించుకోవడానికి వీలు లేని చారిత్రక సూత్రాలు వర్గ సంఘర్షణకి దారి తీసి సామాజిక మార్పు సంభవిస్తుందని విశ్వసించడం, ఏదో ఒక వామపక్ష రాజకీయ పార్టీలో కార్యకర్తగా ఉంటూ అన్ని రకాల సామ్యవాద దృక్పథాల్ని ఊహాస్వర్గాలుగా కొట్టి పారవేయడమే అయితే నేను మార్క్సిస్టును కాదు. అయినప్పటికీ ఆయన ఆలోచనా సముద్రంలోని చైతన్య తరంగాలు నా వంటి విద్యార్థుల్ని, సంచారుల్నీ మోహపరుస్తూనే ఉంటాయి. ఒక రాజనీతి అర్థశాస్త్రజ్ఞుడు మార్కెట్ వినిమయంలో సరుకు స్వభావం ఐంద్రజాలికంగా మారిపోయే రహస్యాన్ని విప్పుతున్నప్పుడూ ఒక రాజనీతి శాస్త్రవేత్త వర్గ నిర్మాణాన్నీ, రాజ్య స్వభావాన్నీ, సంఘర్షణాత్మక సమాజ గమనంలో అధికారం నిర్వహించే పాత్రను పరిశోధిస్తున్నప్పుడూ ఒక అస్తిత్వవాద తాత్వికుడు జార్జి నిల్‌హెల్మ్ ఫ్రెడరిక్ హెగెల్‌తోనో, లుడ్విక్ ఫ్యూయర్‌బాక్‌తోనో మానవుడు పరాయీకరణలో జాతి స్వభావాన్ని (Species Character) కోల్పోవడం గురించి చర్చిస్తున్నప్పుడూ – మార్క్స్ సర్వత్రా పరివ్యాప్తమైనట్లుంటాడు. అందుకే సోవియట్ యూనియన్ పతనమై బెర్లిన్‌గోడ కూలిపోయి, నూతన ఉదారవాద పెట్టుబడి ప్రపంచీకరణ చెందుతున్న ఈ కాలంలో కూడా ఆయన్ని జ్ఞాపకం చేసుకోవడానికి సాహసిస్తున్నాను.

### మార్క్స్ ఇచ్చిన బహుమతి

ప్రపంచాన్ని చూడడంలోని మన దృక్పథాన్ని మార్చివేయ దంలో కీలకపాత్ర వహించిన నాలుగు మార్క్సియన్ లోచూపుల్ని ప్రస్తావిస్తాను. వీటి ప్రభావం నుంచి మార్క్స్ వ్యతిరేకులు సైతం తప్పించుకోలేరనేది వాస్తవం. మొదటిది, పెట్టుబడిదారీ వ్యవస్థ మీద ఆయన చేసిన సాధికారికమైన నైతిక విమర్శ. యువ మార్క్స్ కాల్పనిక జగత్తు సృష్టిగా నేను దాన్ని కొట్టి పారవేయలేను. అందుకు భిన్నంగా సైద్ధాంతిక ఆచరణకు ఉన్న పరిధిని గుర్తిస్తాను. అంతేకాదు, పరాయీకరణ, శ్రమ వినియోగం, దేన్నైనా తనకు వ్యతిరేకంగా మార్చుకోగల డబ్బు సామర్థ్యం మొదలైన అంశాల మీద హెగెల్ ప్రభావితుడైన మార్క్స్ ఆలోచనలు, కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలో ఆర్థిక తాత్విక వ్రాతప్రతుల్లో ప్రతిపాదించిన గణాంకాలు – పరిణితుడైన మార్క్స్ 'పెట్టుబడి'లో ప్రతిపాదించిన మానవ సంబంధాలన్నీ వస్తుసంబంధాలుగా మారిపోయే 'వస్తు ఆరాధన' – వీటన్నిటి మధ్య ఒక అసాధారణ బంధుత్వం కూడా ఉందంటాను. ఐపియల్‌లో గ్లోబల్ పెట్టుబడి, కార్పొరేట్ మీడియా, క్రికెట్, దృశ్య సంబరం తప్ప ఏం చూస్తున్నాం మనం ?

నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థ మనల్ని సరుకులుగా మార్చి, మనలోని జీవశక్తిని, సృజనాత్మకతను మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తుంది. అందుకే మార్క్స్ సామ్యవాదం అనే ఉదాత్త స్వప్నాన్ని మనకిచ్చాడు. అది రూపానికీ సారానికీ మధ్య, స్వేచ్ఛకూ అవసరానికీ మధ్య, వస్తువుగా మారడానికీ మారకపోవడానికీ మధ్య తుల్యత సాధించి, ప్రేమ నుంచే ప్రేమ పుట్టడం గురించి, సంపూర్ణ మానవుడు అన్ని జీవన శాఖల్నీ తలదాల్చవలసిన అవసరం గురించి విశదం చేస్తుంది. శ్రమకాలం, అదనపు విలువ, లాభం వంటి అంశాల సైద్ధాంతీకరణల్లో పడి పై వాస్తవాన్ని విస్మరించడానికి వీలు లేదు. ఆర్థిక రాజనీతి మీద మార్క్స్ ఆలోచనల్లో కూడా ఈ సారాంశం ఇమిడి ఉంది.

రెండవది, మనకొక విమర్శనాత్మక చైతన్యాన్నివ్వడం ద్వారా ఆయన మన కళ్ళు తెరిపించాడు. ఆ శక్తి – మన సామాజిక వాతావరణంలో మన ఆలోచనల్ని ఎట్లా వర్తింప చేసుకోవాలో, ఉత్పత్తి శక్తులతో ఉత్పత్తి సంబంధాలతో మన సంబంధం ఏమిటో, ఏ పాలకవర్గమైతే ఉత్పత్తి సంబంధాలను నియంత్రిస్తుందో ఆ వర్గం ఎట్లా తననొక వివాదరహితమైన సత్యంగా లేక అందరూ ఆమోదించే భావనగా నిలబెట్టుకుంటుందో మనకు అర్థమయ్యేటట్లు చేస్తుంది. ఈ సైద్ధాంతిక భ్రమ లేదా అసత్య చైతన్యం వలలో చిక్కకుండా మనం తప్పించుకోవాలి. నిజంగా సమాజం ఎట్లా పని చేస్తుందో చూడాలన్నా, వర్గ విభజిత సమాజంలో 'స్వచ్ఛమైన పోటీ' వాస్తవాల్ని ఎట్లా దాచిపెడుతుందో,

ఎట్లా అధికారమూ, సంపద సమానంగా విభజించబడవో తెలుసుకోవాలన్నా ఈ అవగాహన తప్పదు. ఇది నిజానికి రాజ్యాన్ని పునర్నిర్వచించడం లాంటిది. రెండు వర్గాల మధ్య రాజ్యం కనపరచే మధ్యవర్తిత్వం అడుగున యధాతథ స్థితిని నిలబెట్టుకునే సైద్ధాంతిక, నిర్బంధ విధానాలు దాగి ఉంటాయి. ఒక రకంగా రాజ్యం చెప్పే (అ) సత్యాల ఆవలకి చూడగలిగే శక్తినివ్వడమే మార్క్స్ మనకు ఇచ్చిన బహుమతి.

మూడవది, సంఘర్షణకు కొత్త అర్థాన్ని ఇచ్చాడు మార్క్స్. సంఘర్షణ అపసవ్యం కాదు. శాంతిభద్రతల సమస్య కాదు, అదొక వ్యతిరేక భావన కానే కాదు. అందుకు భిన్నంగా అది సామాజిక, నిర్మాణ మూలాలలోనే పాతుకుని ఉంది. మార్క్స్ పదునెక్కిన గతి తార్కికవాదం చెబుతున్నట్లుగా సంఘర్షించే వర్గాల ప్రయోజనాలే చరిత్ర చోదకశక్తులుగా పనిచేశాయి. వాద, ప్రతివాదాల మధ్య నిరంతరం జరిగిన గతి తర్క పురోగమన విధానాన్ని చరిత్రను చూడడానికీ ఒక పద్ధతిగా చేసుకున్నాం. నూతన ఉత్పత్తి విధానాలు పారిశ్రామిక బూర్జువా వర్గాల ఆవిర్భావానికి దారితీసి భూస్వామ్య వ్యవస్థను నేలమట్టం చెయ్యడాన్ని అర్థం చేసుకున్నాం. వలస భారత దేశంలో జాతీయ మధ్య తరగతి ఆవిర్భావం అఖిల భారత స్వాతంత్ర్యోద్యమానికి దారి తీయడాన్నీ, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ సరిహద్దు ప్రాంతాల ప్రజలు 'మావోయిస్టు విజృంభణ – బూటకపు ఎన్‌కౌంటర్‌లు' అనే విషవలయంలో పడి స్థానభ్రంశమై, అవమానకర అణచివేతకు గురై, అంచులకు నెట్టివేయబడడాన్ని ఈ కోణం నుంచే చూడగలుగుతున్నాం.

నాల్గవదీ, ఆఖరుది – మనిషి తన పరిధుల్నీ సాధ్యాల్నీ గుర్తించగలగడంలో మార్క్స్ సహకరించాడు. భౌతిక ప్రపంచంలో స్వేచ్ఛ సంపూర్ణంగా ఉండదు. ఎందుకంటే సామాజిక ఆర్థిక నిర్మాణంలో అనేక నిరోధాల మధ్య చారిత్రకంగా నిర్దేశింపబడిన పాత్రను మనం పోషిస్తుంటాం. మార్క్స్ 'జర్మన్ ఐడియాలజీ'లో చెప్పినట్టు భావనలు, నైతికత, మతం మొదలైనవి స్వయం ప్రతిపత్తి కల్గినవి కావు. మనుషులు దేన్ని ఎట్లా ఉత్పత్తి చేస్తారో దానితో ఏకీభావం కలిగి ఉంటారు. అయినప్పటికీ మార్క్స్ భౌతికవాదం ఫ్యూయర్‌బాక్ భౌతికవాదం లాగా యాంత్రికమైనది కాదు. చైతన్యానికీ వాస్తవరూపం తీసుకోవడానికీ మధ్య ఆచరణ ఉంటుంది. ఈ ఆచరణ ద్వారానే ఒక సమూహంగా మన స్థానాన్ని పునరాక్రమించుకుంటాం. చారిత్రక విభాతసంధ్యల్లో మౌనప్రేక్షకుల్లా మిగిలిపోకుండా మన పాత్రను పోషిస్తాం. మార్క్స్ ఒక వెలుపలి వ్యక్తిగా ఇనుప సూత్రాలను చరిత్రకు ఆపాదించలేదు. గొప్ప భావావేశంతో మన చారిత్రక బాధ్యతను గుర్తు చేసిన ఆలోచనాశీలి ఆయన. ఫ్యూయర్‌బాక్ మీద చేసిన 11వ వాదంలో ఈ అంశం సమృద్ధిగా స్పష్టం చేయబడింది. అక్కడే ఆయన ఇలా అన్నాడు 'తత్త్వవేత్తలు ప్రపంచాన్ని వివిధ రకాలుగా వ్యాఖ్యానించారు. కానీ జరగవలసింది దాన్ని మార్చడం'.

మార్క్స్ మంత్రసమానమైన తన ఆలోచనా విధానంతో కళాకారుల్ని, రాజకీయ కార్యకర్తలను, విద్యావేత్తలను, తత్త్వవేత్తలను ఒకర్నేమిటీ, ఒకటేమిటీ జీవితంలోని అన్ని పార్శ్వాలను ఉత్తేజితం చేశాడనడంలో ఆశ్చర్యమేమీ లేదు. విభేదాలున్నప్పటికీ ఆయన్ని తప్పించుకుపోలేం. ఉదాహరణకు మాక్స్‌వెబర్ వంటి సామాజిక శాస్త్రవేత్త మరింత జాగ్రత్తతో కూడిన అధ్యయనంతో వర్గం, అంతస్తు, అధికారం వంటి సామాజిక అంతరాలను వెలికి తీసినప్పుడూ లేదా పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణంలో భావనలు నిర్వహించవలసిన పాత్రను అభ్యర్థించినపుడూ – వాటన్నిటి వెనుక 'మార్క్స్ భూతం' అతణ్ణి వెంటాడుతుంది. అట్లాగే భారతీయ మార్క్సిస్టు, అంబేద్కరిజమ్ ఇస్తున్న ఒత్తిడికి తలవొగ్గి కులాధిక్యతను సాపేక్షంగా అంగీకరించినా దాని అడుగున ఉన్న ఆర్థిక ప్రాతిపదికను పాక్షిక భూస్వామ్య వ్యవస్థలో భూమిపై ఉండే హక్కుల్లోని అంతరాలను విస్మరించలేదు. ఆ మాటకొస్తే జీన్‌పాల్‌సార్త్రె ప్రతిపాదించిన అస్తిత్వవాదం కూడా మార్క్స్ ఆత్మకూ మనస్సాక్షికీ పూర్తిగా భిన్నమైంది కాదు. నిజానికి సార్త్రె మనిషి తాను స్వతంత్రుడిని కాననే అపనమ్మకం (bad faith) గురించి వ్యక్తీకరించిన వేదన, మార్క్స్ పరాయీకరణ చెందిన మనిషి గురించి పడిన బాధ – మౌలికంగా వేరైనవి కావు. మార్క్సిస్టు మహా కథనాల మీద గాఢవిమర్శ చేసిన మిచెల్ ఫుకో కూడా సూక్ష్మ అధికార భౌతిక సూత్రాల చలనశీలతను ప్రస్ఫుటం చెయ్యడంలో మార్క్స్ విమర్శనా పద్ధతినే అనుసరించాడు.

## ప్రమాదాలు - సృజనాత్మకత - ప్రయోగాలు

ఏమైనప్పటికీ మార్క్సిజంలో మనం మరచిపోవడానికి వీల్లేని ఆర్థిక నియతివాదం, నియంతృత్వ హింస వంటి ప్రమాదాలు ఉన్నాయి. అదృష్టవశాత్తూ కొందరు సృజనశీలురైన సంప్రదాయ వాదులు కాని మార్క్సిస్టులు మారుతున్న కాలానికనుగుణంగా విముక్తి చైతన్యాన్ని అన్వయించ

గలుగుతున్నారు. ఉదాహరణకు మార్క్సిజమ్‌ను సమాజాన్ని కురచపరిచే సిద్ధాంతంగా, మార్చడానికి వీల్లేని నియతివాదంగా, ప్రత్యక్ష అంశాలపైనే కానీ భావాత్మక అంశాలపై మాట్లాడని ఆలోచనగా దిగజార్చే అవకాశం ఉంది. నికోలాయ్ బుఖారిన్, జార్జి ప్లెఖనోవ్ వంటి వారి పై ధోరణులను తన బలమైన విమర్శ ద్వారా ఎదుర్కొన్నందుకు అంటోనియో గ్రాంషికి కృతజ్ఞతలు. బెనిడెట్టో క్రోస్ వంటి ఆదర్శ తత్త్వవేత్త సాంస్కృతిక రంగం పైన, మానవ సాధ్యాలపైన చూపిన సున్నితత్వాన్ని ఆధారం చేసుకుని గ్రాంషి 'ఆచరణ తాత్వికత' (Philosophy of Prayis) ను రూపొందించాడు.

నిజానికి చరిత్రను నడిపించే యాంత్రిక, నియతివాద సూత్రాలంటూ ఏమీ లేవు. రాజకీయాలు, సృజనాత్మక కార్యరంగం కాబట్టి, గ్రాంషి చెప్పినట్టు 'ఒకరు తన కార్యాచరణ మేరకే ముందుకు చూడగలుగుతారు'. గ్రాంషి వల్లనే మనం జనసమ్మత భావనకూ, మేధోజనిత ఆలోచనకు మధ్య సయోధ్యను సాధించాల్సిన అవసరాన్ని గుర్తించాం. సాంస్కృతిక రంగంలో ప్రత్యామ్నాయ ఆధిపత్య పోరాట ఆవశ్యకతనీ – యుద్ధ సంసిద్ధ స్థితికి (War of Position) యుద్ధోన్ముఖ కదలిక (War of movement) కీ మధ్య సున్నితమైన తుల్యతనీ గుర్తించాం. గ్రాంషి వల్లనే మార్క్సిజమ్ మానవీయ కోణాన్ని నిలుపుకోగలిగింది.

శాస్త్రీయంగా ఉండడం కూడా బరువును మోయడం వంటిదే. కారల్ మార్క్స్ కూడా న్యూటన్ సిద్ధాంతం, డార్విన్ పరిణామ వాదం వంటి తమకు తామే అడ్డంకులుగా మారిన శాస్త్ర నియతులను ప్రతిపాదించిన యూరోపియన్ వికాసదశకు పుట్టిన బిడ్డే. కానీ ఇరవయ్యో శతాబ్దపు సామాజిక వాస్తవం మారుతూ వచ్చింది. సైన్సు, ఆధిపత్య భావనగా మారి 'సాంకేతిక హింస'గా పరిణమించింది. గిడసబారిన సాంస్కృతిక ధోరణుల నుంచి ఫాసిస్టు మనస్తత్వం పెరిగింది. అడాల్ఫ్ హిట్లర్, బెనిటో ముస్సోలినీ, జోసఫ్ స్టాలిన్ వంటి నియంతలు ఆవిర్భవించారు. సంప్రదాయ మార్క్సిజమ్ ఇవ్వలేని కొత్త విశ్లేషణ కొత్త ఆలోచనా విధానమూ అవసరమయ్యాయి. ఇదుగో ఈ దశలోనే ఒక అద్భుతం జరిగింది. ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ తలెత్తి అర్థవంతమైన జ్ఞానాన్నిచ్చింది.


తియొడోర్ అడొర్నో సాంస్కృతిక పరిశ్రమను చదవడంలో పాతదారుల్ని చెరిపేశాడు. మార్క్యూజ్ 'ఒక్క కొలతే ఉన్న మానవుడు' నియంత్రణ లేకుండా సాగించే వినియోగం గురించి సామాజిక విశ్లేషణలు చేశాడు. ఫ్రాయిడ్ మార్క్స్‌లతో ఎరిక్ ఫ్రామ్‌కు ఉన్న సున్నిత అనుబంధం వల్ల అస్తిత్వం 'కలిగి ఉండడం' కన్నా అస్తిత్వ'మై' ఉండడం ఒక ఉత్సవంగా మారింది. సాంస్కృతిక రంగం మీద స్పృహ కల్గిన, చర్చించుకోగలిగిన సంపద్వంతమైన సంప్రదాయం మార్క్సిజమ్ నుంచే పుట్టగలిగింది. మన యం.యన్.రాయ్‌ని మనమే మరచిపోవడం ఎందుకు ? శ్రామిక నియంతృత్వంలో దాగి ఉన్న ఆధిపత్య బీజాలను ఆయన అప్పుడే చూపించాడు. రాయ్ రాడికల్ హ్యూమనిజాన్ని పార్టీరహిత ప్రజాస్వామ్య వికేంద్రీకరణల్ని ఎట్లా విస్మరిస్తాం? ఈ ప్రయోగాల వల్ల మార్క్సిజమ్ తన బహుళతత్వ సంప్రదాయాన్ని నిలుపుకుని తన 'అధికారిక' అభ్యాసకుల నుంచి తనను తానే రక్షించుకుందని నమ్ముతున్నాను.

మార్క్స్ నిజంగా ఒక ముఖ్యమైన మలుపు. ఆధునిక కాల లౌకిక మత స్థాపకుడు. కానీ రవీంద్రనాథ్‌ఠాగూర్, మహాత్మాగాంధీ వంటి వారు సాధించుకున్న లోతైన అనుభవమేదో ఆయన పొందలేకపోయాడు. ఠాగూర్ బహుశా అనగలిగిన 'కవి మతం' (Poet's religion) ను, అంటే గాఢమైన కృతజ్ఞత, ప్రార్థనల ద్వారా రససిద్ధినిచ్చే మతాన్ని, విశ్వలయతో మనల్ని సంధానపరచే మతాన్ని, వర్గ విశ్లేషణ వంటి నిర్దిష్ట విధానాలకు ఆవలి వైపు చూడగలిగిన దేన్నో మార్క్స్ జారవిడుచుకున్నాడు. అట్లాగే ఆయన గాంధీ 'లోపలి ప్రపంచంలోకి ప్రయాణం' వంటి భావనలకు, రాజకీయాల్ని ప్రేమతో, సర్వోదయ భావనతో మార్చడానికి కావలసిన ఆత్మక్షాళనకు గురి కాలేకపోయాడు. పాశ్చాత్య హేతువాద ధోరణుల్లో మునిగిపోయిన మార్క్స్ ఈ స్వాభావిక ఆత్మ సంగీతాన్ని వినలేకపోయాడు.


అయితేనేం, జీవితమిట్లానే ఉంటుంది. మనం నిరంతరం నేర్చుకుంటూ నేర్చుకున్నది వదిలేస్తూ మన ఆకాశాల్ని విస్తరించుకోవాలి. మనల్ని మనం తగినంత ప్రయోగాత్మకం చేసుకుంటూ మానవీయ మార్క్స్, కవితాత్మక ఠాగూర్, దార్శనికుడైన గాంధీలతో కలిసి ప్రయాణిస్తే భారతీయ రాజకీయ సాంస్కృతిక రంగాలు కల్లోలాల నుంచి బయటపడే దారి కనిపిస్తుంది. సామాజిక వైరుధ్యాలను కప్పి పుచ్చే సిద్ధాంతమైన తీవ్ర జాతీయవాదం నుంచి, అభివృద్ధి పేరుతో ఉగ్రంగా దూసుకెళుతున్న మొరటు ధోరణి నుంచి పేదరికాన్ని చుట్టుముట్టిన అసభ్య వైభవం నుంచీ నిరుద్యోగిత నుంచి, రాజకీయాలను బ్రాండెడ్ సరుకుగా విక్రయించే పబ్లిక్ మాయాజాలం నుంచి అప్పుడు మాత్రమే బయటపడగలం. ❑

# మార్క్స్ అంటే మార్చ్

తెలకపల్లి రవి



1818 మే నెలలో ప్రపంచంలో చాలా మందే పుట్టారు. గిట్టారు. రాజులు, చక్రవర్తులు, పండిత పామరులూ సంపన్నులూ ఎందరెందరో. ఆ తర్వాత కాలంలోనే రవి అస్తమించని సామ్రాజ్యాలన్నవి ఏర్పడ్డం కూలిపోవడం జరిగిపోయింది. సామ్రాట్టులు అంతరించారు గాని సామాన్యుల కోసం పరితపించిన ఒక విజ్ఞాన ఖని, విశ్వ విప్లవ వైతాళికుడు మాత్రం చిరంజీవిగా నిలిచిపోయాడు. ఇప్పుడు ఇంటర్‌నెట్‌లోకి వెళ్లి చూస్తే ఆ మే 5న పుట్టిన ఒకే ఒక్క పేరు ప్రకాశవంతంగా కనిపిస్తుంది. కారల్ మార్క్స్! 19వ శతాబ్ది ప్రథమ పాదంలో పుట్టిన ఆ మహామనీషి సిద్ధాంతాలు 20 శతాబ్దాన్ని అనన్య సామాన్యంగా మలచి, ఆ శతాబ్ది చివరలో చిందర వందరలు అధిగమించి 21వ శతాబ్దంలో పునరుజ్జీవం పొందడానికి కారణమైనాయి. అంతకు ముందు నడిచింది పాలక వర్గాధిపత్య చరిత్ర. ఆయన భావధారతో మొదలైంది పాలకవర్గ ధిక్కార చరిత్ర. మార్క్స్ తత్వాలకూ సూక్తులకూ పరిమితమైన తాత్వికుల స్థానాన్ని చరిత్ర నిర్మాతల సరసన చేర్చిన అఖండ మేధావి. ప్రపంచాన్ని పరిపరి విధాల నిర్వచించడం కాదు మార్చాలంటూ విప్లవ శంఖం పూరించిన సాహస సైద్ధాంతికుడు. వాల్టేర్ రూసో హెగెల్ లెస్సింగ్, హైనే వంటి మహా తాత్వికు లందరూ ఒక్కటిగా రూపు దాలిస్తే మార్క్స్ అవుతాడని మోజెస్ హెస్ ప్రశంస చేసేనాటికి ఆయన వయస్సు కేవలం 23.




'సత్పురుషులొచ్చినా/మతములెన్నొచ్చినా/వేదనలూ పీడనలూ/తొలగనే లేదసలు/మార్క్సిజం ఇలపైన/ ఏనాడు వెలసెనో/మానవాళికానాడే/అరుణోదయం' అని నేనొక పాటలో రాశాను. భవబంధాలు తెంచుకొమ్మని మన మెట్ట వేదాంతం చెప్పింది. మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి గాని ప్రతి చోటా సంకెళ్లతో బంధితుడై వున్నాడని రూసో వాపోయాడు. ఆ మెట్ట వేదాంతాన్ని బద్దలు కొట్టడానికి ఈ తత్వవేత్త వేదన పారదోలడానికి ఏక కాలంలో మార్గదర్శనం చేశాడు మార్క్స్. ఆయన పుట్టక ముందు శ్రమదోపిడీ విలువ వర్గం, విముక్తి వంటి పదాలకు వున్న అర్థం వేరు. కష్టపడే వారిపై జాలి, పేదలపై సానుభూతి చాలా మంది చూపించినా పరిష్కారం చేయడం అటుంచి చెప్పడం కూడా సాధ్యం కాలేదు. అనేక మంది శ్రమను అతి కొద్ది మంది చట్టరీత్యా దోచుకోవడం వల్లనే శత సహస్ర కోటీశ్వరులు కాగలుగుతున్నారనే పరమ సత్యం చాటి చెప్పి సిద్ధాంత రూపం ఇచ్చాడాయన. ఇప్పటి వరకూ నడిచిన (లిఖిత) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని తేల్చి చెప్పేశాడు. 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి. పోయేదేమీ లేదు సంకెళ్లు తప్ప' అని అభయమిచ్చాడు. ఈ క్రమంలోనే వలస దేశాల స్వతంత్రాకాంక్ష కూడా చూడగలిగాడు. భారత స్వాతంత్ర్య పోరాటం గురించి ఏ విదేశీ మేధావి కన్నా ముందు సమగ్రంగా చర్చించిన వ్యక్తి ఆయనే!

## వందేళ్లలోనే నూతన ప్రపంచం

సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థల పరిణామ క్రమాన్ని జమిలిగా చూడాలని గ్రహించాడు గనకనే తర్కాన్ని చరిత్రనూ మేళవించగలిగాడు. అది అతి తర్కం కాదు, అనునిత్యం అధ్యయనంతో ప్రతి పరిణామాన్ని పరిశీలిస్తూ పరిపూర్ణం చేసుకోవాల్సిన గతి తర్కం. ఆయన చెప్పిన చరిత్ర క్రమం రాజ వంశాల అనుక్రమణిక కాదు, మానవాళి మజిలీలను మథనం చేసిన మహాధ్యయనం. ప్రకృతిలోలాగే మానవ సమాజం లోనూ మార్పులు వస్తాయని అందుకు శ్రమ జీవులు చోదక శక్తులుగా వుంటారని చెప్పిన సారాంశం మార్క్సిజం. అయితే శ్రమ దోపిడీ పాఠాలు వల్లె వేస్తేనో లేక బానిస సమాజం భూస్వామ్య సమాజం పెట్టుబడిదారీ సమాజం సోషలిజం అని ఒక పరంపరను జపిస్తేనే మార్క్సిజమై పోదు. మార్పు రానూ రాదు. ఆ మూల సూత్రాల

ప్రాతిపదికన ఆయా దశల్లో శ్రమ దోపిడీ రూపాలు గాని పీడక వర్గ వ్యూహాలు గాని అర్థం చేసుకుని రాజకీయ బలంతో సంఘటిత శక్తితో ఎదిరించాలి.

మేధావిగా రచనలు చేయడమే గాక విప్లవకారుడుగా నిరంతరం పోరాడిన మార్క్స్ 1883లో మరణిస్తే 1917లో అంటే తను పుట్టిన వందేళ్లకు విప్లవ సిద్ధాంతం లెనిన్ జయప్రదంగా అమలు చేశాడు. వర్గాలనే కూలగొట్టే ఇంత సమూలమైన మార్పు ఇంత త్వరితంగా వచ్చిన దాఖలా చరిత్రలో మరొకటి లేదు. అది మార్క్స్ బోధనల లెనిన్ వ్యూహాల ఔన్నత్యం. సోవియట్ యూనియన్‌ను స్థాపించాక మార్క్సిజంతో లెనినిజం కూడా చేరినా పునాది మార్క్సిజమే. ఈ విప్లవానికి ముందు వందేళ్లు తర్వాతి వందేళ్లలో ప్రపంచం ఎలా మారిందీ మారుతున్నదీ పరిశీలించకుండా మార్క్స్ సూత్రాలు బట్టీ వేస్తే ముందుకు పోగలిగింది వుండదు. మార్క్స్ చెప్పిందే అది. నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అంచనా వేయండి అని. కాలం మారింది కాబట్టి విప్లవం కార్మికవర్గం శ్రమ దోపిడీ వంటి పదాలకు అర్థం లేదని ఎవరైనా అంటే అంతకన్నా తప్పు వుండదు. 'మార్క్స్ ప్రతీకారం : ప్రపంచాన్ని మలుస్తున్న వర్గపోరాటం' అని అమెరికన్ పత్రిక 'టైమ్' 2013లో ముఖచిత్ర కథనం ఇచ్చింది. ప్రపంచ దేశాలలో అన్ని చోట్ల కన్నా ఎక్కువగా అమెరికాలో ఆర్థిక కేంద్రీకరణ ఎలా పెరుగుతున్న తీరుపై తీవ్ర హెచ్చరికలు చేస్తూ వీటిపై మార్క్స్ చెప్పిన వర్గ పోరాటాలు ప్రజ్వరిల్లడం తథ్యమని హెచ్చరించింది. 2008లో వచ్చిన సంక్షోభాల విరుగుడు మార్క్స్ లోనే వెతకాలని పాశ్చాత్య ఆర్థికవేత్తలు ఒప్పేసుకుంటున్నారు. మార్క్స్ జీవిత కథలకూ పెట్టుబడి గ్రంథానికి గిరాకీ విపరీతంగా పెరుగుతున్నది. నోరియల్ రిస్కే, థామస్ ఫిక్కెటి వంటి ధనస్వామ్య ఆర్థికవేత్తలు కూడా మార్క్సనే జపిస్తున్నారు. అంత కంటే ముఖ్యంగా, దేశ దేశాలలో కమ్యూనిస్టులు, కార్మిక నాయకులు, ప్రజాస్వామిక వాదులు మానవతా మూర్తులు పోరాడుతున్నారు. ఉద్యమాలు చేస్తున్నారు. ప్రభుత్వాలు నిర్వహిస్తున్నారు. సైద్ధాంతిక ఘర్షణలు సాగిస్తున్నారు. కొత్త గుణపాఠాలు నేర్చుకుంటున్నారు. ఇందులో తప్పొప్పులు వుంటాయి. చిన్న పెద్ద విజయాలూ వుంటాయి. ఎదురు దెబ్బలుంటాయి. కాని మహత్తర త్యాగాలూ వున్నాయి. చెక్కు చెదరని నిబద్ధతలు వున్నాయి. దారి తప్పే బాపతు జారిపోయినా మహాప్రస్థానం చేస్తున్న మార్క్స్ వారసులున్నారు.

వేల వేల సంవత్సరాల దోపిడీ సమాజాలను కూలగొట్టి నూతన సమసమాజాల కోసం సామాజిక న్యాయం కోసం చేసే పోరాటం తేలికైంది కాదు. వర్గ రాజకీయ సైద్ధాంతిక సామాజిక శత్రువులు దాన్ని సాగనివ్వరు. ఈ సంక్లిష్ట క్రమాన్ని అవగాహన చేసుకోకుండా శత్రుశక్తులూ మిత్రులనుకునేవాళ్లు కూడా పోరాడే శక్తులను అవహేళన చేయవచ్చు గాని వాటితోనే చరిత్ర ఆగిపోదు. ఈ పాతికేళ్లలోనూ పుట్టుకొచ్చిన చరిత్రాంతం, కాలానికి అంతం, దూరానికి అంతం, మహా సిద్ధాంతాల అంతం, ఆధునికత అంతం, సత్యం అంతం అంటూ అంతుపట్టని అంతం సిద్ధాంతాలే సోదిలోకి లేకుండా పోతున్నాయి. ఇవన్నీ మార్క్సుకు ముందు వున్నవే. వాటన్నిటిని మధించిన అనంతరమే ఆయన ఎంగెల్సుతో కలసి కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకటించారు. 170 ఏళ్ల ఆ ప్రణాళికలోని మాటలు ఎప్పటి కంటే ఇప్పుడు సత్యమవుతున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దుష్ఫలితాలను ప్రతివారూ చవిచూస్తున్నారు. అరగంటకో రైతు ఆత్మహత్య, నయా కంపెనీలు నరాలు తెగిపోయేలా సరికొత్త వెట్టిచాకిరి చేయించుకోవడం కనిపిస్తున్నది. ఉద్యోగాలు రాకపోగా వున్నవాటికే భద్రత లేకుండా పోతున్న తీరు అసంఘటిత రంగ విశ్వరూపం చూస్తున్నాం. మరమనుషులు, డ్రైవర్లు లేని కార్ల ప్రయోగాల మధ్య పాత పీడనలు తీవ్రం చేస్తూ కొత్త దోపిడీ ముంచుకొచ్చిన వర్తమానాన్ని మార్క్సిజం తప్ప మరే సిద్ధాంతం మనకు చెప్పలేదు. ఈ మార్పులను ఆకళింపు చేసుకుంటూ అసమానతల ఆధిపత్యాల అంతం కోరేవారంతా ఒక్క తాటిపై నడవాలన్నదే మార్క్స్ ఏకం కండు' పిలుపు సారాంశం. 'లాల్ నీల్' వంటి నినాదాల వెనక తాత్వికతా అదే.

## దేశంలోనూ ప్రపంచంలోనూ ... పోరాటాల పరంపర

మీడియాలో ప్రతి చోటా కమ్యూనిజం దెబ్బ తినిపోయిందనీ, కొత్తగా ఎవరూ రావడం లేదని తోచిన వ్యాఖ్యలు చేశారు. గత పాతికేళ్ల ప్రతికూల పరిణామాలను ఎవరూ కాదనరు. సోవియట్, తూర్పు యూరప్ దేశాలలో పతనం గాని, దేశంలో బెంగాల్ ఇటీవల త్రిపుర వంటి చోట్ల ఓటమి గాని వాస్తవాలే. ఆ ప్రభుత్వాలు వున్నప్పుడు సవాళ్లు లేవని, ఇప్పుడు సర్వం పోయిందని అనుకుంటే అవాస్తవికత అవుతుంది. మార్క్స్ జీవిత కాలంలోనే తొలి కార్మిక వర్గ పాలనా వ్యవస్థగా పారిస్ కమ్యూన్ అవతరించి కూలిపోయింది. అయినా సోవియట్ విప్లవం ఆగలేదు. ఇప్పుడు అది లేకున్నా జరిగే పరిణామాలు ఆగవు. ఎప్పటికప్పుడు సవాళ్లు వుంటాయి సమరాలూ సాగుతుంటాయి. మరోవైపు వివిధ రూపాల్లో పెట్టుబడిదారీ సంక్షోభాలు కల్లోలాలూ విరుచుకుపడుతూనే వుంటాయని మార్క్స్ ఎప్పుడో చెప్పింది

నిజమవుతున్నది. వీటి మధ్యనే ఇప్పుడు కంపు ట్రంపు దుందుడుకు వ్యూహాలను సోషలిజం ఆధారంగా పెరిగిన చైనా, నిన్న పెరిగిన రష్యా ఆక్షేపించడం చూస్తున్నాం. ఒకప్పటి సోవియట్ స్నేహంతో బలపడిన మన దేశం లంగిపోతున్నా పొరుగునే వున్న చిట్టి దేశం నేపాల్‌లో కమ్యూనిస్టుల ఘన విజయం వాస్తవం. అంతలోనే అక్కడ సమస్యలు రావడమూ నిజం, ఉత్తేజకరమైన మహారాష్ట్ర రైతుయాత్ర అందరూ అభినందించారు గాని అది 1944లో విజయవాడలో గొప్ప రైతు మహాసభ నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ వారసత్వంగా గుర్తుంచుకోవాలి. ఆ కిసాన్ సభ చొరవతోనే ఇప్పుడు ఢిల్లీలో సుదీర్ఘ రైతు ఉద్యమం నడుస్తున్నది. భారత కార్మికవర్గం దేశవ్యాపిత సమ్మెలతో పాటు వివిధ దేశాలలో చాలా పోరాటాలు నడుస్తున్నాయి. ఫాసిస్టు తరహా శక్తులు ప్రజా వ్యతిరేకులు పంజా విసురుతున్నా ప్రపంచంలో ప్రగతి స్ఫూర్తి గొడ్డుపోలేదు.

## కారల్ మార్క్స్ బోధనలు నిరూపించిన కరోనా

పెట్టుబడిదారీ దేశాల మేడిపండు అభివృద్ధిని ప్రస్తుతం ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా కళ్లకు కట్టింది, కరోనా వైరస్ మృతుల సంఖ్య ముప్పై లక్షలు దాటిపోయింది. తొలిదశలో అత్యధికులు అమెరికా, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, కెనడా వంటి సంపన్న దేశాలలోనే మరణించడం దిగ్భ్రాంతి కలిగించే వాస్తవం. ఆయా దేశాల అనుభవాలలో పరిపరివిధాలుగా వుండొచ్చు గాని ఒక విషయంలో మాత్రం తేడా లేదు. ఇది ప్రపంచీకరణ వైఫల్యం. నయా ఉదారవాద విధాన సంక్షోభం. అందుకు అతి తీవ్రంగా గురైన వైద్య వ్యవస్థల వైఫల్యం. ప్రపంచ ప్రజల ఆరోగ్య, ఆర్థిక, ఆహార భద్రతలన్నీ ఒక్కసారిగా కుప్పకూలిన విషాదం. అద్దాల మేడలా మెరిసిన అంతర్జాతీయ వ్యవస్థ భూత్ బంగళాగా మారిపోయింది. ఏ యుద్ధం లేకుండానే శత్రువు దాడి లేకుండానే శవాల గుట్టలు పడుతున్నాయి. కరోనా అదృశ్య శత్రువు అంటున్నారు గాని నిజానికి అగోచర శత్రువు. మనం నివసిస్తున్న మార్కెట్ మాయాబజార్ మాత్రమే. మనుషుల ప్రాణాలకూ మానవాళి మనుగడకు ఆ మార్కెట్లో విలువ లేదు గనకే కరోనా కరాళ నృత్యాన్ని ఆపేందుకు కార్పొరేట్ వైద్య వ్యవస్థ పెద్ద ఆసక్తి చూపడం లేదు. అంతకు ముందే కుప్పకూల్చబడిన ప్రజారోగ్య వ్యవస్థకు ఇంత స్వల్ప వ్యవధిలో సవాలును స్వీకరించ గల సత్తా లేకపోయింది. వైద్యనిపుణుల కొరత, సహాయక సిబ్బంది, యంత్రాంగం, పరికరాలు, మందులు అన్నిటినీ కోత కోసిన స్థితి. దానికి చెల్లిస్తున్న మూల్యమే ఇంతటి ప్రాణ బలి.

మొదట పేర్కొన్న జాబితాలోని దేశాలన్నీ చితికిపోయిన పెట్టుబడిదారీ దేశాలే. పైగా వాటిలో చాలా భాగం ఇతర దేశాలను ఆక్రమించిన వలసాధిపత్య రాజ్యాలు కూడా. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా ఆధిపత్య శక్తిగా అవతరించినా 'పాశం వండిన కుండ వాసన' పోదన్నట్టు వాటికీ సంపన్న వారసత్వం కొనసాగుతూనే వుంది. వాటి తలసరి ఆదాయాలు ఎక్కువగానే వున్నాయి. వర్ధమాన దేశాల నుంచి ఉపాధి వెతుక్కుంటూ వెళ్లిన వారి సేవలు వినియోగించుకుంటూ సాంకేతిక రంగంలోనూ ఆధిక్యత, బహుళజాతి కంపెనీల ద్వారా ఆర్థిక ప్రాబల్యం సాగిస్తున్నాయి. అలాంటి దేశాలలో ఈ దయనీయ పరిస్థితి ఎలా వచ్చింది? పైగా కరోనా వైరస్ వల్ల మరణాలు అయిదు శాతం లోపే అని చెప్పుకున్న నేపథ్యంలో వేల వేలమంది కుప్పకూలడం ఎందుకు జరుగుతున్నది? ఉదాహరణకు పాజిటివ్ కేసులలో స్పెయిన్‌లో 18.3 శాతం మంది, ఇటలీలో 15.8 శాతం మంది ప్రాణాలు కోల్పోయారు. ఇదంతా ఎందుకంటే వారి సంపదలూ వ్యవస్థలూ ప్రజలను ఆదుకోడానికి బదులు వ్యాపార రేఖలలో బంధితమై వున్నాయి. పైగా సుఖంగా వున్నామనుకునే ఆ ప్రజలకు వాటిని అందిపుచ్చుకోగల స్థితి కూడా లేకుండా పోయింది. వాస్తవానికి కరోనా సోకిన పేర్లలో యువరాజులు, ప్రధానులు, మంత్రులూ హాలీవుడ్ సెలబ్రెటీలు ఎక్కువగా వున్నారు. వారిలో కొందరు కోలుకున్నా మరణించిన వారూ ఎక్కువే. కారణం ఆ వ్యవస్థల దృష్టికోణం రోగ నివారణ, నిరోధం నుంచి వైద్య వ్యాపారం వైపు మరలడమే. సామూహిక ఆరోగ్య సవాలును అందుకునే పరిస్థితి వాటికి లేకుండా పోయింది. క్యాన్సర్లు, హృద్రోగాలు, ఎయిడ్స్, ట్రాన్స్‌ప్లాంటేషన్లు, కాస్మొటిక్ సర్జరీలు, ఇలాంటి వాటి గురించే ఇంకా ఇంకా మాట్లాడుతూ భారీ రేట్లతో నిర్వహిస్తూ లాభాలు పోసుకోవడం వాటి పని. పైగా లాభాలు తక్కువగా వుండే అంటువ్యాధులు, వైరస్ వంటి వాటిపై పరిశోధన, చికిత్స, మందులు కనుక్కోవడం వాటికి నచ్చని విషయం. వైరస్‌కు వ్యాక్సిన్ కనుగొనే విషయంలోనూ ఇదే వైరుధ్యం. ఉత్పత్తిలో సరఫరాలో కూడా లాభాలకే పెద్దపీట, ప్రైవేటీకరణ పుణ్యాన మన దేశంలోనూ గతంలో వలె ప్రభుత్వ సంస్థల వాక్సిన్ చేసే స్థితి పోయి ప్రైవేటు సంస్థలకే వదలి పెట్టడం దాని పర్యవసానాలు చూస్తున్నాం. ఇదే సమయంలో భారతీయ అగ్రసంపన్నుల ఆస్తులు విపరీతంగా పెరిగాయి, ప్రపంచస్థాయి లోనూ అదే పరిస్థితి. ఇదే సమయంలో గత కరోనాలో వలస కార్మికుల వెతలు చేసి కన్నీరు పెట్టిన ఈ దేశం ఇప్పుడు మళ్లీ వారు రైళ్లు పట్టకుండా తరలిపోవడం చూస్తున్నది, మార్క్స్ చెప్పిన అసమానతల సిద్ధాంతం కరోనాలో రుజువైన కఠోర సత్యం.

## మార్క్స్ అంటే మార్క్స్

1930 మహా మాంద్యం తర్వాత ఎన్నడూ లేనంత దుస్థితికి ప్రపంచం చేరిందని ఐఎంఎఫ్ డైరెక్టర్ జనరల్ క్రిస్టాలినా జార్జియేవా ప్రకటించారు. 170 దేశాల జిడిపి తిరోగమిస్తుందని చెప్పారు. తాము కొద్ది మాసాల కిందట అంచనా వేసిన మెరుగుదల కాస్తా తిరోగమనంలో పడిందంటూ దీనిపై సమీక్షకు సమావేశం ఏర్పాటు చేశారు. భారతదేశంలోనే 23 శాతం నిరుద్యోగం పెరుగుతుందనీ, 40 కోట్ల మంది పేదరికంలో కూరుకుపోతారని లెక్కలు చెబుతున్నాయి.

లాక్‌డౌన్‌లో లక్షోపలక్షల పేదలు, శ్రమజీవుల దురవస్థలు కళ్లకు కడుతున్నాయి. అమెరికా ఆరోగ్య సంక్షోభంతో పాటు ఆర్థిక అఘాతంలో కూరుకు పోతుంటే ఉద్యోగాలు భారీగా వూడిపోతాయని హడలి పోతున్నారు. యూరప్ సంగతి చెప్పనే అవసరం లేదు. ఆసియాలో చాలా దేశాలు అఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు మరింత ఎక్కువగా చితికిపోతాయని కూడా ఐఎంఎఫ్ హెచ్చరిస్తున్నది. పైగా ఈ సంకట స్థితిని ఆసరాగా తీసుకుని మరింత పని భారం పెంచి, జీతభత్యాలు భద్రత కోత కోసే ప్రయత్నాలు నడుస్తున్నాయి. ఇండియాలోనే 12 గంటల పనిదినం అంటూ కొత్త లేబర్ కోట్లు తెచ్చారు. ఆహార ఆరోగ్య భద్రత లేని కష్టజీవుల కన్నా కార్పొరేట్ ఒత్తిళ్లే ఈ సమయంలోనూ ప్రభుత్వాలను ఆడిస్తున్నాయి. గతసారి లాక్‌డౌన్ పేరిట నానా కష్టాలలో వదిలేసిన పాలకులు ఇప్పుడు కేవలం ఉత్పత్తి ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటాయనే కారణంతో ఆ ఆలోచన లేదని ప్రకటిస్తున్నారు. ఏతావాతా కరోనా తాకిడికి తలకిందులైన ప్రపంచీకరణ వైఫల్యంలో కరోనా కారల్‌మార్క్స్ బోధనలను కళ్లకు కట్టి చూపించింది, ఇవన్నీ సైద్ధాంతిక ఊహలు కాదు, కనిపిస్తున్న నిజాలు. వీటిపై పోరాడేది కష్టజీవులు కమ్యూనిస్టులే తప్ప పాలకవర్గాలు కాదు. వారికి ప్రేరణగా నిలిచేది మార్క్స్ బోధనలే. అందుకే మార్క్స్ అంటే మార్క్స్ ❑

## మార్క్స్ రచనల్లో పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాలు

**(96వ పేజీ తరువాయి)**

మార్క్స్ తన నోట్స్‌లో పేర్కొన్నారు. ఇది రోమన్ కుటుంబ పెద్ద అధికారం బలహీనపడ్డానికీ, తదనుగుణంగా భార్యల అధికారాలు పెరగడానికి – కనీసం కులీనుల వరకయినా– దారితీసిందన్నారు మార్క్స్.

1884నాటి ఎంగెల్స్ ప్రసిద్ధ రచన "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక"లో వ్యక్తమయిన భావాలకు భిన్నమైన వైఖరి ఈ నోట్స్‌లో ప్రకటించారు మార్క్స్. చరిత్ర పూర్వ యుగంలో మాతృస్వామ్యమే ఉండేదనీ, అది "ప్రపంచమంతటా స్త్రీల చరిత్రాత్మక పరాజయం" పొందడానికి దారితీసిందనీ ఎంగెల్స్ తన రచనలో పేర్కొన్నారు. ఇది ఏకపక్షంగానూ, అతిసామాన్యంగానూ ఉంది. స్త్రీ పురుష సంబంధాల గురించి, అనేక అర్థచ్ఛాయలతో కూడిన, గతితార్కిక అవగాహన 1879–82 నాటి మార్క్స్ నోట్స్‌లో కనిపిస్తుంది. దునయేఫ్ స్కయ స్త్రీ పురుష సంబంధాల నేపథ్యంలో మార్క్స్ ఎంగెల్స్‌ల మధ్య తీవ్ర వైరుధ్యం ఉందన్నారు. అయితే, "మహిళల నెల్లెప్పుడూ అణచివేతకు గురిచేస్తూనే వచ్చారని 1884 లోనే నొక్కిచెప్పడం ఎంతో ఘనమయిన విషయ"మని ఎంగెల్స్‌కు ఆమె నివాళు లర్పించారు. అయితే, స్త్రీ పురుష సంబంధాల విషయంలో ఎంగెల్స్ "బహుపక్ష వైఖరికి బదులుగా ఏకపక్ష వైఖరినే ప్రదర్శించా" రనీ, అది "సమగ్రమూ కాదు, గతితార్కికమూ కాదనీ ఆమె వ్యాఖ్యానించారు.


ఈ వ్యాసాన్ని ముగించే ముందు రెండు ముక్కలు మళ్లీ మనవి చేసుకుంటున్నాను. ఇక్కడ ప్రస్తావించిన పాఠాలతో పాటు మార్క్స్ రాసుకున్న ఇతర నోట్స్ కూడా 'మెగా 2' సంకలనంలో చేరనున్నాయి. భారతదేశం, ఇండోనేసియా, అల్జీరియా, లాటిన్ అమెరికా, ప్రాచీన రోమ్ తదితర పాశ్చాత్యేతర, పెట్టుబడిదారీ పూర్వ సమాజాల గురించి 1879–82 సంవత్సరాల మధ్య కాలంలో, మార్క్స్ కడపటి రోజుల్లో, ఆయన ఆలోచనలు ఎలా వున్నాయో 'మెగా 2,IV/27 సంపుటి' వెల్లడించనున్నది. అదే రోజుల్లో స్త్రీ పురుష సంబంధాల విషయంలో కూడా మార్క్స్ ఆసక్తి, ఆలోచన ఎలా వున్నాయో ఈ నోట్స్ వెల్లడిస్తాయి. 1848లో 'మ్యానిఫెస్టోలోనూ, తదితర తొలినాటి రచనల్లోనూ వ్యక్తమయిన ఆధునికవాద వైఖరికి భిన్నంగా మార్క్స్ తన కడపటి రోజుల్లో ఆలోచించాడని ఈ నోట్స్ సూచిస్తున్నాయి. మొదట్లో ఆయన, పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాలు అనుసరించిన అభివృద్ధి పథాన్ని ప్రపంచంలోని అన్ని దేశాలూ అనివార్యంగా అనుసరించి తీరాలని భావించినప్పటికీ, తర్వాత ఆ అభిప్రాయం మార్చుకున్నారని ఈ నోట్స్ చెప్తున్నాయి. ❑

# పెట్టుబడిదారీ వ్యవస్థకు అంతిమ దశ



మర్ల విజయ కుమార్

గత 40 ఏళ్ళలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపు రేఖలు మారిపోయాయి. ప్రపంచీకరణతో ప్రపంచంలోని అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు ఒకదానితో ఒకటి ముడిపడి, ఒక అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకున్నది. మిగతా ప్రపంచదేశాలతో సంబంధ బాంధవ్యాలు నెరపకుండా ఏ దేశ ఆర్థిక వ్యవస్థా నిలబడ లేని పరిస్థితి ఈనాడు నెలకొని ఉన్నది. ఈనాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వ్యాప్తమవటమే కాకుండా, గతం కంటే భిన్నంగా, ఉత్పాదక పెట్టుబడులు మందగించి, ఊహాజనిత ఫైనాన్స్ పెట్టుబడులు పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యమేలు తున్నాయి. తత్కారణంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థలు అనేక వక్రీకరణలకు లోనయి, తీవ్ర సంక్షోభాలలో కూరుకొని పోయి ఉన్నాయి. ఈ ఆర్థిక సంక్షోభాలకు తోడుగా, శాస్త్ర సాంకేతిక విప్లవం కారణంగా మన నిత్యజీవితాలలో గణనీయమైన మార్పులు సంభవిస్తున్నాయి.




ఈనాడు టెక్నాలజీతో సంబంధం లేకుండా మనకు ఒక్కరోజు కూడా గడవలేని పరిస్థితి నెలకొని ఉన్నది. ప్రజల జీవితాలను, ఆలోచనావిధానాన్ని ప్రభావితం చేయటంలో మీడియా ఒక ప్రధాన శక్తిగా అవతరించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచం నలుమూలలా విస్తరిస్తోంటే, పేద దేశాల, పేద ప్రజలపై దోపిడీ ఇంతకు ముందు ఎన్నడూ కనీవిని ఎరుగని స్థాయికి చేరుకుంటోంది. సంపద తారతమ్యాలు తారాస్థాయికి చేరుకున్నాయి. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి వేగవంతం అవుతోంటే, ఆర్థిక వ్యవస్థలో ఆటోమేటిక్ యంత్రాల ఉపయోగం పెరుగుతోంది. తత్కారణంగా కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. రానున్న 15 ఏళ్ళలో ప్రపంచ వ్యాప్తంగా సగానికి పైగా కార్మికులు, ఉద్యోగుల అవసరం ఉండదని, వారి పనిని రోబోట్లు అతి చవుకగా, నైపుణ్యంగా చేయగలుగుతాయని అనేక ఆర్థిక శాస్త్రవేత్తల, సాంకేతిక నిపుణుల అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. పోటీ తీవ్రతరమవుతూంటే, పెట్టుబడిదారులు, ఒకరిని మించి ఒకరు ఆటోమేషన్ కోసం పెద్దమొత్తాలు వెచ్చిస్తూ, కార్మికుల అవసరాన్ని తగ్గిస్తూ, తద్వారా తమ ఖర్చులు ఆదా చేసుకోవాలని పరుగులు పెడుతున్నారు. మరొక ప్రక్కన, ఆఫ్ షోరింగ్ ద్వారా ఖర్చులు తగ్గించుకుని, గత 30 ఏళ్ళలో లాభాలను మూట గట్టుకున్న బహుళ జాతి సంస్థలు, ఆఫ్ షోరింగ్‌కు స్వస్తి చెప్పి, తమ కంపెనీలలోనే మరిన్ని ఎక్కువ రోబోలతో, పారిశ్రామిక ఉత్పత్తిని, సాఫ్ట్‌వేర్ ఆధారిత సర్వీసు కార్యకలాపాలను తమ అధీనంలోనే నిర్వహించి, ఖర్చులు ఆదా చేసుకోవచ్చునని యోచిస్తున్నారు.

పారిశ్రామిక విప్లవం మూడవ దశ పూర్తికావస్తున్న ఈ రోజుల్లో, పారిశ్రామిక ఉత్పత్తిలో రోబోల వినియోగం పెరిగి, కార్మికుల సంఖ్య దారుణంగా పడిపోతున్నది. ఇక సర్వీసు రంగం, రవాణా, వితరణ రంగాలలో కూడా ఈ ఆటోమేషన్ కారణంగా ఉద్యోగాలు తగ్గిపోయి, మొత్తం ఆర్థిక వ్యవస్థ అసలు మానవ ప్రమేయం లేకుండా పనిచేయగలిగే పరిస్థితులు కల్పించబడు తున్నాయి. ఈ పారిశ్రామిక ఉత్పత్తి విధానంలో జరిగిన అభివృద్ధి, సర్వీసు రంగంలో మార్పులు శాస్త్ర సాంకేతిక అభివృద్ధి కారణంగా సాధ్యమయ్యాయి. భవిష్యత్తులో కూడా మరిన్ని మార్పులు చోటు చేసుకోవచ్చును. అయితే, ఈ మార్పును తిరగదోడే అవకాశం లేదు. అసలు మనుష్యుల అవసరం లేకుండానే వస్తూత్పత్తి, పంపిణీ, వితరణ కృత్రిమమేధస్సును ఉపయోగించి చేయగలగటం సాంకేతికంగా నేడు సాధ్యమయ్యే స్థాయికి టెక్నాలజీ ఎదిగింది. కాని ఈ చర్యల వలన, తాత్కాలికంగా బహుళజాతి సంస్థల లాభాలలో వృద్ధి కనిపించవచ్చునేమోగాని, ఉద్యోగాలు కనుమరుగై పోతుంటే, ప్రజలలో కొనుగోలు శక్తి క్షీణించి, మార్కెట్లు కుదేలవటం ఖాయం. ఇక అప్పుడు, డిమాండే లేనప్పుడు,


పెట్టుబడిదారుడు ఎవరి కోసం వస్తూత్పత్తి చేస్తాడు? ఈ ప్రశ్న ఒక తేలని చిక్కు సమస్యగా పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలను, పాలక వర్గాన్నీ పట్టిపీడిస్తోంది. మనుషులే అవసరం లేని ఆర్థిక వ్యవస్థలో, రోబోలు వస్తువులు ఖరీదు చెయ్యవు కదా? అంటే ప్రపంచజనాభా లో అత్యధికులు జీవనాధారం లేకుండా పోతారు. అత్యధికులైన ప్రజానీకం ఆదాయాలు లేక, కొనుగోలు శక్తి నశించి, గర్భ దారిద్ర్యంలో మగ్గుతుంటారు. ఉద్యోగాలే లేనప్పుడు, వస్తువులు ఎవరు ఖరీదు చేయగలరు? అటువంటి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అసలు మనగలదా? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు వెతుక్కోలేక పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు తలలు పట్టుకుంటున్నారు.

150 సంవత్సరాల క్రితమే మార్క్స్ వివరించినట్లుగా, నూటికి నూరుపాళ్ళు యంత్రాల ద్వారానే ఉత్పత్తి జరిగితే, కార్మిక శక్తి అవసరం లేనప్పుడు, అదనపు విలువ కూడా సృష్టింపబడదు. కార్మికుల శ్రమశక్తిని ఉపయోగించుకుని, తద్వారా అదనపు విలువను స్వంతం చేసుకోవటం ద్వారానే, పెట్టుబడిదారుడు లాభాలను మూటగట్టుకుంటాడు. నిరంతరం లాభాల వృద్ధి లేనిదే ఏ పెట్టుబడిదారుడూ వ్యాపారం చేయలేడు. తాను పెట్టిన పెట్టుబడితో వస్తువుల ఉత్పత్తి కార్మికులచేత చేయించి, వాటిని మార్కెట్‌లో అమ్మటం ద్వారా, పెట్టుబడిదారుడు తాను వెచ్చించిన పెట్టుబడి కంటే, ఎక్కువ సొమ్మును ఆర్జిస్తాడు. యంత్రాల ద్వారానే ఉత్పత్తి జరిగినప్పుడు, ఇక అదనపు విలువ ప్రసక్తే ఉండదు. అంటే, అదనపువిలువ లేనిదే, పెట్టుబడిదారీ వ్యవస్థ కుప్పకూలి పోతుంది. పైగా, మొత్తం ప్రజలు నిరుద్యోగులై, ఆదాయాలు లేకపోయినప్పుడు, మార్కెట్‌లో సరుకులు కొనే వారెవరు? ఈ ప్రమాదాన్ని గుర్తించిన బూర్జువా మేధావులు, వస్తువుల విలువ సున్నాకు పడిపోకుండా, బూర్జువా ప్రభుత్వాలు పన్నుల ద్వారా లభించిన సొమ్ములో కొంతభాగాన్ని ప్రజలందరికీ కనీస మూల ఆదాయంగా పంచిపెడితే, వారు ఆ డబ్బుతో తమ కనీస అవసరాలు తీర్చుకుంటారనీ, తద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థ భవిష్యత్తులో కూడా కొనసాగగలదని ప్రతిపాదిస్తున్నారు. అయితే, వస్తువులు ఉత్పత్తి చేసి, వాటిని కొనుక్కుందుకు ప్రజల చేతిలో డబ్బులు ధారపోయటం అనేది పెట్టుబడిదారీవర్గానికి అస్సలు రుచించని విషయం.

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో చోటు చేసుకుంటూన్న ఈ మార్పులు, ఆ వ్యవస్థ యొక్క పతనం దిశగా తీసుకెళ్తున్నాయని, ఈ ఆటోమేషన్ అనే ఊబిలో కూరుకుపోయిన ఈ దోపిడీ వ్యవస్థ కుప్పకూలటం తథ్యమని అనేక మంది బూర్జువా ఆర్థిక వేత్తలే హెచ్చరిస్తున్నారు. "ఏ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" గ్రంథం (1859) ముందు మాటలో మార్క్స్ "సమాజ అభివృద్ధిలో ఒకానొక దశలో భౌతిక ఉత్పత్తి శక్తులకు, అప్పటి ఉత్పత్తి సంబంధాలకు మధ్యన వైరుధ్యం పొడసూపుతుంది. మరొక మాటలో చెప్పాలంటే ఆనాటి ఉత్పత్తి సంబంధాలు ఆస్తి సంబంధాలను సూచిస్తాయి. అటువంటి దశలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికీ ఈ ఉత్పత్తి సంబంధాలు సంకెళ్లుగా మారతాయి. ఇక అప్పుడు సామాజిక విప్లవ యుగం ప్రారంభమవుతుంది. మౌలిక ఆర్థిక సంబంధాలలో విప్లవం వ్యవస్థ ఉపరితలాన్ని కూడా ప్రభావితం చేసి విప్లవకర మార్పులకు దారి తీస్తుంది." అదే సందర్భంలో మార్క్స్ మరొక మాట కూడా చెప్పారు. "ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకునే వరకూ ఏ సామాజిక వ్యవస్థ పతనం దశకు చేరుకోదు. పాత వ్యవస్థ గర్భంలో జనించి కొత్త, ఉన్నతమైన ఉత్పత్తి సంబంధాలు ఒక పరిపక్వ దశకు చేరుకున్న తరువాతనే సామాజిక మార్పు సాధ్యమవుతుంది.

మార్క్స్ చెప్పినట్లు ఎప్పుడైతే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వ్యవస్థ అభివృద్ధికి ఆటంకంగా మారిపోతాయో (fettering of productive forces), ఇక అప్పటినుండి పెట్టుబడి పతనం ప్రారంభం అవుతుంది. ఇప్పటివరకు ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, కమ్యూనికేషన్ అభివృద్ధితో ఉత్పత్తి శక్తులు బ్రహ్మాండంగా పెరిగి పెట్టుబడిదారి వ్యవస్థ గత 40 ఏళ్లలో ప్రపంచం నలుమూలలకు విస్తరించింది, ఆధిపత్యాన్ని పొందింది. ఇప్పటివరకు పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిలో నూతన ఉత్పత్తి సాధనాలు కీలకపాత్ర పోషిస్తూ వచ్చాయి. ఉదాహరణకు 20వ శతాబ్దంలో రేడియో ఆవిష్కరణతో ప్రపంచంలో సమాచార వితరణలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ తరువాత ట్రాన్సిస్టర్, మైక్రోచిప్స్ అభివృద్ధితో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ బ్రహ్మాండంగా పెరిగి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలే మారిపోయాయి. ఐటి రంగం ఉద్భవించింది. కంప్యూటర్స్, కమ్యూనికేషన్స్ అభివృద్ధితో పెట్టుబడిదారీ వ్యవస్థకు నూతన జవసత్వాలు వచ్చాయి. ఆస్ట్రియన్ ఆర్థికవేత్త జోసఫ్ షుంపెటర్ చెప్పినట్లు, నూతన ఉత్పత్తి శక్తుల ఆవిష్కరణతో పెట్టుబడిదారీవ్యవస్థ పునరుజ్జీవం పొందుతుంది. కాని ఇప్పుడు నూతన టెక్నలాజిలైన ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు వంటివి కార్మికుల సంఖ్యను గణనీయంగా కుదించి వేస్తున్నాయి. దానితో నిరుద్యోగం పెరిగి ఏ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేని పరిస్థితి తలెత్తుతోంది. అన్ని ప్రయివేటు పరం చేసి


ఉద్యోగాల కల్పన బాధ్యతను ప్రయివేటు రంగంపై నెట్టివేసినా సమస్య తీవ్రమవుతుంది కాని పరిష్కారం లేదు. అత్యధిక జనాభాకీ ఉద్యోగాలు, జీవనాధారం లేకపోతే మెజారిటీ ప్రజలు ఆర్థిక వ్యవస్థ బయటికి నెట్టివేయబడతారు. అది పెట్టుబడికి ఆత్మహత్యా సదృశం. ఈ అంశాన్ని లోతుగా పరిశీలించి, భవిష్యత్తులో పెట్టుబడిదారీ వ్యవస్థ ఇప్పటివరకూ ఎదురైన సంక్షోభాలకు భిన్నంగా, ఒక అంతిమ సంక్షోభాన్ని ఎదుర్కొనబోతోందని, దాని నుండి అది బయటపడటం అసంభవమని, ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు అంతిమ ఘడియలు దగ్గరకు వచ్చాయని మార్క్సిస్టు మేధావులు బల్లగుద్ది మరీ చెప్తున్నారు. అసలు మొత్తంగానే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితులు ఈ యాంత్రిక మేధస్సు కారణంగా ఏర్పడవచ్చునని కొందరు హెచ్చరిస్తున్నారు. 21వ శతాబ్ద ప్రారంభదశలోనే ప్రవేశపెట్టబడుతున్న నూతన టెక్నాలజీలు పెట్టుబడిదారీ వ్యవస్థ మూలాలను కదిలించి వేస్తున్నాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వ్యవస్థకు శాపంగా పరిణమించి, ప్రజలు బ్రతకాలంటే పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోయటం తప్ప వేరే మార్గం లేదని నిర్ణయించుకుంటారు. ఇక అప్పుడు విప్లవాత్మక మార్పు తప్పనిసరి అవుతుంది. నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ మార్క్స్ చెప్పిన అటువంటి పతనం దశ వైపు పరుగులు తీస్తోంది. ❏











కారల్ మార్క్స్ 204 జయంతి శుభాకాంక్షలతో

# స్టాఫ్ & వర్కర్స్ యూనియన్
# డెల్టా పేపర్ మిల్స్

(ఎ ఐ టి యు సి అనుబంధ యూనియన్)

రి.నెం. జి/582 | స్థాపితం : 2-10-83

వేండ్ర - 534 210 పశ్చిమగోదావరి జిల్లా

వ్యవస్థాపక అధ్యక్షులు : కీ॥శే॥ కలిదిండి భీమరాజు

## నూతన కార్యవర్గం

అధ్యక్షులు
**డి వి వి యస్ వర్మ**

ఉపాధ్యక్షులు
**డి. సోమసుందర్**
**జి. ప్రసాదరాజు**
**కె. రంగారావు**

ప్రధాన కార్యదర్శి
**ఎమ్.వి.ఎస్. సూర్యనారాయణరాజు**

సంయుక్త కార్యదర్శులు
**ఆర్. శ్రీనివాసరాజు**
**పి.వి. వెంకట్రావు**

కోశాధికారి
**ఎల్.ఇ. ప్రభాకరరావు**


ఉప కోశాధికారి
**వి.వి. భద్రం**

## సభ్యులు

**కె. కాశీవిశ్వనాధరాజు**
**జి. శ్రీనివాసరావు**
**కె. మహేశ్వరరావు**

**వి.వి.వి.ఎన్. కుమార్**
**జి. రాము**
**కె. శ్రీనివాసరాజు**

**ఎమ్. జీనా**
**ఎమ్. మోహన్‌బాబు**
**జి.వి. సత్యనారాయణ**
**వి. బాలకృష్ణ**



కారల్ మార్క్స్ 204 జయంతి శుభాకాంక్షలతో

# స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ సత్యనారాయణ స్పిన్నింగ్ మిల్స్

కలిదిండి భీమరాజు భవనం, రైల్వే స్టేషన్ రోడ్డు, **తణుకు**

ప్రెసిడెంట్
**డి.వి.వి.ఎస్ వర్మ**


జనరల్ సెక్రటరీ
**దాకే పెద ముసలయ్య**

ట్రెజరర్
**మోదుకూరి రాధాకృష్ణ**

వైస్ ప్రెసిడెంట్స్
**కోనాల భీమారావు**
**అట్రు వెంకట్రావు**
**గరగ శ్రీనివాసరావు**
**కరెళ్ళ సాయినాథ్**

జాయింట్ సెక్రటరీస్
**చింతన సాయిరాం**
**బూరుగుపల్లి రాజేంద్ర వరప్రసాద్**
**కోడూరి రఘునాథ ప్రసాద్**
**వాసా సూరిబాబు**

ఆఫీస్ సెక్రటరీ
**రెడ్డి ప్రసాద్**




కారల్ మార్క్స్ 204 జయంతి శుభాకాంక్షలతో

రి.నెం. 2199 స్థాపితం 1-6-60

# స్టాఫ్ & వర్కర్స్ యూనియన్ ఆఫ్
# శ్రీ అక్కమాంబ టెక్స్‌టైల్స్

కుమ్మర్లవారి వీధి, తణుకు - 534 211

| | | |
|---|---|---|
| ప్రెసిడెంట్ | : | డి.వి.వి.యస్. వర్మ |
| వైస్ ప్రెసిడెంట్స్ | : | కోనాల భీమారావు<br>తుమ్మలపల్లి శ్రీనివాస్<br>పుచ్చకాయల భాస్కరరావు<br>అనంత త్రివిక్రమరావు |
| జనరల్ సెక్రటరీ | : | గుళ్ళపల్లి కనకారావు |
| జాయింట్ సెక్రటరీలు | : | గెడ్డం చంద్రశేఖర్<br>జి.ఎస్.వి. ప్రసాద్<br>శెట్టి పాపారావు<br>ఆండ్రోతు రమేష్ |
| కోశాధికారి | : | మాసాబత్తుల విజయ్‌కుమార్ |
| ఆఫీస్ సెక్రటరీలు | : | పోతుబత్తుల సత్యనారాయణ<br>దేవ పెద్దిరాజు |



*In the foot steps of KARL MARX's idealogy for struggle against exploitation, our ALL INDIA BANK EMPLOYEES' ASSOCIATION (AIBEA), the founder leader of Bank Employees' Trade Union Movement, completing its Platinum Jubilee year, "once again RED SALUTES the great philosopher, KARL MARX, On this occasion of his 103rd Birth Anniversary & extend Revolutionary Greetings to one & all for carrying forward the idealogy to greater heights.*

*Vibrant Banks for a Vibrant Economy*

**PEOPLE'S MONEY FOR PEOPLE'S WELFARE**

**NATIONAL SAVINGS FOR NATION'S DEVELOPMENT**

## *AIBEA's Suggestions and Demands*


- Strengthen Public Sector Banks
- Provide adequate capital to all the Banks
- Stop privatisation of Banks
- Open more Branches in unbanked areas
- Make Banking a Fundamental Right of people
- Take stringent measures to recover corporate bad loans
- Make willful default of bank loan a criminal offence
- RBI to publish the names of loan defaulters once in 3 months
- Make RBI more effective and accountable
- Debar loan defaulters from contesting in the Elections
- Strengthen recovery laws-review IBC
- Increase interest rate on Deposits
- Reduce service charges to common people to access banking service
- Merge all RRBs with sponsor Banks
- Revive IDBI Bank as specialist DFI in"public sector
- Strengthen District and Primary Co-operative Banks
- Provide adequate staff in Branches to improve Customer Service
- Ensure functional autonomy in the administration of Banks
- EDs and MDs to be given longer terms of office
- Fill up all vacant posts of Workmen/Ofhicer Directors in Banks

**ALL INDIA BANK EMPLOYEES' ASSOCIATION**

Central Office: 'PRABHAT NIVAS' Regn. No.2037
Singapore Plaza, 164, Linghi Chetty Street, CHENNAI-600001
Phone: 2535 1522 Fax: 2535 8853 Web: www.aibea.in
e mail chv.aibea@gmail.com & aibeahq@gmail.com

**ANDHRA PRADESH & TELANGANA BANK EMPLOYEES' FEDERATION**

| | |
|---|---|
| **ALL INDIA ANDHRABANK AWARD EMPLOYEES' UNION** | **CENTRAL BANK EMPLOYEES' ASSOCIATION (AP& TELANGANA)** |
| **INDIAN BANK EMPLOYEES' UNION (AP& TELANGANA)** | **BANK OF BARODA EMPLOYEES' UNION (AP& TELANGANA)** |



204th Birth Anniversary

*With best compliments from*

KIMS HOSPITALS™

మెదడు మరియు నరాల
సంబంధిత వ్యాధుల కొరకు
ప్రఖ్యాత మెదడు మరియు నరాల వైద్య నిపుణులు

# డా॥ రవీష్ సుంకర

**MS. Mch (Neurosurgery)**

**కిమ్స్ హాస్పిటల్స్, హైదరాబాద్**

ప్రతి నెల 1వ & 3వ శుక్రవారం ఖమ్మంలో
కన్సల్టేషన్ కొరకు అందుబాటులో ఉంటారు.
ఉ॥గం॥ 10-00ల నుండి సా॥గం॥ 5-00ల వరకు

అపాయింట్‌మెంట్స్ కొరకు సంప్రదించండి :

**9542256176 / 9866079860**

స్థలం :

డా॥ రాధాకృష్ణమూర్తి

**యలమంచిలి పాలీ క్లినిక్**

వాటర్ ట్యాంక్ రోడ్, ఖమ్మం - 507 003

**Jaateeya Spurthi,** Fortnightly Printed and Published by **N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : DVVS Varma**